ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 24-7-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 345
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం రూ.10 లక్షల కోట్లు

ప్రాజెక్టులకు ఫెసిలిటేటర్‌గా వ్యవహరిస్తా

సీఎంవో నుంచే పర్యవేక్షణ

ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 లో సీఎం చంద్రబాబు



ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సు సందర్భంగా ఏపీఈడీబీ, ఇన్వెస్టోపియా మధ్య కుదిరిన అవగాహన ఒప్పంద పత్రాలతో సీఎం చంద్రబాబు, యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్‌మారి. చిత్రంలో టాటా కెమికల్స్ లిమిటెడ్ సీఈఓ, ఎండీ ఆర్.ముకుందన్, మంత్రి భరత్, ఇన్వెస్టోపియా సీఈఓ జీన్‌ఫేర్స్, ఏపీఈడీబీ సీఈఓ సాయికాంత్, లులు ఇంటర్నేషనల్ ఛైర్మన్, ఎండీ యూసుఫ్ అలీ, సీఎస్ విజయానంద్

ఈనాడు – అమరావతి

ఏడాదిలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నదే లక్ష్యమని.. అందుకు అనుగుణంగా 15 రంగాల్లో పాలసీలు తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన ఇన్వెస్టోపియా, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీ ఈడీబీ)భాగస్వామ్యంతో విజయవాడలో బుధవారం నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'యూఏఈ నుంచి అమరావతి సహా ఇతర చోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆహ్వానిస్తున్నాం. ఏపీని పరిశీలించిన తర్వాతే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోండి. ప్రాజెక్టుల సాకారం కోసం ఫెసిలిటేటర్‌గా నేనే వ్యవహరిస్తా' అని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా 'ఏపీఈడీబీ- ఇన్వెస్టోపియా' మధ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యూఏఈ ఆర్థిక, పర్యాటకశాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారి, లులు గ్రూప్ ఛైర్మన్ యూసుఫ్ అలీ, ఇన్వెస్టోపియా సీఈఓ జీన్‌ఫేర్స్, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

అనుమతులపై సీఎంవో నుంచే పర్యవేక్షణ

దేశంలోనే మొదటి హైడ్రోజన్ వ్యాలీని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు. 'రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల ప్రతిపాదనలను సీఎంవో నేరుగా పర్యవేక్షిస్తుంది. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. నీటి వనరులు, వ్యవసాయ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. డిజిటల్ టెక్నాలజీ, (మిగతా 2లో)

ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ఓకే



28న లోక్‌సభలో.. మరుసటిరోజు రాజ్యసభలో

16 గంటల చొప్పున సమయం కేటాయింపు ● విపక్ష నిరసనలతో స్తంభించిన పార్లమెంటు

దిల్లీ: పాక్ ఉగ్రవాద స్థావరాల మీద మన సైన్యం ఇటీవల విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో చర్చకు రంగం సిద్ధమైంది. పహల్గాం ఉగ్రదాడితో మొదలైన పరిణామాలపై సమగ్ర చర్చ జరగాలని, తాము లేవనెత్తే ప్రశ్నలకు ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులోనే సమాధానాలు చెప్పాలని విపక్షం గట్టిగా డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రధాని బుధవారం విదేశీ పర్యటనకు వెళ్లారు. 26న తిరుగు ప్రయాణం అవుతారు. విపక్షాల డిమాండ్ మేరకు ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు మొత్తంగా 16 గంటల సమయం కేటాయించాలని బుధవారం రాజ్యసభ 'సభా వ్యవహారాల సంఘం' (బీఏసీ) నిర్ణయించింది. లోక్‌సభ బీఏసీ సోమవారమే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 28న దిగువసభలో, మరుసటిరోజు ఎగువసభలో చర్చ ప్రారంభం కానుంది. చర్చకు మోదీ సమాధానం ఇస్తారా, లేదా అనేది ఇంకా తేలకపోయినా.. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని విదేశాలకు మరోసారి స్పష్టంచేసేలా ఆయన మాట్లాడే అవకాశం ఉందని భాజపా సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. చర్చ సమయంలో (మిగతా 2లో)

ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

ఎలక్టోరల్ కాలేజీ ఏర్పాటుకు ఎన్నికల సంఘం చర్యలు 11లో

మద్యం కుంభకోణం నిందితులకు రెడ్‌కార్నర్ నోటీసులు!

యూఏఈ, థాయ్‌లాండ్‌లలో 8 మంది ఉన్నట్లు గుర్తింపు

● అప్పగింత ఒప్పందాల ద్వారా.. భారత్‌కు రప్పించేందుకు సిట్ చర్యలు

ఈనాడు, అమరావతి: విదేశాలకు పారిపోయిన మద్యం కుంభకోణం కేసు నిందితుల్ని భారత్ రప్పించే చర్యలను సిట్ ప్రారంభించింది. ఇంటర్‌పోల్ ద్వారా వీరిపై త్వరలో రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయనుంది. కేసులో నిందితులు, అనుమానితులైన 8 మంది యూఏఈ(దుబాయ్), థాయ్‌లాండ్‌లలో ఉన్నట్లు సిట్ గుర్తించింది. వారిని ఎక్స్‌ట్రాడిషన్ (నేరగాళ్ల అప్పగింత) లేదా డిపోర్టేషన్(ఆయా దేశాల నుంచి బహిష్కరణ) ద్వారా భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సాయం, సహాయం కోసం తాజాగా మన విదేశాంగ శాఖకు లేఖ రాసింది. ఆ దేశాలతో భారత్‌కు ఉన్న పరస్పర న్యాయ సంబంధ ఒప్పందాల్లో(మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ట్రీటీ) భాగంగా వెంటనే చర్యలు చేపట్టాలని అందులో కోరింది. సొమ్ము సేకరణ, మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన సొత్తుతో విదేశాల్లో కూడబెట్టిన అక్రమాస్తులు, పెట్టుబడులను (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

భవిష్యత్తులో విద్యుత్, ఇంటెలిజెన్స్ గ్రిడ్లు
పాలనలో ఏఐ కీలకంగా మారుతుంది
ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జీ42 ఇండియా సీఈవో మనూ జైన్ వెల్లడి

రూ.20 వేల కోట్ల పెట్టుబడులు.. 50వేల మందికి ఉపాధి!
సీఎం అధ్యక్షతన ఎస్ఐపీబీ 9వ సమావేశం
భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా విశాఖ మాస్టర్‌ప్లాన్ ఉండాలి

ముందస్తు బెయిల్ కేసులో 49 పేజీల తీర్పా?
మినీ ట్రయల్ నిర్వహించేసినట్లుంది
సీఐడీ మాజీ ఏడీజీ సంజయ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

వీడు మామూలోడు కాదు..



గాజియాబాద్‌లో నకిలీ రాయబార కార్యాలయం
పోలీసుల అదుపులో రాయబారిగా చెప్పుకొంటున్న హర్షవర్ధన్ జైన్

ముఖ్యనేతకు కీలక వాటా

క్వార్ట్జ్ దందాలో నెలకు రూ.20 కోట్ల చొప్పున 9 నెలల్లో రూ.180 కోట్లు చేరవేత

మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ నేతృత్వంలో ముఠా

క్వార్ట్జ్ ఎగుమతిదారుల నుంచి ముక్కుపిండి వసూలు

తమ కళ్లుగప్పిపోకుండా అనధికార చెక్‌పోస్టులు, అడుగడుగునా నిఘా



వైకాపా పాలనలో సైదాపురం మండలంలోని జయలక్ష్మి మైన్ వద్ద అక్రమంగా తవ్విన క్వార్ట్జ్

ఈనాడు – అమరావతి, నెల్లూరు

ఎక్కడైనా తవ్వుకో.. ఎంతైనా తవ్వుకో.. ఎక్కడికైనా తరలించుకో.. ఏ ధరకైనా అమ్ముకో.. మాకు మాత్రం టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల చొప్పున ఇవ్వాలి. అలాకాదని లోడుతో రోడ్డెక్కితే.. పోలీసులు, గనులశాఖ అధికారులను రంగంలోకి దింపుతాం. వాహనాలు, ఖనిజాన్ని సీజ్ చేయించి, భారీగా జరిమానాలు వేయిస్తాం.. ఇది నెల్లూరు జిల్లాలో గత ఏడాది వరకు క్వార్ట్జ్ ముఠా బెదిరింపుల తీరు. ఇలా క్వార్ట్జ్ ఎగుమతిదారులందరినీ భయపెట్టి డబ్బులు గుంజారు. అప్పటి మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సారథ్యంలోనే వసూళ్ల దందా చేశామని.. ఆయన ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. ఇలా ఎగుమతిదార్ల నుంచి వసూలు చేసిన సొమ్ములో కీలక వాటాగా నెలకు రూ.20 కోట్ల చొప్పున 'ముఖ్య'నేతకు చేర్చినట్లు తెలుస్తోంది. దీనిపై కూడా లోతైన దర్యాప్తు జరిపితే ఈ ముఠా వెనక ఉన్న పెద్ద తలకాయల గుట్టు రట్టవుతుంది.

చైనాలో డిమాండ్‌తో..

నెల్లూరు జిల్లాలో లభించే క్వార్ట్జ్‌కు 2023లో అనూహ్యంగా చైనాలో డిమాండ్ ఏర్పడింది. అక్కడి కంపెనీలు నాణ్యతను బట్టి టన్నుకు రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు చెల్లించి కొనుగోలు చేశాయి. దీంతో క్వార్ట్జ్‌లో అడ్డగోలుగా దోచుకునేందుకు వైకాపా నేతలు గేట్లు తెరిచారు. అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఓ ముఠా ఏర్పడింది. అనుమతులున్న లీజులే కాకుండా, గడువు ముగిసిన లీజుల్లోనూ, అసలు లీజులే మంజూరు కాని ప్రాంతాల్లోనూ.. ఇలా ఎక్కడైనా క్వార్ట్జ్ తవ్వుకోండంటూ అవకాశం కల్పించారు. (మిగతా 2లో)

వసూళ్ల ముఠా ఎలా నడిచిందంటే..



నేతృత్వం: అప్పటి మంత్రి అనిల్ కుమార్ యాదవ్
పర్యవేక్షణ: బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి
వసూళ్ల బాధ్యత: దువ్వూరు శ్రీకాంత్‌రెడ్డి (జిమ్ శ్రీకాంత్‌రెడ్డి)
ముఠా కార్యాలయ బాధ్యతలు: శ్యాం (సాముద్దీన్)
డబ్బుల వసూళ్లు, బెదిరింపులు: దిలీప్‌రెడ్డి, సాకేత్‌రెడ్డి
ప్రత్యేక చెక్‌పోస్టులు: నెల్లూరు జిల్లా నుంచి చెన్నై పోర్టుకు క్వార్ట్జ్ లోడుతో లారీలు వెళ్లే మార్గంలో, సైదాపురం, గూడూరు రూరల్, రాపూరు వెళ్లే దారిలోనూ..
ప్రత్యేక నిఘా: బూదనం టోల్‌గేట్, తడ దగ్గరలో

విశాఖ రైల్వే జోన్ డీపీఆర్‌కు ఆమోదం

ఈ జోన్ పరిధిలోకి దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆస్తులు, పోస్టులు

కొత్తగా గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ పోస్టులు సృష్టించొద్దని ఆదేశాలు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. జోన్ సరిహద్దులు, అందులోని డివిజన్లు, వీటి పరిధి, సిబ్బంది, మౌలికవసతులు తదితర సమగ్ర వివరాలతో సవరించిన డీపీఆర్‌ను జోన్ ప్రత్యేక అధికారి ఈ ఏడాది జనవరి 25న రైల్వే బోర్డుకు పంపారు. దీనిని పరిశీలించిన బోర్డు.. సవరించిన డీపీఆర్‌కు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకుంది. డీపీఆర్‌లో పేర్కొన్న పలు అంశాలపై కొన్ని నిర్ణయాలు తీసుకుంది. వాటిని అనుసరించాలని కోరుతూ దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌కు తాజాగా ఆదేశాలు వచ్చాయి.

కొత్త జోన్ పరిధిలోకి దక్షిణ మధ్యరైల్వే ఆస్తులు, పోస్టులు

■ కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలో ఉన్న.. దక్షిణ మధ్య రైల్వే జోన్‌కు చెందిన ఆస్తులు, (మిగతా 2లో)

ఇదీ సంగతి!



అన్నిరకాలుగా మీ గదే తనకు సౌకర్యంగా ఉందంటేనూ..!!

నేడు బంగాళాఖాతంలో

అల్పపీడనం!

ఈనాడు, విశాఖపట్నం: ఉత్తర బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అరేబియా సముద్రం నుంచి గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం వరకు ద్రోణి కొనసాగుతోంది. దీంతో గురువారం నుంచి సోమవారం వరకు కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. ఉత్తర కోస్తా వెంబడి గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అమరావతి వాతావరణ విభాగం పేర్కొంది. వర్షాల నేపథ్యంలో (మిగతా 2లో)



సంచుల్లో సిద్ధం చేసిన వర్మీ కంపోస్టు ఎరువు ★ కలెక్టరేట్‌లో ఎరువు కొనుగోలు చేస్తున్న మహిళ

పారేస్తే చెత్త.. పోగేస్తే సంపద!

'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర'కు అనుగుణంగా తిరుపతి గ్రామీణ మండలంలోని అవిలాల పంచాయతీలో 'చెత్త నుంచి సంపద' కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడి సిబ్బంది ఇంటింటా సేకరించిన తడిచెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌లో కిలో రూ.40-50లకు విక్రయిస్తుండగా తాము సంచితో కలిపి రూ.12లకే విక్రయిస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌కు వస్తున్న ప్రజలు, ఉద్యోగులు తమ పెరటి అవసరాల కోసం ఎరువును కొనుగోలు చేస్తున్నారు.

- ఈనాడు, తిరుపతి



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేకు ఇరువైపులా వరద ప్రవాహం

గోదావరికి పెరుగుతున్న వరద

పోలవరం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి పెద్దఎత్తున వరద వచ్చి చేరుతోంది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద బుధవారం సాయంత్రానికి నీటిమట్టం 27.90 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా గోదావరిలోకి 1.84 లక్షల క్యూసెక్కులు వెళ్తోంది. పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా కుడికాలువకు నీటి సరఫరా నిలిపివేశారు.

నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. బుధవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, ప్రకాశం తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా సాయంత్రం 6 గంటల వరకు శ్రీకాకుళం జిల్లా కంచిలిలో 69 మి.మీ. వర్షపాతం నమోదైంది.

మాయాపట్నాన్ని ముంచెత్తిన సముద్రం



మాయాపట్నం గ్రామం వద్ద కెరటాల ఉద్ధృతి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మాయాపట్నం గ్రామాన్ని బుధవారం రాకాసి అలలు చుట్టుముట్టాయి. దాదాపు 70 ఇళ్లు ముంపులో చిక్కుకున్నాయి. తీరానికి సమీపంలో ఉన్న గృహాలు నేలకూలగా మరో 30 ఇళ్లు కోతకు గురై సముద్రంలో కలిసిపోనున్నాయి. రెవెన్యూ, అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సముద్రపు నీటిని మళ్లించేందుకు జేసీబీ సాయంతో మార్గం ఏర్పాటు చేయగా కొన్ని గంటల తర్వాత నీరు వెనక్కి మళ్లింది.

ముఖ్యనేతకు కీలక వాటా

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఆ ఖనిజాన్ని తరలించేందుకు దాని గ్రేడ్‌ను బట్టి టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేలు తమకు కప్పం కట్టాలని హుకుం జారీ చేశారు. దీంతో సైదాపురం, గూడూరు, పొదలకూరు, రాపూరు, చేజర్ల మండలాల్లో అక్రమార్కులు ఇష్టానుసారం తవ్వేశారు. నెలకు సగటున 30 వేల టన్నుల చొప్పున చైనాకు ఎగుమతి చేశారు. వీరంతా వసూళ్ల ముఠాకు చెల్లించిన మొత్తం నుంచి.. నెలకు రూ.20 కోట్ల చొప్పున 'ముఖ్యనేత'కు చేరేవి. ఇలా తొమ్మిది నెలల్లో రూ.180 కోట్లు నగదు రూపంలో ఆయనకు అందాయని తెలుస్తోంది.

పరదాలు కట్టి.. తవ్వేశారు

ప్రభుత్వ భూములు, డీకేటీ, పట్టా, అటవీ భూములు.. ఇలా క్వార్ట్జ్ లభిస్తుందనుకున్న ప్రతిచోటా లీజులతో సంబంధం లేకుండా 20-25 మీటర్ల లోతున తవ్వేసి ఖనిజాన్ని వెలికితీశారు. ఎవరూ చూడకుండా అడ్డంగా పరదాలు కట్టి తవ్వేశారు. అటువైపు వచ్చినా.. ప్రశ్నించినా.. కేసులు పెడతామని బెదిరించారు. లీజులు లేనిచోట్ల తవ్విన ఖనిజాన్ని తరలించేందుకు.. అనుమతులున్న లీజుల పేరిట పర్మిట్లు జారీ చేశారు. ఇందుకు గనులశాఖ అధికారులు సంపూర్ణ సహకారం అందించారు. వసూళ్ల వ్యవహారాలన్నీ పర్యవేక్షించేందుకు ఈ ముఠా నెల్లూరు నగరంలోని ఇస్కాన్ సిటీ పరిధిలో ఓ అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుంది.

ఎన్నికల ఫలితాలొచ్చాక గప్‌చుప్

ఈ వసూళ్ల దందాను 2023 సెప్టెంబరు నుంచి 2024 జూన్‌లో ఎన్నికల ఫలితాలొచ్చే రోజు వరకు సాగించారు. మళ్లీ వైకాపాయే అధికారంలోకి వస్తుందని, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు యథావిధిగా కొనసాగుతాయని వసూళ్ల ముఠా సభ్యులు చెబుతూ వచ్చారు. జూన్ 4న ఫలితాలు చూసి ముఠాకు ముచ్చెమటలు పట్టాయి. ఆరోజు నుంచి అంతా గప్‌చుప్ అయ్యారు.

ఏడాదిలో పెట్టుబడుల లక్ష్యం రూ.10 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)


మానవ వనరుల పరంగానూ బలంగా ఉంది. ఆతిథ్య రంగం, ఆయిల్ అండ్ గ్యాస్, పెట్రో కెమికల్స్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. పాలసీ నిబంధనలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలను చెల్లిస్తాం. గూగుల్ సంస్థ త్వరలో విశాఖలో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది' అని వివరించారు.

లులు వెళ్లి.. వెనక్కి వచ్చింది!

లులు సంస్థ అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాళ్లను విశాఖ, విజయవాడల్లో ఏర్పాటు చేస్తోందని సీఎం తెలిపారు. అమరావతిలోనూ త్వరలో ఏర్పాటు చేయాలని కోరామన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాల వల్ల లులు రాష్ట్రం నుంచి తప్పుకొంది. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. విశ్వసనీయతకు ఇదొక నిదర్శనం' అని పేర్కొన్నారు.

ఆరు నెలల్లోనే యూఏఈ సదస్సు

ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారిని కలిసి ఏపీకి ఆహ్వానించినట్లు సీఎం చెప్పారు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు యూఏఈ మొదటగా ఏపీలో ఇన్వెస్టోపియా సదస్సు నిర్వహించిందన్నారు. 'యూఏఈ నుంచి 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నాము యూఏఈ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశాల్లో ప్రస్తావిస్తే.. అంతకు మించే వస్తాయని వారు హామీ ఇచ్చారు. పెట్టుబడులు పెట్టేందుకు వివిధ దేశాల్లో జరిగే పర్యటనల సమయంలో 25 శాతాన్ని ఏపీకి కేటాయించాలి' అని సీఎం కోరారు.





ఇన్వెస్టోపియా గ్లోబల్ సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

దుబాయ్ ఇంటర్నెట్ సిటీ ఒక స్వర్గధామం

'దుబాయ్‌ని చూస్తే నాకు అసూయ కలుగుతుంది. 50 డిగ్రీల ఉష్ణోగ్రతల ప్రతికూలతల మధ్య దుబాయ్ ఇంటర్నెట్ సిటీ నిర్మాణాన్ని చేపట్టారు.. దాన్ని ఒక స్వర్గధామంలా అక్కడి పాలకులు తీర్చిదిద్దారు. ప్రతి రంగంలోనూ అత్యుత్తమ నగరంగా దుబాయ్ ఇంటర్నెట్ సిటీ ఉంది. అక్కడ ఇంటర్నెట్ సిటీ మొదలుపెడితే.. నేను హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించా. యూఏఈ దార్శనికత.. విధానాల అమలు బాగున్నాయి' అని సీఎం పేర్కొన్నారు. అమరావతి నుంచి హజ్ యాత్రకు మక్కా వెళ్లే వారి కోసం కొత్త విమాన సర్వీసును త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.

సాంకేతిక నగరంగా అమరావతి

అమెరికాలో సిలికాన్ వ్యాలీ తరహాలో.. ఏపీలో క్వాంటమ్ వ్యాలీని వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'గతంలో సైబరాబాద్ నగరాన్ని నిర్మించే అవకాశం దక్కింది. ఇప్పుడు అమరావతిని నిర్మించే అవకాశం వచ్చింది. యూఏఈ మాదిరిగా పాలనలో సాంకేతికతను వినియోగిస్తున్నాం. ఆధార్, జియోట్యాగింగ్ ద్వారా అన్ని సేవలూ అందిస్తున్నాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 550 రకాల ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లో అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయి' అని వెల్లడించారు.

ఆలోచనలు వినూత్నంగా ఉండాలి

'2021లో మనం కొవిడ్‌కు భయపడ్డాం. యూఏఈ విభిన్నంగా ఆలోచించింది. ఆ సమయంలో ఇన్వెస్టోపియాను తెరపైకి తీసుకొచ్చి.. పెట్టుబడులపై దృష్టి పెట్టామని మంత్రి చెప్పిన మాటలు నన్ను ఆకర్షించాయి. చేసే పనులు భిన్నమైనవిగా ఉంటే.. అద్భుతమైన ఫలితాలు వస్తాయి. ప్రతి రోజూ ఒక విభిన్నమైన ఆలోచన చేస్తే అత్యున్నత ఫలితాలు వస్తాయనడానికి ఇదొక నిదర్శనం. యూఏఈ-భారత్ మధ్య బలమైన వాణిజ్య బంధం ఉంది. యూఏఈ-భారత్ మధ్య 2024-25లో 100 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగితే.. అందులో ఏపీ నుంచి 1.5 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. భారత్‌లో యువత సంఖ్య ఎక్కువగా ఉండటం సానుకూల పరిణామం' అని సీఎం పేర్కొన్నారు.

పెట్టుబడులకు ఏపీలో విస్తృత అవకాశాలు

- ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సులో వక్తలు

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని యూఏఈ, రాష్ట్రానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. విజయవాడలో జరిగిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో తమ అభిప్రాయాలు, లక్ష్యాలను వివరించారు.

ఏపీతో భాగస్వామ్యం కీలకం

– అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మారి, యూఏఈ ఆర్థిక మంత్రి



'యూఏఈ-భారత్ ఎకానమీ కారిడార్‌లో ఏపీ కీలక భాగస్వామిగా మారనుంది. దావోస్‌లో సీఎం చంద్రబాబును కలిసినప్పుడు.. ఐదు నిమిషాలు ఏపీ గురించి వివరించారు. ఆరు నెలల్లో ఏపీకి వచ్చి సదస్సు నిర్వహించాం. రాష్ట్రంలో అపారమైన వనరులు.. మౌలిక సదుపాయాలు ఉన్నాయి. సాంకేతిక రంగంలో ఏపీతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి ఉంది. స్టార్టప్.. ఇంక్యుబేషన్ అంశాల్లో కలిసి పనిచేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి సాధిద్దాం. హరిత ఇంధన రంగంలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇన్వెస్టోపియా ద్వారా ఆర్థికంగా అన్ని ప్రాంతాలనూ బలోపేతం చేయడమే లక్ష్యం. ఏఐ, ఫ్యూచర్ ఎకానమీ, రిటైల్, ఏవియేషన్, రంగాల్లో కొత్తగా పెట్టుబడులు పెట్టాలన్నది ఆలోచన'.

స్థానిక పరిశ్రమలు ఎదిగేలా

– ఆర్.ముకుందన్, టాటా కెమికల్స్ లిమిటెడ్ ఎండీ, సీఈవో

'ఇన్వెస్టోపియా రౌండ్ టేబుల్ సదస్సును ఏపీలో నిర్వహించాలని నిర్ణయించాం. స్థానిక పరిశ్రమలు ప్రపంచ స్థాయికి ఎదిగేలా చేసేందుకు ఈ తరహా సమావేశాలు ఉపయోగపడతాయి. దేశంలో ఫుడ్ బౌల్, మిరప, సుగంధ ద్రవ్యాలకు, అగ్రిటెక్ ఇన్నోవేషన్‌లోనూ ఏపీ అగ్రస్థానంలో ఉంది. వేగంగా ఎదుగుతున్న ఏపీ పెట్టుబడులకు అనుకూలం'.

సీఎం చంద్రబాబు వల్లే మళ్లీ వచ్చా

– లులు సీఎండీ యూసుఫ్ అలి



'సీఎం చంద్రబాబును మొదటిసారి దావోస్‌లో కలిసినప్పుడు.. రాష్ట్రానికి మీరు ఏం చేయగలరని అడిగారు. దీంతో విశాఖలో మాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. గత పాలనలో ఇబ్బందుల కారణంగా ప్రతిపాదన పక్కన పెట్టా. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విశాఖలో షాపింగ్ మాల్.. విజయవాడలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. వాటి ద్వారా 5 నుంచి 8 వేల మందికి ఉపాధి లభిస్తుంది. చంద్రబాబును చూసే రాష్ట్రానికి మళ్లీ వచ్చా'.

ఆహార శుద్ధి పరిశ్రమలకు అనుకూలం

– టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి



'రాష్ట్రానికి ఫుడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు ఉంది. రాష్ట్రంలో 5,565 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు. 9 మెగా ఫుడ్ పార్కులు ఉన్నాయి. మూడు పారిశ్రామిక కారిడార్లు, 6 పోర్టులు ఉన్నాయి. ఇది మల్టీ నేషనల్ కనెక్టివిటీకి దోహదపడుతుంది. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. మత్స్య ఎగుమతుల్లో రాష్ట్రం వాటా 45 శాతంగా ఉంది'.

స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం రూపొందించాం

– కె.విజయానంద్, సీఎస్

'స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాం. రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే స్వర్ణాంధ్ర లక్ష్యం. హరిత ఇంధన రంగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ డిక్లరేషన్‌ను సీఎం ఇటీవల ప్రకటించారు. దేశంలోనే అతి పెద్ద గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా రాష్ట్రం మారుతుంది'.

మద్యం కుంభకోణం నిందితులకు రెడ్‌కార్నర్ నోటీసులు!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి, వాటిని స్తంభింపజేసేందుకు వీలుగా ఆయా దేశాల న్యాయస్థానాలకు లేఖలు(లెటర్స్ రోగెటరీ) పంపాలని విన్నవించింది. మద్యం కుంభకోణం నిందితులు ఆ దేశాల్లో ఎక్కడెక్కడ ఉన్నారో ఇప్పటికే సమాచారం సేకరించిన సిట్ సంబంధిత వివరాల్ని విదేశాంగ శాఖకు పంపించింది. అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిని ఏపీ సీఐడీ 2015లో మారిషస్ నుంచి ఎక్స్‌ట్రాడిషన్ ప్రక్రియ ద్వారానే భారత్‌కు తీసుకొచ్చింది. ఇప్పుడు సిట్ కూడా అదే తరహా చర్యలు చేపట్టింది.

ఎవరెవరు ఎక్కడెక్కడ...

విభాగం	భారత్‌లో ఉన్నవారు	థాయ్‌లాండ్‌లో	యూఏఈలో	మొత్తం
నిందితులు	12	1	4	17
అనుమానితులు	4	1	2	7
సాక్షులు	5	0	0	5
మొత్తం	21	2	6	29



ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి



సైఫ్ అహ్మద్




ముప్పిడి అవినాష్‌రెడ్డి



పురుషోత్తం వరుణ్‌కుమార్



బొల్లారం శివకుమార్



ముప్పిడి అనిరుధ్‌రెడ్డి



సైమన్ ప్రసన్



చంద్రపతి ప్రద్యుమ్న

మద్యం కుంభకోణం కేసు నిందితులు, అనుమానితులు 24 మంది, సాక్షులు ఐదుగురు పరారీలో ఉన్నారు. వీరిలో 8 మంది విదేశాల్లో దాక్కున్నారు. వారిపై ఇప్పటికే లుక్ అవుట్ సర్క్యులర్లు జారీ అయ్యాయి. ఏయే తేదీల్లో వారు విదేశాలకు పారిపోయారో సిట్ గుర్తించింది. ఆ వివరాలివీ...

నిందితుడు/అనుమానితుడు	విదేశాలకు పారిపోయిన తేదీ	ప్రస్తుతం ఏ దేశంలో
1. ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి	2024 నవంబరు 30	యూఏఈ
2. సైఫ్ అహ్మద్	2024 ఆగస్టు 9	యూఏఈ
3. ముప్పిడి అవినాష్‌రెడ్డి	2025 ఫిబ్రవరి 28	థాయ్‌లాండ్
4. పురుషోత్తం వరుణ్‌కుమార్	2025 ఫిబ్రవరి 8	యూఏఈ
5. బొల్లారం శివకుమార్	2025 మార్చి 18	యూఏఈ
6. ముప్పిడి అనిరుధ్‌రెడ్డి	2025 మార్చి 19	థాయ్‌లాండ్
7. సైమన్ ప్రసన్	2025 ఫిబ్రవరి 22	యూఏఈ
8. చంద్రపతి ప్రద్యుమ్న	2025 జూన్ 3	యూఏఈ

ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

మోదీ పార్లమెంటులో ఉండాలని తాము బీఏసీ సమావేశంలో డిమాండ్ చేశామని, ప్రభుత్వం దానికి భరోసా ఇచ్చిందని రాజ్యసభలో కాంగ్రెస్‌పక్ష ఉప నాయకుడు ప్రమోద్ తివారీ విలేకరులకు తెలిపారు. వర్షాకాల సమావేశాలు మొదలయ్యాక రాజ్యసభ బీఏసీ సమావేశం జరగడం ఇదే ప్రథమం. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ దీనికి అధ్యక్షత వహించారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు విపక్షాలు రాజ్యసభలో మరోసారి డిమాండ్ చేశాయి. వాయిదా తీర్మాన నోటీసులిచ్చి.. కార్యకలాపాలను అడ్డుకున్నాయి. సభను మూడుసార్లు కొంతసేపు వాయిదా వేయాల్సి వచ్చింది. నోటీసులను తిరస్కరించి చివరకు గురువారానికి వాయిదావేశారు.

సభలో ఇలా ప్రవర్తిస్తే సహించను: ఓంబిర్లా

ఎన్నిసార్లు వారిస్తున్నా పార్లమెంటు సమావేశాలకు కొందరు ఎంపీలు నినాద ఫలకాలతో (ప్లకార్డులతో) వస్తుండటంపై లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా మండిపడ్డారు. వీధుల్లో ప్రవర్తించినట్లు ఇక్కడా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. బిహార్ ఓటర్ల జాబితా విషయంలో పలువురు సభ్యులు తన పీఠం వద్దకు వచ్చిమరీ ఆందోళన నిర్వహిస్తుండటంతో ఆయన ఈ మేరకు ఆగ్రహంతో స్పందించారు. "ప్రజలు ఏ ఆశలు, ఆకాంక్షలతో మిమ్మల్ని ఎన్నుకున్నారో దానికి తగ్గట్టు మీ ప్రవర్తన ఉండాలి. ప్రజల జీవితాలను సరళతరం చేయడానికి దోహదపడేలా చర్చల్లో మీరు పాల్గొనాలి. దీనికి విరుద్ధంగా పార్లమెంటులో కూడా.. వీధుల్లో ప్రవర్తించినట్లు మీరు మెలగుతున్నారు. పార్లమెంటేరియన్లలా మీరుండాలి. సభలోకి ప్లకార్డులు తీసుకురాకూడదు. మీరు దీనిని ఇలాగే కొనసాగిస్తే నేను నిర్ణయాత్మక చర్యలు చేపట్టక తప్పదు" అని హెచ్చరించి సభను కొంతసేపు వాయిదావేశారు. తర్వాతా పరిస్థితిలో మార్పులేక గురువారానికి వాయిదావేశారు. వరసగా మూడోరోజూ పార్లమెంటు కార్యకలాపాలు దాదాపు స్తంభించిపోయాయి.

మద్యం కేసులో శ్రవణ్‌రావుకు సిట్ నోటీసులు

ఈనాడు, అమరావతి: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన శ్రవణ్‌రావుకు.. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు నోటీసిచ్చారు. గురువారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. మద్యం కుంభకోణం నిందితులకు దుబాయ్‌లోని తన ఫ్లాట్‌లో ఆశ్రయం కల్పించారనేది ఆయనపై ప్రధాన అభియోగం.

గ్రహం అనుగ్రహం

24–7–2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
అమావాస్య: రా. 1-03 తదుపరి శ్రావణ శుక్లపక్ష పాడ్యమి
పునర్వసు: సా. 5-50 తదుపరి పుష్యమి
వర్జ్యం: ఉ. 6-14 నుంచి 7-47 వరకు తిరిగి రా. 1-42 నుంచి 3-36 వరకు
అమృత ఘడియలు: మ. 3-31 నుంచి 5-03 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-56 నుంచి 10-48 వరకు తిరిగి మ. 3-05 నుంచి 5-37 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.39; సూర్యాస్తమయం: సా.6.32
అమావాస్య

మిథున్‌రెడ్డితో పెద్దిరెడ్డి ములాఖత్



మిథున్‌రెడ్డితో ములాఖత్ అనంతరం బయటకొస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి వనిత తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో అరెస్టై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని ఆయన తండ్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ భరత్‌రామ్ బుధవారం మధ్యాహ్నం కలిశారు. అనంతరం జైలు బయట నిర్వహించిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. వైకాపా శ్రేణులను, కీలక నేతలను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు న్యాయపరంగా సౌకర్యాలను ఇవ్వాల్సిన పనిలేదా అని ప్రశ్నించారు. 'మిథున్‌రెడ్డి ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కొంటారు. సౌకర్యాలు కావాలని అడిగే వ్యక్తి కాదు' అని చెప్పారు.

విశాఖ రైల్వే జోన్ డీపీఆర్‌కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదిత పోస్టులు, సిబ్బందిని బదలాయించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

- తూర్పుకోస్తా రైల్వే, దక్షిణ మధ్య రైల్వే జోన్ల పరిధిలోని ట్రాక్ మెషీన్లు, వాటి సిబ్బందిని బదలాయించేందుకు ఆమోదించలేదు.
- కొత్త జోన్ కేంద్రమైన విశాఖపట్నంలో సివిల్ పనులకు అదనంగా రూ.200 కోట్లు అవసరమని డీపీఆర్‌లో పేర్కొనగా.. ఆ ప్రతిపాదనలు పంపితే పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.
- జోన్ ప్రధాన కార్యాలయం నిర్మిస్తున్న ముడసర్లోవలో అత్యవసర వార్డుతో హెల్త్ యూనిట్ అవసరమని ప్రతిపాదించగా.. ప్రస్తుతం ఇది అవసరం లేదని నిర్ణయించింది.
- గుణుపూర్-తేరుబలి కొత్త లైన్ పూర్తయ్యే వరకు గుణుపూర్-పర్లాఖెముండి సెక్షన్ సహా, నౌపడ-గుణుపూర్ లైన్‌ను కొత్తగా ఏర్పాటయ్యే విశాఖపట్నం డివిజన్‌లో ఉంచాలని డీపీఆర్‌లో ప్రతిపాదించారు. అయితే కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన జోన్ పరిధికి అనుగుణంగా ఈ ప్రతిపాదన లేకపోవడంతో దీనిని బోర్డు అంగీకరించలేదు.
- కొత్తగా జీఎం పోస్టు మినహా, మరే ఇతర గెజిటెడ్, నాన్ గెజిటెడ్ పోస్టులు సృష్టించకూడదని తెలిపింది.
- కొత్త జోన్ ప్రధాన కేంద్రానికి, విశాఖపట్నం డివిజన్‌కు అవసరమైన సిబ్బంది కోసం డీపీఆర్‌లో చేసిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.
- ఆయా సెక్షన్లలో అధికారులు, సిబ్బంది.. ఎక్కడ పని చేస్తున్నవారు అక్కడే అన్న విధానంలో కేటాయిస్తారు. ఫీల్డ్ సిబ్బందిని మాత్రం విభజిస్తారు.
- కొత్త జోన్ ప్రధాన కేంద్రం (విశాఖపట్నం)లో అధికారుల కోసం అద్దెకు తీసుకునే నివాసాలకు చెందిన ప్రతిపాదనలు పంపాలని పేర్కొంది.
- అధికారులు, ఉద్యోగుల సీనియారిటీ విషయంలోనూ పలు సూచనలు చేసింది.

శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం టికెట్లు ఇక ఆన్‌లైన్‌లోనే


తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనార్థం కేటాయించే శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం టికెట్లను ఆగస్టు ఒకటి నుంచి తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇప్పటివరకు రోజూ ఆన్‌లైన్‌లో 150, తిరుపతిలో హోమం వద్ద క్యూలైన్లో ఉన్నవారికి 50 టికెట్లు ఇచ్చేవారు. ఇకనుంచి హోమం వద్ద టికెట్లు ఇచ్చే ప్రక్రియను రద్దు చేశారు. మొత్తం 200 టికెట్లను ఆన్‌లైన్‌లో కేటాయించే ప్రక్రియకు తితిదే శ్రీకారం చుట్టింది.

రాజధానిలోనే స్వాతంత్ర్య దినోత్సవం

ఈనాడు, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఈసారి రాజధాని అమరావతిలోనే నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం వెనుక ఇటీవల పీ-4, ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించిన ప్రాంతంలోనే వేడుకలు జరపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర సచివాయలంలో ఉన్నతాధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలని, జర్మన్ హ్యాంగర్లు వేయాలని సూచించారు.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తాడేపల్లిగూడెం	33.4	26.2
విశాఖపట్నం	32.0	27.0
శ్రీకాకుళం	32.0	27.0
విజయనగరం	32.0	25.0
నెల్లూరు	31.3	27.9
ఒంగోలు	31.1	26.8
రాజమహేంద్రవరం	31.0	25.5
తిరుపతి	30.6	26.0
నరసాపురం	30.6	25.2
అనంతపురం	30.6	24.0
విజయవాడ	30.4	25.4
కడప	30.0	25.0
గుంటూరు	29.0	26.0
కర్నూలు	28.4	25.0
హైదరాబాద్	27.6	22.4



ఆటోకార్మికుల ఉపాధికి ఇబ్బంది లేకుండా చూస్తాం

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. కాకినాడలో బుధవారం ఆయన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి పాల్గొన్నారు. అనంతరం రవాణాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆటో కార్మికుల ఉపాధికి ఇబ్బంది లేకుండా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు రూ.10 వేలు విదిలించి, రూ.70 వేల పైన పన్నులు, జరిమానాల పేరిట దండుకుందని ఆరోపించారు. ఒకటి, రెండు రోజుల్లో ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన నమూనా బస్సును తెస్తామని ఆయన వెల్లడించారు. ఈ పథకం కోసం సుమారు 1,400 బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు.

జీరో యాక్సిడెంట్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యం: జీరో యాక్సిడెంట్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని మంత్రి చెప్పారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సుమారు రూ.130 కోట్లు ఆదాయం కోల్పోతున్నా వాహనదారుల సంక్షేమం కోసం గ్రీన్ ట్యాక్స్‌ను రద్దు చేశామని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లకు నైట్‌అవుట్ ఎలవెన్సు పెంచుతున్నామన్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్వాక్రా మహిళలకు ఉచితంగా.. రూ.50 వేల విలువైన ఎగ్ కార్ట్‌లు



లబ్ధిదారులకు ఎగ్ కార్ట్ పత్రాలను అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్. చిత్రంలో సెర్ప్ ఎక్స్ అఫీషియో కార్యదర్శి వాకాటి కరుణ తదితరులు



పంపిణీకి సిద్ధంగా ఉంచిన ఎగ్ కార్ట్‌లు

ఈనాడు, అమరావతి: చిరు వ్యాపారాలను ప్రోత్సహించడంలో భాగంగా డ్వాక్రా మహిళలకు ఉచితంగా రూ.50 వేల విలువైన ఎగ్ కార్ట్‌లను ప్రభుత్వం అందిస్తోంది. పోషకాహార లోపాన్ని నివారించే క్రమంలో కోడిగుడ్ల వాడకాన్ని పెంచేందుకు నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ (నెక్)తో సెర్ప్ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. 2025-26 ఏడాదికి రాష్ట్రవ్యాప్తంగా 1,000 మందికి ఎగ్ కార్ట్‌లను అందిస్తారు. మొదటి విడతగా 250 ఎగ్ కార్ట్‌లను నెక్ సరఫరా చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రాజెక్ట్ డైరెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ లబ్ధిదారులకు వీటిని అందించారు. ఒక్కోదాని విలువ రూ.35 వేలు. గుడ్లతో వివిధ రకాల వంటకాలు చేసేందుకు అవసరమైన రూ.15 వేల విలువైన వస్తు సామగ్రినీ ఇస్తారు. వీటితో డ్వాక్రా మహిళలు నెలకు రూ.20 వేల చొప్పున ఆదాయాన్ని ఆర్జించవచ్చని సెర్ప్ అధికారులు చెప్పారు.

రూ.20 వేల కోట్ల పెట్టుబడులు.. 50 వేల మందికి ఉపాధి!

- సీఎం అధ్యక్షతన ఎస్ఐపీబీ 9వ సమావేశం
- భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా విశాఖ మాస్టర్‌ప్లాన్ ఉండాలి

ఈనాడు, అమరావతి: విశాఖలో ఐటీ రంగంలో రూ.20,216 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిఫి, సత్వా, బీసీఎం, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు ముందుకొచ్చాయి. వాటిద్వారా 50,600 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థలు ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) 9వ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ‘భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా విశాఖ మాస్టర్‌ప్లాన్ ఉండాలి. మౌలిక వసతుల సమస్య రాకుండా ప్రణాళికలు ఉండాలి. విమానాశ్రయం-రైల్వే కనెక్టివిటీ, జాతీయ రహదారులు, మెట్రోపై ముందస్తు ప్రణాళికతో జాగ్రత్తలు తీసుకోవాలి. పుణె, బెంగుళూరు లాంటి చోట్ల ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇక్కడ అలా ఉండకూడదు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు సామాన్యులు అక్కడ నివసించేలా పరిస్థితులు ఉండాలి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు అమలుచేయాలి. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉంది. ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ సహా.. అనేక సంస్థలకు భూములు ఇస్తున్నాం. ఇంకా విశాఖకు వచ్చే పరిశ్రమలకు అనువైన భూములు చూపించాలి’ అని సీఎం పేర్కొన్నారు. పెట్టుబడుల ప్రతిపాదనలపై 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్‌కమిటీ ఛైర్మన్, మంత్రి లోకేశ్ సమావేశంలో వివరించారు. ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖ ఖ్యాతి మరింతగా పెరుగుతుందని ఆయన అన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో పాల్గొన్న మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్ తదితరులు

◆ సిఫీ టెక్నాలజీస్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ సొల్యూషన్స్, సర్వీసెస్ ప్రొవైడర్‌గా పనిచేస్తుంది. ఈ ఏడాది అక్టోబరులో కార్యకలాపాలు ప్రారంభించనుంది.

◆ సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఐటీ, ఐటీఈఎస్ పార్కులు, నివాస, వాణిజ్య ప్రాజెక్టులను అభివృద్ధి చేయనుంది. ప్రస్తుతం 8 నగరాల్లో.. 80 మిలియన్ చదరపు అడుగుల మేర కార్యాలయాల సముదాయాలను సంస్థ నిర్మిస్తోంది.

◆ జిందాల్ గ్రూపునకు చెందిన బీసీఎం ఎనర్జీ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విశాఖలో మినీ స్మార్ట్ టెక్ సిటీ ఏర్పాటు చేయనుంది. గ్రేడ్ ఏ ప్లస్ ఆఫీస్ స్పేస్, కో-వర్కింగ్ స్పేస్, ఉద్యోగుల నివాస ప్రాంతాలను అభివృద్ధి చేయనుంది. ఫైనాన్షియల్ సర్వీసెస్, స్టార్ హోటళ్లు, ఐటీ పార్కుల నిర్మాణంలో అనుభవం ఉంది.

◆ ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజైనింగ్, ఎస్టాబ్లిషింగ్, జీసీసీ ఆపరేటింగ్‌లో భారత్‌తో పాటు పోలండ్, యూఏఈలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం 1.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది.

ఇప్పటికి.. రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులు

కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు జరిగిన ఎస్ఐపీబీ భేటీల్లో 113 ప్రాజెక్టులను ఆమోదించడం ద్వారా.. రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వాటి ఆధారంగా 5.56 లక్షల మందికి ఉపాధి లభించనుంది. పారిశ్రామిక రంగంలో 46 ప్రాజెక్టులు, ఇంధన రంగంలో 41, పర్యాటక రంగంలో 11, ఐటీలో 11, ఫుడ్ ప్రాసెసింగ్‌లో 4 పరిశ్రమలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.

వివిధ సంస్థల పెట్టుబడుల వివరాలు (రూ.కోట్లలో)

సంస్థ	పెట్టుబడి	ఉపాధి
సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ (రెండోదశలో రూ.15వేల కోట్ల పెట్టుబడులు 400 మందికి ఉపాధి)	1,466	200
సత్వా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్	1,500	25 వేలు
బీసీఎం ఎనర్జీ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్	1,250	15 వేలు
ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్	1,000	10 వేలు

పవనన్న సినిమా కోసం ఎదురుచూస్తున్నా: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ‘పవనన్న, ఆయన సినిమాలు, స్వాగ్ నాకు చాలా చాలా ఇష్టం. పవర్‌స్టార్ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో హరిహర వీరమల్లు అద్భుత విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను’ అని లోకేశ్ పేర్కొన్నారు. హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా బుధవారం ఎక్స్ వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పవర్‌స్టార్ అభిమానుల్లాగే తానూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు.

‘హరిహర వీరమల్లు’ సూపర్‌హిట్ కావాలి: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పవన్‌కల్యాణ్ నటించిన ‘హరిహర వీరమల్లు’ సూపర్‌హిట్ కావాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. చిత్రం విడుదల సందర్భంగా బుధవారం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. “పవన్ అభిమానులు, ప్రేక్షకులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న హరిహర వీరమల్లు వారి ముందుకొచ్చింది. డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. సమయాన్ని సర్దుబాటు చేసుకుని పవన్ నటించిన ఈ సినిమా అన్ని వర్గాలనూ ఆకట్టుకోవాలని ఆకాంక్షిస్తున్నాను” అని చంద్రబాబు పేర్కొన్నారు.

చంద్రబాబు మాటలు విజయ సంకేతాలు


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: ‘గత పదేళ్లలో సీఎం చంద్రబాబుతో పలుమార్లు సమావేశమైనా ఎప్పుడూ సినిమాల ప్రస్తావన రాలేదు. ఈ రోజు హరిహర వీరమల్లు చిత్ర విజయాన్ని కాంక్షించినందుకు ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆ మాటలు విజయ సంకేతాలు. నా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. సినిమాలో నటించే వెసులుబాటు కల్పించారు’ అని హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సీఎం చంద్రబాబు పెట్టిన పోస్టుపై పవన్ కల్యాణ్ స్పందించారు.

దాల్మియా సిమెంటు ఉత్పత్తి సామర్థ్యం పెంపు

విస్తరణతో రూ.3,287 కోట్ల పెట్టుబడులు

ఈనాడు, అమరావతి: దాల్మియా భారత్ సంస్థ కడపలోని సిమెంటు కార్మాగార క్లింకర్ సామర్థ్యాన్ని 3.6 మిలియన్ టన్నుల(ఎంటీ) నుంచి 6 ఎంటీలకు విస్తరించనున్నట్లు ప్రకటించింది. దీనికోసం రూ.3,287 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. హరిత పరిశ్రమగా దీన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. 2028 నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని, దీంతో సుమారు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొంది. 2028 నాటికి 75 టన్నుల సిమెంటు ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకోవాలన్నది లక్ష్యంగా పేర్కొంది. ‘రాష్ట్రంతో మాకు అనుబంధం మరింత బలపడుతుంది. ఆ ప్లాంట్ ద్వారా దక్షిణ భారత మార్కెట్ డిమాండు మేరకు సరఫరా చేసే అవకాశం ఉంటుంది’ అని సంస్థ ఎండీ, సీఈఓ పునీత్ దాల్మియా పేర్కొన్నారు.



జీవితంలో సమస్యలు సహజం

ఒక్కసారి వెనక్కి తిరిగి మీ గతంలోకి తొంగి చూడండి. చిన్నప్పటి నుంచి మిమ్మల్ని భయపెట్టిన సమస్యలు, వాటిని మీరు ఎదుర్కొని ముందుకు సాగిన తీరు మీకు అవగతమవుతుంది. మరి అదే స్ఫూర్తితో ప్రస్తుత మీ సమస్యనూ పరిష్కరించుకోలేరా? జీవితంలో సమస్యలు రావడం ఎంత సహజమో, వాటిని ధైర్యంగా ఎదుర్కోవడాన్ని కూడా అలాంటి ఓ సహజ ప్రక్రియగా మార్చుకోవాలి.

– మార్క్ మాన్సన్, రచయిత

వచ్చే ఏడాదికి రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ నెర్వ్ సేవలు

- వైద్యఖర్చుల భారం తగ్గాలంటే ఆరోగ్య పరిరక్షణ అవసరం
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఐపీఎంలో 150 పోస్టుల భర్తీకి పచ్చజెండా

ఈనాడు, అమరావతి: టాటా ట్రస్ట్-గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో చేపడుతున్న డిజిటల్ నెర్వ్ సెంటర్లను వచ్చే ఏడాది చివరికి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సమీక్షించారు. ‘డిజిటల్ నెర్వ్ సెంటర్ల కోసం జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటుచేయాలి. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. వచ్చే ఏడాది జనవరిలో చిత్తూరు జిల్లావ్యాప్తంగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్లను ప్రారంభించబోతున్నాం. టెక్నాలజీని వినియోగించుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు ఎలా అందించవచ్చన్న అంశాలపై అధ్యయనం చేయండి. విశాఖ, విజయవాడ, తిరుపతి లాంటి నగరాల్లోని సిటీ డయాగ్నస్టిక్ సెంటర్లలో సేవలు పేదలకు అందుబాటులోకి తేవాలి. సీటీ స్కాన్, ఎంఆర్ఐ లాంటి వాటికి ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో భారీగా వసూలుచేస్తారు. ప్రభుత్వ కేంద్రాల ద్వారా పేదలు, మధ్యతరగతివారికి వైద్యపరీక్షలు అందుబాటులోకి తేవాలి. వైద్యరంగంలో టెక్నాలజీ వినియోగంపై ఇప్పటికే గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో పనిచేస్తున్నాం. ఐఐటీ మద్రాస్ లాంటివారి సేవలనూ ఉపయోగించుకోవాలి’ అని సీఎం సూచించారు.

ప్రజల ఆరోగ్య వివరాలు అందుబాటులో ఉండాలి

‘భవిష్యత్తులో వైద్యఖర్చులు ప్రజలు భరించలేని స్థాయికి చేరే ప్రమాదం ఉంది. ఈ భారం తగ్గాలంటే ఆరోగ్యం మీద ప్రజలకు అవగాహన తప్పనిసరి. ఆహార అలవాట్లలోనూ మార్పులు రావాలి. పురుగు మందులు వినియోగించని ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలి. ఈ దిశగా రైతులు, ప్రజలను చైతన్యం చేయాలి. ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయాలి’ అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ‘ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. పిల్లల్లో పోషకాహార లోపాలను గుర్తించేలా ‘కేర్ అండ్ గ్రో’ పాలసీని సమర్థంగా అమలు చేయాలి. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఉండాలనే ప్రభుత్వ పాలసీని పక్కాగా అమలుచేయాలి. గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలపై ప్రత్యేకదృష్టి సారించాలి. ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దాలి. అవసరమైతే ఔట్‌సోర్సింగ్ సేవలు తీసుకోండి. వైద్య కళాశాలల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోండి. రాష్ట్రంలో డీమ్డ్ యూనివర్సిటీల ఏర్పాటుపై దృష్టిసారించాలి’ అని ముఖ్యమంత్రి సూచించారు.

యోగాధ్యయన పరిషత్ పునరుద్ధరణకు సొసైటీ

‘యోగా డే రోజున డిక్లరేషన్ ప్రకటించాం. యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. నేచురోపతి, హోమియో, ఆయుర్వేదం, యునాని లాంటి సంప్రదాయ వైద్య పద్ధతులను యాక్టివేట్ చేయాలి’ అని ముఖ్యమంత్రి సూచించారు. ‘యోగాధ్యయన పరిషత్తు పునరుద్ధరణకు సొసైటీ ఏర్పాటుచేయాలి. అవసరమైన సిబ్బందిని వైద్యసేవల నియామక బోర్డు ద్వారా నియమించాలి. అవసరం లేకున్నా సిజేరియన్ల ద్వారా కాన్పులు చేస్తున్నారు. యోగా చేస్తే సాధారణ ప్రసవాలకు అవకాశం ఉంటుంది’ అని సీఎం వ్యాఖ్యానించారు.

150 పోస్టుల భర్తీకి ఆమోదం

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టరేట్‌లో పోస్టులను భర్తీచేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రిని కోరారు. 723 పోస్టులకు గాను.. 143 మందే ఉన్నారని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ముందుగా 150 పోస్టులను భర్తీచేసేలా ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. విదేశాల్లో వైద్యవిద్య అభ్యసించిన విద్యార్థులకు రిజిస్ట్రేషన్ సమస్యను పరిష్కరించాలని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వైద్య విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలని సీఎం అన్నారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, టాటా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో విద్యుత్, ఇంటెలిజెన్స్ గ్రిడ్లు

- పాలనలో ఏఐ కీలకంగా మారుతుంది
- రాష్ట్రంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు విస్తృత అవకాశం
- ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జీ 42 ఇండియా సీఈవో మనూ జైన్ వెల్లడి



ఫైర్‌సైడ్ చాట్‌లో పాల్గొన్న మంత్రి లోకేశ్, జీ 42 ఇండియా సీఈవో మనూ జైన్, మోడరేటర్ రక్షా శారద

ఈనాడు, అమరావతి: రాష్ట్రం డిజిటల్ పవర్‌హౌస్‌గా మారనుందని మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు. . నవకల్పనలకు అవకాశాలు వస్తాయన్నారు. డేటా విప్లవం ద్వారా అంతర్జాతీయంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందువరుసలో ఉంటుందని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన ఇన్వెస్టోపియా గ్లోబల్ ఏపీ-2025 సదస్సులో భాగంగా పెట్టుబడులకు ముఖద్వారంగా రాష్ట్రం, యూఏఈ పెట్టుబడులు - భాగస్వామ్యాలు, వ్యవసాయ సాంకేతికత, ఆహార భద్రత, ఏఐ, డేటా సెంటర్లు.. స్మార్ట్ గవర్నెన్స్ అంశాలపై చర్చలు జరిగాయి. ఏఐ, డేటా సెంటర్లు ఆధునిక ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గంగా మారుతున్నాయా? అనే అంశంపై నిర్వహించిన ఫైర్‌సైడ్ చాట్‌లో మంత్రి లోకేశ్, జీ 42 ఇండియా సీఈవో మనూ జైన్ పాల్గొన్నారు. మోడరేటర్ రక్షా శారద అడిగిన ప్రశ్నలకు ఇద్దరూ ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. అవి ఇలా..

మోడరేటర్: డేటా సెంటర్లు.. ఆర్థికాభివృద్ధి అవకాశాలపై మీ అభిప్రాయాలు ఏంటి?

మనూ: సీఎం చంద్రబాబును 2015 జూన్‌లో తొలిసారి కలిశాను. దేశంలో ‘షావోమి’ని మొదటిసారి ప్రారంభించాలని వచ్చి.. ఏపీని అనువైన ప్రాంతంగా ఎంచుకున్నాం. ఇప్పుడు షావోమి దేశంలోనే అతి పెద్ద కంపెనీ. రాష్ట్రం నుంచే తయారీ జరుగుతోంది.

లోకేశ్: ఏఐ ద్వారా పాలనను చాలా సులువుగా.. ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయవచ్చనేది తెలుసుకున్నా. నేను పాదయాత్ర చేసేప్పుడు భూముల రికార్డుల కోసం ప్రజలు పడే ఇబ్బందులను గమనించా. భూ రికార్డుల్లో ఉన్న తప్పులను సవరించేందుకు ఏఐ వినియోగించి రికార్డులు సరిచేస్తున్నాం. ఏఐని వినియోగించి ప్రజలకు సులువుగా సేవలు అందించడంపై దృష్టి పెట్టా. దీని కోసం వివిధ ప్రభుత్వ శాఖలను అనుసంధానిస్తూ డేటా లేక్ రూపొందించాం.

మోడరేటర్: ఏఐ, డేటా సెంటర్ల భవిష్యత్తును ఎలా చూస్తున్నారు?

మనూ: 25 ఏళ్ల కిందట ఇంటర్నెట్ కొత్తగా వచ్చిన సమయంలో.. ప్రజల జీవితాన్ని మార్చేస్తుందని భయపడ్డారు. దాని సాయంతో ఇప్పుడు 10 నిమిషాల్లో ఆహారం ఆర్డర్ చేసుకోవచ్చు. ప్రపంచంలో ఎక్కడున్నా వీడియో కాల్స్ చేసుకోవచ్చు. రాబోయే 25 ఏళ్లలో ఏఐ, డేటా సెంటర్లు సాంకేతికంగా కీలకం కాబోతున్నాయి. ప్రస్తుతం ఎలక్ట్రిక్ గ్రిడ్ మాత్రమే ఉంది. 25 ఏళ్ల తర్వాత వచ్చే జెనరేషన్ రెండు గ్రిడ్‌లు (ఎలక్ట్రిక్ గ్రిడ్.. ఇంటెలిజెన్స్ గ్రిడ్) వాడతారు.

మోడరేటర్: క్వాంటమ్ కంప్యూటింగ్.. డేటా లేక్స్ లాంటి వాటిపై మాట్లాడుతుంటే.. యూఏఈతో కలిసి పనిచేయడం వల్ల లాభం ఉంటుందా?

లోకేశ్: ఏపీలో డేటా సెంటర్లు వినూత్న ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారతాయి. ఇదే దృష్టితో 2017-18లో ఆలోచించాం. అప్పట్లో చాట్ జీపీటీ లాంటిది లేదు. విశాఖను దేశానికి డేటా సిటీగా మార్చాలని నిర్ణయించాం. గత ఐదేళ్లలో చిన్న అడ్డంకి వతచ్చింది. ఇప్పుడు సాంకేతికత అందిపుచ్చుకునేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాం. ఈ విషయంలో జీ 42 సహకరిస్తుందని భావిస్తున్నాం.

మనూ: 2015లో ఏపీకి వచ్చినప్పుడు.. చుట్టూ పచ్చటి పొలాలు ఉన్నాయి. వాటి మధ్య కంప్యూటర్లు ఏర్పాటు చేసిన విషయం ఇప్పటికీ నాకు గుర్తు ఉంది. సీఎం చంద్రబాబు సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుంటారు. ఆయన నన్ను అప్పుడు ఒక డేటా గదిలోకి తీసుకెళ్లారు. అందులో కంప్యూటర్లు.. స్క్రీన్లు ఉన్నాయి. ప్రతి గ్రామం నుంచి సమాచారం తెలుసుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐటీ హబ్ నిర్మించారు. ఇప్పుడు అమరావతి, విజయవాడ, విశాఖలో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ విభాగాల్లో..నిర్ణయాలు తీసుకోవడంలో ఏఐ వాడుతున్నారు.

మోడరేటర్: పాలనా విధానాలను ఏఐ ఎలా మారుస్తుంది?

లోకేశ్: యూఏఈ మొదటగా ఏఐ వినియోగించినట్లు తెలుసు. ఏఐకి ప్రత్యేకంగా మంత్రిని నియమించిన దేశాల్లో అదొకటి. ఏపీలో ఏఐ వినియోగం ప్రాథమిక దశలో ఉంది. 100 సేవలకు సంబంధించి దీనిని పరిశీలిస్తున్నాం. ఒక హాకథాన్ నిర్వహిస్తున్నాం. యూఏఈ నుంచి ఇంకా చాలా అంశాలు తెలుసుకోవాలి. ఏఐ వల్ల ఉపాధి కోల్పోతారనే ఆందోళన ఉంది. ఇది నిజం కాదు. ఐటీ విప్లవం ద్వారా భారత్ చాలా లబ్ధి పొందింది. ఏఐ విషయంలోనూ అలాగే జరుగుతుందని నా అభిప్రాయం.

మోడరేటర్: మీ జీవితంలో ఏఐని ఎలా ఉపయోగిస్తున్నారు?

లోకేశ్: ఏఐ అనేది జీవన విధానంగా మారింది. మన పనిని సులువుగా.. సమర్థంగా చేస్తుంది. ఐప్యాడ్, ఐఫోన్ లేకుండా పిల్లల్ని ఎలా బిజీగా ఉంచాలి... ఇలాంటి అంశాల్లో ఏఐ సహాయం చేసింది.

ఈనాడు

ఇది న్యాయమా?

నేరస్థులందరినీ కచ్చితంగా చట్టబద్ధంగా శిక్షించాల్సిందే. ముఖ్యంగా సామాజిక శాంతిని, జాతిభద్రతను ప్రమాదంలోకి పడదోసే అకృత్యాలకు పాల్పడేవారిని కఠినంగా దండించాల్సిందే. కానీ, కేసును కొలిక్కితెచ్చేశామని చెప్పుకోవడానికి ఎవరోఒకరిపై నేరాభియోగాలు మోపితే- బాధితులకు న్యాయం జరగదు. నిజమైన నేరగాళ్లతో ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదమూ తొలిగిపోదు. కేసుల పరిష్కారంలో సహేతుకంగా వ్యవహరించకపోతే సమాజానికి ఎంతటి ముప్పు వాటిల్లుతుందో తాజాగా వివరించిన బాంబే హైకోర్టు- 2006 ముంబయి బాంబుపేలుళ్లకు బాధ్యులుగా బోనెక్కినవారిని నిర్దోషులుగా ప్రకటించింది. ఆధారాల సేకరణలో, ప్రత్యక్ష సాక్షుల విచారణలో పోలీసులు, ప్రాసిక్యూషన్ వర్గాల వైఫల్యాన్ని ఉన్నత న్యాయస్థానం వేలెత్తి చూపించింది. దేశ ఆర్థిక రాజధానిలో ఆరు నిమిషాల వ్యవధిలో ఏడు లోకల్ రైళ్లలో పేలిన బాంబులు- 187 మందిని కబళించి, 824 మందిని గాయపరిచాయి. ఈ భయంకర ఉగ్రదాడికి కారకులెవరో ఇరవై ఏళ్ల తరవాతా తేలకపోతే- ముష్కరమూకలపై పోరాటానికి అర్థముంటుందా? అశాస్త్రీయ దర్యాప్తులతో పోలీసులు కేసులను చాపచుట్టేస్తుంటే ప్రజలకు రక్షణ ఉంటుందా?

భార్యాపిల్లలు సహా నలుగురు కుటుంబ సభ్యులను హతమార్చాడంటూ బల్జీందర్ కుమార్ అనే వ్యక్తిపై 2013లో పోలీసులు కేసుపెట్టారు. 2020లో ట్రయల్ కోర్టు కుమార్‌ను దోషిగా నిర్ధారించి ఉరిశిక్ష వేసింది. పంజాబ్, హరియాణా హైకోర్టు నిరుడు దాన్ని సమర్థించింది. అనుమానాలే తప్ప కుమార్ నేరం చేశాడని నిరూపించే సాక్ష్యాలేవీ లేవని పేర్కొన్న సుప్రీంకోర్టు- అతడు నిర్దోషి అంటూ వారం కిందట తీర్పుచ్చింది. 'పోక్సో' కేసులో ఇరవై ఏళ్ల జైలుశిక్షకు గురైన ఓ వ్యక్తి కూడా దోషి కాదని తేల్చింది. దేశవ్యాప్తంగా ఇలా ఎన్నో కేసుల్లో ఏళ్ల తరబడి కారాగారాల్లో మగ్గిపోతున్నవారు ఆపై ఎప్పటికో నిర్దోషులుగా విడుదలవుతున్నారు. కానీ, వారు కోల్పోయిన జీవితాలను ఎవరు తెచ్చివ్వగలరు? అదే సమయంలో చట్టం చేతుల్లోంచి తప్పించుకుపోతున్న అపరాధులేమో మళ్లీ మళ్లీ నేరాలకు ఒడిగడుతున్నారు. తప్పుడు సాక్ష్యాలను పుట్టించడం, ఫోరెన్సిక్ ఆధారాలను పక్కాగా సేకరించి సమర్పించకపోవడం వంటి మతిమాలిన పనులకు పాల్పడుతున్న పోలీసులకు న్యాయస్థానాలు తరచూ తలంటుతున్నాయి. అయినా తీరుమార్చుకోని కొందరు ఖాకీల మూలంగా పౌరహక్కులు మంటగలుస్తున్నాయి. దశాబ్దాల తరబడి సాగుతున్న కేసులు సామాన్యులకు సత్వర న్యాయాన్ని దూరం చేస్తున్నాయి!

ఒక పట్టాన తెమలని కేసుల కారణంగా మన దేశంలో నేరన్యాయ వ్యవస్థే ఒక శిక్షగా మారుతోందని సుప్రీంకోర్టు గతంలో ఆవేదన వ్యక్తంచేసింది. ఆ దుర్భరావస్థను మరింత పెంచుతూ- దేశీయంగా అన్ని స్థాయుల న్యాయస్థానాల్లో ప్రస్తుతం పెండింగ్ కేసుల సంఖ్య 5.30కోట్లకు చేరింది. రాజ్యాంగ ప్రమాణాలకు అనుగుణంగా ప్రజలకు సత్వర న్యాయం జరగాలంటే- ప్రతి పది లక్షల జనాభాకు యాభై మంది న్యాయమూర్తులు ఉండాలని లా కమిషన్ లోగడ సిఫార్సు చేసింది. కానీ, పది లక్షల మందికి 15 మంది జడ్జిలు మాత్రమే ఉన్న భారతావనిలో కోర్టులపై పనిభారం నానాటికీ పెరుగుతోంది. పదమూడు హైకోర్టులలో ఇరవై నుంచి యాభై శాతం వరకు సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండటంతో న్యాయవితరణలో ఇంకా జాప్యం జరుగుతోంది. కిందిస్థాయి న్యాయస్థానాల్లో మౌలిక వసతుల కల్పనలోనూ సమస్యలున్నాయి. వీటన్నింటినీ పరిష్కరించడంలో ప్రభుత్వాలు చొరవ తీసుకుంటేనే- న్యాయంకోసం జీవితాంతం ఎదురుచూసే అసహాయ పరిస్థితులు ప్రజానీకానికి తప్పుతాయి!



సౌరకుటుంబం మొత్తంలో మన భూగ్రహమే అందమైంది. తెల్లని మేఘాలూ, నీలి సముద్రాలూ, ఎత్తయిన కొండలూ... మరెక్కడా లేవు. ఈ అద్భుతాన్ని ముందు తరాలకు అంతే అందంగా ఇవ్వాల్సిన బాధ్యత మనదే!

– సునీతా విలియమ్స్

మాటే అలంకారం

వాక్కు పరబ్రహ్మ స్వరూపం. దాన్ని ఎంత అవసరమో అంతే వాడాలి. అతిగా మాట్లాడటంవల్ల అసత్యాలు దొర్లే ప్రమాదముంది. ఇతరులను నొప్పించే అవకాశముంది. సత్యవాక్కు కలిగి మితభాషులుగా ఉండేవారంటేనే అందరికీ గౌరవం.

అగ్నిదేవుడు వాక్కు రూపంలో ఉంటాడు. అగ్ని ఎంత పవిత్రమో మాట కూడా అంతే పవిత్రంగా ఉండాలి. మధురమైన వాక్కు కన్నా ప్రియమైంది మరొకటి లేదు. రామాయణంలో శ్రీరాముడు పితృవాక్య పరిపాలకుడుగానే కాదు, ప్రియభాషణుడుగానూ వాసికెక్కాడు. అలాగే ఆంజనేయుడు అత్యంత మధురంగా మాట్లాడి శ్రీరాముడి మనసును ఆకట్టుకున్నాడు. భారతంలో రాయబారానికి వచ్చిన శ్రీకృష్ణుడితో దుర్యోధనుడు- యుద్ధం చేయకుండా సూది మొనంత భూమి కూడా ఇవ్వనని కఠోరంగా మాట్లాడి కురుక్షేత్ర సంగ్రామానికి కారణమయ్యాడు. ఎందరో వీరులను, పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యాన్ని కోల్పోయాడు.



అంతర్యామి

సమస్త జీవరాశి నుంచి మనిషిని వేరుచేసేది, ఒక మెట్టు పైన ఉంచేది మాట మాత్రమే. అందుకే అది సాత్వికంగా, సత్యంగా మనుషుల మధ్య బంధాలను పెంచేదిగా ఉండాలి. ఎదుటి వ్యక్తులను కించపరిచేటట్లుగా ఉండకూడదు. వాగ్భూషణం భూషణం... అంటాడు భర్తృహరి నీతి శతకంలో. 'చంద్రకాంతిలా ప్రకాశించే రత్నాలహారాలు, స్నానలేపనాదులు, పువ్వులు, కేశాలంకరణలూ ఇవేవీ మనిషికి నిజమైన సౌందర్యాన్ని చేకూర్చలేవు. చక్కగా సంస్కారంతో కూడిన మాట ఒక్కటే మనిషికి నిజమైన అలంకారం. మిగిలిన భూషణాలన్నీ నశించినా, చివరకు శరీరం నశించిన తరవాత కూడా వాక్కు నిలిచి ఉంటుంది' అని ఆ నీతిశతకం బోధిస్తుంది. ఒక మంచిమాట, స్వచ్ఛమైన చిరునవ్వు ఎటువంటి మనిషిని అయినా ఆనందంగా ఉంచుతాయి. దుర్మార్గుణ్ని కూడా మనిషిగా మారుస్తాయి.

మాట ప్రళయాన్ని సృష్టించగలదు. మానవాళికి సుఖశాంతులూ అందించగలదు. ఎదుటి వ్యక్తి ఏమాట మాట్లాడితే మనకు బాధ కలుగుతుందో అలాంటి మాటలు మనమూ మాట్లాడకూడదు. హితవుగా, ప్రియంగా, మనసుకు తృప్తిగా ఉండే మాటలు మాట్లాడటం మంచిది. లేకుంటే మౌనంగా ఉండటం శ్రేయస్కరం. మహాభారతంలో విదురుడు ధృతరాష్ట్రుడితో 'మనం మాట్లాడే తీరులోనే మనకు ఎవరితోనైనా స్నేహం చిగురిస్తుంది. మాట తీరు బాగా లేకపోతే శత్రుత్వం ఏర్పడుతుంది. గొడ్డలి దెబ్బ తిన్న చెట్టు మళ్లీ చిగురించి ఏపుగా పెరుగుతుంది. కానీ ఒక్క పరుషవాక్యం వల్ల విరిగిన మనసు తిరిగి అతకటం చాలా కష్టం. ఆ గాయం సలుపుతూనే ఉంటుంది. శరీరంలో గుచ్చుకున్న బాణాన్ని ఎలాగైనా బయటికి తీయవచ్చు. కానీ మనసును నొప్పించే మాటను పలికాక వెనక్కు తీసుకోవటం అసాధ్యం' అని బోధిస్తాడు.

మాటలే మనిషి వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తాయి. మాటలవల్లే మానవ సంబంధాలు పటిష్ఠమవుతాయి. అందుకే మాటలు పరిమళభరిత పుష్పంలా, కోకిలగానంలా ఉండాలి. అప్పుడే మైత్రి, సఖ్యత, ప్రేమ, అభిమానం వంటి దైవీగుణాలతో మనిషి అందరికీ దగ్గరవుతాడు. సత్సంబంధాలు పెంపొందించుకోగలుగుతాడు.

– విశ్వనాథ రమ

ఎడతెగని సైబర్ దాడులు

విదేశాల్లో మూలాలు!

నేటి డిజిటల్ యుగంలో రాజకీయ, భౌగోళిక వివాదాలను దౌత్య, సైనిక మార్గాల్లోకన్నా సైబర్ సీమలో తేల్చుకోవడానికే దేశాలు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రభుత్వాలు, సైద్ధాంతిక బృందాలు, ప్రచ్ఛన్న గ్రూపులు తమకు గిట్టని దేశాలపై సైబర్ దాడులకు పాల్పడుతున్నాయి. అక్కడి మౌలిక వసతులను దెబ్బతీయడానికి ర్యాన్సమ్‌వేర్‌ను ప్రయోగిస్తున్నాయి. ఎలక్ట్రానిక్ మార్గాల్లో గూఢచర్యం జరుపుతున్నాయి. ఇండియా సైతం ఈ ముప్పును తీవ్రంగా ఎదుర్కొంటోంది.



ఆర్థికంగా, డిజిటల్ సాంకేతికత పరంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి నానాటికీ సైబర్ ముప్పు పెరుగుతోంది. పరిశ్రమలు, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్లు, ఆర్థిక సేవలు, ఫార్మస్యూటికల్స్ రంగాల్లో ఇండియా ప్రగతిని దెబ్బతీయడానికి సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారు. అలాంటి వారిలో ప్రధానంగా పాకిస్థాన్, చైనా, ఉత్తర కొరియాలకు చెందినవారు ఎక్కువగా ఉంటున్నారు. మన మిత్రదేశమైన రష్యాలోని సైబర్ నేరగాళ్ల నుంచీ ప్రమాదాలు ఎదురవుతున్నాయి.

రకరకాల మార్గాల్లో...

భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లపై కొంతకాలంగా సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఆ సంస్థలకు ఆర్థిక, సాంకేతిక సత్తా అంతంతమాత్రమే కాబట్టి ఆ దాడులను సమర్థంగా ఎదుర్కోలేకపోతున్నాయి. మొత్తమ్మీద సైబర్ దాడుల వల్ల ఇండియా శాంతి సుస్థిరతలు పదే పదే ప్రమాదంలో పడుతున్నాయి. నేడు అంతర్జాతీయ వేదికపై ఇండియా కీలక పాత్రధారిగా అవతరించడం ప్రత్యర్థులకు ఏమాత్రం గిట్టడం లేదు. అందుకే మన కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, నెట్‌వర్క్‌లపై వారు దాడులు జరుపుతున్నారు. వాటిలో ట్రోజన్ మాల్‌వేర్‌తో (చట్టబద్ధమైన, నిజమైన ప్రోగ్రాముల ముసుగులో ఉండేవి) చేస్తున్నవి అత్యధికంగా 43శాతానికి చేరుకున్నాయని డేటా సెక్యూరిటీ కౌన్సిల్ 2024 సంవత్సర నివేదిక వెల్లడించింది. తరవాతి స్థానాలను ఇన్ఫెక్టర్లు (ఫైళ్లను డౌన్‌లోడ్, ఓపెన్ చేసినప్పుడు వాటి ద్వారా ప్రవేశించేవి), వార్మ్స్ (నెట్‌వర్క్ ద్వారా స్వతంత్రంగా పాగావేసేవి) ఆక్రమిస్తున్నాయి. గతేడాది తెలంగాణ రాష్ట్రం అత్యధిక మాల్‌వేర్ దాడులను ఎదుర్కొంది, తమిళనాడు, దిల్లీ దాని వెనక నిలిచాయి. నగరాల్లో సూరత్ అధిక మాల్‌వేర్ దాడులకు గురైంది. బెంగళూరు, హైదరాబాద్ తరవాతి స్థానాల్లో ఉన్నాయి. ఇండోనేసియాకు చెందిన ఏసన్ బ్లాక్ ఫ్యాగ్‌తో పాటు ఎనానిమస్ బంగ్లాదేశ్ వంటి హ్యాక్టివిస్ట్ గ్రూపుల నుంచి సైబర్ దాడులు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం, ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణల నేపథ్యంలోనూ భారత్‌పై రాజకీయ ప్రేరిత సైబర్ దాడులు జరుగుతున్నాయి. వాటిని శత్రు ప్రభుత్వాలు, హ్యాక్టివిస్ట్ గ్రూపులు నిర్వహిస్తున్నాయి.

గత నెలలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి సైబర్ సీమ డిజిటల్ యుద్ధ రంగంగా మారిపోయింది. పాకిస్థానీ సైబర్ ముష్కరులు భారతీయ వెబ్‌సైట్ల రూపురేఖలు మార్చేయడం, మాల్‌వేర్‌లను చొప్పించడం అధికమైంది. పహల్గాంలో భారతీయ పర్యాటకులను పాక్ ఉగ్రవాదులు హతమార్చిన దరిమిలా మన మౌలిక వసతులు, ఫైనాన్స్ రంగంపై పాక్ సైబర్ దాడులు పెరుగుతాయని కేంద్ర హోం శాఖ, కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్)లు హెచ్చరించాయి. ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్‌కు వ్యతిరేకంగా 15 లక్షల సైబర్ దాడి యత్నాలు జరిగాయి. దుండగులు 150సార్లు మాల్‌వేర్‌తో మన నెట్‌వర్క్‌లలోకి చొరబడగలిగారు. 'ఏపీటీ 36' అనే పాక్ గ్రూపు భారతీయ రక్షణ సంస్థలపై మాల్‌వేర్ దాడికి తీవ్రంగా ప్రయత్నించింది. చైనా లోపాయికారీగా పాకిస్థాన్‌కు తోడ్పాటునందిస్తూ పాక్ సైబర్ దాడి సామర్థ్యానికి పదును పెడుతోంది. ప్రభుత్వ సమాచార సాధనాల్లో, సోషల్ మీడియాలో భారత్‌పై తప్పుడు ప్రచారం వ్యాపింపజేస్తోంది. సైనిక, సైబర్ సీమల్లో ఏకకాలంలో చైనా, పాక్‌లను ఎదుర్కోవడానికి ఇండియా సర్వ సన్నద్ధంగా ఉండక తప్పదు.

హమాస్‌పై యుద్ధంలో ఇజ్రాయెల్‌కు భారత్ పరోక్షంగా మద్దతు పలుకుతోందనే భావనతో పాలస్తీనా అనుకూల హ్యాక్టివిస్ట్ గ్రూపులు మన దేశంపై గురిపెట్టాయి. ఘోస్ట్ ఆఫ్ పాలస్తీనా, ఎనానిమస్ అరబిక్, క్రామెక్ వంటి గ్రూపులను ఇక్కడ చెప్పుకోవాలి. అవి మన ప్రభుత్వ, ప్రైవేటు, ఫైనాన్స్ రంగాలపై డిస్ట్రిబ్యూటెడ్ డినైల్ ఆఫ్ సర్వీస్ (డీడీఓఎస్) మాల్‌వేర్ దాడులు నిర్వహిస్తున్నాయి. డేటా చౌర్యానికీ పాల్పడ్డాయి. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయి. 2023లో ఇండియాపై 150కి పైగా హ్యాక్టివిస్ట్ గ్రూపులు రోజుకు 50 చొప్పున సైబర్ దాడులు చేశాయి. భారతీయ కంపెనీల నుంచి, ప్రభుత్వం నుంచి కీలక సమాచారాన్ని కాజేయడానికి పదేపదే ప్రయత్నించాయి. సెర్ట్ నెట్‌వర్క్, ఇండియన్ ఆయిల్, పోలీసు, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్కుల్లోకి చొరబడి కీలక సమాచారాన్ని సంగ్రహించినట్లు [illegible] అనే పాకిస్థానీ హ్యాకర్ చెప్పుకొన్నాడు.

అప్రమత్తంగా ఉండాల్సిందే...

మాల్దీవుల్లో ఇండియా అవుట్ పేరుతో సోషల్ మీడియాలో భారత వ్యతిరేక ప్రచారం చేపట్టారు. దానివల్ల చైనా అనుకూలుడైన మొహమ్మద్ ముయిజ్జు అధికారంలోకి రాగలిగారు. మాల్దీవుల నుంచి భారత్ సేనలను వెళ్లగొట్టి చైనాకు భద్రత, ఆర్థిక పరంగా తాళాలు అప్పగించారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతానికి చైనా సైబర్ పాత్ర స్పష్టంగా బయటపడకపోయినా మున్ముందు అక్కడి భారత వ్యతిరేకులకు డ్రాగన్ తోడ్పాటు అందించబోతోందనే [illegible]. డిజిటల్ దండయాత్రలను తిప్పికొట్టడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసుకుంటున్న భారతదేశం ప్రత్యర్థుల సైబర్ కుట్రలపై ఇక అప్రమత్తంగా ఉండాలి. జాతీయ భద్రత, అంతర్జాతీయ సంబంధాల్లో సైబర్ భద్రతను కీలక అంతర్భాగం చేసుకోవాలి. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో సైబర్ పోరాట పటిమను పెంపొందించుకోవాలి. సొంత సైబర్ సైన్యాన్ని తయారు చేసుకోవాలి. సైబర్ పోరులో పరిశోధన-అభివృద్ధిని ముమ్మరం చేయాలి. ఇలా బహుముఖ వ్యూహంతో ముందుకు సాగితేనే సైబర్ బందిపోట్లను కట్టడి చేయడానికి వీలవుతుంది.



డాక్టర్ శ్రుతి మంత్రి
సీనియర్ అసోసియేట్ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డేటా సైన్స్, ఐఎస్‌బీ



జ్ఞాపకాల పెట్టె

అప్పుడప్పుడూ తుడిచే అటక మీద.. అప్పుడెప్పుడో తెరిచిన పెట్టె. చెక్కతోనో ఇనుముతోనో చేసిన దృఢమైన శరీరం. దానికంటే దిట్టమైన తాళం. చూడటానికి మొరటుగా, గంభీరంగా ఉంటుంది కానీ.. తుప్పుపట్టడానికి సిద్ధంగా ఉన్న ఆ పెట్టె చుట్టూ జ్ఞాపకాలెప్పుడూ జావళీలు పాడుతూనే ఉంటాయి. ముఖ్యంగా పాతకాలం ఇళ్లలోనూ, ఆనాటి మనుషుల మనసుల్లోనూ ఈ ట్రంకు పెట్టెకు దాని బరువుకు తగిన భారీ స్థానమే ఉంటుంది!

అప్పట్లో అదో చిరుసంతోషాల ఖజానా. భద్రంగా దాగి ఉండాల్సిన ప్రతిదాన్నీ తనలో చేర్చుకుని, రీవిగా గదిలో ఓ మూల నుంచి సర్వం పరికిస్తూ ఉండేది. పిల్లాపాపలతో, వచ్చిపోయేవారితో కళకళలాడే ఇల్లాయె! తాను కాస్త అడ్డుగా ఉన్నానని భావిస్తే ఎంచక్కా అటక మీదకు చేరిపోయి.. అక్కడినుంచి హైయాంగిల్‌లో జరిగేదంతా చూస్తూ ఉండటమే పని. పండుగపూట ఇంటావిడ శుభ్రంగా తుడిచి కాస్త పసుపుబొట్టు పెడితే చాలు, కళ పదింతలయ్యేది. కాస్త దూర ప్రయాణాలు చేయాల్సి వస్తే తనదే హడావుడంతా. పెట్టె లేనిదే ఇంటి జనం అడుగు బయటపెట్టేవారే కాదు. సాదాసీదాగా కనపడే పెట్టెలు మామూలువైతే, కాస్త రంగుల పూల డిజైన్లు ఉండేవి ఇంకొంచెం గొప్పగా ఫీలయ్యేవన్నమాట.

ఇక ఆ ట్రంకు పెట్టెలో పట్టే వాటి చిట్టా అయితే ఓ పట్టాన లెక్కతేలదు. దుస్తులు, వస్తువులు, కావాల్సినవి, అక్కర్లేనివి, ఒక్కటేమిటి.. సమస్తం అందులోకే! పెద్దసైజు అక్షయపాత్రలా చిన్నసైజు పుష్పకవిమానంలా ఎన్ని వచ్చినా 'ఇంకా చోటుంది తే' అంటూ చక్కగా అన్నింటినీ ఒడిసిపట్టుకునేది. ఎంత ఓపికో అంత ఒద్దిక. కాలక్రమంలో చాలా మారిపోతున్నట్లే ఇప్పుడీ పెట్టెలనూ వాడటం మానేశాం. అయినా నేటి డబుల్ బెడ్రూమ్ ఫ్లాట్లలో ట్రంకుపెట్టె పట్టే చోటెక్కడిదని!

ఈసారి ఏ పండుగకో పబ్బానికో ఊరెళ్లినప్పుడు మీ ఇంట్లో గనక ఈ పెట్టె ఉంటే అటక మీద నుంచి ఆ భావాల భారాలు మోస్తూ కాలక్షేపం చేస్తున్న దాన్ని ఓసారి కిందికి దించి చూడండి. మనం పుట్టగానే అమ్మమ్మ అపురూపంగా కుట్టి తొడిగిన జుబ్బాలు, చిన్ననాడు ఎంతో ఇష్టంగా ఆడుకున్న బొమ్మలు, ఇంట్లో పెద్దవాళ్లను పలకరించేందుకు ఎక్కడెక్కడి నుంచి ఎప్పుడెప్పుడో బంధువులు రాసిన ఉత్తరాలు, తాతగారికి ప్రాణప్రదమైన పుస్తకాలు, అమ్మ పెళ్లినాటి చీర... ఎన్నో ఎన్నెన్నో వెలకట్టలేనంత విలువైన వస్తువులు! తాళం తీసి మూత పైకి లేపగానే అదోరకం పాత వాసన. ఒక్కసారిగా మనసంతా అది శోభాయమానంగా వెలిగిన రోజుల్లోకి వెళ్లిపోతుంది. పెదాలపై చిన్న చిరునవ్వు తెలియకుండానే వచ్చి చేరుతుంది. ఎందుకంటే కాలమెంత మారుతున్నా, కొన్ని ఇష్టాలూ విషయాలూ ఆ మార్పునకు అతీతంగా మిగిలిపోతాయి. అలాంటి విభిన్నమైన అనుభూతులను ముందు తరాలకు అందించడం కూడా ఓ రకమైన సంపద ఇవ్వడమే!

– మౌళిక

మూఢనమ్మకాల మంటల్లో మానవత్వం!

సుస్థిర ప్రగతికి దూరం

పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, లింగసమానత్వం తదితర 17 లక్ష్యాల సాధన ద్వారా 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా జనజీవితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నది ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీల) ఉద్దేశం. 2015లో నిర్దేశించుకున్న ఈ లక్ష్యాల గడువు మరో అయిదేళ్లలో ముగియనుంది. 2025 నాటికి చేరుకోవాలనుకున్న ఎస్‌డీజీల్లోని 169 ఉపలక్ష్యాల్లో కేవలం 35శాతం వాటిలోనే తగినంత పురోగతి కనిపిస్తోంది. ప్రస్తుతానికి ఆయా ఎస్‌డీజీ లక్ష్యాల పరిస్థితి ఎలా ఉందంటే... (శాతాల్లో)



పురోగతిలో ఉన్నవి లేదా లక్ష్యం చేరుకున్నవి	18
కొద్దిమేర పురోగతి	17
నామమాత్ర ప్రగతి	31
స్తబ్ధత నెలకొన్నవి	17
తిరోగమనంలో ఉన్నవి	18

(ఆధారం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల నివేదిక - 2025)

సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలకు నిదర్శనం బాణామతి లేదా చేతబడి. దాని పేరు మీద అన్యాయంగా సాటి వ్యక్తుల ప్రాణాలు తీస్తున్న ఉదంతాలు తరచూ వెలుగు చూస్తున్నాయి. బడుగు, బలహీన వర్గాలు... ముఖ్యంగా మహిళలు ఎక్కువగా ఈ దుర్మార్గాలకు బాధితులవుతున్నారు.

బాణామతికి పాల్పడ్డారనే నెపంతో బిహార్‌లోని టెట్గామా గ్రామంలో ఇటీవల ఒక గిరిజన కుటుంబంలోని అయిదుగురు సభ్యులను చుట్టుపక్కల వ్యక్తులు చావబాది నిప్పంటించి హతమార్చారు. చనిపోయినవారిలో ముగ్గురు మహిళలున్నారు. బాణామతి లేదా చేతబడి చేశారనే ఆరోపణలతో ఆదివాసీ, దళిత, వెనకబడిన వర్గాలకు చెందినవారిని, ముఖ్యంగా మహిళలను హతమార్చడం కొన్ని రాష్ట్రాల్లో పరిపాటిగా మారింది. జాతీయ నేర గణాంకాల సంస్థ(ఎన్సీఆర్‌బీ) లెక్కల ప్రకారం ఒక్క 2022లోనే దేశవ్యాప్తంగా 85 బాణామతి హత్యలు జరిగాయి. గడిచిన దశాబ్ద కాలంలో 1,184 మంది అలా ప్రాణాలు కోల్పోయారు. బాణామతి పేరుతో ఝార్ఖండ్‌లో ఎక్కువ మంది కడతేరిపోతే, తరవాతి స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాలు నిలుస్తున్నాయి. 2000 సంవత్సరం నుంచి ఏకంగా రెండున్నర వేల మంది చేతబడి ఆరోపణలతో హతులయ్యారు.

చట్టాలు ఉన్నప్పటికీ...

బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలతో జరిగే దాడులను నిలువరించాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి 2021లో ఒక తీర్మానం ఆమోదించింది. 2009-2019 మధ్య అరవై దేశాల్లో మంత్రగాళ్లు, మంత్రగత్తెలంటూ 20వేల మందిపై దాడులు జరిగినట్లు ఐరాస తెలిపింది. బిహార్‌లో 1999లోనే బాణామతి కార్యకలాపాల నిరోధ చట్టం తెచ్చినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రభుత్వ అలసత్వానికి పితృస్వామ్య భావజాలం తోడై మంత్రగత్తెలనే సాకుతో బడుగు వర్గాల మహిళలపై దాడులు చేయడం ఆనవాయితీగా మారింది. బిహార్‌లో బాణామతి ఆరోపణలపై హతమైన మహిళల్లో 98శాతం దళిత, బలహీన వర్గాలవారేనని నిరంతర్ ట్రస్ట్ అధ్యయనం తెలిపింది. ఈ జాడ్యం గ్రామాల్లోనే ఎక్కువగా ఉంది. వితంతువులు, భర్త వదిలిపెట్టి వెళ్లినవారు, అవివాహితులుగా ఒంటరి జీవితం సాగిస్తున్న మహిళలకు మంత్రగత్తెలని ముద్రవేసి హింసిస్తున్నారు. లేదా హతమారుస్తున్నారు. వితంతువు పేరిట ఉన్న భూమిని కాజేయడానికి ఆమె బంధువులే బాణామతి ఆరోపణతో కడతేర్చిన ఉదంతాలు కొన్ని ప్రాంతాల్లో వెలుగు చూశాయి. బాణామతి చేస్తున్నారనే నెపంతో పళ్లు ఊడగొట్టడం, ముక్కు కోసేయడం, నగ్నంగా ఊరేగించడం, శిరోముండనం చేయడం, మానవ మలం, పేడ తినిపించడం వంటి హేయ అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఉరితీయడం, నరికేయడం లేదా సజీవ దహనం చేయడం వంటివీ వెలుగు చూస్తున్నాయి.






గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో నిరక్షరాస్యత, మూఢనమ్మకాల వల్ల మానసిక రోగులకు మంత్రగాళ్లని ముద్రవేస్తున్నారు. ముఖ్యంగా అంటువ్యాధులు వ్యాపించినప్పుడు ఎవరో ఏదో చేశారనే అనుమానాలు ప్రబలుతున్నాయి. పితృస్వామ్య భావజాలం, పాత ఆచారాలకు భిన్నంగా స్వతంత్రంగా వ్యవహరించే మహిళలకు మంత్రగత్తెలనే ముద్రవేసి హతమార్చి ఆ తరవాత వారి ఆస్తులను లాగేసుకుంటున్నారు. ప్రస్తుతం బాణామతి పేరిట జరిగే దాడుల నిరోధానికి కొన్ని రాష్ట్రాల్లో చట్టాలు తెచ్చినా జాతీయ స్థాయిలో అలాంటి ఏర్పాటు లేదు. పార్లమెంటులో ప్రత్యేక చట్టం తీసుకొచ్చే ప్రయత్నాలు జరిగినా అవి ఫలించలేదు. భారతీయ న్యాయ సంహితలోనూ దీనికి సంబంధించి ప్రత్యేక నిబంధనలు లేవు. మరోవైపు బిహార్, కర్ణాటక, ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్రలు ఇలాంటి దాడులను నివారించడానికి చట్టాలు తెచ్చినా వాటిలో స్పష్టత లోపించింది. అస్సాం ఇతర రాష్ట్రాలకన్నా కఠినమైన చట్టాలు చేసింది. అక్కడ ఎవరైనా మహిళను మంత్రగత్తె అని వేధిస్తే యావజ్జీవ కారాగార శిక్ష, అయిదు లక్షల రూపాయల దాకా జరిమానా విధించవచ్చు.

విస్తృత చైతన్యం అవసరం


బాణామతి పేరుతో జరుగుతున్న కర్కశత్వాన్ని నిరోధించడానికి జాతీయ స్థాయిలో వెంటనే పటిష్ఠ చట్టం తెచ్చి సమర్థంగా అమలు చేయాలి. దాంతోపాటు మూఢనమ్మకాల పట్ల స్థానిక జనసముదాయాల్లో మార్పు తేవడానికి గట్టిగా కృషిచేయాలి. లింగ సమానత్వానికి ప్రాధాన్యమివ్వాలి. ఇందుకోసం సమాచార సాధనాలను విస్తృతంగా ఉపయోగించుకోవాలి. సమాజంలో చైతన్యం నింపే కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలి. నాటకాలు, రచనల ద్వారా మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనాన్ని జాగృతం చేయాలి. మంత్రగత్తెలని ముద్రపడిన మహిళలను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో మానసిక చికిత్సాలయాలను పెంచాలి. అప్పుడే అమానవీయ హింసకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది.

– డాక్టర్ కంచర్ల వాలెంటీనా
దిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులు



నైపుణ్య శిక్షణ కావాలా?.. ఉపాధి అవకాశాలు తెలుసుకోవాలా?

నైపుణ్య శిక్షణాధికారితో ఫోన్ ఇన్ రేపు


శ్రీనివాసరావు

జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ వివిధ కోర్సుల్లో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తోంది. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో పాటుగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక రూపొందిస్తోంది. ఆయా అంశాలతో పాటు ప్రైవేటు సంస్థల్లో కొలువులు, జాబ్‌మేళాల నిర్వహణ.. ఉపాధి అవకాశాల గురించి తెలుసుకొనే అవకాశం 'ఈనాడు-మీతోడు' కల్పిస్తోంది. ఎన్టీఆర్ జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ తప్పిన, పూర్తి చేసిన విద్యార్థులు దిగువ నంబరుకు సూచించిన సమయంలో ఫోన్ చేస్తే జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి ఎస్.శ్రీనివాసరావు మీ ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. సందేహాలు నివృత్తి చేస్తారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

96033 43003 | తేదీ: శుక్రవారం (25.07.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం నేడే


అధికారులతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

ఆత్కూరు(గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఆత్కూరులో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటనకు ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. స్వర్ణభారత్ ట్రస్టు ఆవరణలో జరిగే ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవంలో ఎన్ఆర్ఐ కమిషన్ పంజాబ్ సభ్యులు ఏ.వేణుప్రసాద్‌తో కలిసి గవర్నర్ గురువారం ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ మేరకు గవర్నర్ పర్యటన ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ జేసీ గీతాంజలిశర్మ వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు వివిధశాఖల అధికారులతో చర్చించారు. సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుముతున్న వరద


జి.కొండూరు: ముత్యాలంపాడు వంతెనపై ఉద్ధృతి


పెనుగంచిప్రోలు: కూచివాగు కల్వర్టు పైనుంచి నీటి ప్రవాహం


ముచ్చింతాలలో పొలాలను ముంచెత్తిన వరద

నీటమునిగిన పత్తి, వరి, అపరాలు

ఈనాడు - అమరావతి: నిన్న మొన్నటి దాక మొహం చాటేసిన వరుణుడు కరుణించాడని అన్నదాతలు సంబరపడేలోగా.. ఎగువ నుంచి వరద విరుచుకుపడుతోంది. దీంతో జిల్లాలో చాలా ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి. కొన్నిచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. పంట పొలాలు నీట మునిగాయి. వర్షాలతో ప్రస్తుతానికి రైతులకు ఇబ్బంది లేకున్నా మరో రెండు రోజులు భారీవర్షాలు పడితే నష్టం వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

రాకపోకలు స్తంభించి: గంపలగూడెం మండలం కట్లేరు వంతెన దగ్గర రహదారిపై వరద ఉద్ధృతంగా ప్రవహించి ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కంచికచర్ల, వీరులపాడు వాగులు పోటెత్తాయి. వీరులపాడు మండలంలో పెద్దాపురం-గూడెం మాధవరం మధ్య ఏనుగుగడ్డవాగుకు భారీగా వరద చేరింది. తాటిగుమ్మిలోని వైరా కట్లేరు వాగులో ప్రమాదవశాత్తు ఓ యువకుడు గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. అల్లూరు, చట్టన్నవరం మధ్య వరద ఉద్ధృతికి యువకుడి వాహనం కొట్టుకుపోగా స్థానికులు బయటకు తీశారు. ముచ్చింతాల, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు మండలాల మధ్య కూచివాగు కల్వర్టుపై వరద ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నందిగామ మండలం దాములూరు-పల్లంపల్లి మధ్య లోలెవల్ కాజ్‌వే మీదుగా వరద ప్రవహించడంతో నందిగామ వీరులపాడు మధ్య రాకపోకలు నిలిచాయి. జి.కొండూరు మండలంలో కుంగిన బుడమేరు వంతెనపైనే నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. గంపలగూడెం మండలం మొగుళ్లవాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి.

పంటలనూ వదలక: జిల్లాలో పత్తి, మొక్కజొన్న, పెసర పంటలు ప్రారంభదశలో ఉన్నాయి. వరి నాట్లు ఇప్పుడిప్పుడే వేస్తున్నారు. ఓ వైపు వర్షం.. మరో వైపు వరదతో పల్లపు ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం, అనుములలంక, పెనుగొలనుల్లో పత్తి, పెసర చేలు నీట మునిగాయి. వేసిన వరి నాట్లు, నారుమడులు ముంపుబారిన పడ్డాయి. ఇప్పటి వరకు పడిన వర్షాలతో పంటలకు ఎలాంటి నష్టం ఉండదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నాట్లు వేసిన రైతులు ఎరువులు వేయడానికి అనుకూలంగా ఉంటుంది. పత్తికి కూడా ఇబ్బంది ఉండదు. వరి నీట మునిగినా నీరు పోగానే తేరుకుంటుందని చెబుతున్నారు.

చెడగొట్టారు.. చెరబట్టారు..!

ఆలయ భూముల సాగు పేరుతో మట్టి దందా ❒ ఆపై చేపల చెరువులుగా మార్పు


చెరువులుగా మారిన... గూడవల్లి కోదండరామస్వామి భూములు ఇవే

ఈనాడు, అమరావతి

'దేవాదాయ శాఖ భూములను.. నామమాత్ర లీజు చెల్లించేలా కౌలుకు తీసుకున్నారు. వాటిలో అక్రమంగా మట్టి తవ్వేసి.. రూ.కోట్లు కొల్లగొట్టారు. తర్వాత.. వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చేసి అనుభవిస్తున్నారు. దేవాదాయ శాఖకు మాత్రం పొలాల కిందే నామమాత్ర లీజు చెల్లిస్తున్నారు. కొందరు అధికారులకు విషయం తెలిసినా.. అక్రమార్కులు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి బయటపెట్టలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక.. దేవాదాయ శాఖ భూముల పరిశీలన చేపట్టగా.. నందివాడ పరిధిలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అయినా.. అక్రమార్కులపై చర్యల్లేవు. కౌలు భూమి లీజును.. చేపల చెరువుగా మార్చేసి చేతులు దులిపేసుకున్నారు. అక్రమానికి సక్రమ ముద్ర వేసి.. మమ అనిపించారు.

విజయవాడ దుర్గగుడి దత్తత ఆలయమైన గూడవల్లి కోదండరామస్వామి కోవెలకు నందివాడ మండల ఇలపర్రులో సర్వేనంబరు 337లో 8.24 ఎకరాల మాగాణి ఉంది. దేవాదాయ శాఖకు చెందిన 38 రిజిస్టరు, రెవెన్యూ ఆర్ఎస్ఆర్‌లోనూ ఇదే ఉంది. కానీ.. ఆరేళ్ల కిందట ఈ మాగాణిలో మట్టి తవ్వేసి.. చేపల చెరువులుగా మార్చేశారు. కౌలు మాత్రం.. మాగాణిగానే ఇస్తూ వచ్చారు. సరిగ్గా ఏడాది కిందట.. దుర్గగుడి అధికారులు భూముల పరిశీలనకు వెళ్లగా.. అక్కడ చెరువే లేదు. ఆపై ఆలయ ఉన్నతాధికారులకు చెప్పినా.. వాళ్లకు "గిట్టుబాటు" కావడంతో గోప్యంగా ఉంచి వ్యవహారం చక్కబెట్టేశారు. ఎవరైతే భూమి కౌలుకు తీసుకుని.. చెరువు తవ్వేశారో.. వాళ్లకే చేపల చెరువు కింద లీజుకు ఇచ్చినట్లు ఒప్పందాలను మార్చేశారు. పైగా అంతా మా కనుసన్నల్లోనే జరిగింది.. చెరువును తవ్వుకొమని మేమే అనుమతిచ్చామని.. కొందరు అధికారులు చెబుతున్నారు.

దేవాదాయ భూముల్లో తవ్వేసినా.. దేవాదాయ శాఖ భూమిలో సాగు చేస్తామని కౌలుకు తీసుకున్న ప్రైవేటు వ్యక్తులు మట్టిని తవ్వి వాటిని చెరువులుగా మార్చేసుకోవచ్చా? అది కూడా ఎప్పుడో ఏళ్ల కిందట మట్టంతా తవ్వి అమ్మి.. చెరువులుగా మార్చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక హడావుడిగా లీజులు మార్చడమేంటి? ఆరేళ్ల కిందటే చేపల చెరువుగా మార్చేసి.. ఆదాయం పొందుతున్నందుకు.. నాటి నుంచి అధిక లీజు వసూలు చేయాలి కదా? మాగాణి కింద ఏటా రూ.లక్ష కూడా ఆలయానికి చెల్లించలేదు. చేపల చెరువుగా మార్చాక ప్రస్తుతం రూ.3.50-4.50 లక్షలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదంతా ఆరేళ్లుగా వసూలు చేయాలి కదా? ఇవేవీ పట్టించుకోకుండా అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు.

వేలం లేకుండానే... ఏడాది కిందటి వరకూ మాగాణి పేరిటే దేవాదాయ శాఖకు లీజు చెల్లించారు. ప్రస్తుతం చేపల చెరువుగా లీజు మార్చేటప్పుడు.. బహిరంగ వేలం వేయాలి. ఎవరు ఎక్కువకు పాడితే.. వారికే కేటాయించాలి. అప్పుడు దేవస్థానానికి ఆదాయమూ బాగా వస్తుంది. కానీ.. వేలంతో పనిలేకుండా పాతవాళ్లకే గుట్టుగా లీజును పెంచేసి.. ఇవ్వడమేంటి? గత ప్రభుత్వంలో అక్రమానికి.. నేడూ అధికారులు వత్తాసు పలుకుతూ.. అక్రమానికి దన్నుగా నిలవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

దారంతా డొల్ల.. ఒళ్లంతా గుల్ల

నిత్యం వేల మంది విద్యార్థులు తిరిగే రోడ్డు


మిఠాయి దుకాణం ఎదురుగా.. రోడ్డంతా గుంతలమయం


కెనడీ స్కూల్ వద్ద పెద్ద తటాకంలా..

విజయవాడ బందరు రోడ్డు నుంచి కానూరుకు వెళ్లే ప్రధానమైన రహదారి ఇది. కొన్ని వందల విద్యా సంస్థలు ఈ రహదారిని ఆనుకునే అటూఇటూ ఉన్నాయి. నిత్యం వేల మంది విద్యార్థులు ఇటుగానే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తిరుగుతుంటారు. కొన్నిచోట్ల రెండు నుంచి మూడు అడుగుల లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం వర్షం నీరు చేరి.. అవి కనిపించడం లేదు. ఇలాగే ఇటీవల ఈ రహదారిపై గుంతలు కనిపించక.. ఓ యువకుడు ద్విచక్రవాహనంపై వస్తూ అదుపుతప్పి పడిపోయి.. ప్రాణాలు కోల్పోయాడు. అయినా.. పాలకులు, అధికారుల్లో నిర్లక్ష్యం పోలేదు. ఇంకెన్ని ప్రాణాలు పోతే.. మీరు స్పందిస్తారని.. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి ఆ చివరి నుంచి ఈ చివరికి.. మొత్తం గుంతలే తప్ప.. సజావుగా ఎక్కడా లేదు. – ఈనాడు, అమరావతి


దారిపై భారీ మడుగు, గుంతలు..


చర్చి ఎదురుగా దుస్థితి.. ఇక్కడే ఓ యువకుడు చనిపోయినా రహదారుణమే

సంక్షేమ లబ్ధిదారులపై సైబర్ వల

ఏపీకే ఫైల్స్‌తో దోచుకునేందుకు కుట్ర

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

జూన్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకంపై సైబర్ నేరగాళ్లు కన్నేశారు. అర్హులైన కొందరు తల్లులకు ఫోన్లు చేశారు. బ్యాంకు ఖాతా స్తంభించిందని, దాన్ని పునరుద్ధరించాలని చెప్పి డబ్బులు గుంజేశారు. అలాగే పథకం డబ్బులు ఖాతాల్లో జమకాని వారికి ఫోన్ చేసి.. డబ్బులు జమ చేసేందుకు రుసుములు పేరిట రూ.వేలల్లో కొట్టేశారు. ఈ తరహా కేసులు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల నమోదయ్యాయి. వచ్చే ఆగస్టులో రైతుల ఖాతాల్లో 'పీఎం కిసాన్ యోజన' డబ్బులు పడతాయని చెబుతుండడంతో.. రైతులను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు సిద్ధమవుతున్నారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



పీఎం కిసాన్ యోజన పేరుతో వైరస్ ఏపీకే ఫైల్స్ ఇలా ఉంటాయి..

నమ్మి క్లిక్ చేస్తే.. అనర్థమే

'పీఎం కిసాన్ యోజన' పేరుతో రైతుల చరవాణులకు వైరస్ ఏపీకే ఫైల్స్ పంపుతున్నారు. ఈ పథకం డబ్బులు పడతాయని ఆశగా ఎదురు చూస్తున్న రైతులు దాన్ని క్లిక్ చేస్తున్నారు. చరవాణికి వచ్చిన ఏపీకే ఫైల్.. వైరస్ ఫైల్ కావడంతో దాన్ని క్లిక్ చేసిన మరుక్షణం చరవాణికి అనుసంధానంగా ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతాయి. వెంటనే వారు సదరు ఖాతాల నుంచి నిమిషాల వ్యవధిలోనే డబ్బులు లాగేస్తారు.

ఈ జాగ్రత్తలు మేలు..

అపరిచిత వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చే లింక్‌లు క్లిక్ చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. అమాయకులను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు ఆయా పథకాల పేర్లు, లోగోలు పెట్టి వైరస్ ఫైల్స్ తయారు చేస్తారు. ఏపీకే రూపంలో వీటిని సామాజిక మాధ్యమాల్లో పెడతారు. పలువురికి పంపిస్తారు. అలా ఒకరి నుంచి ఒకరికి వెళుతుంటాయి. ఎవరైనా వాటిని క్లిక్ చేస్తే డబ్బులు పోతాయంటున్నారు సైబర్ క్రైం పోలీసులు.

- పీఎం కిసాన్ డబ్బులు పడ్డాయో లేదో తెలుసుకునేందుకు లింక్ క్లిక్ చేయమంటారు. క్లిక్ చేయగానే వైరస్ బారిన పడతారు.
- పీఎం కిసాన్ యాప్ అప్‌డేట్ లింక్ అంటూ పంపుతారు. దాన్ని క్లిక్ చేస్తే.. సైబర్ నేరగాళ్ల వలలో పడినట్లే.

పొడి చెత్త ఇవ్వండి.. సరకులు పొందండి!



స్వచ్ఛ రథం..


వెనుక భాగంలో నిత్యావసర వస్తువులు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ శాఖ స్వచ్ఛ రథం పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పనికిరాని వస్తువులను సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సమానమైన నగదు లెక్కించి.. సరిపడా నిత్యావసర సరకులు అందిస్తారు. వీటి కోసం ప్రత్యేకంగా వాహనాలను తయారు చేయిస్తున్నారు. సదరు వాహనం వెనుక భాగంలో నిత్యావసర సరకులు, ముందు భాగంలో అట్టపెట్టెల నుంచి ఖాళీ ప్లాస్టిక్ బాటిల్స్, స్టీల్ సామగ్రి, చిరిగిపోయిన బస్తాలు, గన్నీ బ్యాగులు, పేపర్లు వంటి పనికిరాని వస్తువులు(పొడిచెత్త) పెట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ నెల 10న గుంటూరు జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు.

పైలట్ ప్రాజెక్టుగా రామవరప్పాడు: ఎన్టీఆర్ జిల్లాలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్టుకు విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడును ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఓ వాహనాన్ని నెలవారీగా అద్దెకు తీసుకుని దాన్ని స్వచ్ఛ రథంలా మార్పులు చేస్తున్నారు. ఆగస్టు ఒకటి నుంచి ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రోజూ రెండు వార్డులు తిరిగేలా, వారంలో రెండు సార్లు గ్రామస్థుల ఇళ్ల వద్దకు వచ్చేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే రోజూ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు తగ్గే అవకాశం ఉంది. ఈ కార్యక్రమాన్ని క్రమంగా జిల్లాలో ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఏవీ ఇన్‌ఫ్రాకాన్ మోసం రూ.25 కోట్లు

- బయటపడుతున్న విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ కుమారుడి అక్రమాల చిట్టా
- గత నెలలో లక్ష్మీవిజయ్‌కుమార్ అరెస్టు.. తాజాగా చిక్కిన మరొకరు

ఈనాడు, హైదరాబాద్: వైకాపా నేత, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు కుమారుడు, ఏవీ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ లక్ష్మీ విజయ్‌కుమార్ అక్రమాల చిట్టా తవ్వేకొద్దీ బయటపడుతోంది. ప్రీలాంచ్, బైబ్యాక్ స్కీములంటూ మోసానికి పాల్పడిన కేసులో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు ఇప్పటికే విజయ్‌కుమార్‌ను అరెస్టు చేయగా తాజాగా మరో నిందితుడు ఏవీ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ డైరెక్టర్ తిమ్మిరి శామ్యూల్‌ను పట్టుకున్నారు. సైబరాబాద్ ఈవోడబ్ల్యూ డీసీపీ ఎ.ముత్యంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కేసు వివరాలు వెల్లడించారు. లక్ష్మీ విజయ్‌కుమార్ తేలిగ్గా డబ్బు సంపాదించాలని 2021లో హైదరాబాద్ మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో ఏవీ ఇన్‌ఫ్రాకాన్, ఏవీ ఆర్గానో ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. ఎలాంటి భూమి లేకున్నా ఉందని, ఆసక్తి ఉంటే ప్లాట్లు కొనుగోలు చేయాలని.. ఇందుకోసం పెట్టుబడులు, బైబ్యాక్, ప్రీలాంచ్ తదితర ఆఫర్లు ఉన్నట్లు ప్రచారం చేశాడు. ఇలా రూ.8 కోట్ల దాకా వసూలు చేసి తర్వాత ముఖం చాటేశాడు. బాధితులు మే 28న సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడ్ని ఒంగోలులో జూన్ 25న అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో మోసం చేసిన మొత్తం పెరిగినట్లు గుర్తించారు. 150 మంది నుంచి రూ.25 కోట్ల వరకూ వసూలు చేసినట్లు బయటపడింది. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ఈ మోసంలో భాగస్వామి గుంటూరు జిల్లాకు చెందిన, హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉండే తిమ్మిరి శామ్యూల్‌ను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, డిపాజిటర్ల డబ్బు రికవరీ కోసం ప్రయత్నిస్తున్నట్లు డీసీపీ తెలిపారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె


మహా మండపంలో సారె తీసుకొచ్చిన మహిళలు

ఇంద్రకీలాద్రి: ఆషాఢ మాసం సందర్భంగా మహిళా బృంద సభ్యులు బుధవారం దుర్గమ్మకు సారె సమర్పించారు. పూలు, పండ్లు, పొంగళ్లు, మిఠాయిలు, పట్టు వస్త్రాలతో తరలివచ్చారు.

నేటితో ముగింపు: ఆషాఢ మాసం చివరి రోజు 24న ఆలయ అర్చకులు అమ్మవారికి సారె సమర్పించడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో శీనానాయక్ తెలిపారు. మహా మండపంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ఆలయ ప్రాంగణంలోకి తరలిస్తారని పేర్కొన్నారు. 25 నుంచి చండీహోమం, గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమాలు నూతన యాగశాలలో నిర్వహిస్తామని చెప్పారు.

పేద కడుపు.. చల్లగా!

13,365 మందికి కొత్త రేషన్ కార్డులు ★ కొత్తగా చేరికకు 64,382 దరఖాస్తులు



ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. ఏడు అంశాల్లో 99,872 దరఖాస్తులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. వైకాపా ఐదేళ్ల పాలనలో ఒక్కసారే కార్డులు ఇవ్వగా కూటమి సర్కారు అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే కొత్త కార్డులు, మార్పులు చేర్పులు మొదలుపెట్టి పంపిణీకి సిద్ధమవుతోంది.

దరఖాస్తుల్లో అర్హుల వివరాలు (23.07.25 నాటికి)	జిల్లాలు ఎన్టీఆర్	కృష్ణా
కొత్త సభ్యుల చేర్పు	33,985	30,397
కొత్త కార్డులు	7,406	5,959
కార్డు విభజన	6,444	5,841
సభ్యుల తొలగింపు	2,167	1,602
చిరునామా, వివరాల మార్పు	1,774	3,354
ఆధార్ అనుసంధాన తప్పులు	473	384
కార్డుల సరెండర్	49	37

నాలుగేళ్ల తర్వాత కొత్తవి...

ఉమ్మడి కృష్ణాలో 11,12,832 రేషన్ కార్డులు.. 2,016 దుకాణాలు ఉన్నాయి. నెలకు 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించింది. అధికారుల అంచెల విచారణ తర్వాత నిర్దేశిత అర్హతలు ఉన్న వారిని ఎంపిక చేసింది. దీంతో 13,365 మందికి కొత్తగా రేషన్ కార్డులు రానున్నాయి. వీరేకాక.. గత నాలుగేళ్లలో పుట్టిన వారు, గతంలో సాంకేతిక సమస్యలతో డిలీట్ అయినవారు 64,382 మందిని వారి కార్డుల్లో కొత్తగా చేర్చనున్నారు. ఈ నాలుగేళ్లలో ఉద్యోగాల్లో చేరిన వారు.. ఆదాయ పన్ను పరిధిలోకి వచ్చినవారు 3,769 మందిని కార్డుల నుంచి తొలగించనున్నారు. 86 మంది తమ రేషన్ కార్డులను ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

స్మార్ట్‌గా సరఫరా...

వైకాపా జమానాలో రేషన్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలో బియ్యం కార్డుల పేరుతో జగన్, వైఎస్ చిత్రాలతో ఆ పార్టీ జెండా రంగులో కార్డులు పంపిణీ చేశారు. వీటిని తొలగించేసి... కూటమి సర్కారు సాంకేతిక సొబగులతో సరికొత్తగా తేనుంది. ఏటీఎం కార్డుల పరిమాణంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. వీటిపై క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. దాన్ని స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలన్నీ కనిపిస్తాయి. చిన్న సైజులో ఉండడంతో తేలిగ్గా వెంట తీసుకెళ్లే వీలుంది. 'రేషన్ కార్డుల దరఖాస్తుకు గడువు ఏమీ లేదు.. ఇది నిరంతర ప్రక్రియ. స్మార్ట్ కార్డుల తయారీ ప్రక్రియ తుది దశకు వచ్చినట్లు' ఎన్టీఆర్, కృష్ణా జిల్లా డీఎస్‌వోలు పాపారావు, మోహన్‌బాబు తెలిపారు.

బంగారు కుటుంబాలకు 'ఫిక్కీ' మార్గదర్శనం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : 'ఫిక్కీ' మహిళా పారిశ్రామికవేత్తలు పీ-4 విధానంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. 'ఫిక్కీ' లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్.ఎల్.ఒ.) విజయవాడ ప్రతినిధులతో నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. జిల్లాలో 86,000 బంగారు కుటుంబాలను గుర్తించగా, ఇప్పటికి 3,700 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చినట్టు వివరించారు. ఎఫ్.ఎల్.ఒ. విజయవాడ సీనియర్ ఛైర్‌పర్సన్ మాలినేని సుప్రియ, కార్యదర్శి అట్లూరి సుమబిందు, కోశాధికారి దేవినేని భవానీ, సంయుక్త కార్యదర్శి చలసాని దీప్తి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి బి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి విలువైంది ప్రాణం.. పట్టుజారితే తల్లకిందులే జీవితం


పటమట బస్టాపు వద్ద బస్సు ఫుట్‌బోర్డుపై ప్రమాదకరంగా నిలబడి..

రోజూ సాయంత్రమైతే చాలు కళాశాలలు విడిచిన వెంటనే వందల మంది విద్యార్థులు బస్సుల కోసం బందరు రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ వరకు రహదారికి ఇరువైపులా చేరతారు. కిక్కిరిసి ఉన్న బస్సుల్లో ఫుట్ బోర్డుపై వేలాడుతూ విలువైన ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం చేస్తున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై ఇలాంటి ప్రయాణాలు ప్రమాదాలను తెచ్చిపెడతాయి.

–ఈనాడు, అమరావతి

నిన్నేపెళ్లాడతా...! తియ్యని మాటలతో రూ.78 లక్షలు కాజేశారు

మధురానగర్, న్యూస్‌టుడే

కానూరుకు చెందిన ఒక వైద్యుడికి ఆన్‌లైన్‌లో రెండు నెలల క్రితం ఓ యువతి పరిచయమైంది. తియ్యని మాటలతో నమ్మించింది. పెళ్లి చేసుకుందామని బురిడీ కొట్టించి.. విడతల వారీగా రూ.40 లక్షలు గుంజింది. తర్వాతి నుంచి ష్.. గప్‌చుప్ అని చరవాణి స్విచ్ఛాఫ్ చేసింది.

నూజివీడుకు చెందిన ఓ యువకుడు చైనాలో ఉద్యోగం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన యువతి.. కార్పొరేట్ స్కూల్‌లో చదివానని, భవానీపురంలో ఉంటానని పరిచయం చేసుకుంది. వివాహం చేసుకుందామంటూ ఛాటింగ్ చేసి రూ.38 లక్షలు తన ఖాతాకు మళ్లించుకుని మాయమైంది.

అంతర్జాలంలో వివిధ రూపాల్లో పరిచయం పెంచుకుంటున్న యువతులు.. అమాయకులకు వల వేసి రూ.లక్షలు గుంజేస్తున్నారు. విజయవాడకు సమీపంలోని ఇద్దరు యువకులను ఒకే తరహాలో మోసం చేశారు. ధనవంతులను లక్ష్యంగా చేసుకుని సరికొత్త రూపంలో జరుగుతున్న ఈ నేరాలు నగరవాసులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

మభ్యపెట్టి ముగ్గులోకి..

ఆన్‌లైన్‌లో పరిచయమైన యువతులు మాయమాటలతో మభ్యపెడతారు. రెండు, మూడు నెలలు పాటు మాట్లాడతారు. కుటుంబ వ్యవహారాలు, సమాచారం తెలియజేస్తారు. తర్వాత నెమ్మదిగా.. మీరే లోకమన్నట్లు వ్యవహరిస్తారు. ఇద్దరం కలిసి వ్యాపారం చేద్దామని నమ్మిస్తారు. తర్వాతి నుంచి పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేస్తారు. కానూరు వైద్యుడిని, చైనాలో ఉంటున్న నూజివీడు యువకుడిని ఇదే తరహాలో మోసం చేశారు.

అపరిచితులతో వ్యాపారమంటే ఆలోచించండి..

ఆన్‌లైన్‌లో పరిచయమైన వారు.. కలిసి వ్యాపారం చేద్దామంటే కాస్తంత ఆలోచించాలని పోలీసులు చెబుతున్నారు. ముక్కూమొహం తెలియని వారు వ్యాపారం పేరుతో రూ.లక్షలు పంపమంటే అసలు నమ్మవద్దంటున్నారు. ఎవరైనా పెళ్లి చేసుకుందామంటే.. వారి కుటుంబం గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలి. ఆ తర్వాతే ముందుకు వెళ్లాలి. పెళ్లికి ముందే వ్యాపారాల పేరుతో అపరిచితులను నమ్మి మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ధనవంతుల వివరాలను ముందుగానే సేకరించి.. ఈ తరహా మోసాలకు పాల్పడతారని చెబుతున్నారు. ఒక్కోసారి పురుషులే మహిళల్లా వాయిస్ ఛేంజర్‌తో గొంతు మార్చి మాట్లాడుతుంటారని, ఇతరుల ఫొటోలను తమ ఫొటోలుగా నమ్మించి మోసం చేస్తారని. ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్‌లో 190 సీట్ల భర్తీ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లోని వివిధ కోర్సుల్లో చేరేందుకు మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన 480 సీట్ల భర్తీకి బుధవారం ప్రారంభించిన రెండో విడత కౌన్సెలింగ్‌లో 190 సీట్లు భర్తీ అయ్యాయని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.కనకారావు తెలిపారు. మొదటి రోజున ఒకటి నుంచి 337 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్‌కు పిలవగా.. 217 మంది హాజరైనట్లు చెప్పారు. గురువారం 338 నుంచి ఆఖరి ర్యాంకు వరకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. సందేహాల నివృత్తికి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, 0866-2475575, 94906-39639, 77804-29468 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

పీజీ దంత వైద్య సీట్లకు ఐచ్ఛికాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని దంత వైద్య కళాశాలల్లో మొదటి విడత కౌన్సెలింగ్‌లో భర్తీ కాని ఎండీఎస్ కన్వీనర్/యాజమాన్య కోటా (ఎస్1, ఎస్2, ఎస్3) సీట్ల భర్తీకి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఐచ్ఛికాలు నమోదు చేసుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌కు కన్వీనర్ కోటాలో 61 సీట్లు, యాజమాన్య కోటాలో 120 సీట్లు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఏ స్పెషాలిటీలో ఎన్ని సీట్లు ఉన్నాయో విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ కార్ల దందా!

అనుమతి లేకుండా షెడ్ నిర్మాణం
ఆర్టీసీ ఆదాయానికి భారీ గండి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

నగరానికి ఆనుకుని ఉన్న రామవరప్పాడు రింగ్ వద్ద.. విశాఖపట్నం, ఏలూరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సుల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. సరైన అనుమతులు లేకుండా కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ కార్ల నిర్వాహకులు దందా సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూస్తే ప్రయాణికులను కంగారు పెట్టి కారుల్లో ఎక్కించి పంపించేస్తున్నారు. దీని కోసం ఒక ముఠానే ఏర్పాటు చేసుకున్నారు. బయట ట్రావెల్ కార్లు ఆపితే.. ఇక్కడ నిలపకూడదంటూ భయపెట్టి తరిమేస్తున్నారు. అదేమని ప్రశ్నించిన వారి తాళాలు లాక్కుని బెదిరిస్తున్నారు. జాతీయ రహదారులు, ట్రాఫిక్ పోలీసుల అనుమతులు లేకుండానే సెంట్రల్ డివైడర్‌ను ఆక్రమించి.. షెడ్ నిర్మించి, దందా కొనసాగిస్తున్నారు. అదేవిధంగా పండిట్ నెహ్రూ బస్టేషన్ వద్ద హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులను మరో ముఠా.. కార్లలో తరలించేస్తోంది.

రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే అనుమతి

అధికారంలోకి ఏ పార్టీ వస్తే.. ఆ పార్టీలో చేరే ఒక వ్యక్తి కనుసన్నల్లో ఈ దందా నడుస్తోంది. ఇక్కడి నుంచి ప్రయాణికులను ఎక్కించుకోవాలంటే.. ఆ వ్యక్తికి కప్పం చెల్లించాల్సిందే. రూ.50వేలు కట్టి రిజిస్టర్ చేసుకుంటే.. ఇక్కడ కార్లు ఆపి... ప్రయాణికులను ఎక్కించుకోవచ్చు. రిజిస్టర్ చేసుకోని వారి వాహనాలను ఆపనీయరు. ఈ కార్యకలాపాలన్నీ పర్యవేక్షించేందుకు సెంట్రల్ డివైడర్ మధ్య భారీ షెడ్ నిర్మించారు. ఎవరి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే వెలిసిన ఈ షెడ్‌ను చూసి.. స్థానికులు ఆశ్చర్యపోయారు. రవాణాశాఖ నిబంధనల ప్రకారం వ్యక్తిగత వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోకూడదు. ఇక్కడ ఆ నిబంధనకు తిలోదకాలు ఇచ్చేశారు. ఫలితంగా ఏలూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఎక్కకుండా కార్లలో తరలించేస్తున్నారు. ఫలితంగా బస్సులన్నీ ఖాళీగా వెళుతున్నాయి.



రామవరప్పాడు రింగ్ వద్ద సెంట్రల్ డివైడర్‌లో వెలిసిన షెడ్

జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదులు

రామవరప్పాడు రింగ్, పీఎన్‌బీఎస్ వద్ద జరిగే దందాపై కలెక్టర్ లక్ష్మీశ, రవాణాశాఖ కమిషనర్, ఉపరవాణా కమిషనర్, ట్రాఫిక్ ఏడీసీపీ తదితరులకు ఫిర్యాదు చేసినట్లు ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పన రాజేంద్రప్రసాద్, విజయవాడ శాఖ అధ్యక్షుడు ముక్తినేని సాయిప్రసాద్‌లు తెలిపారు. ఒకే నంబరుపై నాలుగు కార్లు తిరుగుతున్నాని, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండానే అక్రమ మార్గంలో ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారని వివరించారు. రామవరప్పాడు రింగ్ వద్ద అక్రమంగా నిర్మించిన షెడ్‌ను తొలగించి.. అక్కడ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు వారు విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

రామవరప్పాడు రింగ్, పీఎన్‌బీఎస్ తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించుకుంటున్న వైనంపై గత పది రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వ్యక్తిగత వాహనాల్లో ఎక్కించుకుంటున్న వారిపై కేసులు నమోదు చేశాం. పర్మిట్లు లేని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- ప్రవీణ్, ఇన్‌ఛార్జి ఆర్టీవో

కృష్ణా నదికి వరద ఉద్ధృతి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో బుధవారం స్థానిక వరద ఉద్ధృతి నెలకొంది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద ఉదయం 6 గంటలకు 12 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 8,700 క్యూసెక్కులు విడుదల చేశారు. 9 గంటలకు వరద పెరగడంతో 20 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి, దిగువకు 14,500 క్యూసెక్కులు వదిలారు. మధ్యాహ్నం వరద తీవ్రం కావడంతో.. 40 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 28,800 క్యూసెక్కులను విడుదల చేశారు. తర్వాత క్రమేపీ తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 6 గంటలకు 20 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి, 14,240 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సాగునీటి విడుదలను పునరుద్ధరించారు. 516 క్యూసెక్కులు విడుదల చేశారు.



బ్యాంకులకు రూ.1.5 కోట్ల టోకరా

విద్యాధరపురం, న్యూస్‌టుడే: తప్పుడు చిరునామాలతో బ్యాంకుల వద్ద రుణాలు తీసుకొని తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషనులో మూడు చీటింగ్ కేసులు నమోదయ్యాయి. భవానీపురానికి చెందిన ఆ యువకుడు వెంచర్, బూటిక్ పెట్టేందుకు ఆరు బ్యాంకుల వద్ద రూ.1.5 కోట్ల రుణం తీసుకున్నాడు. సిబిల్ స్కోర్ 300 ఉండగా బ్యాంకు అధికారులు రుణాలు ఇచ్చారు. క్రెడిట్ కార్డు పైన సైతం రుణాలు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో రుణం చెల్లించాలని బ్యాంకు అధికారులు అడుగుతుండటంతో ఢిల్లీలో వ్యాపార పని మీద ఉన్నానని చెబుతూ వస్తున్నాడు. దీంతో రుణం వసూలు చేయలేక బ్యాంకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల భవానీపురం పోలీసు స్టేషను పరిధిలో చీటింగ్ వ్యవహారాలపై ఆ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూడడంతో బ్యాంక్ అధికారులు సదరు వ్యక్తి చిరునామా కోసం ప్రయత్నిస్తున్నారు. కొందరు అధికారులు తమకు తెలిసిన పోలీసుల ద్వారా రికవరీ చేసే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం.

జగన్ వికృత రాజకీయాలకు అల్లాడిన రాష్ట్రం

బీసీవై పార్టీ రెండో ఆవిర్భావ సభలో బోడె రామచంద్రయాదవ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: 2019లో అధికారం చేపట్టిన జగన్ వికృత క్రీడకు రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలు అల్లాడిపోయాయి. సహజ సంపద, భూములు, కాంట్రాక్టులను తన సామాజిక వర్గానికి దోచిపెట్టారు. 'పేదలకు సంక్షేమం' పేరుతో రూ.వేల కోట్లు దోచుకున్నారు' అని బీసీవై (భారత చైతన్య యువజన) పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఆరోపించారు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన ఆ పార్టీ రెండో ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీవై జెండా యాత్ర ద్వారా ప్రజల చైతన్యం, యువజన పోరాటంలో నాంది పలికామని తెలిపారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు తన సామాజిక వర్గాన్ని ఎక్కువగా ప్రోత్సహించారని, తర్వాత వచ్చిన జగన్ తన సామాజిక వర్గానికి చెందిన వారికి రాష్ట్రాన్ని దోచిపెట్టారని, వారి పాలనలో బడుగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. కరేడు ఉద్యమానికి రామచంద్రయాదవ్ నాయకత్వం వహించాలని రైతులు కోరారు. ప్రాణం ఉన్నంత వరకు కరేడు రైతుల కోసం పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

సంక్షేమ పథకాలపై వైకాపా దుష్ప్రచారం

ప్రశ్నించిన మహిళా నాయకురాలిపై కత్తితో దాడికి యత్నం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై బ్యానర్లతో దుష్ప్రచారం చేయడమే కాకుండా.. ప్రశ్నించిన తెదేపా మహిళా అధ్యక్షురాలిని కత్తితో చంపుతానని వైకాపా నాయకుడు బెదిరించిన ఘటన పాయకాపురంలో కలకలం రేపింది. పట్టపగలు అందరూ చూస్తుండగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. దీనిపై మంగళవారం రాత్రి నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తెదేపా సీనియర్ నాయకురాలు దాసరి ఉదయశ్రీ 61వ డివిజన్ తెలుగు మహిళ అధ్యక్షురాలిగా ఉన్నారు. ఈ నెల 20వ తేదీ, ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో పాయకాపురం ప్రశాంతినగర్ వద్ద తెదేపా సంక్షేమ పథకాలను దూషిస్తూ.. వైకాపా నాయకులు పసుపులేటి ఏసు, మస్తాన్ జగదీష్‌లు బ్యానర్లు కట్టారు. వాటిలో కొన్నింటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖంపై 'ఇంటూ' గుర్తు చేసి, పథకాలపై దుష్ప్రచారం చేయడం కలకలం రేపింది. ఈ విషయం తెలిసిన ఉదయశ్రీ.. అక్కడికి వెళ్లి బ్యానర్లపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

నాయకుల నిలదీత.. ప్రశాంతినగర్ అమెరికన్ కిడ్స్ స్కూల్ వద్ద బ్యానర్లు కట్టిన వైకాపా నాయకులు పసుపులేటి ఏసు, మస్తాన్ జగదీష్‌ను దాసరి ఉదయశ్రీ ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్యం అనుమతులు లేకుండా ఎలా కడతారని నిలదీశారు.. వారు ఆమెను దుర్భాషలాడారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశాల మేరకే బ్యానర్లు కట్టామంటూ వాగ్వాదానికి దిగారు. ఈ లోగా అక్కడకు 59వ డివిజన్ తెదేపా నాయకులు వలీ, దుర్గారాం, పెద్ద శ్రీను వచ్చి.. వైకాపా నాయకులను ప్రశ్నించారు. గొడవ పెద్దది కావడంతో.. ఏసు, జగదీష్‌లు కత్తి తీసుకుని ఆమెను బెదిరించడంతో అందరూ వెళ్లిపోయారు. ఆదివారం సాయంత్రం ప్రశాంతినగర్ ప్రాంగణంలో ఫ్లెక్సీలు సమావేశాలు ఉండడంతో.. దానికి ముందే తనపై దాడి చేయాలని కుట్ర పన్నినట్లు ఉదయశ్రీ గుర్తించారు. దీనిపై ఆమె మంగళవారం రాత్రి నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ 79 (మహిళను అవమానించడం), 351 (3) రెడ్ విత్ 3 (5) (నేరపూరిత బెదిరింపు) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

కారుపై కూలిన స్తంభం



నగరంలోని కాళేశ్వరరావు రోడ్డులో బుధవారం కేబుల్ టీవీకి చెందిన ఓ సిమెంటు స్తంభం అకస్మాత్తుగా కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నేల గుల్లగా మారింది. ఒక్కసారిగా వాలిపోయి పక్కనే ఉన్న కారుపై పడింది. వెనుక తలుపు ధ్వంసమైంది. కారు లేకపోతే రోడ్డుపై పడేదని.. అదే సమయంలో చోదకులు, పాదచారులు ఉంటే పెను ప్రమాదం వాటిల్లేదని స్థానికులు అభిప్రాయపడ్డారు.

- న్యూస్‌టుడే, సూర్యారావుపేట

వత్సవాయిలో 138.2 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలోని అన్ని మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. వత్సవాయి మండలంలో అత్యధికంగా 138.2 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామ 79.6 మి.మీ., వీరులపాడు 76.4, కంచికచర్ల 68.2, జి.కొండూరు 65.2, పెనుగంచిప్రోలు 64.2, ఎ.కొండూరు 52.4, మైలవరం 48.6, ఇబ్రహీంపట్నం 42, రెడ్డిగూడెం 39.6, గంపలగూడెం 33.2, చందర్లపాడు 25.6, జగ్గయ్యపేట, విస్సన్నపేట 25.2, తిరువూరు 14.6, విజయవాడ గ్రామీణ 33.6, పటమట 32.6, అజిత్‌సింగ్‌నగర్ 32.4, గాంధీనగర్, భవానీపురంలలో 32.2 మి.మీ. మేర వర్షం పడింది.

సత్యవర్ధన్ కేసులో కొమ్మా కోట్లు ముందస్తు బెయిల్ పిటిషన్

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో పరారీలో ఉన్న వంశీ అనుచరుడు, ఏ2 కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లు.. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ముందస్తు బెయిల్ దాఖలు చేశారు. కేసు నమోదైనప్పటి నుంచి పరారీలోనే ఉన్నారు. గత ఐదు నెలలుగా పోలీసులు గాలిస్తున్నారు. కోట్లు బెయిల్ పిటిషన్‌పై పోలీసులు బుధవారం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. కేసులో ఫిర్యాదుదారుడు కిరణ్, బాధితుడు సత్యవర్ధన్‌లకు పోలీసులు నోటీసులు ఇచ్చి, వాటిని కోర్టులో సమర్పించారు. వీరు కోర్టుకు హాజరై, తమ వాదనలు వినిపించాల్సి ఉంది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ వేసేందుకు పోలీసులు సమయం కోరడంతో న్యాయాధికారి ఈనెల 31వ తేదీకి వాయిదా వేశారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో మోసం

పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో పలువురిని మోసగించిన ఘటన భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దీంతో బాధితులు నేరుగా కాకుండా పరిచయస్తుల ద్వారా పోలీసులను సంప్రదించినట్లు సమాచారం. భవానీపురానికి చెందిన చైతన్య, వర్ధన్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని తాడేపల్లికి చెందిన రవీంద్రవర్మ, గత ఏడాది వీరి వద్ద దఫాల వారిగా రూ.15 లక్షలు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో రవీంద్ర వర్మకు ప్రభాకరరెడ్డి, కిషోర్ సహకరించారని బాధితులు వాపోతున్నారు. వారు చెప్పిన విధంగా మొగల్రాజపురంలోని ఓ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో ఉద్యోగి అని చెప్పి వారి ఇద్దరికి రెండు వారాల పాటు శిక్షణ ఇప్పించారు. అనంతరం బ్యాంక్ లెటర్ ప్యాడ్‌పై అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చినట్లు వారు ముగ్గురు బాధితులను నమ్మించారు. ఈ నేపథ్యంలో తాము చెప్పేంత వరకు బ్యాంక్ వద్దకు వెళ్లవద్దని బాధితులకు చెప్పారు. ఆ తరువాత వారు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితులు బ్యాంక్ వద్దకు వెళ్లి ఆరా తీయగా అవి డూప్లికేట్ ఆర్డర్ అని తేలడంతో పోలీసులను సంప్రదించినట్లు తెలిసింది. ఈ విషయంపై భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావును సంప్రదించగా ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులు తమకు ఇంత వరకు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. మోసపోయిన బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 475 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.92/-.

నూతన ఆరోగ్య బీమా పథకంతో ధీమా

గుణదల(పటమట), న్యూస్‌టుడే: నూతన స్ప్రీ (ఎస్‌పీఆర్ఈఈ) ఆరోగ్య బీమా పథకంతో కార్మికుల జీవితాలకు ధీమా కల్పిస్తున్నామని, దీనిని కర్మాగారాలు, సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు సూచించారు. బుధవారం గుణదలలోని కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) ప్రాంతీయ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం (ఎస్‌పీఆర్ఈఈ-2025) కరపత్రాలను ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మిక రాజ్య బీమా సంస్థ 196వ సమావేశంలో స్ప్రీ పథకానికి ఆమోదం లభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా బీమా చెల్లించాలని యజమాని ప్రకటించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చెల్లుబాటు అయినట్లు పరిగణిస్తామని, రిజిస్ట్రేషన్ కంటే ముందు కాలానికి ఎలాంటి కాంట్రిబ్యూషన్ వర్తించదని చెప్పారు. రిజిస్ట్రేషన్ ముందు కాలానికి ఎలాంటి రికార్డులు తనిఖీ చేయనవసరం లేదని అన్నారు. జరిమానాల భయాన్ని తొలగించడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరళీకృతం చేసినట్లు వివరించారు. దీనికి ముందు గడువులోగా నమోదు చేసుకోకపోతే చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధించే పరిస్థితి ఉండేదని తెలిపారు. స్ప్రీ పథకంతో ఆ సమస్యలన్నీ తొలగినట్లయిందని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 69,632 కర్మాగారాలు, సంస్థలు నమోదయ్యాయని, వాటిలో 14 లక్షల మంది ఉద్యోగులు ఈ పథకం కింద ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఐఎంఎస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, స్టేట్ మెడికల్ ఆఫీసర్ ఆర్.ప్రదీప్ కుమార్, కర్మాగారాల డైరెక్టర్ డి.చంద్రశేఖరవర్మ, బాయిలర్స్ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావు, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ నవనీత్ పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న రామారావు, ఆంజనేయులు, ప్రదీప్ కుమార్, ఉమామహేశ్వరరావు

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అక్కను కొడుతున్న బావను హత్య చేసిన బావమరిదికి న్యాయమూర్తి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల కథనం మేరకు.. కృష్ణా జిల్లా మచిలీపట్నం ఫిష్ మార్కెట్ సమీపంలో నివాసముంటున్న ఎల్లమ్మకు, విజయవాడ సింగ్‌నగర్ న్యూ రాజేశ్వరిపేటకు చెందిన పవర్ రాజేశ్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. కొన్నేళ్లు వీరి కాపురం సజావుగానే సాగింది. రాజేశ్ తన భార్య చెల్లితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దాంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఎల్లమ్మ తన తమ్ముడు తంగా పాండియన్‌తో కలిసి ఏలూరు వెంకటాపురం పంచాయతీ చెంచుల కాలనీకొచ్చి ఉంటున్నారు. 2021 మే 20న రాజేశ్ చెంచుల కాలనీకొచ్చి భార్యతో మళ్లీ గొడవపడి కొట్టాడు. దీంతో పాండియన్ మా అక్కను కొడతావా అంటూ బావను కత్తితో నరికి హతమార్చాడు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఏలూరు రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని బుధవారం తుది విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

మద్యం కుంభకోణంలో నిందితుల పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: మద్యం కుంభకోణంలో నిందితుల పిటిషన్లు విజయవాడ ఏసీబీ కోర్టులో వాయిదా పడ్డాయి. తనకు తిరుపతి స్విమ్స్‌లో ఫిజియోథెరపీ చేయించుకునేందుకు అనుమతించాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం వాదనలు జరగాల్సి ఉంది. ప్రాసిక్యూషన్స్ జేడీ అందుబాటులో లేకపోవడంతో తదుపరి వాదనల నిమిత్తం ఈనెల 25వ తేదీకి వాయిదా పడింది. ఏ34 వెంకటేష్ నాయుడు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణ కూడా వాయిదా పడింది. ఈనెల 28వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. ఏ35.. బాలాజీ కుమార్ యాదవ్, ఏ36 నవీన్ కృష్ణ బెయిల్ పిటిషన్లపై సిట్ కౌంటర్లు దాఖలు చేసింది. వాదనలు వినేందుకు 29వ తేదీకి వాయిదా పడింది.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



✦ స్థానిక ఎస్సీవాడ కమ్యూనిటీ హాలు దగ్గర వీధిలోని డ్రెయినేజీలో పూడిక, చెత్త పెరిగి మురుగు నీటి పారుదల సక్రమంగా జరగడంలేదని స్థానికులు మేమున్నాం... మీకు తోడుగాకు తెలిపిన సమస్యపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించారు. బుధవారం సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించారు. -న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

స్పందనకు వందనం

✦ పట్టణంలోని 12వ వార్డులో బైపాస్ మెయిన్ రోడ్డుపై చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక సిబ్బందితో శుభ్రం చేయించారు. ✦ పట్టణంలోని వడ్డెర కాలనీ డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలని స్థానికులు కోరగా శానిటరీ అధికారి స్పందించారు. పురపాలిక కార్మికులతో పూడిక తొలగింపజేసి మురుగు నీరు పారుదల సక్రమంగా సాగేలా చేయించారు. ✦ పట్టణంలోని మునుకుళ్ల రోడ్డులోని కాలువల్లో వ్యర్థాలు నిలిచి ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలుపగా పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. కార్మికులతో శుభ్రం చేయించారు. -న్యూస్‌టుడే, తిరువూరు



శాకంబరిగా భ్రమరాంబిక అమ్మవారు

మైలవరం, న్యూస్‌టుడే: ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక శ్రీ భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని బుధవారం వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు లలితా పారాయణం పఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మైలవరం న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5,62,577 విలువైన ఆర్థిక సాయం చెక్కులను బుధవారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అందజేశారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

నాగ కనకదుర్గమ్మకు బోనాలు

కొనిజెర్ల(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొనిజెర్ల బీసీ కాలనీలో నాగ కనకదుర్గ అమ్మవారికి భక్తులు బుధవారం ఆషాఢ బోనాలు సమర్పించారు. పిండి వంటలు, పాయసం, వేపమండలతో సందడిగా గుడికి చేరుకున్న మహిళలు అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు.

కోదండ రామాలయానికి రూ.లక్ష విరాళం

ఊటుకూరు (గంపలగూడెం): మండలంలోని ఊటుకూరు కోదండ రామాలయానికి గ్రామానికి చెందిన మిఠాయి దుకాణ నిర్వాహకురాలు లీలాదేవి, కుమారుడు ఈశ్వర్, కుమార్తెలు కవిత, సరిత, వెనీల బుధవారం రూ.లక్ష విరాళం అందజేసినట్లు గుడి కమిటీ సభ్యులు తెలిపారు. లీలాదేవి తన భర్త రాజపురోహిత్‌కిషోర్ జ్ఞాపకార్థం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాభివృద్ధికి విరాళం అందజేశారు. దాత కుటుంబాన్ని అర్చకులు రామకృష్ణాచార్యులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కమిటీ సభ్యులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

రాలేక.. పోలేక

రహదారులపై వరదనీరు ప్రవహించడంతో స్తంభించిన జనజీవనం

న్యూస్‌టుడే, జి.కొండూరు, రెడ్డిగూడెం, గంపలగూడెం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి.. దీంతో జనజీవనం స్తంభించింది. లోలెవెల్ వంతెనల వద్ద రోడ్లపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఇటీవల నాటిన వరి, పత్తి చేలు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పుల్లూరు వద్ద బుడమేరు వాగు ఉధ్ధృతి

☛ హెచ్ ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై నిర్మించిన తాత్కాలిక లోలెవెల్ వంతెనపై వరద నీరు ప్రవహించడంతో బుధవారం వాహనాల రాకపోకలు నిలిచాయి. మరోవైపు వెలగలేరు నుంచి పోలవరం కుడికాలువ పట్టిసీమ నీరు బుడమేరుకు చేరుతోంది. బుధవారం వర్షం కురవక పోవడంతో మండలంలోని బుడమేరు పరివాహక పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

☛ వెలగలేరు వద్ద బుడమేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రస్తుతం 5.5 అడుగుల నీటి మట్టం కొనసాగుతోంది. వరదనీరు 11 అడుగుల మేర పెరిగితే గేట్లు ఎత్తివేయాల్సిన అవసరముంటుంది. రాత్రికి వర్షం లేకుంటే పూర్తిగా గండం గడిచినట్టే.

☛ రెడ్డిగూడెం మండల పరిధిలోని చిననందిగామ-పుట్రేల ఆర్ అండ్‌బీ రహదారిలోని నాగసానిపాటి చెరువు కట్టువాగు చప్టా వద్ద నీటి ప్రవాహం పెరగంతో బుధవారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్ సిబ్బంది రాకపోకలు జరగకుండా పర్యవేక్షణ చేస్తున్నారు.





అమ్మిరెడ్డిగూడెం-గోసవీడు మధ్య రహదారిపై మొగుళ్ల వాగు వద్ద నిలిచిన రాకపోకలు

గంపలగూడెం మండలంలోని వినగడప సమీప వంతెన వద్ద మళ్లింపు రహదారిపై ప్రవాహం చేరడంతో ముందుస్తు జాగ్రత్తగా మళ్లింపు రోడ్డుపై ఎస్సై ఎస్.శ్రీను తన సిబ్బందితో వంతెన వద్దకు చేరుకుని రాకపోకలను నిలిపేశారు. మండల కేంద్రం నుంచి ఏటి అవతల ఉన్న కనుమూరు, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి, నారికంపాడు, తండాకు వెళ్లేందుకు ప్రజలు తిరువూరు మండలం మీదుగా రాకపోకలు సాగించారు. 3 కి.మీ దూరం ప్రయాణానికి 30 కి.మీ దూరం ప్రయాణం చేయాల్సి వచ్చింది. గంపలగూడెం నుంచి వయా నారికంపాడు మీదుగా నూజివీడు, మైలవరం, విజయవాడ వెళ్లాల్సిన వాహనాలు, ప్రయాణికులు తిరువూరు నుంచి చుట్టూ తిరిగి వెళ్లారు. పలు గ్రామాల్లో చెరువులకు వరద నీరు చేరడంతో కళంగులు(అలుగు) పొంగి ప్రవహిస్తున్నాయి. గత ఏడేళ్లుగా ఆగస్టు నుంచి అక్టోబరు వరకు ఈ ప్రాంత ప్రజలకు వినగడప వంతెన వద్ద ప్రయాణ కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి.



వినగడప సమీప కట్లేరు వంతెన వద్ద మళ్లింపు రహదారిపై ప్రవహిస్తున్న నీరు



పెనుగొలనులో నీటిలో పత్తి మొక్కలు

మౌలిక వసతుల కల్పనకు కృషి

మైలవరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మొర్సుమిల్లి నుంచి తండాకు వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.1.68 కోట్లు మంజూరవగా బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.27.5 కోట్ల విలువైన సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో పి.సుబ్బారావు, వల్ల సుబ్బారావు, నవ్వ శ్రీ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మొర్సుమిల్లిలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి పీఏసీఎస్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవిడ్, చిలక రాజేష్, పార్థసారథి, సుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, అధికారులతో కలిసి వరి మొక్కలు నాటేందుకు సిద్ధమైన ఆర్డీవో మాధురి

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం

రోలుపడి (తిరువూరు): రోలుపడిలో ఏవో వి.పద్మ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు నిర్వహించిన సదస్సులో ఆర్డీవో మాధురి పాల్గొని అన్నదాతలకు ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటల సాగు చేయాలని సూచించారు. తదుపరి పాఠశాల విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు, గ్రామస్థులతో కలిసి సమీప మాగాణిలో వరి నాట్లు వేశారు. తహసీల్దారు ఉదయభాస్కర్, ఎంపీడీవో రవిబాబు, సాంకేతిక ఏవో దీప్సుకన్య, పశువైద్యాధికారి అభిలాష్ పాల్గొన్నారు.

న్యూస్‌టుడే బృందం: తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని మండల వ్యవసాయశాఖాధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం కర్షకులకు అందిస్తున్న రాయితీ పరికరాలపై అవగాహన కల్పించారు.

నదీ తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కృష్ణానదీ తీరప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం తహసీల్దారు వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన బుధవారం రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలిసి నదీతీర గ్రామాల్లో వరద ప్రవాహాన్ని, స్థానిక పరిస్థితులను పరిశీలించారు. అనంతరం అధికారులు, గ్రామస్థులతో మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, నదిలో ప్రయాణాలు నిలిపివేయాలని ఆదేశించారు. నది తీర నివాసులకు, లంక గ్రామస్థులకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేసి నివేదికలు అందజేయాలన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ మనోజ్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



సచివాలయ అధికారులకు సూచనలు ఇస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు



వ్యర్థాల సేకరణ ఆరా తీస్తున్న కన్నమనాయుడు, పక్కన రామకృష్ణనాయక్

పరిశుభ్రతపై అవగాహన కల్పించండి

జి.కొండూరు, న్యూస్‌టుడే: వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఉమ్మడి కృష్ణా జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.కన్నమనాయుడు ఆదేశించారు. ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చిన పౌరుల అభిప్రాయాల మేరకు తక్షణ పని తీరు మెరుగుపరచాలని, మండలంలోని కోడూరు గ్రామాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి వారం తప్పకుండా ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరచాలని, గ్రామంలో పొడి, తడి వ్యర్థాలను సేకరించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ కాల్ గురించి ప్రతి ఒక్కరికి తెలియజేసి, గ్రామంలో పచ్చదనం మెరుగుపరచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీవీ రామకృష్ణనాయక్, సర్పంచి వి.ప్రసాద్, ఈవోపీఆర్డీ కే శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందించండి.. స్థలం కాపాడండి

కావలూరు శివారు సత్యనారాయణపురంలో మూసి వేసిన ప్రాథమిక పాఠశాల భవనంతో పాటు ఆ స్థలాన్ని కూడా ప్రజావసరాలకు వినియోగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామ పరిధిలో ఐదుగురు విద్యార్థులు ఉండటంతో పేదలకు పక్కా గృహాలు కేటాయించారు. అక్కడే మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను కూడా ఏర్పాటు చేశారు. దీంతో ఆ బడి పరిధిలోని పిల్లలంతా తమతమ నివాసాలకు దగ్గరలోని పాఠశాలలకు వెళ్తూ... తక్కువ మంది విద్యార్థులు ఉండడంతో ఈ పాఠశాలను మూసేశారు. ఇటీవల కొందరు స్థిరాస్తి వ్యాపారులు పాఠశాల స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. స్థలం అన్యాక్రాంతం కాకముందే అధికారులు స్పందించి గ్రామానికి అత్యవసరమైన మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



మూసివేసిన ప్రాథమిక పాఠశాల భవనం

అధ్వాన దారులు.. అధికారులు చూడరు

కవులూరు నుంచి కొండపల్లి వెళ్లే రహదారి దారి పొడవునా గుంతలతో రాకపోకలకు నరకప్రాయంగా మారింది. గత ఏడాది వరదల కారణంగా కోతకు గురైన ఈ రహదారి ధ్వంసమవడంతో ఈనాడులో పలు మార్లు కథనాలు ప్రచురించడంతో 800 మీటర్ల మేర రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. దాదాపు మరో 600 మీటర్లు రహదారి నిర్మించాల్సి ఉండగా నిధులు లేకపోవడంతో పక్కన పెట్టారు. దీంతో రహదారి మరింత అధ్వానంగా తయారై ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ రోడ్డు పక్కన బుడమేరు డైవర్షన్ ఛానెల్‌పై నిర్మించిన వంతెనకు అప్రోచ్‌రోడ్డు ఇటీవలే ఏర్పాటు చేసే క్రమంలో ఎక్కువ మట్టి జారడంతో చిన్నపాటి వానకే తీవ్రంగా బురద ఏర్పడుతోంది. ఫలితంగా ద్విచక్ర వాహనదారులు జారి పడి రహదారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి నిర్మాణం పై దృష్టి సారించి తమ కష్టాలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు



గుంతలమయంగా కవులూరు కొండపల్లి రహదారి



బుడమేరు డైవర్షన్ ఛానెల్ వంతెన సమీపంలో బురదమయం

బాధ్యత వదిలేశారు

అది జాతీయ రహదారి అని ఆ మూగ జీవాలకు తెలియదు. నేల తీరిందని రహదారిపై పడుకున్నాయి. అయితే అప్పటికే సాయంత్రం 5 గంటలు అయ్యింది. వర్షాకాలం నేపథ్యంలో త్వరగా చీకటి పడుతుంది. పేరుకే జాతీయ రహదారైనా విద్యుత్తు దీపాల వెలుగులు లేవు. నల్ల దూడలు చీకటిలో కలిసిపోతే వేగంగా వచ్చే భారీ వాహనాలకు అవి కనిపించక ఘోరం తప్పదు. ఈ పరిస్థితులు అనేక మార్లు ఇబ్రహీంపట్నం, కొండపల్లి జాతీయ రహదార్లపై చోటు చేసుకొన్నాయి. వాటి కాపరులు మాత్రం బాధ్యత మరచి వదిలేస్తున్నారు. ప్రమాదానికి గురై అవి మరణించినా, గాయపడిన సందర్భాల్లో మాత్రం వాహన యజమానులపై దౌర్జన్యం చేసి నగదు వసూలు చేసుకొంటున్నారు. దీనిపై పురపాలిక, పోలీసు అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని పురవాసులు పేర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం




ఎన్టీటీపీఎస్ కొత్తగేటు ఎదురుగా జాతీయ రహదారిపై పడుకున్న ఆవు దూడలు

'అకారణంగా మమ్మల్ని కొట్టారు'

మైలవరం, న్యూస్‌టుడే: అకారణంగా మమ్మల్ని కళాశాలలో సిబ్బంది కొట్టారంటూ ఓ కాలేజీ బస్సును మైలవరంలో విద్యార్థులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. ప్రముఖ కార్పొరేట్ కళాశాలకు మైలవరం నుంచి నిత్యం ఆ కళాశాల బస్సులోనే సదరు విద్యార్థులు విజయవాడ వెళ్లొస్తుంటారు. ఇటీవల బస్సులో అద్దం పగలడంతో తమను సిబ్బంది కొట్టారంటూ బుధవారం సాయంత్రం విద్యార్థులను దింపేందుకు వచ్చిన బస్సుకు స్థానిక నూజివీడు రోడ్డులో అడ్డుకున్నారు. కళాశాల నిర్వాహకులు క్షమాపణ చెప్పాలంటూ రోడ్డుపై గోల చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై కే సుధాకర్ అక్కడికి చేరుకుని విజయవాడలో ఘటన జరిగితే మైలవరంలో బస్సు ఆపడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అకారణంగా రోడ్డుపై ఇబ్బందులు కలిగించడం మంచి పద్ధతి కాదంటూ హితవు పలకడంతో బస్సును వదిలేశారు.

దేశం గర్వించదగ్గ మహాపురుషులు



బాలగంగాధర్, చంద్రశేఖర్‌ల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి ఉమా

గొల్లపూడి: దేశం గర్వించదగ్గ మహా పురుషులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్‌ఆజాద్‌లు అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతిని తెదేపా కార్యాలయంలో బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారి పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల చిత్రపటాలకు స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ కే అప్పారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శివహరి ప్రసాద్, ఉమామహేశ్వర రెడ్డి, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

పెనుగొలను (గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో స్వాతంత్ర్య సమరయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి నిర్వహించారు. వారి చిత్రపటాలకు శిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం డీఎల్పీవో రాఘవన్ పారిశుద్ధ్య నిర్వహణను ఆకస్మిక తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బంది పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ లక్ష్యంగా చెత్త సేకరణ చేయాలని సూచించారు. వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీవో ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలించాలని ప్రదర్శన నేడు

తిరువూరు, న్యూస్‌టుడే: గంజాయి నిర్మూలించాలి-యువతను కాపాడుకోవాలి అనే నినాదంతో గురువారం ఉదయం 9 గంటల నుంచి పట్టణంలోని బైపాస్ రోడ్డు నుంచి రాజుపేట పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు పాల్గొనాలని కోరారు.

25న నెమలి కృష్ణుడికి ఫలాలంకరణ

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలో నెమలి వేణుగోపాలస్వామికి ఫలాలంకరణ, రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు శాకంబరి అలంకరణ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి ఎన్.సంధ్య తెలిపారు. అలంకరణకు భక్తులు అందించే కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ గురువారం ఉదయం గుడి కార్యాలయంలో అందించాలని కోరారు.

అవీ ఇవీ

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని వినతి

రామచంద్రాపురం(ఎ.కొండూరు): స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై బుధవారం రామచంద్రాపురంలో ఎ.రామిరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మయ్య తదితరుల ఆధ్వర్యంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

లైసెన్సు లేకుండా యూరియా అమ్మితే చర్యలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: యూరియా కృత్రిమ కొరత పేరుతో గ్రామాల్లో లైసెన్స్ లేని వ్యక్తులు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ కె.శశికళ హెచ్చరించారు. మండలంలోని రైతులు పట్టాదారు పాస్ పుస్తకం నకలు తీసుకువచ్చి దుకాణాల్లో ఎరువులు తీసుకోవాలని ఆమె సూచించారు. విస్సన్నపేటలో బుధవారం పలు ఎరువుల దుకాణాల్లో ఎరువుల నిల్వలను ఆమె తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా విక్రయాలపై వీఏఏలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు.

పంటల బీమా చేయించుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వివిధ పంటలు సాగుచేస్తున్న రైతులు గడువు తేదీ లోపు పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయశాఖ మైలవరం ఏడీ శ్రీనివాసులు తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.850 ప్రీమియం చెల్లించి ఆగస్టు 15వ తేదీ లోపల బీమా చేయించుకోవాలన్నారు. మిర్చి పంటకు ఎకరానికి రూ.1,800, మొక్కజొన్నకు రూ.370, పెసరకు రూ.360ల ప్రీమియాన్ని జులై 31 లోపు కట్టేయాలన్నారు. ఈ పథకంలో రైతులు అర్హులు కావాలంటే వారు సకాలంలో ప్రీమియం చెల్లించి ఆ పంటల పరిధిలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

అచ్యుతానందన్ సేవలు ఎనలేనివి

కొండపల్లి: నిస్వార్థ ప్రజాసేవకు అచ్యుతానందన్ ఓ నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. బుధవారం కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఐ(ఎం) అగ్రనేత అచ్యుతానందన్(102) చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జవివే జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, సీపీఎం మండల నాయకులు మహేష్, బాషా, మల్లికార్జునరావు, పార్వతి పాల్గొన్నారు.

విస్సన్నపేట: మండల కేంద్రంలోని సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో అచ్యుతానందన్‌కు నివాళులర్పించారు. పార్టీ నాయకులు వి.నాగరాజు, ఎం.జ్ఞానరత్నం తదితరులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

రైతుల శ్రేయస్సుకు అనేక పథకాలు

రెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని తెదేపా నాయకుడు ఎం.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం రెడ్డిగూడెంలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు, తెదేపా నాయకుడు సిహెచ్.చందా, రైతులు పాల్గొన్నారు.


ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ముసునూరు: వసతి గృహంలో ఉండి చదవుకోవడం ఇష్టంలేక ఇంటర్ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ముసునూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.చిరంజీవి కథనం మేరకు.. మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ చదివేందుకు తల్లిదండ్రులు ఏలూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. అక్కడ వసతి గృహంలో ఉండి చదువుకోవడం ఇష్టం లేకపోవడంతో విస్సన్నపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. అక్కడి హాస్టల్లో కూడా ఉండటం ఇష్టం లేక ఈ నెల 19న కళాశాల నుంచి బయలుదేరి ఇంటికి వెళ్లలేదు. అయితే చందు గ్రామానికి రావడం గమనించిన స్థానికులు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. చుట్టుపక్కల ఎక్కడా కనిపించకపోవడంతో ఈనెల 21న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం వారింటి సమీపంలో ఉన్న ఓ చర్చి మరుగుదొడ్డి నుంచి దుర్వాసన వస్తోంది. స్థానికులు వెంటనే వెళ్లి చూడగా ఉరేసుకొని మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేతికంది వస్తాడనుకుంటే.. అతడి తల్లిదండ్రులు కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం కాగా.. చిన్న కుమారుడు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఉన్నత చదువులు చదివి చేతికంది వస్తాడనుకుంటే చిన్న వయసులోనే విగతజీవిగా మారడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రతిభావంతులకు ఆర్థిక సాయం

తిరువూరు, న్యూస్‌టుడే: ఐఐటీలో ర్యాంకులు సాధించిన పట్టణానికి చెందిన అజ్మీర కార్తీక్, అజ్మీర్ వినీల్‌కు చదువు నిమిత్తం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం రూ.50వేలు చొప్పున ఆర్థికసాయం అందించారు. తిరువూరుకు చెందిన ఏవీడీసీ హెచ్.నాయక్ రోజువారి వేతనదారు. అతడి కుమారులైన కార్తీక్ ఆంధ్రాలో, వినీల్ గువహటి ఐఐటీల్లో సీట్లు సాధించారు. వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని తన కార్యాలయానికి ఆహ్వానించి నగదు అందించి అభినందించారు. సాయం చేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



కార్తీక్, వినీల్‌కు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మకరందం

makarandam@eenadu.in

ఈనాడు

గురువారం జులై 24, 2025

8 మా చిరునామా: **మకరందం**, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

ఆంజనేయుని చిత్రించిన శ్రీరాముడు



సాక్షాత్తు శ్రీరాముడు తన బాణంతో ఆంజనేయ స్వామిని చిత్రించిన పవిత్ర పుణ్యక్షేత్రం గండి. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలంలో పాపఘ్ని నదీ తీరాన రెండు కొండల మధ్య ఉందీ క్షేత్రం. ప్రచారంలో ఉన్న పౌరాణిక కథను అనుసరించి.. రావణాసురుడు- సీతాదేవిని అపహరించగా.. ఆమెని అన్వేషిస్తూ బయల్దేరిన రామలక్ష్మణులు గండికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ తపస్సు చేస్తున్న వాయుదేవుడు తన ఆతిథ్యం స్వీకరించమని అడిగాడు. 'రావణ సంహారం తర్వాత నీ కోరిక తీరుస్తా'నని రాముడు వాగ్దానం చేశాడు. ఇచ్చిన మాట ప్రకారం రావణ వధ అనంతరం రామలక్ష్మణులు గండి ప్రాంతానికి చేరుకున్నారు. యుద్ధ సమయంలో హనుమంతుడు తనకు చేసిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ రాముడు తన బాణంతో ఆంజనేయుడి చిత్రాన్ని గీయనారంభించాడు. కానీ అయోధ్యకు వెళ్లేందుకు శుభ గడియలు దాటిపోతుండటంతో ఆ చిత్రాన్ని పూర్తిచేయకుండానే వెళ్లిపోయాడు. అందుకు నిదర్శనంగా ఇక్కడి హనుమంతుడి ఎడమ కాలికి చిటికెన వేలు ఉండదు. తర్వాత ఎందరో శిల్పులు దీన్ని పూర్తి చేయాలనుకున్నా సాధ్యం కాలేదు. గండి క్షేత్రంలోని ఆంజనేయస్వామి ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తాడని, సర్వ పాపాలనూ హరిస్తాడని భక్తులు విశ్వసిస్తారు. ఇక్కడ శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు జులై 26న ప్రారంభమై ఆగస్టు 23 వరకు ప్రతి శనివారం కొనసాగుతాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. జిల్లా కేంద్రం కడప నుంచి 45 కిలోమీటర్ల దూరంలోని వేంపల్లెకు బస్సు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గండి క్షేత్రానికి ఆటోలు, బస్సులు అందుబాటులో ఉంటాయి.

జులై 27 జననీ జనకుల దినోత్సవం

పెద్దల పెంపకాన్ని బట్టే పిల్లల నడవడిక ఉంటుందన్నది నానుడి. ధర్మబద్ధమైన తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడిచి ఉత్తమ సంతానంగా కీర్తి గడించటం కంటే గొప్ప సంగతి ఇంకేముంటుంది?! పురాణేతిహాసాల్లో అలాంటి ఉదాహరణలనేకం. అందుకు విరుద్ధంగా పెద్దల మాటను పెడచెవిన పెట్టి దారి తప్పిన ఉదంతాలూ ఉన్నాయి. కొందరిని చూసి ఎలా ఉండాలో, ఇంకొందరిని చూసి ఎలా ఉండకూడదో నేర్చుకుంటాం.

ధార్మిక జీవనానికి దారి దీపాలు



వాక్కు-అర్థం పరస్పరం మిళితమైపోయినట్లుగా జగత్తుకు తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులు అనుసంధానమై ఉంటారు. అన్యోన్య దాంపత్యానికి ప్రతీక ఆ ఆదిదంపతులు. భౌతికంగా భిన్న ధ్రువాల్లా కనిపించినా అంతరంగికంగా ఏకతత్వంతో అలరారే అద్వైతస్వరూపులు శివ పార్వతులు. మాతా పితరులు ఎలా ఉండాలో లోకానికి తెలియజేసిన ఆదర్శ దంపతులు. తాము ధర్మాన్ని అనుసరించి, సంతానాన్ని అదేమార్గంలో నడిపించారు. ఒకరిని విఘ్ననాయకునిగా మరొకరిని సేనానాయకునిగా తీర్చిదిద్దిన మార్గదర్శకులు ఉమామహేశ్వరులు.

సంసార సౌధానికి- తల్లి, తండ్రి, పిల్లలు, ధర్మం.. ఈ నాలుగూ మూల స్తంభాలని పేర్కొంది మహాభారతంలోని శకుంతలోపాఖ్యానం. వీటిలో ఏ ఒక్కటి గాడి తప్పినా, కుంటుపడినా.. ఇక కుటుంబ సౌధ అస్తిత్వం ప్రశ్నార్థకమే అవుతుంది. తాము ధర్మమార్గంలో నడుస్తూ, సంతానాన్ని కూడా అలాగే నడిపించినవారు కొందరు. తాము అనుసరించినా, పిల్లల్ని నడిపలేకపోయినవారు మరికొందరు. తామూ, తమవారూ కూడా ధర్మమార్గంలో నడవనివారు ఇంకొందరు. తాము ధర్మాన్ని తప్పడమే గాక ఆ మార్గంలో నడుస్తున్న పిల్లల్ని అడ్డగించినవారు మరికొందరు.

స్వార్థంతోనో వ్యామోహంతోనో బాధ్యతారాహిత్యంతోనో తాము అధర్మ మార్గంలో నడవటమే గాక తమ సంతానాన్నీ ఆ మార్గంలోనే నడిపి వంశ నాశనం చేసుకున్న తండ్రులు రావణాసుర, ధృతరాష్ట్రులు. వరగర్వంతో ప్రకృతి నియమాలకు విరుద్ధంగా, పర స్త్రీ పట్ల వ్యామోహంతో తాను పతనమయ్యాడు. తన పుత్రుల పతనానికీ కారణమయ్యాడు రావణాసురుడు.

ఆ వంశాల పరంపరలో..

సూర్యవంశ, చంద్రవంశ రాజులు తాము ధర్మమార్గాన్ని అనుసరించారు. తమ సంతానాన్ని కూడా ఆ మార్గంలో నడిపించారు. ఆదర్శ తల్లిదండ్రులై వంశాలను తరింపజేశారు. ఉదాహరణకు దశరథ మహారాజు తదితరులది ధర్మబద్ధమైన జీవన విధానం. తాము సన్మార్గంలో నడుస్తూ తమ సంతానాన్ని కూడా అలా నడిపించినవారు కౌసల్య దశరథులు. పరిస్థితుల ప్రాబల్యం వల్ల ప్రాణసమానమైన పుత్రుణ్ని అరణ్యాలకు పంపాల్సిన అనివార్య పరిస్థితి. అలాంటి సంకట స్థితిలో దశరథుడు ప్రాణాల్ని సైతం విడిచాడే కానీ ధర్మాన్ని అతిక్రమించలేదు. తండ్రి మాటను ఆచరించేందుకు రాముడు వనవాసానికి బయల్దేరాడు. భర్తని అనుసరించిన సుమిత్ర తనలాగే పుత్రుడు కూడా ధర్మమార్గంలో నడవాలనుకుంది. అందుకే రాముడికి సేవకుడిగా లక్ష్మణుని పంపింది.

శిశుపాలుని తల్లిదండ్రులు ఆదర్శమూర్తులైనా అతడు మాత్రం దుర్మార్గుడు, దైవవిరోధిగా కొనసాగి తల్లిదండ్రులకు వేదన మిగిల్చాడు. కంసుడు కూడా మాతాపితలు చూపిన ధర్మమార్గాన్ని వీడి ప్రాణాలమీదికి తెచ్చుకున్నాడు. తనకు అర్హత లేని పదవిని అధిష్ఠించి తనది కాని రాజ్యాన్ని అనుభవించి కూడా అర్హులైన తమ్ముడి బిడ్డల పట్ల అన్యాయంగా ప్రవర్తించాడు ధృతరాష్ట్రుడు.

భారతంలో ధర్మరాజు తర్వాత అంతగా ధర్మబోధ విన్నది ధృతరాష్ట్రుడే. కృష్ణుడు, వ్యాసుడు, విదురుడు, సనక సనందనాదుల ద్వారా ధార్మికతను పొందాడతడు. కానీ ఆ ధర్మసూత్రాలేవీ ఆచరణలో పెట్టలేదు. స్వార్థం, లోభం, పదవీకాంక్షలతో దుర్మార్గంగా ప్రవర్తిస్తున్న దుర్యోధనాదుల్ని నిలువరించలేదు. అధర్మాన్ని ప్రోత్సహించి వంశనాశనం చేసుకున్న పుత్ర వ్యామోహ ధృతరాష్ట్రుడు. హితవు చెప్పేందుకు ప్రయత్నించి, విఫలమై అసహాయురాలిగా నిలిచిన తల్లి గాంధారి.

అధర్ముడైన హిరణ్యకశిపుడు సన్మార్గంలో నడుస్తున్న పుత్రుణ్ణి అడ్డగించాడు. విష్ణుమూర్తిని ఆరాధిస్తున్న ప్రహ్లాదుణ్ణి హతమార్చాలని ప్రయత్నించి చావును కొనితెచ్చుకున్నాడు. తన దుర్మార్గాలకు సహకరించలేదని సంతానాన్నే శాపగ్రస్తుల్ని చేసిన దుష్ట జనని నాగుల తల్లి కద్రువ.

మాతృదేవోభవ పితృదేవోభవ అంటూ తల్లిదండ్రులకు దైవం కంటే ఉన్నత స్థానాన్ని అందించింది మన సంప్రదాయం. కుటుంబ సౌఖ్యం కోసం, లోక కల్యాణార్థం తమ బిడ్డల్ని అద్భుతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులందరూ పుణ్యమూర్తులే.

– డా.ఎస్ఎల్వి. ఉమామహేశ్వరరావు, త్రిపురాంతకం

ఆ తల్లులే ఆదర్శం

అయోధ్యలోనైనా అరణ్యంలోనైనా భర్త సాన్నిధ్యమే స్వర్గ సమానంగా భావించింది సీతమ్మ. లోకకంటకుడైన రావణసంహారంలో తన వంతు పాత్రను పోషించింది. అలా ఆమెని తీర్చిదిద్దిన జననీజనకులు సునయనా జనకులు. కుంతీదేవి జీవితంలోని ప్రతి అడుగు కష్టమయంగానే సాగినప్పటికీ ఎన్నడూ ధర్మం తప్పలేదు, బిడ్డల్ని పెడదారి పట్టనివ్వలేదు. అందుకే ఆమె మహాత్మురాలు. తన సంతానమైన నరకాసురుడు ధర్మం తప్పినప్పుడు అతణ్ణి సంహరించి లోకరక్షణ గావించిన తల్లి భూదేవి.

పూజ.. పుష్పం..



'చల్లరే శ్రీరామచంద్రునిపై పూలు.. సొంపైన మనసుతో నింపైన బంగారు గంపలతో.. మంచి చంపకములను..' అంటూ దైవాన్ని కీర్తించారు త్యాగరాజస్వామి. ఎంతటి భక్తిభావంతో ఎలాంటి పూలను సమర్పించాలో పదాల రూపంలో ప్రస్ఫుటం చేశారు. పూజ అనగానే ముందుగా స్ఫురించేవి పూలు. పూలు లేని పూజ అసమగ్రంగా తోస్తుంది. అసలు దేవుడికి పూలెందుకు సమర్పించాలంటే.. అది భక్తి వ్యక్తీకరణ. కుసుమాలు ఆహ్లాదాన్ని, ఏకాగ్రతను పెంచుతాయి. మనసును నిలకడగా ఉంచుతుంది. అది పూజకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తుంది. ఏకాగ్రచిత్తంతో చేసే పూజ అంతర్గత శాంతికి, ప్రకృతితో అనుసంధానానికి దారితీస్తుంది.

ఒక్కో దేవుడికీ ఒక్కోరకమైన ప్రసాదం నివేదించినట్లే ఆయా దేవుళ్లకు ఇష్టమైన కుసుమాలు కూడా వేర్వేరుగా ఉంటాయి. వినాయకుడు అనుకూల శక్తులకు అధిదేవత. ఆ శక్తులను ఎరుపు, గులాబీ, నారింజ రంగులు పెంపొందింపజేస్తాయి. అందువల్ల మందార, గన్నేరు తదితర సుమాలు ఆయనకు ఇష్టం. జీవులకు శక్తి, ఉత్సాహం, ఆశ, ఆనందాలను వృద్ధిచేసే బాధ్యత స్థితి కారకుడైన విష్ణుమూర్తిది. వీటన్నిటినీ కలిగించే లక్షణం పసుపు వర్ణానికి ఉంది. అందుకే ఆ రంగు ఆ స్వామికి ఇష్టమని, పసుపు పూలతో పూజిస్తే సిరిసంపదలను ప్రసాదిస్తాడని నానుడి. వీటితోపాటు మల్లె, మొల్ల, జాజి, సంపెంగ, మెట్టతామర పూలు కూడా విష్ణువుకు ప్రియమైనవే. నీలిరంగుకు చెడు శక్తులను తనలో నిక్షిప్తం చేసుకునే గుణం ఉంది. అందువల్ల శనిదేవుడికి శంఖుపుష్పం తదితర నీలిరంగు పూలను సమర్పించాలి.

సరస్వతీదేవికి తెల్లని కుసుమాలు

లక్ష్మి ఐశ్వర్యదేవత. తామర పూలంటే ఆమెకి ప్రీతి. అలాగే ఉత్సాహానికి ప్రతీక అయిన ఎరుపురంగు, జీవచైతన్యాన్ని పెంపొందించే లేతరంగు కుసుమాలు కూడా లక్ష్మీదేవికి ఇష్టం. జ్ఞానానికి ప్రతీకలైన మొదుగుపూలు, స్పష్టత, స్వచ్ఛతలకు చిహ్నాలైన తెల్లని కుసుమాలు చదువులతల్లి సరస్వతీదేవికి ప్రియమైనవి. ఎరుపు రంగు ధైర్యం, సాహసం, ఉత్సాహం, ఉద్వేగాలకు ప్రతీక. దుష్టశిక్షణ చేసే కాళీమాతకు ఎరుపురంగు పూలు ఇష్టమైనవిగా చెబుతారు. పాపిట సింధూరం ధరించి, తన సౌభాగ్యాన్ని కాపాడే రంగు అదేనని చెప్పింది సీతాదేవి. అందువల్ల హనుమంతుడు ఆ రంగును రాముడికి ప్రతీకగా భావించాడని, ఆ వర్ణం ఆయనకు ప్రీతికరమని విశ్వసించి సింధూరవర్ణ పూలతో పూజిస్తారు.

మహేశ్వరుడికి శంఖుపుష్పం

శ్రీకృష్ణుడికి పారిజాతాలంటే చాలా ఇష్టం. బృందావనంలో కదంబ వృక్షాల కింద ఆటపాటలతో గడిపినందున ఆ స్వామికి బంతిపూలను తలపించే కదంబ పుష్పాలంటే కూడా మక్కువ ఎక్కువ. పురాణ కథను అనుసరించి.. పరమశివుడు గరళం తాగి స్పృహ కోల్పోయిన సమయంలో ఉమ్మెత్తపూవు ఆయనకు సపర్యలు చేసిందట. అందువల్ల ఆ పూలంటే శివుడికి మహా ఇష్టం. వాటితో పూజ చేస్తే అహం, శత్రుత్వం వంటి గుణాలు నశించి ప్రశాంతమైన జీవితం ఏర్పడుతుంది. అలాగే చెడు శక్తులను తనలో నిక్షిప్తం చేసుకుని సత్ఫలితాలనిచ్చే గరళకంఠుడికి నీలిరంగు పుష్పాలు ఇష్టం. మహేశ్వరుణ్ణి శంఖుపుష్పం, తెల్ల జిల్లేడు, ఉమ్మెత్త పూలతో పూజిస్తే.. సంపదలు కలుగుతాయి.

ఈ పూలు పూజకు అనర్హం

మొగలి, బంతి, కేతకి పుష్పాలు పూజకు పనికిరావు. వీటికి శాపం ఉందనేది పురాణ కథనం. యజమాని అనుమతి తీసుకోకుండా వారి ఇళ్ల లేదా తోటల నుంచి కోసిన, కింద పడిన, వాసన చూసిన, కడిగిన, ఎడమచేత్తో కోసిన, రేకలు విడదీసిన, వాడిపోయిన, పాడైపోయిన, పొరబాటునైనా ఒకసారి ధరించిన కుసుమాలను పూజకు ఉపయోగించకూడదని పౌరాణిక గ్రంథాలు పేర్కొన్నాయి. ఒక్క పారిజాత పుష్పం మాత్రం చెట్టు నుంచి కొయ్యకుండా నేల రాలిన తర్వాత సేకరించి పూజించాలి. పారిజాత చెట్టును శ్రీకృష్ణుడు స్వర్గం నుంచి తీసుకొచ్చాడని, ఈ దేవతా వృక్షం నుంచి పూలు కోయకూడదని పెద్దలు చెబుతారు. అందంగా, ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ మునుపెన్నడూ తెలియని పూలను పూజకు వినియోగించకూడదు. ఇలాంటి పూలతో పూజించినా ఆ పూజ ఫలితాన్నివ్వదు.

తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల తర్వాత పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్వామివారికి పాదాల నుంచి హృదయం వరకూ వివిధ రకాల పూలను శాస్త్రోక్తంగా సమర్పిస్తూ పూజించే ప్రక్రియనే పుష్పయాగం అంటారు. ఆ ఏడుకొండల స్వామికి ప్రతి గురువారం సాయంకాల పూజానంతరం ఆపాదమస్తకం పూల దండలతో అలంకరించి పూలంగిసేవ చేస్తారు. మంత్రాలనే పుష్పాలుగా చేసుకుని భగవంతుని ఆకారం, రూపం, స్థితి, ప్రత్యేకతలు, ఇచ్చే ఆశీస్సులు మొదలైన అంశాలను స్తుతించడమే మంత్రపుష్పం. చేతినిండా కుసుమాలతో వేద మంత్ర పఠనం చేస్తారు కాబట్టి దీనికి మంత్రపుష్పం అనే పేరు స్థిరపడింది. తర్వాత మనసులోని కోరికలను వ్యక్తీకరిస్తూ పుష్పాలను భగవంతుడికి సమర్పిస్తారు. దైవం మనకు ప్రసాదించిన అనేక సంపదలు, ఆశీస్సులకు ప్రతిగా కృతజ్ఞతలు తెలపడమే మంత్రపుష్ప పఠన ఉద్దేశం. కేరళ వాసుల ఓనం పండుగలో వివిధ ప్రాంతాల నుంచి అనేక రంగుల పువ్వులను సేకరించి తివాచీలా అమర్చడం ఆనవాయితీ. బతుకమ్మ పండుగలో పూల అమరిక, అలంకరణలదే ప్రధాన పాత్ర. సంక్రాంతి పండుగలోనూ ఇళ్లూ వాకిళ్లూ, ద్వారబంధాలు, ముంగిళ్లు, అరుగులు.. ఎటు చూసినా పుష్పాలు శోభిస్తూ భక్తిని ప్రేరేపిస్తాయి. అయ్యప్ప పడిపూజ, గౌరమ్మ సంబరాలు, వీరభద్రుని వేడుకలు.. ఏ ఆధ్యాత్మిక సందర్భమైనా పూలకే పెద్దపీట.

దైవానికి పువ్వులు సమర్పించడం అంటే.. హృదయాన్ని నివేదించడమే. భగవంతుడికి ఏమిచ్చినా తక్కువేనన్న అపారభక్తితో దైవికమైన పూలను అర్పించి కృతజ్ఞతను చాటుకుంటాం.

– శ్రీనివాసాదిత్య కార్తికేయ

మాతృభక్తి.. మహావిష్ణు సేవ!

జులై 29 గరుడపంచమి



మాతృభక్తికి, మహావిష్ణువు సేవకు పరమ నిదర్శనం గరుత్మంతుడు. స్వర్గంలో పోరాడి అమృతాన్ని తెచ్చి తల్లిని దాస్యంనుంచి విడుదలచేశాడు. తను మాత్రం బిందువైనా సేవించ లేదు. గరుడుడి సాహస త్యాగాలకు విష్ణువే ఆశ్చర్యపోయి.. వాహనంగా చేసుకున్నాడు. త్యాగగుణం ఉంటే భగవంతుడు తన ఆత్మీయభక్తుడిగా భావిస్తాడనటానికి ఇది తార్కాణం. విష్ణుమూర్తి జరిపిన శిష్టరక్షణ, దుష్ట శిక్షణలో గరుత్మంతుడి సహకారం అనన్యసామాన్యం. గరుడుడు వేద స్వరూపుడని ధర్మ గ్రంథాలు కీర్తించాయి. గీతలో కృష్ణుడు విష్ణువాహన మైన గరుత్మంతుడు తానేనని స్పష్టం చేశాడు.



గరుత్మంతుడి ప్రస్తావన రామాయణంలోనూ కనిపిస్తుంది. ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రానికి రామలక్ష్మణులు మూర్ఛపోయారు. అప్పుడు దేవలోకం నుంచి గరుత్మంతుడు మహాప్రభంజనంలా ప్రత్యక్ష మవుతాడు. ఆ ప్రభావంతో రామలక్ష్మణుల నాగ పాశాలన్నీ విడిపోతాయి. పక్షిరాజు స్వహస్తాలతో స్పృశించి ఆ అపూర్వసోదరుల గాయాల్ని మాన్పాడు.

గజరాజరక్షకుడికి గరుడవాహనమై..

శ్రీవేంకటేశ్వరుడి వేడుకల్లో ఆ ఖగరాజుకు ఎంతో ప్రాధాన్యం. తిరుమల బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ తలమానికం. గరుడధ్వజాన్ని ఎగురవేయటం, గరుడ వాహనంపై స్వామిని ఊరేగించటం, పరిసమాప్తి రోజున గరుడధ్వజ అవరోహణ ఆనవాయితీ. ఇలా ఆ కోనేటిరాయడిది, ఖగరాజుది అవినాభావ సంబంధం. భక్తకవి యామునాచార్యులు 'గరుడుడు విష్ణుమూర్తికి దాసుడుగా, సఖుడుగా, వాహనంగా, ఆసనంగా, ధ్వజంగా, ఛత్రంగా, వినసక్రగా సేవలందిస్తున్నాడు' అని కొనియాడాడు. గరుడుని రెక్కలు జ్ఞానవైరాగ్యాలకి ప్రతీకలని తత్వవేత్తలు నిర్వచిస్తారు.

గరుడుడి ఘనతకు దర్పణం గరుడపురాణం. విష్ణువు స్వయంగా ఈ పురాణాన్ని గరుత్మంతుడికి వినిపించాడట. మనం చేసే పాపాలకు పరలోకంలో అనుభవించే శిక్షలకు సంబంధించిందే గరుడపురాణం.

ప్రతి పున్నమికీ వైభవంగా..

తిరుమల బ్రహ్మోత్సవాల్లో గరుడవాహన సేవ అత్యంత ప్రత్యేకం. ఆ పవిత్రమైన రోజు స్వామి గరుడునిపై వైకుంఠమూర్తిగా దర్శనమిస్తాడు. ఆ వాహన సేవ జరిగే రోజున తమిళనాడు శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి బహూకరించిన తులసిమాలలు శ్రీవారికి అలంకరిస్తారు. ఆనందనిలయంలో శ్రీవేంకటేశ్వర మూలవిరాట్టుకు సదా అలంకరించే మకరకంఠి (ఒక కంఠాభరణం), లక్ష్మీహారం, సహస్రనామ మాలల్ని గరుడవాహన సేవ రోజున ఉత్సవమూర్తికి సమర్పిస్తారు. చెన్నైలోని హిందూ ధర్మార్థసమితి నూతనంగా తయారుచేసిన తొమ్మిది గొడుగులను భక్తులు పాదచారులై తిరుమలకు తెచ్చి సమర్పించటం సంప్రదాయం. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లోనే కాకుండా ప్రతి పౌర్ణమికీ తిరుమలలో 'పున్నమి గరుడసేవ' వైభవంగా నిర్వహించటం ఆనవాయితీ.


భగవంతుణ్ణి భక్తులదరికి చేర్చే పుణ్య కార్యకర్త గరుడుడు. త్యాగరాజస్వామి ఆ పక్షిరాజును స్మరిస్తూ 'ఖగరాజు నీ యానతి విని వేగ చనలేదో' అంటూ ఆవేదనచెందితే.. భక్తరామదాసు 'గరుడగమన రారా!' అని ప్రార్థించాడు. అన్నమయ్య బ్రహ్మోత్సవాల్లోని గరుడవాహనసేవ వైభవాన్ని వేనోళ్ల కీర్తించాడు. తమిళనాడు నాచ్చియార్ కోవెలలో ఉత్సవ మూర్తిగా, కర్ణాటక కోలదేవి గ్రామంలోని గరుత్మంతుడి ఆలయంలో మూలమూర్తిగా పూజలందుకుంటున్నాడు. గరుత్మంతుని పూజిస్తే సర్పబాధల నుంచి విముక్తి కలుగుతుందంటారు. శ్రావణశుద్ధ పంచమి గరుత్మంతుడి జన్మదినమని, అమృతభాండం తెచ్చింది ఈరోజేనని తెలియజేసే పౌరాణిక కథలున్నాయి.

– బి.సైదులు

జులై 26 అన్నవరం సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవం

బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ఏకీకృత స్వరూపంగా పంపానదీ తీరంలో రత్నాచలంపై సత్యనారాయణస్వామి కొలువైన అన్నవరం పుణ్యక్షేత్రం భక్తుల పాలిట పెన్నిధి. అన్నవరం అంటే అడిగిన వరాలను (అనిన వరం) ఇచ్చేదని అర్థం.

వరాలిచ్చే అన్నవరం స్వామి



స్థలపురాణాన్ని అనుసరించి మేరుపర్వతం, ఆయన భార్య మేనక శ్రీమహావిష్ణువు గురించి చేసిన తపస్సు ఫలించి భద్రుడు, రత్నకుడు అనే పుత్రులు కలిగారు. విష్ణుభక్తులైన వారి తపోఫలంగా ఒకరు భద్రాచలంగా, మరొకరు రత్నాచలంగా మారారు. 'మూలతో బ్రహ్మ రూపాయ, మధ్యతశ్చ మహేశ్వరం, అథతో విష్ణు రూపాయ త్రైక్య రూపాయతే నమః' అన్నారు. కనుక కిందిభాగాన్ని బ్రహ్మస్వరూపంగా, మధ్యభాగాన్ని పరమేశ్వరునిగా, పైభాగాన్ని విష్ణురూపంగా భక్తులు ఆరాధిస్తారు. సత్యనారాయణ స్వామి వారికి ఒక పక్కన అనంతలక్ష్మి, మరో పక్కన పరమశివుడు ఉంటారు. ఖరనామ సంవత్సరం శ్రావణ మాసం శుక్లపక్ష విదియనాడు స్వామి అంకుడుచెట్టు కింద ఆవిర్భవించినందున.. అన్నవరం పుణ్యక్షేత్రంలో ప్రతీ సంవత్సరం శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భావ దినోత్సవం ఘనంగా వేడుక చేస్తారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకం, ప్రాకారసేవ, గ్రామోత్సవం వంటి అనేక విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులు అసంఖ్యాకంగా అన్నవరం దివ్యక్షేత్రాన్ని దర్శించుకుంటారు. ఆలయ ప్రాంగణంలో రామాలయం, వనదుర్గ ఆలయం, వ్రత మండపాలు ఉన్నాయి. రాములువారు అన్నవరం ఆలయానికి క్షేత్ర పాలకులు. వనదుర్గ అమ్మవారు ఆలయ భద్రత కోసం రాత్రి వేళల్లో పహరా కాస్తుందని విశ్వసిస్తారు. ఈ మండపాల్లో సత్యనారాయణస్వామి వ్రతం చేసుకోవడం పుణ్యప్రదంగా భావిస్తారు. ఈ వ్రతంతో పుణ్యం-పురుషార్థం, భక్తి-ముక్తి కలుగుతాయి. లక్ష్య సాధనకు అవసరమైన మానసిక బలాన్ని సమకూర్చి మన జీవితాలను సుసంపన్నం చేస్తుంది.

ఈ ఆలయంలో ఇచ్చే ఎర్ర గోధుమనూక ప్రసాదం అమృతాన్ని తలపిస్తుంది, ఇదెంతో ఖ్యాతి పొందింది. అలాగే ఈ పుణ్యక్షేత్రంలో ప్రతిరోజూ ఆయుష్ హోమం నిర్వహిస్తారు. ఇందులో పాల్గొని సత్ఫలితాలను పొందామని ఎందరో భక్తులు చెబుతుంటారు. సూర్యుడి గమనం ఆధారంగా సమయాన్ని తెలిపే పలభా యంత్రం ఇక్కడి ప్రత్యేకత.– శ్రీకాంత్ శ్రీగిరి

వ్యాసరాయలు ప్రతిష్ఠించిన విగ్రహాలు



అనంతపురం జిల్లాలో నేమకల్లు, కసాపురం, మురడి ఆంజనేయ స్వామి ఆలయాలు జులై 26 నుంచి ఆగస్టు 23 వరకు నిర్వహించే శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. శ్రావణమాసంలో మంగళవారం లేదా శనివారం నాడు ఈ మూడు ఆలయాలనూ ఒకే రోజున దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు.

చారిత్రక ప్రాశస్త్యం

నేమకల్లు, మురడి, కసాపురం గ్రామాల్లో ఆంజనేయస్వామి విగ్రహాలను విజయనగర సామ్రాజ్య రాజగురువైన వ్యాసరాయలు ఒకే రోజున ప్రతిష్ఠించారని చరిత్రకారులు చెబుతున్నారు. కృష్ణదేవరాయలు కర్ణాటకలోని హంపి నుంచి బయల్దేరి నేమకల్లు కొండల్లో సేద తీరడానికి వచ్చారని, ఆయనకు 'ఖుహు' దోషం (ఇది చతుర్దశితో కూడిన అమావాస్యనాడు పుడితే వచ్చే అరుదైన కాలదోషం) ఉండటంతో విరుగుడు కోసం నేమకల్లు, మురడి, కసాపురం గ్రామాల్లో మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను వ్యాసరాయలతో ప్రతిష్ఠాపన చేయించారని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. రాయల పరిపాలనకు అద్దం పట్టేలా శిల్పకళలతో ఈ ఆలయాలు అలరారుతున్నాయి.

ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అనంతపురం జిల్లా కేంద్రానికి నేమకల్లు 120 కి.మీ, మురడి 115 కి.మీ, కసాపురం 90 కి.మీ.ల దూరంలో ఉన్నాయి. ఈ శ్రావణమాసంలో వచ్చే ఐదు శనివారాలు, నాలుగు మంగళవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అసంఖ్యాకంగా వస్తారు. గత ఏడాది నవంబర్ 30న నారా చంద్రబాబు నాయుడు నెమకల్లు ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధికి మూడు కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. ఆయన ప్రతిపక్ష హోదాలో ఒకసారి, ముఖ్యమంత్రి అయ్యాక మరోసారి ఆలయాన్ని సందర్శించడం విశేషం. అనంతపురం జిల్లాలోని అన్ని డిపోలు, కర్ణాటకరాష్ట్రం బళ్లారి ఆర్టీసీ డిపోల నుంచి హనుమాన్ దర్శన్ కింద ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఆధ్యాత్మిక సాధనలతో అత్యధిక ఫలితం



ఆషాఢమాసం చివరి రోజును చుక్కల అమావాస్య అంటారు. ఇది చిక్కులను దూరం చేస్తుందని, ఈ రోజు చేసే ఆధ్యాత్మిక సాధనలతో అత్యధిక ఫలితం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. లక్ష్మీప్రదమైన శ్రావణమాసం ప్రారంభానికి ముందు వచ్చే అమావాస్య కనుక ఈ రోజు సాయంసంధ్యా సమయంలో లక్ష్మీ అమ్మవారి ముందు వీలైనన్ని ఎక్కువ దీపాలను వెలిగిస్తారు. ఇలా ధూప దీపాలతో పూజిస్తే శుభ ఫలితాలు కలుగుతాయని విశ్వసిస్తారు. ఈ రోజున గౌరీవ్రతం చేస్తారు. పితృదేవతలను స్మరించుకుంటారు.

ఆషాఢ అమావాస్య తెల్లవారి నుంచి శ్రావణమాసం మొదలవుతుంది. తమకు తగిన వరుడితో వివాహం జరగాలని కోరుకుంటూ శ్రావణమాసానికి ముందు రోజున పెళ్లికాని అమ్మాయిలు గౌరీదేవిని పూజిస్తారు. బియ్యప్పిండితో చేసిన కుడుములను అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అమ్మవారి రక్షా కంకణాన్ని ధరిస్తే త్వరలోనే పెళ్లవుతుందని విశ్వసిస్తారు. ఈ రోజున కన్యలు, కొత్త కోడళ్లు చుక్కల అమావాస్య నోము నోచుకుంటారు. అమ్మవారి ముందు వంద చుక్కలు పెట్టి వాటి మీద వంద దారపు పోగులను ఉంచుతారు. వాటిని ఒక దండగా అల్లి, ధరిస్తారు. ఈ రోజున గోమాతకు అరటిపండ్లు, ఇతర గ్రాసం తినిపించి ప్రదక్షిణ చేసుకుంటే కోరికలు నెరవేరతాయని పెద్దలు చెబుతారు.

పూజలు, పెళ్లిళ్లతో ఆధ్యాత్మికత, ఆనందాలు వెల్లివిరిసే శ్రావణమాసం జులై 25న ఆరంభమవుతుంది. నోములు, వ్రతాలు, పేరంటాలతో సందడి చేస్తుందీ మాసం. శ్రావణంలో రాఖీపౌర్ణమి, కృష్ణాష్టమి.. విశేష పర్వదినాలు. నాగ చతుర్థి, గరుడ పంచమి, కల్కి జయంతి, దామోదర ద్వాదశి, జంధ్యాల పౌర్ణమి, శ్రీహయగ్రీవ జన్మోత్సవం, మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం ఈ మాసంలోనే. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం శ్రీమహావిష్ణువు ఎన్నో అవతారాలు ఎత్తాడు, ఎన్నో రూపాలు ధరించాడు. వాటిలో హయగ్రీవ రూపం ఒకటి. విష్ణువు దేవకీదేవి గర్భాన శ్రావణ బహుళ అష్టమినాడు రోహిణీ నక్షత్రంలో అర్ధరాత్రి జన్మించాడు. ఆ కృష్ణయ్య లీలలను తలచుకుంటూ శ్రీకృష్ణజన్మాష్టమి వేడుక చేసుకుంటాం. ఈ సందర్భంగా నిర్వహించే ఉట్లోత్సవం ఉత్సాహాన్ని పంచుతుంది. తిరుమలలో ఈ పర్వదినాన్ని ఎంతో వైభవంగా చేస్తారు.

రాగిజావతో జలుబు, ఆస్తమా వస్తాయా?

వర్షాకాలంలో రాగిజావ తాగడం వల్ల జలుబు, ఆస్తమా వస్తాయి అంటున్నారు. నిజమేనా? - ఆదిలక్ష్మి, వైజాగ్

రాగిజావ తీసుకుంటే శరీరానికి చలవ చేస్తుంది. కాబట్టి జలుబు, ఆస్తమా వంటివి వస్తాయి అనుకుంటున్నారు. అది అపోహ మాత్రమే. దీన్ని కాలంతో సంబంధం లేకుండా ఎప్పుడైనా తీసుకోవచ్చు. ముఖ్యంగా వేసవికాలంలో మన శరీరం చెమట ద్వారా చాలా లవణాలను కోల్పోతుంది. ఆ సమయంలో శరీరానికి తక్షణ శక్తిని స్తుంది. అందుకే రాగిపిండిని ముందురోజు రాత్రంతా పులియబెట్టి మరుసటిరోజు ఉదయం మజ్జిగతో కలిపి తీసుకోవాలి. ఇలా పులియబెట్టడం వల్ల దానిలో సహజసిద్ధంగా మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇవి మనలో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రాగిజావ తాగడం వల్ల శరీరానికి కావాల్సిన ఐరన్, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, బి కాంప్లెక్స్ వంటి పోషకాలు పుష్కలంగా అందుతాయి. ఒకవేళ వర్ష, శీతకాలాల్లో దీన్ని తీసుకున్నప్పుడు జలుబు చేస్తోంటే మజ్జిగతో కాకుండా పాలు కలిపి వేడిగా తీసుకోవాలి. దీనివల్ల పిల్లలూ, పెద్దలూ ఆరోగ్యంగా ఉంటారు.

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

రోజుకి ఎంత చక్కెర?

ఈమధ్య ఆహారంలో ఆయిల్, చక్కెరలు తగ్గించమని చెబుతున్నారు కదా... మన రోజువారీ ఆహారంలో వీటిని ఏ మోతాదులో తీసుకోవాలి? - ఓ సోదరి

అవును నిజమే తగ్గించాలి. మన దేశంలో ఊబకాయం పెరుగుతోంది. దీంతో మధుమేహం, గుండె జబ్బులు పెరుగుతున్నాయి. లివర్ ఫెయిల్ అవ్వడం, బ్రెయిన్ స్ట్రోక్ రావడం, హార్మోనుల్లో హెచ్చుతగ్గులు, సంతాన లేమి సమస్యలూ పెరుగుతున్నాయి. దీంతో చాలామంది ఆసుపత్రి పాలవుతున్నారు. అంతేకాదు, మందుల వినియోగం కూడా పెరిగిపోతోంది. రోజువారీ ఆహారంలో చక్కెర 20గ్రా., ఆయిల్ 4-5 చెంచాలకు మించకూడదు. ఆహారాన్ని నేరుగా చక్కెర రూపంలో తినకపోయినా, మారిన మన ఆహారపు అలవాట్లతో దానికి మించే తీసుకుంటున్నాం. దీనికితోడు ఈజీ టు ఈట్ ఫుడ్స్‌కే ఎక్కువ అలవాటు పడిపోయాం. ఇవన్నీ ఎక్కువ షుగర్, ఫ్యాట్‌తో కూడుకున్నవే. ఉదాహరణకి చాక్లెట్లు, సాఫ్ట్‌డ్రింక్స్, కేక్ వంటి వాటిల్లో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. ఇవి తింటే ఆరోగ్యానికి చేటు. ఇక నూనె విషయానికొస్తే డీప్ ఫ్రై, వేపుళ్లు తింటే మోతాదుకు మించి శరీరంలో కొవ్వులు పెరుగుతాయి. అందుకే ఎక్కువ ఆయిల్‌తో చేసే వంటకాల్ని అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవాలి. ఇలా తీసుకుంటే శరీరంలో అనవసరపు కొవ్వులు పేరుకోకుండా ఉంటాయి. ఆరోగ్యంగానూ ఉండొచ్చు.

వసుంధర

vasundhara@eenadu.in

నింగిలో 'గోల్డెన్ గర్ల్'

ఆకాశంలో విమానం... ఎలా ఎగురుతుంది? ఎవరు నడుపుతారు? ఈ ప్రశ్నలే ఆ చిన్నారికి ఆకాశంలో ఎగరాలనే కోరికని కలిగించాయి. నింగిలో 7వేల గంటలకుపైగా విమానం నడిపి తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేలా చేశాయి. ప్రస్తుతం ఈమె డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఇన్‌స్పెక్టర్ కూడా. ఫ్లైట్ ఆపరేషన్స్‌ని పరిశీలించడమే కాదు, విమానంలో అత్యవసర పరిస్థితులను పైలట్లు ఎలా ఎదుర్కోవాలో శిక్షణిచ్చే స్థాయికి చేరుకున్నారు కెప్టెన్ పూనమ్ దేవరాఖ్యానీ.



పూనమ్

భోపాల్‌లోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగారు పూనమ్. అక్కడే ఏవియేషన్‌లో డిగ్రీతోపాటు, ఏరోస్పేస్ ఏవియేషన్‌లో ఎంబీఏ పూర్తిచేశారీమె. తనకి ఓ తమ్ముడు... విజయ్. అతను పుట్టుకతోనే 98శాతం లోకో మోటార్ డిజేబిలిటీ, సెరిబ్రల్ పాల్సీతో బాధపడేవాడు. దాంతో ఆమె తండ్రి సంపాదన అంతా వైద్య ఖర్చులకే సరిపోయేది. చిన్నప్పటి నుంచి పూనమ్‌కి పైలట్ అవ్వాలనే కోరిక. 'ఆ విషయాన్ని నాన్నకి చెబితే... 'పూటగడవని పరిస్థితులు మనవి. ఒకసారి ఆలోచించు మనలాంటివాళ్లకు సాధ్యమేనా? పైగా ఆడపిల్లవి కష్టం' అన్నారు. దాంతో నా చదువు నాన్నకి ఆర్థిక భారం కాకూడదనుకున్నా. జెట్ ఎయిర్‌వేస్‌లో పార్ట్ టైమ్ జాబ్ చేసేదాన్ని. అక్కడ పని చేస్తుంటే ఎందుకో తెలీదు నా కలలకి దగ్గరున్నట్లుండేది. రాత్రుళ్లు విమానాల మధ్యలో కూర్చునే చదువుకునేదాన్ని. అలా నా సొంత డబ్బుతోనే కొన్నాళ్లకి పైలట్ అయ్యా. మొదటిసారి కాక్‌పిట్‌లో కూర్చుని గాల్లో ఎగురుతుంటే చిన్నప్పుడు డాబా మీద కూర్చుని కలలుగన్న రోజులు గుర్తొచ్చాయి' అంటారు పూనమ్. 2019లో జెట్ ఎయిర్‌వేస్ మూసివేతకు దగ్గరగా ఉన్నప్పుడు కొన్ని నెలలపాటు ఖాళీ విమానాలు నడుపుతూ జీతం లేకుండా కూడా పనిచేశారట. తర్వాత అనేక సంస్థల్లో పనిచేసి 2021లో డీజీసీఏ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. తన మొత్తం ప్రయాణానికి స్ఫూర్తి మాత్రం ఆమె తమ్ముడేనట. 'సమస్యల్లో ఉన్నప్పుడు ఎలా ధైర్యం తెచ్చుకోవాలి? వాటినే లక్ష్యాలుగా ఎలా మార్చుకోవాలనేది తన దగ్గరే నేర్చుకున్నా. ఎందుకంటే వైకల్యంతో బాధపడుతూనే అత్యధిక దూరం జిప్‌లైన్‌ను నడిపిన వ్యక్తిగా విజయ్ రికార్డు సృష్టించాడు. ఆసియా, ఇండియా, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించాడు. అందుకే ఏదైనా సమస్య వస్తే ధైర్యం కోసం వెంటనే తననే గుర్తుచేసుకుంటా' అంటారు పూనమ్.

ఆపదలో ఎలా కాపాడాలో తెలియాలి...

'డీజీసీఏలో ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నంత సేపూ చాలా ఏకాగ్రతతో ఉండాలి. ఆకాశంలో ఎగిరే ప్రతి విమానాన్ని పర్యవేక్షిస్తుండాలి. పైలట్ కూడా అలర్ట్‌గా ఉండాలి. వందల మంది ప్రాణాలు మన చేతిలోనే ఉంటాయి. ఓసారి దోహా నుంచి వస్తుండగా విమానంలో కార్గోడోర్ అలర్ట్ కారణంగా టేకాఫ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. మరోసారి విమానాన్ని గాల్లోనే ఉంచి రిపేరు చేశాం. ఇంకోసారి ఇంజిన్‌లో మంటలు చెలరేగగా... మేము వెంటనే చెక్‌లిస్ట్‌ను తీసుకుని దగ్గర్లో ఉన్న ఎయిర్‌పోర్టులో విమానాన్ని ఆపేశాం. ఒక పైలట్ ఇలాంటి సందర్భంలో ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవడం చాలా కష్టం. అందుకే ప్రతి ఆరునెలలకు ఓసారి పైలట్లకు శిక్షణ ఇస్తుంటాం. ఈ ప్రక్రియ రెండు రోజులు జరుగుతుంది. ప్రామాణిక ఆపరేటింగ్ విధానాల్లో నావిగేట్, ఏవియేట్, కమ్యూనికేట్ చేయడం... ఈ మూడు అంశాలను తప్పక నేర్పుతాం. నావిగేట్ అంటే ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవడం, ఏవియేట్ చేయడం అంటే విమానాన్ని నడపడం. కమ్యూనికేట్ అంటే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌తో టచ్‌లో ఉండటం. వీటితోపాటు ఇంజిన్ వైఫల్యం నుంచి క్యాబిన్ ప్రెజర్ సమస్య వరకూ అన్నీ తెలిసి ఉండాలి. విమానంలో సమస్యలు వేటికవే భిన్నంగా ఉంటాయి. ఏ సమస్య వచ్చినా రక్షణచర్యలు చేపట్టాల్సిన బాధ్యత పైలట్ చేతుల్లోనే ఉంటుంది' అంటారీమె. విమానయాన రంగంలో ఉత్తమ సాంకేతిక నైపుణ్య సేవలు అందించినందుకుగానూ పౌర విమానయాన మంత్రిత్వ శాఖ 37మంది మహిళలకి గతేడాది అవార్డులు అందించింది. అందులో పూనమ్ 'యంగ్ ఉమన్ ఏవియేషన్ లీడర్' అవార్డుని అందుకున్నారు. విమానయాన రంగంలో ఆమె సాధించిన ఈ విజయాలే... 'గోల్డెన్ గర్ల్' అన్న బిరుదును తెచ్చిపెట్టాయి.

ఆలోచనలు ఇబ్బంది పెడుతుంటే..!



'పనులన్నీ పూర్తిచేసుకుని పదిగంటలకే నిద్రపోయేందుకు ప్రయత్నిస్తున్నాం'... స్లీప్ షెడ్యూల్ సరిగా ఉందా? అన్న ప్రశ్నకు చాలామంది మహిళల సమాధానం ఇలాగే ఉంటుంది. కానీ, పదికే బెడ్ ఎక్కినా... నిద్ర పట్టేది మాత్రం ఏ పదకొండుకో, పన్నెండుకో. కొంతమందికైతే అది కూడా కలత నిద్రే. మళ్లీ ఉదయం లేచిన దగ్గర్నుంచీ ఉరుకులు, పరుగులే. వీటన్నింటికి కారణం ఆలోచనలే. అవి ఒక్కసారి మొదలయ్యాయంటే... ఆ ప్రవాహంలో కొట్టుకుపోవాల్సిందే. కాసేపటికి ఎక్కడ, ఎందుకు, ఎలా ప్రారంభం అయ్యాయో కూడా చెప్పడం కష్టమవుతుంది. ఒకదానికి ఒకటి ముడిపెడుతూ ఎక్కడ్నుంచి ఎక్కడికో వెళ్లిపోవడం వాటి ప్రత్యేకత. అయితే, అనవసరమైన విషయాలు ఆలోచిస్తున్నామా అంటే... కాదు. అవసరమైనవే... కానీ అప్రస్తుతమైనవి. నిజమేగా మరి! రేపు ఉదయం అల్పాహారం ఏం చేయాలో... నిద్రపోయేముందే ఆలోచించాలా చెప్పండి? ఎల్లుండి ఆఫీస్‌లో ఇచ్చే ప్రాజెక్టు, కాలేజీ పరీక్షలు ఇవన్నీ అప్పటికి అప్రస్తుతమైనవే కదా. వీటిన్నింటివల్లా నిద్రకి ఆటంకం. పైగా నిద్రపోయేటప్పుడు మనం ఏవైతే ఆలోచిస్తామో... అవే కలలుగా వచ్చి కలత నిద్రను మిగులుస్తాయి. పర్యవసానంగా జీవగడియారం దెబ్బతింటుంది. మానసిక ఒత్తిడి, ఆందోళన, లేనిపోని శారీరక, మానసిక సమస్యలన్నీ తలుపుతడతాయి. అందుకే వీటిని నియంత్రించడం తప్పనిసరి. అందుకు ఏం చేయాలంటే... అనవసరమైన విషయాలు ఆలోచిస్తున్నా అనుకున్నప్పుడు వెంటనే లేచి చల్లటి నీళ్లు ముఖంపై చల్లుకోండి. ధ్యాస మళ్లడానికి సంగీతం వినండి. లేదా లేచి నడవండి, పక్కవారితో మాట్లాడండి. దాంతో ఆలోచనలు ఆగుతాయి. లేదా మీకు నచ్చిన సంఘటనలు, స్థలాలు, మీ విజయాలు వంటివి గుర్తుచేసుకోండి. ఇవన్నీ హ్యాపీ హార్మోన్లను విడుదల చేస్తాయి. మంచి నిద్రకు కారణమవుతాయి. పాటిస్తారుగా మరి!

వాళ్లు చెప్పారని కొనొద్దు!



'వావ్... చూశారా నా ముఖం ఎంత మెరుస్తోందో. ఈ మాయంతా ఈ క్రీమ్‌దే' 'మొటిమలు రెండు రోజుల్లోనే మాయం... రహస్యమేంటో తెలియాలా... కామెంట్ చేయండి'... సోషల్‌మీడియాలోకి అడుగుపెట్టడం ఆలస్యం, ఇలాంటి వీడియోలు, రీల్స్ ఎన్నో కనిపిస్తాయి కదూ! సమస్య మనకు సంబంధించిందే అనుకోండి. వెంటనే మెసేజ్ చేస్తాం. ఆ క్రీమ్, ఉత్పత్తులను తెప్పించుకుంటాం. తీరా అవి పని చేయకపోతే? డబ్బు వృథానేగా! అందుకే....

దేశంలో బాగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో 'బ్యూటీ, ఫిట్‌నెస్' తప్పక ఉంటాయి. ఎక్కువ కొనుగోళ్లు జరిగేది ఎక్కడో తెలుసా? సోషల్ మీడియా ద్వారానే అంటున్నాయి అధ్యయనాలు. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావమే ఇదంతా. మన సమస్యకి పరిష్కారం దొరుకుతోంది, పైగా అవతలివాళ్లు వాడారు కాబట్టి, రుజువూ ఉందని సంబర పడుతున్నాం కానీ... మనకు నప్పేదేనా అని ఆలోచించడం లేదు. కాబట్టే, అనవసర వృథా లేదా కొత్త సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నాం. అలా జరగొద్దంటే కొనే ముందు కొన్ని ప్రశ్నలు వేసుకోండి.

ఎవరామె?

పేరున్న ఇన్‌ఫ్లుయెన్సర్, లక్షల్లో ఫాలోయర్లు... ఇవి మాత్రం ప్రామాణికం కాదు. సంబంధిత రంగంలో ప్రావీణ్యం ఉందా? నిపుణురాలా అన్నది చూసుకోండి. గతంలో ఎలాంటి ఉత్పత్తులను ప్రమోట్ చేశారు? అది చూసి ఎవరైనా వాడారా? వాడామన్నట్లు కామెంట్లు ఏమైనా పెట్టారా, వాళ్ల స్పందనేంటి అనేవి చూసుకోవాలి. ఇక్కడే కాదు, భిన్న వెబ్‌సైట్లలో రేటింగ్, కామెంట్లు చూసుకోవాలి.

ఇవి కలిశాయా!

అవును... ఆమెదీ మీదీ ఒకే చర్మతత్వమా? ఒకేలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారా? ఉదాహరణకు మీది పొడిచర్మం... తనదేమో ఆయిలీ అయితే ఆ ఉత్పత్తి మీకు పనిచేయాలని లేదు కదా! ఇంకా వాతావరణం, జీవనశైలి, పడని అంశాలంటూ బోలెడు చెక్ చేసుకోవాలి. కొన్ని దేశాలు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొన్ని పదార్థాలను బ్యాన్ చేస్తుంటాయి. లేదా కొన్ని ముందు ప్రభావం చూపినా దీర్ఘకాలంలో హాని కలిగించొచ్చు. మరి వీటి సంగతేంటి? అవీ చూసుకోవాలి.

బడ్జెట్ మాటేంటి?

ఆ ఉత్పత్తి మీ బడ్జెట్‌లోనే వస్తోందా? సమస్య తీరుతున్నంత మాత్రాన ఎంత ఖర్చైనా భరించాల్సిన పనిలేదు. అదే గొప్పదని భావించాల్సిన అవసరమూ లేదు. ఇన్‌ఫ్లుయెన్సర్లు చెప్పినంత మాత్రాన అదే గొప్పది కాదు. దానికి తక్కువలో ప్రత్యామ్నాయాలు బోలెడుంటాయి. పోనీ వాటిని వెతకండి. చాలావరకూ ఇన్‌ఫ్లుయెన్సర్లు సంస్థలతో కలిసి పనిచేస్తారు. ఒకరకంగా వారి ఉత్పత్తులకు ప్రచారం కల్పిస్తారు. ఇందుకు సంస్థలు వారికి కొంతమొత్తం చెల్లిస్తాయి కూడా. అందుకే ప్రచారంలో భాగంగా చేస్తున్నారా? నిజంగానే రివ్యూ ఇస్తున్నారా అన్నదీ చూసుకోవాలి.

అద్భుతాలుండవు

చివరగా... రెండు రోజుల్లో సమస్య మాయం. అనుకున్న ఫలితం ఖాయం అనగానే ఆశ కలిగి కొనాలనిపించడం మామూలే. కానీ నిజంగా నమ్మాలనిపిస్తోందా? మీకే అనుమానమొచ్చినా ఆగండి. పోనీ ఆశకొద్దీ కొన్నారు. తీరా ప్రయోజనం లేదు. తరవాత సంగతేంటి? తిరిగి ఇచ్చే వీలుందా? అదీ చూసుకోవాలి. ఆ అవకాశం లేకపోయినా ఆగాల్సిందే. డబ్బులు, ఆరోగ్యం... ముడిపడినవి. అంత సులువుగా ఎవరో చెప్పారని నమ్మేయొచ్చా? ఆలోచించే అడుగేయాలి. మరి... గమనించుకుంటారుగా?

మీకు తెలుసా?

సారా బూన్... దుస్తులను ఇస్త్రీ చేసేందుకు వీలుగా ఐరనింగ్ బోర్డ్‌ని కనుగొన్నారీమె. 1892లో దీనికి పేటెంట్‌నీ పొందారు. యూఎస్ పేటెంట్ అందుకున్న మొదటి ఆఫ్రికన్ అమెరికన్ మహిళ కూడా ఈమేనట.

> ఆర్థిక మందగమనం, జనాభాలో వృద్ధుల సంఖ్య పెరగడం, వాణిజ్యపరమైన ఒడుదొడుకులు, సామాజిక నిరసనలు, వాతావరణ మార్పులు... లాంటి సమస్యలు ఎదుర్కొంటున్న దేశాలెన్నో! మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వాళ్లకి నైపుణ్య శిక్షణ ఇస్తే ఇటు ప్రపంచానికీ, అటు మహిళలకూ మేలు జరుగుతుంది!
>
> - గీతా గోపీనాథ్, ఫస్ట్ డెప్యూటీ ఎండీ, ఐఎమ్ఎఫ్



బంగారం - వెండి



23న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,340	94,200	1,19,280
విజయవాడ	1,00,675	93,800	1,19,200
ప్రొద్దుటూరు	99,750	91,770	1,17,800
రాజమహేంద్రవరం	1,02,330	93,800	1,29,000
విశాఖపట్నం	1,01,960	93,800	1,20,000
తమిళనాడు	-----	93,800	1,29,000

గంటల పూలు... సీతాకోక చిలుకలు!



చూడ్డానికి గంటల్లా... లాంతర్లలా కనిపించే ఫ్లవరింగ్ మేపల్ పూల మొక్క... పెంచుకునే ప్రదేశానికి కళ తెచ్చిపెడుతుంది. మరి దీన్ని మన ఇంటి ముందు నాటుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసా?

ఫ్లవరింగ్ మేపల్ మొక్క శాస్త్రీయ నామం అబుటిలాన్ పిక్టమ్. ఇది మాల్వేసి (మాలో) కుటుంబానికి చెందినది. భారతదేశంతో సహా ఉష్ణమండల, ఉప ఉష్ణమండల ప్రాంతాలలో అలంకార మొక్కగా ప్రాచుర్యంలో ఉంది. దీన్నే ఇండియన్ మాలో, చైనీస్ లాంతర్ అనే పేర్లతోనూ పిలుస్తారు. 2-4 సెం.మీ.ల పొడవు, ఐదు రేకలతో పొడవైన కాండాలపై వేలాడుతూ కనిపిస్తాయి. ఇవి దక్షిణ భారత దేశంలో ఏడాది పొడవునా వికసిస్తాయి. పసుపు, ఎరుపు, కాషాయం, తెలుపు... వంటి రంగుల్లో కనువిందు చేస్తాయి. పైన ముదురు ఎరుపు గీతలు పెయింట్ లుక్‌ని తెస్తాయి.

ఇంటి తోట

సంరక్షణ ఇలా...

గుబురుగా పెరిగే ఈ పూల మొక్క చక్కగా ఎదగాలంటే రోజూ 6-8గంటల సూర్యరశ్మి అవసరం. అది నాటుకునే ప్రదేశంలో గాలి బాగా వీచేలా చూసుకోవాలి. పొడిగా ఉండే సారవంతమైన నేలల్లో నాటుకోవాలి. ఆ మట్టిలో కాస్త ఇసుక, కంపోస్ట్ కలిపితే ఆరోగ్యంగా ఎదుగుతుంది. కొత్త కొమ్మలను గిల్లితే... పూలు ఎక్కువగా వస్తాయి. ఎండిపోయిన, చనిపోయిన కొమ్మల్ని ఎప్పటికప్పుడు తొలగించండి. మొక్క ఎదిగేటప్పుడు తప్పనిసరిగా 20:20:20 నిష్పత్తిలో ఎన్‌పీకే సమగ్ర ఎరువుని అందిస్తే పూలు నిండుగా పూస్తాయి.









వ్యాధుల్ని అరికట్టాలంటే...

తేమ ఎక్కువైతే ఈ మొక్కకు వేరు తెగులు వస్తుంది. అందుకే, చుట్టూ ఉన్న మట్టి పొడిగా అయ్యాకే నీళ్లు పోయాలి. తెల్లదోమ, ఆకుతొలుచు పురుగులు దీనికి పడతాయి. వాటి నివారణకు బేకింగ్ సోడా, సబ్బుద్రావణాన్ని ఉపయోగించండి. ఈ మొక్కకు ఔషధ గుణాలు ఎక్కువని... ప్రపంచ వ్యాప్తంగా ప్రాచీన వైద్య విధానాల్లో వాడుతుంటారు. పూలనూ తింటారు. సలాడ్లలో ఉపయోగిస్తారు. తేనె సమృద్ధిగా ఉండే ఈ పూలు హమ్మింగ్ బర్డ్‌లు, తేనెటీగలు, సీతాకోక చిలుకల్ని ఆకర్షిస్తాయి. తోట వైవిధ్యాన్ని మెరుగు పరుస్తాయి.

అక్షర శిక్షకులు



భిక్షాటన చేస్తూ చిన్నపిల్లలు కనిపిస్తే... జాలిపడి ఏదోఒకటి చేతిలో పెట్టేవారే ఎక్కువ. కానీ కనగసభాపతి యువనేశ్వరి, శంకర రమణ మాధవి మాత్రం వాళ్ల భవిష్యత్తును తీర్చిదిద్దాలనుకున్నారు. ఛోటూ కీ ఎడ్యుకేషన్ పేరిట సంస్థను స్థాపించి... భావి పౌరులుగా వాళ్లని తీర్చిదిద్దుతున్నారు.



యువనేశ్వరిది చెన్నై, మాధవిది గుంటూరు. ఇద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. ఓ కార్యక్రమంలో కలిసిన వీళ్ల పరిచయం స్నేహంగా మారింది. అలా వీళ్లోసారి కలిసినప్పుడు షాపింగ్ మాల్ వద్ద భిక్షాటన చేస్తున్న పిల్లలు కనిపించారు. చదువు చెప్పిస్తే వాళ్ల భవిష్యత్తునీ మార్చొచ్చు అన్న ఉద్దేశంతో 'ఛోటూ కీ ఎడ్యుకేషన్' (సీకేఈ) అనే సంస్థను ప్రారంభించారు. మొదట్లో రోడ్డు పక్కనే చిన్న గుడారంలో బోధించేవారు. తరవాత హైదరాబాద్‌లోని నిజాంపేట, మియాపూర్, జీడిమెట్ల, బొల్లారం, పెద్ద అంబరుపేటల్లో సీకేఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 'తొలిరోజుల్లో పిల్లలు చదువుకోవడానికి వెళ్తే డబ్బులు రావని తల్లిదండ్రులు ఒప్పుకొనేవారుకాదు. ఇద్దరం వైద్యరంగంలో పనిచేస్తున్న వాళ్లమే. దీంతో మెడికల్ క్యాంప్‌లూ ఏర్పాటు చేసేవాళ్లం. చాలామంది పిల్లల్ని ఏమైనా చేస్తామేమో... కిడ్నీలు అమ్మేస్తామేమో అని భయపడేవాళ్లు. వాళ్లతో మాట్లాడి, మాపై నమ్మకం కలిగించడానికి చాలానే కష్టపడ్డాం' అంటారీ స్నేహ ద్వయం.

కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులకు ఎదురు డబ్బులిచ్చారు. పూర్తిగా భిక్షాటన మానేయమంటే వినరని... మొదట్లో 2గం. మాత్రమే పాఠాలు చెప్పేవారు. ఉపాధ్యాయులూ దొరికేవారు కాదు. ఎన్నో ప్రయత్నాల తర్వాత వారాంతపు సెలవుల్లో మాత్రం చెప్పడానికి కొందరు ముందుకొచ్చారు. తరవాత నెమ్మదిగా రెగ్యులర్ స్కూలుగా మార్చడమే కాదు, టీచర్లనూ ఏర్పాటు చేశారు. 'ఈ పిల్లలకు పాఠాలు చెప్పడం అంత తేలిక కాదు. ఏదైనా చేయలేదని కోప్పడితే రావడం మానేసేవారు. కొందరు ఒకరోజు వస్తే మరో రోజు రారు. వాళ్ల ఇంటికెళ్లి నచ్చజెప్పి తీసుకురావడం కష్టమయ్యేది. ఇక్కడ 13, 14ఏళ్ల వయసులోనే పెళ్లి చేస్తుంటారు. వాటిని ఆపడానికి ప్రయత్నించినప్పుడూ బెదిరించేవారు. అలాంటప్పుడు పోలీసుల సాయం తీసుకునేవాళ్లం' అంటారు యువనేశ్వరి, మాధవి.

చదువులే కాదు... వంట, క్రీడలు, డ్రాయింగ్ వంటివాటిల్లోనూ శిక్షణనిస్తున్నారు. ప్రతి నెల చివరి శనివారం సంస్థల సాయంతో ఎలక్ట్రికల్ వర్క్, వ్యర్థాల నుంచి పరికరాలను తయారు చేయడం వంటివీ నేర్పిస్తున్నారు. ఏటా సమ్మర్ క్యాంపులను నిర్వహించి స్పోకెన్ ఇంగ్లిష్, స్కిల్ ట్రైనింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వర్క్ వంటివీ నేర్పిస్తున్నారు. ప్రతి రెండు నెలలకూ పిల్లల ఎదుగుదలపై రిపోర్టు తయారు చేస్తారు. దాని ఆధారంగా అవసరమైతే నిపుణుల కమిటీతో మాట్లాడి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. 'ప్రస్తుతం 195 మంది విద్యార్థులున్నారు. మా లక్ష్యం ఒక్కటే... ప్రతి పిల్లాడికి చదివే హక్కుంది. దానికి భిక్షాటన చేసే పిల్లలు మాత్రం ఎందుకు దూరమవ్వాలి? వాళ్లలో కొందరి జీవితాలు మార్చినా చాలన్నదే మా ప్రయత్నం' అంటారీ స్నేహితురాళ్లు.

- రామాంజనేయులు, హైదరాబాద్

మహిళా వెల్డర్లు..!



రాణీ చెన్నమ్మ మహిళా బృందం... పేరుకి తగినట్లు అందరూ యోధులే. కాకపోతే చెన్నమ్మ దేశ స్వతంత్రం కోసం ఆంగ్లేయులతో యుద్ధం చేస్తే... వీళ్లు సంప్రదాయ పని విధానాలు, ఆలోచనలతో పోరాడారు. గాజు తెరల్ని బద్దలుకొట్టి వెల్డింగ్ వృత్తిలో రాణిస్తున్నారు. వీళ్ల గురించి తెలియాలంటే...

34 ఏళ్ల సుచితది ఉడిపికి సమీపంలోని ఉచిలా గ్రామం. బి.కామ్ చదువుకుంది. మంచి ఉద్యోగం చేయాలన్నది ఆమె కల. కానీ స్థానికంగా ఏ అవకాశాలు రాక... ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసేది. '2024లో ప్రాజ్, జెన్ ఎక్స్ కంపెనీ మహిళా వెల్డర్లు కావాలని ఓ ప్రకటన విడుదల చేసింది. తెలియని రంగమే... కానీ మంచి జీతం, కొత్త పని నేర్చుకునే అవకాశం ఉంటుందన్న ఆశతో ఇంటర్వ్యూకి వెళ్లాను. ఎంపిక చేసుకున్నారు. మొదట్లో చాలా భయపడ్డాను. తోటి వాళ్లను చూశాక, నాకు ధైర్యం వచ్చింది' అంటారు సుచిత. అనిషాది కూడా అక్కడికి దగ్గర్లో ఉన్న పడుబిద్రి. డిగ్రీ పూర్తిచేసి, ఫొటోగ్రాఫర్‌గా స్థిరపడింది. 'స్నేహితుల ద్వారా ఈ అవకాశం గురించి తెలిసింది. కానీ నిప్పురవ్వలంటే భయం నాకు. వెళ్లాలా వద్దా అని ఆలోచించా. వెనకడుగు వేయడం ఇష్టం లేక చేరాను' అంటారీమె. కటింగ్ అండ్ డ్రిల్లింగ్ విభాగంలో పనిచేస్తోంది అనిషా. ప్రజ్ఞ బెంగళూరులోని సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేసింది. కానీ తను ఎంపిక చేసుకున్న రంగంలో సరైన అవకాశాలు లేక చిన్న చిన్న వెల్డింగ్ పనులు చేస్తుండేది. 'చదువు పూర్తయ్యాక ఈ రంగంలో పనికోసం చాలా ప్రయత్నాలు చేశాను. 'అమ్మాయివి, ఇక్కడ నువ్వేం చేస్తావు' అన్నవాళ్లే ఎక్కువ. కానీ ప్రాజ్ మాలో ప్రతిభను చూసింది. దాన్ని నిరూపించుకునే అవకాశం ఇచ్చింది. దీనిలో రాణించి ఉన్నత పదవుల్ని చేరుకోవాలనేదే నా ఆశ' అంటారీమె. వీళ్లే కాదు, ఈ బృందంలో 50మంది మహిళలు ఉన్నారు. తరచి చూస్తే ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. అందరూ జీవితంలో ఏదైనా సాధించాలి అన్న ఆశతో ఉన్నవారే. వీరందరూ శిక్షణ పూర్తిచేసుకుని క్షేత్రస్థాయిలో పనిచేయబోతున్నారు. కొందరు ఇప్పటికే విధుల్లో చేరిపోయారు కూడా. కేటాయించిన విభాగాల్లో తమదైన ముద్ర వేసి... విదేశాల్లో పనిచేయాలన్నదే తమ కోరిక అంటున్నారు. అందరికీ ఆల్‌దబెస్ట్ చెప్పేద్దామా మరి!

వరాల మూటకు... లాలపోసే వేళ!



అర్జాల్లో ఉన్న బిడ్డను పాదిని పట్టుకుని, కాళ్లపై పడుకోబెట్టుకుని.. నూనెతో, నున్నిపిండితో శరీరాన్ని మర్దన చేసి.. చిన్ని చిన్ని చేతులను, కాళ్లను సున్నితంగా లాగుతూ... ఏడవకు ఏడవకు బుజ్జి పాపాయి... ఏడిస్తే నీకళ్ల నీలాలు కారు... అంటూ నానమ్మో, అమ్మమ్మో బిడ్డకు లాలపోస్తుంటే ఆ చిన్నారికి ఆరోగ్యంతో పాటు ఆత్మీయత కూడా అందేది.

కానీ ఇప్పుడన్నీ ఉరుకుల పరుగుల జీవితాలు! కనుమరుగైన ఉమ్మడి కుటుంబాలు... చుట్టపు చూపుగా వచ్చివెళ్లే బంధువులు... ఇక చిన్నారులకు తీరిగ్గా నూనెతో తలంటి, ఆదిస్నా స్నానం చేయించేదెవరు...? ఈ పరిస్థితుల్లోనే అందుబాటులోకి వచ్చాయి బేబీ స్పా సెంటర్లు.

వీటి ఏర్పాటు మంచి సౌకర్యమే అయినా, అమ్మ చేతి స్పర్శకు... అమ్మమ్మ ఆత్మీయతకు ప్రత్యామ్నాయం మాత్రం కాదని చెబుతున్నారు నిపుణులు.

- శిశువుకు ఇంట్లో అమ్మ, అమ్మమ్మ, నానమ్మలు స్నానం చేయించడం మన కుటుంబాల్లో అతి సాధారణమైన విషయమే. ఇలా చేయడంలో చాలా ఆరోగ్య రహస్యాలున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆత్మీయుల చేతి స్పర్శతో శిశువుకు వారితో బలమైన భావోద్వేగ బంధం ఏర్పడుతుంది. వారి మెదడు, శరీరం ఎదుగుదలకూ దోహదపడుతుంది.
- తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాల్లో బిజీగా ఉంటున్న ప్రస్తుత తరుణంలో మార్కెట్లో ట్రెండింగ్ అందుబాటులోకి వచ్చాయి 'బేబీ స్పా సెంటర్లు'. ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే కనిపించిన ఈ కేంద్రాలు ఇప్పుడు మన నగరాల్లోనూ ఏర్పాటయ్యాయి.
- వీటిలో ఆధునిక సాంకేతికతతో హైడ్రోథెరపీ, నూనె మసాజ్ వంటివి శిశువులకు అందిస్తున్నారు.
- హైడ్రోథెరపీలో భాగంగా ఒక చిన్న టబ్‌లో శిశువును పడుకోబెట్టి... గోరువెచ్చని నీటిని స్ప్రే చేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఒక్కో సెషన్‌లో 20-40 నిమిషాల పాటు ఈ సేవలు చిన్నారికి అందిస్తారు. ఒక్కో సెషన్‌కు వేలల్లో వసూలు చేస్తున్నారు.



- ఒకవైపు గోరువెచ్చని నీరు స్ప్రే అవుతుండగా.. మరోవైపు ఆ నీరు బయటకు వెళ్లిపోతుంది. టబ్‌లో ఉన్న నీటిలో శిశువు కాళ్లు చేతులూ ఆడిస్తుండడం వల్ల వ్యాయామం కూడా అవుతుంది.
- ఇందుకోసం ప్రత్యేక నీటి టబ్‌లు, స్విమ్ సూట్‌లు వినియోగిస్తున్నారు. తల్లిదండ్రులైతే తమ పిల్లలకు స్పా, హైడ్రోథెరపీ వంటివి చేయించి.. ఆ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టుకుంటున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

ఆ స్పర్శను మించింది లేదు...

ఆధునిక సౌకర్యాల సంగతి ఎలా ఉన్నా.. శిశువుకు ఇంటి స్నానమే మేలని చెబుతున్నారు వైద్యులు. ఎందుకంటే...

- సాధారణంగా బొడ్డు తాడు ఊడిన ప్రాంతంలో గాయం మానేవరకు శిశువుకు స్నానం చేయించవద్దని వైద్యులు సూచిస్తుంటారు.
- ఇంట్లో పెద్దవాళ్లు అందుబాటులో లేకుంటే తల్లి పూర్తిగా కోలుకున్న తర్వాత తానే కాళ్లపై పడుకోబెట్టుకుని చిన్నారికి స్నానం చేయించాలి. నూనె పట్టించి, మర్దన చేయడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. చేతి స్పర్శతో బలమైన భావోద్వేగ బంధం ఏర్పడుతుంది. బిడ్డతో కళ్లతోనే సంభాషణ కొనసాగుతుంది. దీన్ని 'న్యూరో సెన్సరీ ఇంటిగ్రేషన్' అంటారు.
- పిల్లల మెదడు ఎదుగుదలకు ఇది తోడ్పడుతుంది. మాటలు, నడక సకాలంలో వచ్చేస్తాయి. కండరాల కదలికలు, జీర్ణక్రియ మెరుగవుతాయి.
- అన్నింటికంటే ముఖ్యం పిల్లలు, పెద్దవాళ్లు ఆ కాలాన్ని ఆస్వాదించే ప్రక్రియ. ఆ సమయంలో పిల్లలు నవ్వుతుంటారు... అది చూసి తల్లిదండ్రులు, పెద్దవాళ్లు కూడా మురిసిపోతుంటారు. తద్వారా ఏర్పడే భావోద్వేగ బంధంతో పిల్లలు బలంగా ఉంటారు. కడుపు నిండా పాలు తాగుతారు. కంటి నిండా నిద్రపోతారు. ఆరోగ్యంగా ఎదగడానికి ఇవన్నీ కూడా దోహదపడేవే.
- శిశువుకు ఏడాది వయసు వరకు ఇలా చేస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

జాగ్రత్తలు అవసరం...



చిన్నారులను బేబీ స్పా సెంటర్లకు తీసుకెళ్లడం తప్పేం కాదు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

- శిశువును టబ్‌లో పడుకోబెట్టి.. స్ప్రే చేసే సమయంలో ఆ నీరు శిశువు నోటిలోకి, ముక్కులోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. సబ్బు నీటిని శిశువు మింగే అవకాశం ఉంటుంది.
- హైడ్రోథెరపీలో వాడే నీరు శుభ్రంగా ఉండాలి. లేకుంటే శిశువుకు అలర్జీ, ఇన్‌ఫెక్షన్లు రావచ్చు.
- టవళ్లను కూడా ఒకరికి వాడినవి మరో చిన్నారికి ఉపయోగించకుండా చూసుకోవాలి.
- జ్వరం, శ్వాస సమస్యలు, ఒంటిపై గాయాలు, ఇన్‌ఫెక్షన్లతో శిశువు బాధపడుతున్నప్పుడు స్పా సేవలు వద్దు.

-డాక్టర్ వీవీవీ ప్రసాద్, సీనియర్ పీడియాట్రీషియన్, సీఈవో, లోటస్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్స్

కారడవి గుడారాల్లో.. కాగడాల వెలుగుల్లో..



రాష్ట్రంలో ఈ మధ్య క్యాంప్‌ఫైర్ సంస్కృతి పెరిగింది. ముఖ్యంగా అరకు వెళ్లే రోడ్డు పక్కన చిన్న చిన్న టెంట్లు చాలా కనిపిస్తున్నాయి. వ్యాపారస్తులు కాసింత వైవిధ్యాన్ని జోడించి యువతను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు లోయకు సమీపంలో ఓ హోటల్ నిర్వాహకులు రోడ్డు పక్కన వినూత్న సెటప్ చేశారు. ఇద్దరు ఉండేందుకు వీలుగా గోళాకార నిర్మాణాలు సిద్ధం చేశారు. చుట్టూ అడవి, ఎత్తయిన కొండల మధ్య ఈ గోళాకార గుడారాలలో సేదతీరేందుకు యువత ఇష్టపడుతుందని నిర్వాహకులు తెలిపారు. - ఈనాడు, అరకులోయ

ట్రామ్‌లో సామాన్యుడిలా దుబాయ్ పాలకుడు



దుబాయ్: దుబాయ్ పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూం సామాన్యులతో కలిసి ట్రామ్‌లో ప్రయాణించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆకస్మికంగా ట్రామ్ స్టేషన్‌ను సందర్శించేందుకు వచ్చిన రషీద్ అక్కడ కొందరు అధికారులతో మాట్లాడి, ప్రజారవాణాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఆయన ప్రయాణికులతో కలిసి ట్రామ్‌లో ఎక్కి ప్రయాణించారు. ఎలాంటి హడావుడి లేకుండా.. ఒక పక్కగా కూర్చొన్న ఆయనను చూసిన ప్రయాణికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. దీన్ని ఓ వ్యక్తి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. దుబాయ్ ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధి పనులను వ్యక్తిగతంగా పర్యవేక్షించడంలో ఆయన చేస్తున్న ప్రయత్నాల్లో ఇదొక భాగమని అధికారులు పేర్కొన్నారు.

30 వేల మునగ చెట్లు.. ఓ విశ్రామికుడు



ఈటీవీ భారత్: వ్యవసాయదారులకు వ్యాపారం కూడా తెలిసి ఉండాలంటారు మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాకు చెందిన డాక్టర్ విక్రమ్ బాపట్ (68). సాఫ్ట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన ఈయన ఉద్యోగ విరమణ అనంతరం తన స్వగ్రామమైన సావంగి మర్దాపూర్ చేరుకొని మునగ సాగు ప్రారంభించారు. మునగాకును ప్రపంచవ్యాప్తంగా సూపర్‌ఫుడ్‌గా పేరు. డిమాండు ఉందని గుర్తించి 9 ఎకరాల్లో 30 వేల మునగచెట్ల సేంద్రియ సాగుతో లాభాల పంట పండిస్తున్నారు. మునగాకును కోసిన తర్వాత సోలార్ టన్నెల్ డ్రయర్ సెంటర్‌లో దాదాపు రెండు రోజులు ఆరబెట్టి పొడిని తయారుచేస్తామని బాపట్ తెలిపారు. ఈ పొడితో బిస్కెట్లు, టీ పొడి, ఫేస్ ప్యాక్ వంటి వివిధ ఉత్పత్తులను రూపొందించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 'కృష్ణ సృష్టి' అనే బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు.

తోక లేని చేప.. 26 కి.మీ. పోతుంది!



తమిళనాడులోని పాంబన్ జాలర్ల వలకు బుధవారం సుమారు 8 కిలోల బరువున్న ఈ సన్‌ఫిష్ చిక్కింది. ఈ చేప అరుదైనదని శాస్త్రవేత్తలు తెలిపారు. తోక లేకుండా దెబ్బతిన్నట్లు కనిపించే ఉండే ఈ జలచరం.. ఎక్కువగా తూర్పు పసిఫిక్ మహా సముద్రంలో కనిపిస్తుందట. 200 నుంచి 600 మీటర్ల లోతులో తిరుగుతూ... రోజుకు 26 కి.మీ. వరకు ఈదగలవని తెలిపారు.
- న్యూస్‌టుడే, చెన్నై (ప్యారిస్)

సాధనమున సమకూరు సాహసాలెన్నో..!



కిర్గిజ్‌స్థాన్ నారిన్ ప్రాంతంలో లేక్ సాంగ్ కోల్ సమీపంలో ఈక్వెస్ట్రియన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఐదు నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన పలు అంతర్జాతీయ బృందాలు వీటిలో పాలుపంచుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఆయా బృందాలను అలరించేందుకు ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఓ రౌతు గుర్రంపై స్వారీ చేస్తూ ఇలా అగ్ని విన్యాసం చేశారు.

'మడ'మ తిప్పని పోరు

ఈనాడు, చెన్నై: సునామీ, తుపాన్లకు అడ్డుగోడల్లా నిలిచి సముద్ర తీరాన్ని కాపాడే మడ అడవులు కొన్నాళ్లుగా చాలావరకు నాశనమయ్యాయి. వాటిని పునరుద్ధరించాలని తమిళనాడు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అడవుల్ని ఎలా పెంచాలి? ఎలాంటి మొక్కలు నాటాలి? అనేవి పెద్ద సవాళ్లుగా మారాయి. అధికారులు రెండేళ్లపాటు పరిశోధనలు చేసి, దేశ, విదేశాల పద్ధతుల్ని పరిశీలించారు. వాటిని పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ విధానంలో మడ అడవుల్ని పునరుద్ధరించాలనే నిర్ణయానికి వచ్చారు.


పడవల్లో వెళ్లి చేపలు పట్టుకునేలా...

తమిళనాట మడ అడవుల పెంపకానికి అధికారులు ప్రత్యేక విధానాన్ని పాటిస్తున్నారు. ఎంపిక చేసిన ప్రదేశాల్లో మొదట చేప ముళ్లు, ఆకుల్లోని ఈనెల మాదిరి డిజైన్లలో కాలవలను తవ్వుతారు. మిగిలిన ప్రదేశంలో భారీసంఖ్యలో పలు రకాల మొక్కలు నాటతారు. ఓ పక్క మొక్కలు పెరిగి విపత్తులకు అడ్డుకట్ట వేస్తాయి. మరో పక్క సమీప గ్రామాల మత్స్యకారులు పడవలపై కాలవల్లోకి వెళ్లి చేపలు పట్టుకుని ఉపాధి పొందుతారు. 2023 నుంచి తీరంలోని 10 జిల్లాల్లో ఈ ప్రాజెక్టు నడుస్తోంది. గ్రీన్ తమిళనాడు మిషన్‌లో భాగంగా అటవీశాఖ ప్రత్యేక నర్సరీల్లో మొక్కల్ని పెంచి అడవుల పునరుద్ధరణకు తరలిస్తోంది. పునరుద్ధరిస్తున్న మడ అడవులు జీవ వైవిధ్య ప్రాంతాలుగా మారుతున్నాయి. నాలుగేళ్ల క్రితం 4,500 హెక్టార్లలో అడవులుండగా... ఇప్పుడు 10 వేల హెక్టార్లకుపైగా విస్తరించాయి. 8.73 లక్షల టన్నుల కర్బన ఉద్గారాల్ని ఇవి పీల్చుకోగలవని అంచనా.



తిరువారూరు జిల్లా ముత్తుపేటలో పునరుద్ధరించిన మడ అడవి. 1,350 హెక్టార్లలో పనులు చేపట్టారు. 707 హెక్టార్లలో పూర్తయ్యాయి. 16 లక్షల మొక్కలు నాటారు. 6 గ్రామాల మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు

అమ్మభాషకు అనువాదాల పందిరి!



ఈనాడు, హైదరాబాద్: దూర ప్రాంతాలకు వెళుతున్న బస్సుల్లో... రైళ్లలో... హైదరాబాద్ మెట్రోలో ఇటీవల కొత్త గాలి వీస్తోంది. సెల్‌ఫోన్ ఆక్రమిత ప్రపంచంలోకి మెల్లిగా చొచ్చుకొస్తోంది. యువతీ, యువకుల చేతుల్లోకి పుస్తకాలుగా మారుతూ అక్షర సుగంధాన్ని వ్యాపింపజేస్తోంది. ఇది భాషా సాహితీవేత్తలకు నూతన ఉత్సాహాన్ని అందిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత పుస్తకాలను తెలుగులోకి అనువదించే ప్రేరణ కలిగిస్తోంది.

మహిళా కాల్పనిక సాహిత్య విభాగంలో 2024లో బహుమతి పొందిన 'బ్రదర్‌లెస్ నైట్' పుస్తకాన్ని 'మనుషులు మాయమయ్యే కాలం'గా తెలుగులో అందుబాటులోకి తీసుకురాగా విశేష ఆదరణ పొందింది. 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' నవల అమెజాన్ ద్వారా 1.50 లక్షల ప్రతులు అమ్ముడయ్యాయి. వీరిలో 70% మంది తాము కొన్న తొలి పుస్తకం ఇదేనని చెప్పడం గమనార్హం. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖతో కలిసి హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో సేకరించిన సమాచారం ప్రకారం 20-30 ఏళ్ల వయసున్న విద్యార్థులు, యువకుల్లో 30% మంది పుస్తక పఠనం వైపు మళ్లుతున్నారని తేలింది. 31-40 ఏళ్ల వయసు మహిళలు, పురుషుల్లో 35% మంది తీరిక సమయాల్లో తెలుగు పుస్తకాలు, ఆంగ్ల నవలలు చదువుతున్నట్లు వెల్లడైంది. ఈ పరిణామాలను గమనిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రచురణ సంస్థ... సమకాలీన సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అందించాలని సంకల్పించింది. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం సూచనతో నోబెల్, బుకర్ ప్రైజ్‌లు పొందిన ఏడు పుస్తకాలతోపాటు 15 భాషల నుంచి 25 పుస్తకాలను అనువదించేందుకు సన్నాహాలు చేస్తోంది. వాటిలో నోబెల్ పొందిన షైనింగ్, మై నేమ్ ఈజ్ రెడ్, వుయ్ డు నాట్ పార్ట్ వంటి పుస్తకాలు... బుకర్ ప్రైజ్ సొంతం చేసుకున్న వెజిటేరియన్, డిస్‌కంఫర్ట్ ఆఫ్ ది ఈవెనింగ్, కైరోస్ వంటివి ఉన్నాయి.






ఫార్మర్ లోడర్.. మేడిన్ జహీరాబాద్

రైతుల కోసం 'ఫార్మర్ లోడర్' పేరుతో మినీ విద్యుత్ వాహనాన్ని (ఈవీ) రూపొందించారు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్‌కు చెందిన తెలుగు రాజశేఖర్. ఐటీఐ డీజిల్ మెకానిక్ పూర్తి చేసి మహీంద్రా కర్మాగారంలో అప్రెంటిస్‌షిప్ చేసిన ఈ యువకుడు.. అప్పుడు వచ్చిన ఆలోచనతో ఈ ప్రయత్నం చేసినట్లు చెప్పారు. "కారు తరహా ఉపయోగించుకునే బహుళ ప్రయోజన ఈవీ తయారీ కోసం.. జహీరాబాద్‌లోని స్క్రాప్ దుకాణాల నుంచి ఇనుప సామగ్రి, పాత కార్ల చక్రాలు, స్టీరింగ్ విడిభాగాలను రూ.1.50 లక్షలకు కొనుగోలు చేశా. ఐదు క్వింటాళ్ల వరకు బరువును మోసే సామర్థ్యంతో పనిచేసేలా 12 వాల్ట్ సామర్థ్యం గల నాలుగు బ్యాటరీలను అమర్చా. రూ.20 ఖర్చుతో రెండు యూనిట్లు ఛార్జింగ్ చేస్తే 80-100 కి.మీ.లు ప్రయాణిస్తుంది. ప్రస్తుతం రోడ్డుపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్నా" అని వివరించారు రాజశేఖర్.

– న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్



మీతో ఫోన్ చేయించి...
మీ ఫోన్‌నే హ్యాక్ చేసి...
మీరు చేసినట్లే కాల్ చేసి...
మీ వాళ్లనే మోసం చేసి
వారినుంచి అందినంత గుంజేస్తే...

స్మార్ట్ దందాల్లో ఇదో తరహా. ఈ ఉచ్చులో చిక్కుకుని మోసపోయిన చాలామంది పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

- ఇప్పటివరకూ కొరియర్ పార్సిల్‌లో నిషేధిత వస్తువులు వచ్చాయని డిజిటల్ అరెస్ట్ చేశారని చెప్పి మోసాలకు పాల్పడేవారు. దీనిపై ప్రజల్లో అవగాహన వస్తోందని గుర్తించిన సైబర్ నేరగాళ్లు కొత్తదారిని ఎంచుకుంటున్నారు.
- కాల్ ఫార్వర్డ్ ఫిషింగ్‌తో మోసాలకు పాల్పడుతున్న మాయగాళ్లు తాము కొరియర్ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నట్టు నమ్మిస్తారు.
- మీ చుట్టుపక్కలే తమ కొరియర్ బాయ్స్ ఉన్నారు. మేము పంపే నంబర్‌కు డయల్ చేసి సమాచారమిస్తే మీ వద్దకు వచ్చి పార్సిల్ ఇస్తారంటూ నమ్మిస్తారు.
- ఇదంతా మాయగాళ్ల పన్నాగమని తెలియని బాధితులు వారిచ్చిన నంబరుకు ఫోన్ చేస్తారు. అంతే మీ ఫోన్ హ్యాక్ అవుతుంది. మీ కాంటాక్ట్ జాబితాలోని నంబర్లు మాయగాళ్ల చేతికి చేరతాయి.
- మీ సన్నిహితులకు మీరు చేసినట్లే ఫోన్ చేసి ఆసుపత్రిలో ఉన్నామని, బ్యాంకు ఖాతా బ్లాక్ చేశారని, యూపీఐ లావాదేవీలు నిలిచిపోయాయని.. ఏవో కారణాలు చెప్పి తమ ఖాతాకు నగదును బదిలీ చేయించుకుంటారు.
- ఫోన్‌కాల్‌కు స్పందించకుంటే వాట్సాప్ ద్వారా ఛాటింగ్ చేసి టోకరా వేస్తున్నారు.
- తాము పంపిన డబ్బు గురించి అవతలి వారు ప్రశ్నించినపుడు తమ ఫోన్ హ్యాక్ అయినట్టు బాధితులు గుర్తిస్తున్నారు.




ఇలా చేయాలి..:

- తమ ఫోన్‌లో కాల్స్, మెస్సేజ్‌లు మరో నెంబర్‌కు ఫార్వర్డ్ అవుతున్నట్టు గుర్తిస్తే ఆపేయాలి
- కాల్, మెస్సేజ్, ఎంఎంఎస్ ఫార్వర్డ్ అవుతుందా! లేదా! తెలుసుకునేందుకు *#21# టైప్ చేసి డయల్ చేయాలి. దీంతో స్క్రీన్‌పై అవతలి వారి సమాచారం కనిపిస్తుంది.
- ఫోన్ కాల్, మెస్సేజ్ ఫార్వర్డ్‌ను తొలగించేందుకు ##002# డయల్ చేస్తే ఆ ఆప్షన్ తొలగిపోతుంది.
- ఈ తరహా మోసంపై అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్‌క్రైమ్ డీసీపీ కవిత దార తెలిపారు. కాల్‌ఫార్వర్డింగ్‌ను గుర్తించి బయటపడేందుకు ఫోన్ సెట్టింగ్‌లు మార్చుకోవాలని సూచించారు.

- ఈనాడు, హైదరాబాద్

నువ్వు తోపప్పా!



కర్ణాటకలోని కొప్పళ జిల్లా గంగావతి పరిధిలోని అంజనాద్రి కొండను ఎక్కాలంటేనే భక్తులు ఆయాస పడిపోతారు. మొత్తం 575 మెట్లుంటే.. కొన్ని నిటారుగా ఉంటాయి. కొన్ని చోట్ల ఒంగి వెళ్లాల్సి ఉంటుంది. అందుకే చాలా మంది భక్తులు కొండెక్కడాన్ని ఓ సాహసంగా భావిస్తారు. అలాంటిది.. 62 ఏళ్ల నింగప్ప సవనూరు 102 కిలోల జొన్నల మూటను మోసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. మొక్కు తీర్చుకునేందుకు ఈ సాహసం చేసినట్లు బాగలకోట జిల్లా హునూరుకు చెందిన నింగప్ప తెలిపారు. గతంలో ఒకరు 100 కిలోల బస్తా మోస్తూ అంజనాద్రి ఎక్కారు. నింగప్ప ఆ రికార్డును అధిగమించారు. – గంగావతి, న్యూస్‌టుడే

ఇలా చేస్తే కచ్చితంగా ఓడిపోతారు



కచ్చితంగా విజయం సాధించడానికి ఏ సూత్రమూ లేదు. కానీ కచ్చితంగా ఓడిపోవడానికి ఓ సూత్రం ఉంది. అదేంటంటే.. ఏ ప్రయత్నమూ చేయకుండా ఖాళీగా కూర్చోవడం. అందుకే ఓటమిని తప్పించుకోవాలంటే ప్రయత్నాలు మొదలుపెట్టండి. అప్పుడు విజయమైనా వరిస్తుంది లేదా వైఫల్యాల ద్వారా అనుభవమైనా వస్తుంది. ఆ అనుభవమే విజయానికి చేరువ చేస్తుంది.
– ఆంథోనీ జూడ్, ఆన్‌లైన్ బ్రాండింగ్ కన్సల్టెంట్

గజరాజుల కళ్లలోకి ఫోకస్



ఏనుగులు పొలాలు, జనావాసాల పైకి రాకుండా అటవీ శాఖ వినూత్న చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో సౌర విద్యుత్తు దీపాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ దీపాలను ఎలిఫెంట్ డిటర్మెంట్ లైట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. రాత్రివేళల్లో ఏనుగులు జనావాసాల వైపు వస్తున్నప్పుడు వాటి కళ్లలోకి ఈ లైట్ల ఫోకస్ పడటంతో పాటు శబ్దాలు వస్తాయని, తద్వారా అవి బెదిరి వెనుదిరుగుతాయని స్థానిక అటవీ రేంజ్ అధికారి జయశంకర్ చెప్పారు.
– న్యూస్‌టుడే, కుప్పం

పిచ్చివాడనుకున్నారు.. అదే బాట పట్టారు

పచ్చదనం పెరగాలంటే మొక్కలు నాటి పెంచాలి. మొక్కలు కావాలంటే విత్తనాలు నాటాలి. మరి విత్తనాలు ఎక్కడి నుంచి వస్తాయి? చెట్ల వద్దే సేకరించాలి.. ఇదే పని చేస్తూ లక్షల విత్తనాలు పోగేసి.. ఖాళీ స్థలాల్లో చల్లుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఓ యువకుడు, అతని మిత్రులు. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన అవిరెండ్ల సందీప్‌కుమార్ పురపాలికలో ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుడు. గతేడాది ఏప్రిల్ నుంచి ఖాళీ సమయాల్లో బస్తా చేతపట్టుకొని.. చెట్ల కింద రాలిపడిన విత్తనాలను పోగుచేస్తూ ఉండేవాడు. ఇదిచూసి మొదట్లో పిచ్చివాడనుకున్నారు. కొద్దిరోజుల తర్వాత సందీప్ లక్ష్యం తెలిసి.. అనేక మంది జత కలిశారు. 'తొలుత లక్ష విత్తనాల సేకరణ లక్ష్యాన్ని 5 నెలల్లో పూర్తిచేశాం. అదే ఉత్సాహంతో పెరిగిన మిత్రులతో ఇప్పటివరకు సుమారు ఏడు లక్షల విత్తనాలు సేకరించాం. వీటిలో సుమారు లక్ష విత్తనాలు వివిధ ప్రదేశాల్లో చల్లాం. 50 వేల విత్తనాలను పలువురు పర్యావరణ ప్రేమికులకు పంపిణీ చేశాం. మా కృషిని అప్పట్లో వనజీవి రామయ్యతో పాటు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అభినందించారు. త్వరలోనే పాఠశాలల్లో విత్తన బంతుల తయారీతో పాటు.. అటవీ శాఖ అధికారుల సహాయంతో మిగిలిన విత్తనాలు చల్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం'' అని వివరించారు సందీప్‌కుమార్.
– న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం



సేకరించిన విత్తనాలతో...



సందీప్‌కుమార్

ఎగురుతుంది.. ఈదుతుంది

ఇంటర్నెట్ డెస్క్: డెన్మార్క్‌లోని ఆల్‌బాగ్ యూనివర్సిటీ విద్యార్థులు గాల్లో ఎగరడంతో పాటు నీటి లోపల ఈదేలా డ్రోన్‌ను అభివృద్ధి చేశారు. వేరియబుల్ పిచ్ ప్రొపెల్లర్ సిస్టమ్ దీని ప్రత్యేకత. సాధారణంగా ఉండే ప్రొపెల్లర్‌కు భిన్నంగా ఇందులో మూడు అడ్జస్టబుల్ బ్లేడులు ఉంటాయి. గాల్లో ఉన్నప్పుడు ప్రొపెల్లర్ బ్లేడ్లు స్టీపర్ పిచ్‌లోకి మారుతాయి. అప్పుడు థ్రస్ట్ ఏర్పడి డ్రోన్ గాల్లోకి బలంగా ఎగిరేందుకు సహాయపడుతుంది. నీటి లోపలికి వెళ్లినప్పుడు ఈ బ్లేడ్లు యాంగిల్‌ను తగ్గించుకుంటాయి. అప్పుడు డ్రోను నీళ్లలో ఈదుకొంటూ వెళ్లగలుగుతుంది. సముద్ర అన్వేషణలు, రెస్క్యూ ఆపరేషన్లలో ఇవి ఎంతగానో ఉపయోగపడే అవకాశముంది.




ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో నకిలీ ఎంబసీ

వెస్ట్‌ఆర్కిటికా పేరుతో నకిలీ రాయబార కార్యాలయం

లఖ్‌నవూ: నకిలీ అధికారులను, కార్యాలయాలను, టోల్ గేట్లను, పోలీస్ స్టేషన్‌లను చూశాం. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఏకంగా ఓ నకిలీ రాయబార కార్యాలయాన్నే సృష్టించాడో వ్యక్తి. ప్రధానమంత్రి, రాష్ట్రపతితో తాను దిగినట్లు ఉన్న మార్ఫింగ్ ఫొటోలను చూపించి.. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకులను నమ్మించి మోసం చేశాడు. బుధవారం గాజియాబాద్‌లోని ఓ నకిలీ రాయబార కార్యాలయాన్ని ఉత్తర్‌ప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు గుర్తించారు. వెస్ట్ ఆర్కిటికా సహా పలు గుర్తింపులేని దేశాల రాయబారిగా చెప్పుకుంటున్న హర్ష వర్ధన్ జైన్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కవి నగర్‌లో ఓ భవనం అద్దెకు తీసుకుని వెస్ట్ ఆర్కిటికాతో పాటు సబోర్గా, పౌల్వియా, లొడోనియా లాంటి దేశాలకు తాను రాయబారినంటూ హర్షవర్ధన్ ప్రచారం చేసుకున్నాడు. దౌత్యపరమైన నంబరు ప్లేట్లు కలిగిన 4 విలాసవంతమైన కార్లను ఏర్పాటు చేసుకున్నాడు. విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేయడం సహా షెల్ కంపెనీల ద్వారా హవాలా లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. 2011లో అక్రమంగా శాటిలైట్ ఫోన్‌ను వినియోగించిన కేసూ అతడిపై ఉన్నట్లు తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు వాహనాలు, 12 నకిలీ పాస్‌పోర్టులు, విదేశాంగ శాఖ ముద్రతో ఉన్న నకిలీ పత్రాలు, రెండు పాన్‌కార్డులు, 34 రబ్బర్ స్టాంపులు సహా రెండు నకిలీ ప్రెస్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వాటితో పాటు రూ. 44.70 లక్షల నగదు, 18 దౌత్యపరమైన నంబరు ప్లేట్లు నిందితుడి వద్ద లభించాయని వెల్లడించారు.



ఆఫీసులో నడవడం మరవొద్దు


ఎక్కువ సేపు కూర్చోవడం ఆరోగ్యానికి మంచిది కాదు. అందుకే ఆఫీసులో 20-30 నిమిషాలకొకసారి సీటు నుంచి లేచి రెండు నిమిషాల పాటు నడవండి. దీనివల్ల రక్తంలో చక్కెర, ఇన్సులిన్ స్థాయిలు తగ్గుతాయి. జీవనశైలి వ్యాధులను అరికట్టడానికి ఇది అవసరం.
– మార్క్ హైమన్, హెల్త్ ఎక్స్‌పర్ట్

బ్రిటన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ



దిల్లీ: బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల పర్యటనకు బయలుదేరిన ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం రాత్రి లండన్ చేరుకున్నారు. ఆ రెండు దేశాలతో సంబంధాలు ఈ పర్యటనతో బలోపేతమవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్-బ్రిటన్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని, అది గత కొన్నేళ్లలో మరింత బలపడిందని పేర్కొన్నారు. పర్యటనలో బ్రిటన్ రాజు చార్లెస్-3ని కూడా మోదీ కలవనున్నారు. అనంతరం మాల్దీవులకు పయనమవుతారు. ఆ దేశ 60వ స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొంటారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల కసరత్తు ప్రారంభం



దిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం (ఈసీ) వెల్లడించింది. ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపింది. అనారోగ్య కారణాలతో జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. పార్లమెంటు ఉభయ సభలకు ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులతో ఈ ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటు కానుంది. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించేందుకు చర్యలు చేపట్టామని బుధవారం ఈసీ వెల్లడించింది. ఉప రాష్ట్రపతి ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి కాగానే అతి త్వరలో షెడ్యూలు విడుదల చేస్తామని తెలిపింది. నెల రోజుల్లో ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ పూర్తి కావచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీ కాలం ఉంది. కొత్త ఉప రాష్ట్రపతి మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు.

రాష్ట్రపతికి స్వయంగా రాజీనామా లేఖ ఇచ్చిన ధన్‌ఖడ్

ఉప రాష్ట్రపతి పదవికి తాను చేసిన రాజీనామా లేఖను జగదీప్ ధన్‌ఖడ్ స్వయంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అందజేశారు. ఎలాంటి అపాయింట్‌మెంట్ లేకుండానే ఆయన సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. రాష్ట్రపతికి రాజీనామా లేఖను అందజేశారు. అనంతరం 9.30 గంటలకు ఎక్స్‌లో ఆ లేఖను పోస్టు చేశారు.

చైనీయులకు భారత పర్యాటక వీసా

- ఐదేళ్ల తర్వాత ప్రక్రియను తిరిగి ప్రారంభించిన కేంద్రం

బీజింగ్: గల్వాన్ లోయలో జరిగిన సైనిక ఘర్షణ తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను సరిదిద్దేందుకు భారత్, చైనా ముందడుగు వేస్తున్నాయి. ఈ ప్రయత్నాల్లో భాగంగా ఐదేళ్ల క్రితం చైనీయులకు నిలిపివేసిన భారత పర్యాటక వీసాలను ఈ వారం నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. 2020లో కొవిడ్ మహమ్మారి కారణంగా చైనీయులకు భారత పర్యాటక వీసాలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తూర్పు లద్దాఖ్ సరిహద్దు ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని భారత్ ఈ ఆంక్షలను కొనసాగించింది. గురువారం నుంచి చైనీయులు పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. దీనిని చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వాగతించింది.

రైల్వే ఈక్యూ దరఖాస్తులు ఒకరోజు ముందే సమర్పించాలి

దిల్లీ: రైళ్లలో అత్యవసర కోటా (ఈక్యూ) కింద బెర్తులు కేటాయించాల్సిందిగా కోరుతూ సమర్పించే దరఖాస్తులకు వేళల్ని రైల్వే మంత్రిత్వ శాఖ మార్చింది. ఎనిమిది గంటల ముందే రిజర్వేషన్ చార్టులను సిద్ధం చేయాలన్న నిర్ణయానికి తగ్గట్టుగా ఈ మార్పుచేసినట్లు మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొంది. అర్ధరాత్రి 12 (00.00) నుంచి మధ్యాహ్నం రెండు (14.00) గంటల్లోపు బయల్దేరే రైళ్లలో ఈక్యూ కోసం ముందురోజు మధ్యాహ్నం 12 గంటల్లోగా దరఖాస్తుల్ని సంబంధిత విభాగానికి అప్పగించాలి. మధ్యాహ్నం 2.01 (14.01) నుంచి రాత్రి 11.59 (23.59) గంటల మధ్య బయల్దేరే రైళ్లకోసం ముందురోజు సాయంత్రం 4 గంటల్లోగానే దరఖాస్తులు ఇవ్వాలి. ప్రయాణపు తేదీరోజు ఇచ్చే దరఖాస్తుల్ని పరిగణనలో తీసుకునేది లేదని రైల్వేశాఖ స్పష్టం చేసింది. ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో ప్రయాణాల కోసం ఈక్యూ అభ్యర్థనల్ని అంతకుముందు పనిదినాన కార్యాలయ వేళల్లో అందజేయాలి. చార్టుల తయారీ, దాని వల్ల రైళ్లు బయల్దేరడంలో జాప్యం కాకుండా అధికారులంతా ఈ వేళలకు కచ్చితంగా కట్టుబడి ఉండాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది. బెర్తుల కేటాయింపులో ప్రస్తుత మార్గదర్శకాలు కచ్చితంగా పాటిస్తూ, దరఖాస్తుదారులు అసలైనవారేనని ధ్రువపరచుకోవాలని కోరింది.

చేతులపై రైలు కోచ్, బెర్తు నంబర్లు

బెంగాల్‌లో యువతుల అక్రమ రవాణా ముఠా గుట్టురట్టు

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో యువతుల అక్రమ రవాణా ముఠా గుట్టు రట్టయింది. బెంగాల్‌లోని న్యూ జల్పాయిగుడి నుంచి బిహార్ రాజధాని పట్నాకు వెళ్తున్న క్యాపిటల్ ఎక్స్‌ప్రెస్ రైలులో సోమవారం రాత్రి 56 మంది యువతులను ఎక్కారు. వారి వెంట 8 మంది పురుషులు కూడా ఉన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆర్పీఎఫ్ సిబ్బంది.. ఆ యువతులున్న బోగీకి వచ్చారు. వారి ముఖాల్లో ఆందోళనను గమనించి.. టికెట్లు చూపించాలని అడిగారు. అయితే యువతుల వద్ద టికెట్లుగానీ, ఇతర పత్రాలుగానీ లేవు. వారి చేతులపై కోచ్, బెర్తు నంబర్లు ముద్రించి ఉన్నాయి. అనుమానంతో సిబ్బంది ఆరా తీయగా.. బెంగళూరు కంపెనీలో ఉద్యోగం కోసం తమను రైల్లో తీసుకెళ్తున్నారని ఓ యువతి చెప్పింది. బెంగళూరులో ఉద్యోగమైతే బిహార్‌కు ఎందుకు తీసుకెళ్తున్నారంటూ.. ఆ యువతుల వెంట ఉన్న ఇద్దరిని సిబ్బంది ప్రశ్నించారు. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారిద్దరినీ అరెస్టు చేశారు. యువతుల అక్రమ రవాణాలో భాగంగానే వారందరినీ బిహార్ తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. 18-31 ఏళ్ల మధ్య వయసున్న ఆ యువతులను అధికారులు వారి కుటుంబాలకు అప్పగించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు వెల్లడించారు.

భర్త నాలుక కొరికి మింగేసిన భార్య

ఈటీవీ భారత్: భార్యాభర్తల మధ్య గొడవలు హద్దు మీరితే పరిణామాలు ఎంత తీవ్రతకు దారితీస్తాయో చెప్పేందుకు బిహార్‌లోని గయాలో జరిగిన ఈ విచిత్ర సంఘటన నిదర్శనం. ఖిజ్రాసరాయ్ పోలీస్‌స్టేషను పరిధికి చెందిన దంపతుల మధ్య చిన్న గొడవ తలెత్తింది. మాటా మాటా పెరిగి ఘర్షణగా మారింది. భార్య ఆగ్రహంతో ఊగిపోతూ భర్త నాలుకను కొరికి నమిలి మింగేసింది. భర్త ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గ్రామస్థులు సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చాలా రక్తం పోయినందున ప్రాథమిక చికిత్స చేసి మగధ్ వైద్య కళాశాలకు సిఫార్సు చేసినట్లు డాక్టర్ మీనారాణి తెలిపారు. ఇంకా దారుణం ఏమిటంటే.. ఇంత జరిగినా ఆస్పత్రిలోనూ భార్యాభర్తలు గొడవపడ్డారని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



జస్టిస్ వర్మ కేసు విచారణ నుంచి వైదొలగిన సీజేఐ

- త్వరలో కొత్త ధర్మాసనం ఏర్పాటు



దిల్లీ: ఇంట్లో నోట్ల కట్టలు బయటపడిన వ్యవహారంలో తనను దోషిగా తేల్చిన అంతర్గత కమిటీ నివేదిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశాన్ని అత్యవసరంగా విచారించాలని వర్మ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ జోయ్‌మాల్యాబాగ్చితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీనిపై బుధవారం స్పందించిన సీజేఐ గవాయ్.. జస్టిస్ వర్మ పిటిషన్ వేసిన అంతర్గత కమిటీలో తాను భాగంగా ఉన్నానని.. మళ్లీ ఇప్పుడు తానే ఈ అంశంపై విచారణ జరపడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారాన్ని విచారించేందుకు మరోక ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. తాను ఈ కేసు విచారణ నుంచి వైదొలగుతున్నట్లు పేర్కొన్నారు.

అచ్యుతానందన్‌కు వీడ్కోలు

- అళప్పుజలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు


అచ్యుతానందన్ భౌతికకాయానికి గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

అళప్పుజ: శ్రామికజన పక్షపాతి, దిగ్గజ కమ్యూనిస్టు నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్‌కు లక్షల మంది అభిమానులు అశ్రునయనాలతో కడపటి వీడ్కోలు పలికారు. ఆయన భౌతిక కాయానికి బుధవారం రాత్రి 9 గంటల సమయంలో అళప్పుజలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు జరిగాయి. అచ్యుతానందన్ కుమారుడు అరుణ్‌కుమార్ తండ్రి చితికి నిప్పంటించారు. 1946లో పున్నప్ర-వయలార్ పోరాటంలో అమరులైన కమ్యూనిస్టు నేతల స్మారకాలు, సమాధులున్న వలియ చుడుకాడులో అంతిమ సంస్కారాలు జరిగాయి. 101 ఏళ్ల వయసులో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అచ్యుతానందన్ తుది శ్వాస విడిచారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ తిరువనంతపురంలో ఆయన పార్థివదేహాన్ని ప్రజలు, అభిమానులు సందర్శించారు. ఆ తర్వాత ప్రత్యేకంగా అలంకరించిన బస్సులో ఊరేగింపుగా అళప్పుజకు తీసుకొచ్చారు. వర్షంపడుతున్నా లెక్కచేయకుండా అనేక గ్రామాల ప్రజలు ఆయనను కడసారి చూసేందుకు దారిపొడవునా గంటల తరబడి నిరీక్షించారు. తిరువనంతపురం నుంచి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న అలప్పుజకు చేరుకోవడానికి 16 గంటలకు పైగా సమయం పట్టింది. అనంతరం అచ్యుతానందన్ స్వగృహంలో, సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన భౌతిక కాయాన్ని ఉంచగా పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు దర్శించుకున్నారు.

స్వచ్ఛమైన వాతావరణం మానవ హక్కు

- అంతర్జాతీయ న్యాయస్థానం కీలక తీర్పు

ద హేగ్: స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమగ్రమైన పర్యావరణం మానవ హక్కు అని అంతర్జాతీయ న్యాయస్థానం ప్రకటించింది. భూగోళాన్ని వాతావరణ మార్పుల నుంచి పరిరక్షించేందుకు చర్యలు చేపట్టని దేశాలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించినట్టేనని కోర్టు స్పష్టం చేసింది. పెరిగిపోతున్న భూతాపం నేపథ్యంలో వాతావరణ మార్పుల కారణంగా తాము చేయని తప్పిదానికి బలై నష్టపోతున్న దేశాలు అందుకు నష్ట పరిహారం పొందడానికి అర్హత కలిగివున్నాయని కూడా అంతర్జాతీయ కోర్టు పేర్కొంది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల్ని నిలువరించేందుకు ప్రతి దేశం తీసుకోవాల్సిన చర్యలు, అలా చర్యలు తీసుకోని దేశాలపై చేపట్టాల్సిన చర్యలు అనే అంశంపై బుధవారం వెలువరించిన తీర్పులో కోర్టు ఈ అభిప్రాయాలను వ్యక్తీకరించింది. ఈ తీర్పు ప్రపంచ దేశాలన్నీ విధిగా అనుసరించాలన్న నిబంధనేదీ లేదు కానీ కోర్టు వెలువరించిన ఈ 500 పేజీల తీర్పు అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణోద్యమంలో ఒక కీలక మలుపు కాగలదని భావిస్తున్నారు. "ఇతర మానవ హక్కుల్ని ఆస్వాదించాలంటే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమగ్రమైన వాతావరణం ప్రతి ఒక్కరికీ వర్తించే మానవహక్కు కావాలి" అని అంతర్జాతీయ న్యాయస్థానం అధ్యక్షుడు యుజి ఇవసావా అన్నారు. పర్యావరణ సంక్షోభం భూగోళంపై జీవజాల మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోందని, మన భూగ్రహ ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించిందని ఆయన అన్నారు. ఈ తీర్పు ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ ఉద్యమాలకు, భిన్న దేశాల మధ్య కుదిరే ఒప్పందాలకు ప్రాతిపదిక అయ్యే అవకాశం ఉంది. వనువాతు ద్వీపదేశం దాఖలుచేసిన వ్యాజ్యంపై కోర్టు ఈ తీర్పు వెలువరించింది.

కర్ణాటకలోనూ భయంకరమైన ఓట్ల చోరీ

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణ


పార్లమెంటు ఆవరణలో బుధవారం ఆందోళన చేస్తున్న ప్రియాంక గాంధీ, జయా బచ్చన్, కనిమొళి తదితర ఎంపీలు

దిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జరిగినట్లుగానే కర్ణాటకలోనూ భయంకరమైన ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల ఓటర్లను భారీ సంఖ్యలో తొలగిస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఇది బిహార్‌కే పరిమితం కాలేదని, మహారాష్ట్రలోనూ ఓట్లు దొంగిలించారని ఆక్షేపించారు. తాము కోరినా మహారాష్ట్ర ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం చూపలేదని, వీడియోలను అడిగితే చట్టాన్ని మార్చేశారని రాహుల్ గాంధీ తెలిపారు. మహారాష్ట్రలో కోటి మంది కొత్త ఓటర్లను చేర్చి, ఎన్నికలను దొంగిలించారన్నారు. కాగితాలపై ఇచ్చిన ఓటరు జాబితాలను డిజిటల్‌గా విశ్లేషించే వీలు ఉండదన్నారు. కొత్త ఓటర్లు ఎలా చేరుతున్నారో తెలిసిపోయిందని చెప్పారు. ఈ డిజిటల్ విశ్లేషణకు ఆరు నెలల సమయం పట్టిందన్నారు. తాము చేసిన ఈ పరిశోధన చూసి ఈసీ బిహార్‌లో తీరు మార్చేసిందని ఆరోపించారు. ఓటర్ల పేర్లను గల్లంతు చేయడమే ఆ పద్ధతి అని వివరించారు.

బ్రహ్మపుత్ర డ్యాం ప్రభావం భారత్ మీద ఉండదు: చైనా

బీజింగ్: పర్యావరణపరంగా అత్యంత సున్నితమైన టిబెట్ ప్రాంతంలో బ్రహ్మపుత్ర నదిపై జలవిద్యుత్తు ప్రాజెక్టు కోసం జలాశయ నిర్మాణం చేపట్టడాన్ని చైనా సమర్థించుకుంది. ఈ డ్యాం సాయంతో నదీజలాలు మళ్లించుకోవడం కానీ, వేరే రకంగా ఉపయోగించుకోవడం కానీ చేయబోమంది. దిగువ పరీవాహక ప్రాంతాలైన భారత్, బంగ్లాదేశ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బుధవారం స్పష్టంచేసింది. చైనీయులు యార్లంగ్ జాంగ్‌పో అని పిలుచుకునే బ్రహ్మపుత్రపై వాస్తవాధీనరేఖకు అతి సమీపంలో న్యింగ్చి నగరం వద్ద డ్యాం నిర్మాణ పనుల్ని చైనా ప్రధాని లీ కియాంగ్ గత శనివారం ప్రారంభించిన విషయం విదితమే. ఈ నిర్మాణ స్థలం వాస్తవాధీనరేఖ వద్ద అరుణాచల్‌ప్రదేశ్‌కు దగ్గరగా ఉంది. ఈ ప్రాజెక్టు ఈ నది దిగువ ప్రాంతాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ చెప్పారు. నదికి దిగువన ఉన్న రెండు దేశాలకు అవసరమైన సమాచారం అందించామని, నదీ ప్రవాహ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ప్రయోజనం కోసం ఆయా దేశాలకూ సహకారం అందిస్తామని తెలిపారు. డ్యాం నిర్మించాలని నిర్ణయించడం చైనా సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయమన్నారు. కాలుష్యరహిత విద్యుదుత్పత్తికి ఈ నిర్మాణం చేపట్టామని, దిగువ దేశాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదన్నారు.

ధనికులకు దోచిపెడుతున్న మోదీ సర్కారు: ఖర్గే

దిల్లీ: ప్రధాని మోదీ ప్రభుత్వం పేదల పొట్ట కొట్టి ధనవంతుల జేబులు నింపుతోందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో దుమ్మెత్తిపోశారు. 2015-16 నుంచి 2024-25 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మోదీ కుబేర మిత్రులకు రూ.12,08,828 కోట్ల రుణాలను మాఫీ చేశాయని ఆయన తెలిపారు. దేశంలో ఆర్థిక అసమానతలు గత 100 ఏళ్లలో ఎన్నడూ లేనంత స్థాయికి పెరిగిపోయినా మోదీ ప్రభుత్వం ధనవంతులకు మరింత దోచిపెడుతోందన్నారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ప్రభుత్వ బ్యాంకులు ఎంత మొత్తంలో రుణాలు మాఫీ చేసినదీ తెలిపారు. అయితే, బ్యాంకులు నిరర్థక ఆస్తులను నాలుగేళ్ల తరవాత తమ ఖాతా పుస్తకాల నుంచి తొలగించినంత మాత్రాన రుణాలను మాఫీ చేసినట్లు కాదనీ, రుణ గ్రహీతల నుంచి బకాయిలు వసూలు చేయడానికి బ్యాంకుల యత్నాలు కొనసాగుతాయని వివరించారు.

ఎడతెగని ఇజ్రాయెల్ దాడులు

గాజాలో తాజా మరణాలు 21

డెయిర్ అల్ బలా: ఇజ్రాయెల్ నిరంతరాయంగా కొనసాగిస్తున్న దాడుల్లో మరో 21 మంది సాధారణ పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ సాగిన దాడుల్లో మృతిచెందిన వారిలో సగానికి పైగా మహిళలు, పిల్లలేనని గాజా ఆరోగ్య విభాగం అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న దిగ్బంధనం కారణంగా గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు నెలకొని నిస్సహాయత రాజ్యం చేస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో శాంతి భద్రతల పరిస్థితులు పూర్తిగా దిగజారింది.


గాజాలో ఆహారం కోసం ఎగబడుతున్న పాలస్తీనియులు

చైనా పర్యటన ఎంతో దూరంలో లేదు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య



వాషింగ్టన్: త్వరలోనే తాను చైనాలో పర్యటించే అవకాశాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తమ రెండు దేశాల మధ్య మంచి బంధం ఉందని పేర్కొన్నారు. శ్వేతసౌధంలో మంగళవారం ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తో భేటీ అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. "అమెరికా, చైనా మధ్య సంబంధాలు బాగానే ఉన్నాయి. ఐఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాల వంటి అత్యాధునిక సాధనాల్లో ఉపయోగించే రేర్ ఎర్త్ మాగ్నెట్లను బీజింగ్ మా దేశానికి ప్రస్తుతం రికార్డు స్థాయిలో ఎగుమతి చేస్తోంది. చైనాలో నేను పర్యటించే రోజు ఎంతో దూరంలో లేదు" అని ట్రంప్ పేర్కొన్నారు. పరస్పర సుంకాల పెంపుతో అమెరికా, చైనా మధ్య ఇటీవల వాణిజ్య యుద్ధం తరహా వాతావరణం తలెత్తినా.. ప్రస్తుతం పరిస్థితులు కొంత శాంతించినట్లే కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చైనాలో పర్యటించి, ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయితే ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు మరింత మెరుగవుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఫిలిప్పీన్స్ ఉత్పత్తులపై 19% సుంకం

ఫిలిప్పీన్స్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌తో భేటీ అనంతరం ట్రంప్ 'ట్రూత్ సోషల్' వేదికగా తెలిపారు. ఫిలిప్పీన్స్ నుంచి వచ్చే ఉత్పత్తులపై తమ దేశంలో 19% సుంకం విధించనున్నట్లు ప్రకటించారు. ఇది గతంలో హెచ్చరించిన మొత్తం కంటే కేవలం 1% తక్కువ. అమెరికా ఉత్పత్తులపై మాత్రం ఫిలిప్పీన్స్‌లో దిగుమతి సుంకమేమీ ఉండబోదని ట్రంప్ స్పష్టం చేశారు.

సాంకేతిక లోపంతో ఇండిగో విమానం రద్దు

గాల్లోకి ఎగిరే చివరి క్షణంలో నిలిపివేసిన పైలట్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 50 మంది ప్రయాణికులతో బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఇండిగో విమానం సాంకేతిక సమస్యల కారణంగా చివరి క్షణంలో రద్దయ్యింది. విమానం టేకాఫ్‌కు ముందు ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులు అసౌకర్యానికి గురికాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదా టికెట్ మొత్తాన్ని పూర్తిగా తిరిగి ఇచ్చే చర్యలు తీసుకున్నట్లు ఇండిగో విమానయాన సంస్థ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం బుధవారం ఉదయం 11:15 గంటలకు అహ్మదాబాద్ నుంచి దీవ్ వెళ్లాల్సిన ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం పైలట్లు ఈ సమాచారాన్ని అధికారులకు అందించి ఫ్లైట్‌ను వెనుకకు మళ్లించినట్లు ఇండిగో సంస్థ పేర్కొంది. ప్రయాణానికి ముందు నిర్వహణ, తనిఖీలు చేపట్టినట్లు వివరించింది. రన్ వే మీద టేకాఫ్ దశలో ఉండగా పైలట్ విమానాన్ని ఆపాలని నిర్ణయించినట్లు తెలిపింది. కొద్ది రోజులుగా ఇండిగో విమానాల్లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలో ఇది మూడోది కావడం గమనార్హం.

విమాన ప్రమాద మృతదేహాలు తారుమారు కాలేదు: భారత్

దిల్లీ: గత నెలలో సంభవించిన అహ్మదాబాద్-లండన్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు బ్రిటన్ పౌరుల మృతదేహాల బదులు వేరెవరివో వచ్చాయంటూ బ్రిటన్ పత్రిక "డెయిలీ మెయిల్" వెలువరించిన కథనాన్ని భారత్ బుధవారం ఖండించింది. మృతదేహాలను గుర్తించడానికి వృత్తిపరమైన నిబద్ధతతో పనిచేశామని, మృతుల గౌరవానికి భంగం కలగకుండా వ్యవహరించామని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. మృతుల గుర్తింపు ప్రక్రియ నిర్దిష్ట నియమాల ప్రకారం, సాంకేతిక అవసరాలకు అనుగుణంగానే నిర్వహించామని స్పష్టంచేశారు. మృతుల్లో 53 మంది బ్రిటన్ పౌరులు ఉన్నారు. వీరి మృతదేహాల అప్పగింతలో దారుణమైన తప్పిదాలు జరిగాయని, దానివల్ల మరింత వేదన చెందుతున్నామని బ్రిటన్‌కు చెందిన రెండు కుటుంబాలు పేర్కొన్నట్టు పత్రిక వెల్లడించింది.

జెలెన్‌స్కీకి వ్యతిరేకంగా ఆందోళనలు

- అవినీతి నిరోధక సంస్థలను బలహీనపరిచే బిల్లుపై వివాదం


ఉక్రెయిన్‌లో ఆందోళనకు దిగిన పౌరులు

కీవ్: అవినీతి నిరోధక సంస్థలను బలహీనపరుస్తూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఓ బిల్లుపై చేసిన సంతకం తీవ్ర దుమారానికి తెరలేపింది. దీనిపై యూరప్ అంతటా విమర్శలు వెల్లువెత్తగా.. దేశరాజధాని కీవ్‌లో సైతం భారీ ఎత్తున నిరసనలు జరిగాయి. రోడ్లపైకి చేరుకున్న ప్రజలు జెలెన్‌స్కీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని ఆందోళనలు నిర్వహించారు. జాతీయ అవినీతి నిరోధక సంస్థ (నాబు), ప్రత్యేక అవినీతి నిరోధక ప్రాసిక్యూటర్ కార్యాలయం (సోపా)లను ప్రాసిక్యూటర్ జనరల్ ఆధీనంలోకి తీసుకువచ్చే బిల్లుపై జెలెన్‌స్కీ సంతకం చేయడమే ఈ నిరసనలకు కారణం. ఇది అవినీతి నిరోధక సంస్థల అధికారాన్ని తక్కువ చేస్తుందని విమర్శకులు అంటున్నారు. అంతేకాదు ఈ బిల్లుపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి సైతం వ్యతిరేకత ఎదురైంది. ఇది తమ కూటమిలో ఉక్రెయిన్ చేరికకు అడ్డుగా నిలిచే అవకాశం లేకపోలేదని ఈయూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రష్యాతో యుద్ధం కీలక దశకు చేరుకున్న ఈ సమయంలో తనకు ఉన్న ప్రజా మద్దతు ప్రమాదంలో పడే అవకాశం ఉందని గ్రహించిన జెలెన్‌స్కీ.. అవినీతి నిరోధక శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు బుధవారం వెల్లడించారు. అనంతరం తన టెలిగ్రామ్ ఛానెల్ వేదికగా స్పందిస్తూ... అవినీతి నిరోధక సంస్థల్లో రష్యా ప్రభావాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ట్రంప్ పెళ్లిలో ఎప్‌స్టీన్ సందడి

- ఫొటోలు బయటపెట్టిన సీఎన్‌ఎన్



ఇంటర్నెట్‌డెస్క్: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం కేసు రోజురోజుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెడకు బిగుసుకుపోతోంది. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్, ట్రంప్‌నకు చాలా మంచి స్నేహం ఉందంటూ అమెరికా వార్తా పత్రికలు రోజుకో కథనాన్ని ప్రచురిస్తున్నాయి. 1993లో జరిగిన ట్రంప్, మార్లా మాపుల్స్ వివాహానికి ఎప్‌స్టీన్ హాజరైనట్లు సీఎన్‌ఎన్ ఓ కథనాన్ని తాజాగా వెలువరించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను సైతం విడుదల చేసింది. దీంతో వెంటనే ట్రంప్ తమ కార్యాలయానికి ఫోన్ చేసినట్లు సీఎన్‌ఎన్ పేర్కొంది. "మీరు నన్ను ఆట పట్టిస్తున్నారా? ఇది నకిలీ వార్త" అంటూ ఆగ్రహంగా ఆయన ఫోను పెట్టేశారని తెలిపింది. అయితే ఎప్‌స్టీన్ కుంభకోణానికి సంబంధించిన విచారణ పత్రాలను తాను ఎన్నికయిన తర్వాత విడుదల చేస్తానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎప్‌స్టీన్ 50వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు ట్రంప్ రాసిన ఓ లేఖను తాజాగా 'ది వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రిక ప్రచురించింది. ఆ తర్వాత న్యూయార్క్ టైమ్స్ పత్రిక సైతం ఎప్‌స్టీన్ కుంభకోణాన్ని బయటపెట్టిన మహిళల్లో ఒకరితో ఇంటర్వ్యూ నిర్వహించి ట్రంప్‌నకు ఎప్‌స్టీన్‌కు స్నేహం ఉందని బయటపెట్టింది. బుధవారం సీఎన్‌ఎస్ ట్రంప్ రెండో పెళ్లి చిత్రాలు సహా ఎప్‌స్టీన్‌తో ఆయన మాట్లాడుతున్న పలు వీడియోలు, ఫొటోలను విడుదల చేసింది.

ఆగస్టు 24 వరకు పాక్ విమానాలపై నిషేధం

దిల్లీ: పాకిస్థాన్ విమానాలకు భారత్ తన గగనతల మూసివేతను పొడిగించింది. ఆగస్టు 24 వరకు పాక్‌కు చెందిన అన్ని రకాల విమానాలపై ఈ నిషేధం ఉంటుందని కేంద్రం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ గగనతలంలోకి పాక్ ప్రవేశించకుండా కేంద్రం నిషేధాన్ని విధించిన విషయం తెలిసిందే. తొలుత మే 24వరకు గగనతలాన్ని మూసివేయగా దాన్ని మళ్లీ జూన్ 24 వరకు ఆ తర్వాత జులై 24వరకు పొడిగించింది. తాజాగా మరోసారి ఇంకొక నెల పాటు గగనతలాన్ని మూసివేస్తున్నట్లు తెలిపింది. ఇదే తరహాలో పాక్ సైతం తన గగనతలంలో భారత్ విమానాలకు నిషేధం విధించింది.

ఐర్లాండ్‌లో కాల్పులు.. ముగ్గురి మృతి

లండన్: ఉత్తర ఐర్లాండ్‌లోని ఓ గ్రామీణ ప్రాంతంలో చోటుచేసుకున్న కాల్పుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు గాయపడ్డారు. రాజధాని బెల్‌ఫాస్ట్‌కు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాగ్యురెస్ బ్రిడ్జ్ గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ కలహాలే కాల్పులకు దారి తీశాయని స్థానిక అసెంబ్లీ సభ్యురాలు జెమ్మా డోలన్ సామాజిక మాధ్యమ వేదికగా పేర్కొన్నారు. నలుగురికి తుపాకీ గాయాలు అయ్యాయని.. వారంతా ఒకే కుటుంబసభ్యులని పోలీసులు తెలిపారు. వీరిలో ముగ్గురు మృతి చెందగా మరో వ్యక్తి గాయపడినట్లు వెల్లడించారు.

చాంపియన్స్

పైచేయి సాధించడం.. అంతలోనే తడబాటు.. మళ్లీ ఆధిపత్యం.. ఆ తర్వాత చిక్కుల్లో పడడం! ఇంగ్లాండ్‌తో అండర్సన్-తెందుల్కర్ టెస్టు సిరీస్‌లో ఆరంభం నుంచి భారత్‌ది ఇదే కథ. నాలుగో టెస్టు ఇందుకు మినహాయింపేమీ కాదు. మూడో టెస్టులో పోరాడినా కొద్దిలో ఓడి సిరీస్‌లో వెనుకబడిన శుభ్‌మన్ సేన.. కీలకమైన నాలుగో టెస్టును బాగానే ఆరంభించింది. కానీ పాత అలవాటును కొనసాగిస్తూ దశల వారీగా తడబడి ప్రత్యర్థికి అవకాశం ఇచ్చింది. 94/0 నుంచి 140/3తో ఇబ్బందుల్లో పడిన టీమ్ఇండియా..235/3తో కోలుకుంది. మళ్లీ చివర్లో సుదర్శన్ వికెట్ కోల్పోవడం, పంత్ గాయంతో రిటైర్డ్‌హర్ట్ కావడంతో జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. అయినా తొలి రోజు ఆట భారత్‌కు సంతృప్తికరమే. పంత్.. రెండో రోజు బ్యాటింగ్‌కు వస్తాడా లేదా అనేదే సందేహం. ఒకవేళ అతడు రాకపోతే అది జట్టు భారీ స్కోరు అవకాశాలకు పెద్ద ఎదురుదెబ్బే!



సాయి సుదర్శన్ 61

భారత్ 264/4

నిలబడి.. తడబడి

- రాణించిన సుదర్శన్, యశస్వి
- ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టు

మాంచెస్టర్

సిరీస్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే గెలవాల్సిన లేదా కనీసం డ్రా చేసుకోవాల్సిన నాలుగో టెస్టును భారత్ మెరుగ్గానే ఆరంభించింది. సాయి సుదర్శన్ (61; 151 బంతుల్లో 7×4), యశస్వి జైస్వాల్ (58; 107 బంతుల్లో 10×4, 1×6) నిలవడంతో తొలి రోజు, బుధవారం ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 264 పరుగులు చేసింది. రాహుల్ (46; 98 బంతుల్లో 4×4) రాణించాడు. జడేజా (19), శార్దూల్ (19) క్రీజులో ఉన్నారు. గాయపడిన ఆకాశ్‌దీప్‌కు బదులు అన్షుల్ కాంబోజ్ అరంగేట్రం చేశాడు. కరుణ్ స్థానంలో సుదర్శన్, నితీష్ స్థానంలో శార్దూల్ ఈ మ్యాచ్‌లో ఆడారు.

నిలిచిన రాహుల్, యశస్వి: మబ్బులు పట్టిన వాతావరణం.. స్వింగ్, బౌన్స్‌కు అనుకూలంగా ఉన్న పిచ్! ఈ స్థితిలో టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు దింపింది ఇంగ్లాండ్. తమ పేసర్లు ఆరంభంలోనే వికెట్లు తీసి శుభారంభం అందిస్తారని ఆ జట్టు భావించింది. కానీ రాహుల్, యశస్వి జైస్వాల్ ఆ పాచిక పారనీయలేదు. వికెట్ చేజార్చుకోకూడదన్న కృతనిశ్చయంతో బ్యాటింగ్ చేశారు. ఆర్చర్, వోక్స్ చక్కటి లెంగ్త్‌తో బౌలింగ్ చేసి ఇబ్బంది పెట్టినా భారత ఓపెనర్లు ఆ పరీక్షకు నిలిచారు. స్వింగ్ అయిన కొన్ని బంతులు భారత బ్యాటర్లను బీట్ చేశాయి. ఒకటి రెండు సందర్భాల్లో యశస్వి బ్యాట్‌ను తాకి దాదాపు క్యాచ్ వెళ్లాయి. మూడో టెస్టులో ఆర్చర్ బౌలింగ్‌లోనే యశస్వి ఔట్ కావడంతో రాహులే ఎక్కువగా అతడిని ఎదుర్కొన్నాడు. ఆర్చర్ వేసిన తొలి 5 ఓవర్లలో రాహుల్ 25 బంతులు ఆడాడు. బంతిని ఆలస్యంగా ఆడుతూ స్వింగ్ వలలో పడకుండా చూసుకున్నాడు. కుదురుకున్న తర్వాత రాహుల్, యశస్వి తమ షాట్లు ఆడారు. ఒకవైపు నియంత్రణతో ఆడుతూనే మరోవైపు లైన్ తప్పిన బంతులను శిక్షించారు. వీలైనంతగా బ్యాక్‌ఫుట్‌లోనే పరుగులు రాబట్టారు. బౌన్స్, స్వింగ్ అవుతున్న పిచ్‌పై భారత్‌కు మెరుగైన ఆరంభాన్ని అందించారు. లంచ్‌కు కొద్దిసేపటి ముందు స్టోక్స్ వేసిన ఓ షార్ట్ బంతిని యశస్వి అప్పర్‌కట్‌తో సిక్స్‌గా మలిచాడు. 78/0తో భారత్ సంతృప్తికరంగా తొలి సెషన్‌ను ముగించింది.

పుంజుకున్న ఇంగ్లాండ్: లంచ్ తర్వాత భారత్ పరిస్థితి మారిపోయింది. ఇంగ్లాండ్ చకచకా వికెట్లు పడగొట్టి పట్టు సాధించింది. ఉదయం సెషన్లో ఎంతో పట్టుదలతో బ్యాటింగ్ చేసిన రాహుల్.. విరామం అనంతరం ఏకాగ్రత కోల్పోయాడు. వోక్స్ వేసిన ఓ ఔట్ స్వింగర్‌ను బ్యాక్‌ఫుట్‌లో ఆడేందుకు ప్రయత్నించి స్లిప్‌లో క్రాలీకి క్యాచ్ ఇచ్చాడు. దీంతో రాహుల్-యశస్వి 94 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఈ సిరీస్‌లో రెండో టెస్టు ఆడే అవకాశాన్ని దక్కించుకున్న సాయి సుదర్శన్ ఈ స్థితిలో యశస్వికి అండగా నిలిచాడు. ఓ ఫ్లిక్ షాట్‌తో ఖాతా తెరిచిన అతడు షాట్లు ఆడేందుకు తొందర పడలేదు. మరోవైపు కార్స్ బౌలింగ్‌లో ఓ సింగిల్‌తో యశస్వి 96 బంతుల్లో అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. కానీ ఎక్కువసేపు నిలవలేదు. ఎనిమిదేళ్ల తర్వాత టెస్టుల్లో ఆడుతున్న స్పిన్నర్ డాసన్.. యశస్విని బుట్టలో వేశాడు. డాసన్ బౌలింగ్‌లో అతడు ఫార్వర్డ్ డిఫెన్స్ ఆడబోగా.. బంతి ఎడ్జ్ తీసుకుని బ్రూక్ చేతిలో పడింది. 20 పరుగుల వద్ద సాయి సుదర్శన్ కొద్దిలో ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఊపిరి పీల్చుకునేలోగానే భారత్‌కు మరో షాక్ తగిలింది. గత టెస్టులో రాణించలేకపోయిన శుభ్‌మన్ గిల్ (12) మరోసారి స్వల్ప స్కోరుకే ఔటయ్యాడు. స్టోక్స్ బౌలింగ్‌లో శుభ్‌మన్ షాట్ ఆడకుండా వదిలేయగా.. ఔట్‌సైడ్ ఆఫ్‌స్టంప్‌పై పడిన బంతి లోపలికి దూసుకొచ్చి ప్యాడ్‌ను తాకింది. స్టోక్స్ అప్పీల్ చేయడం అంపైర్ ఔట్ ఇవ్వడం జరిగిపోయాయి. శుభ్‌మన్ సమీక్ష కోరినా ప్రయోజనం లేకపోయింది. లంచ్, టీ మధ్య 71 పరుగులు చేసిన భారత్.. 3 వికెట్లు కోల్పోయింది.

రాణించిన సుదర్శన్: టీ తర్వాత భారత్ పుంజుకుంది. ఆడుతుంది రెండో టెస్టే అయినా.. ఒత్తిడిలోనూ సుదర్శన్ నిలిచాడు. పటిష్టమైన డిఫెన్స్‌తో ఆకట్టుకున్న అతడు.. ప్రయోగాలకు పోకుండా సురక్షిత షాట్లే ఆడాడు. ముచ్చటైన డ్రైవ్‌లు కొట్టాడు. ఈ క్రమంలోనే రూట్ బౌలింగ్‌లో బౌండరీతో 134 బంతుల్లో టెస్టుల్లో తొలి అర్ధసెంచరీ అందుకున్నాడు. మరోవైపు రిషబ్ పంత్ (37 రిటైర్డ్ హర్ట్; 48 బంతుల్లో 2×4, 1×6) నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. కుదురుకున్నాక పంత్ ధాటిగా ఆడాడు. ఈ క్రమంలో కార్స్ బౌలింగ్‌లో అతడి తల మీదగా కొట్టిన సిక్స్ హైలైట్. దీంతో స్కోరు వేగం పెరిగింది. భారత్ 140/3 నుంచి 200/3తో కోలుకుంది. ఇన్నింగ్స్ గాడిలో పడినట్లే అనుకునేలోపు పంత్ అనూహ్యంగా పెవిలియన్ చేరాడు. రివర్స్ స్వీప్ ఆడే క్రమంలో గాయపడిన అతడు రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. కాసేపటికే భారత్‌కు ఇంకో షాక్! కుదురుకున్న సుదర్శన్‌ను స్టోక్స్ పెవిలియన్ చేర్చాడు. స్టోక్స్ బౌలింగ్‌లో సుదర్శన్ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించి ఔటయ్యాడు. తర్వాత జడేజా, శార్దూల్ మరో వికెట్ పడనీయలేదు. వెలుతురు మందగించడంతో ఆటను ముందుగానే ముగించారు.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) బ్రూక్ (బి) డాసన్ 58; రాహుల్ (సి) క్రాలీ (బి) వోక్స్ 46; సాయి సుదర్శన్ (సి) కార్స్ (బి) స్టోక్స్ 61; శుభ్‌మన్ ఎల్బీ (బి) స్టోక్స్ 12; పంత్ రిటైర్డ్ హర్ట్ 37; జడేజా బ్యాటింగ్ 19; శార్దూల్ బ్యాటింగ్ 19; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (83 ఓవర్లలో 4 వికెట్లకు) **264**; **వికెట్ల పతనం:** 1-94, 2-120, 3-140, 4-235; **బౌలింగ్:** వోక్స్ 17-4-43-1; ఆర్చర్ 16-2-44-0; కార్స్ 16-1-60-0; స్టోక్స్ 14-2-47-2; డాసన్ 15-1-45-1; రూట్ 5-0-19-0



ఇలా ఆడే ప్రయత్నంలో..

పంత్ రిటైర్డ్‌హర్ట్



టీమ్ఇండియాకు ఊహించని దెబ్బ తగిలింది. జోరు మీద కనిపించిన పంత్.. వోక్స్ వేసిన ఫుల్ లెంగ్త్ బంతిని రివర్స్ స్వీప్ ఆడేందుకు విఫలయత్నం చేశాడు. ఇంగ్లాండ్ ఎల్బీ అప్పీల్ చేసింది. అంపైర్ నిరాకరించడంతో సమీక్షకు వెళ్లింది. సమీక్షలో అతడి బ్యాట్‌కు బంతి తాకిందని తేలింది. అయితే బ్యాట్‌కు తగిలిన తర్వాత బంతి పంత్ కుడి పాదానికి బలంగా తాకడంతో గాయమైంది. పాదం బాగా వాపుతో పాటు రక్తం కారుతూ కనిపించింది. దీంతో పంత్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అతడు నడవలేకపోవడంతో గోల్ఫ్‌కార్ట్‌లో పెవిలియన్‌కు తీసుకెళ్లారు.

2089 టెస్టుల్లో యశస్వి సాధించిన పరుగులు. 23 ఏళ్ల వయసులో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్లలో అతడిది రెండో స్థానం. సచిన్ (3617) ముందున్నాడు.

● ఒకే టెస్టు మ్యాచ్‌లో అయిదుగురు ఎడమచేతి వాటం బ్యాటర్లతో బరిలో దిగడం భారత్‌కు ఇదే తొలిసారి.



అన్షుల్

అనుకోకుండా..

అన్షుల్ కాంబోజ్.. భారత్-ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌కు ముందు అతడు సీనియర్ జట్టు సెలక్షన్ కోసం పరిగణనలోనే లేడు. భారత్-ఎ తరపున ఇంగ్లాండ్ లయన్స్‌తో అనధికార టెస్టులు ఆడి ఇంటికి వచ్చేశాడు. కానీ ఈ కుర్రాడికి అనుకోకుండా టీమ్ఇండియా తరపున ఆడే అవకాశం దొరికింది. మాంచెస్టర్‌లో ఆరంభమైన నాలుగో టెస్టులో ఈ హరియాణా పేసర్ అరంగేట్రం చేశాడు. ఆల్‌రౌండర్ నితీష్ కుమార్‌రెడ్డి, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్‌లకు గాయాలు కావడంతో అన్షుల్‌ను భారత జట్టులోకి చేర్చారు సెలక్టర్లు. సిరీస్‌లో అప్పటికే రెండు టెస్టులు ఆడిన ప్రసిద్ధ్ కృష్ణ జట్టులో ఉండడంతో 24 ఏళ్ల అన్షుల్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందని అనుకోలేదు. కానీ మేనేజ్‌మెంట్ అన్షుల్‌పై నమ్మకముంచింది.

పాలన.. ప్రక్షాళన

క్రీడా సంఘాలంటే అంతర్గత కుమ్ములాటలు.. క్రీడా సంఘాలంటే అవినీతి, ఆశ్రిత పక్షపాతం.. క్రీడా సంఘం అంటే కేవలం రాజకీయం.. క్రీడా సంఘం అంటే ఆటల్ని అభివృద్ధి కంటే కొందరి స్వార్థం కోసమే ఎక్కువగా పనికొచ్చే వేదికలు. దేశంలో క్రీడల సమాఖ్యలపై ఇలాంటి ఎన్నో విమర్శలు. అవి నిరాధారమైనవేమీ కావు. కానీ భారత్ మేటి క్రీడా దేశంగా ఎదిగే దిశగా.. ఆటల్లో ప్రస్తుత అవ్యవస్థకు చరమగీతం పాడేందుకు ఓ గొప్ప ముందడుగు పడింది. ఆటల పాలన వ్యవస్థ సమూల ప్రక్షాళనకు భారత ప్రభుత్వం సిద్ధమైంది. క్రీడా సమాఖ్యల పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు.. నిర్ణయాల్లో అథ్లెట్లను భాగస్వాములను చేసేందుకు భారత ప్రభుత్వం కొత్త చట్టం తెస్తోంది. ఈమేరకు లోక్‌సభలో జాతీయ క్రీడల పాలన బిల్లును ప్రవేశపెట్టింది. జాతీయ క్రీడా సమాఖ్యలపై తిరుగులేని అధికారాలు ఉండే నేషనల్ స్పోర్ట్స్ బోర్డు ఏర్పాటు ఈ బిల్లులో అత్యంత ముఖ్యమైన అంశం.

- లోక్‌సభలో జాతీయ క్రీడా పాలన బిల్లు
- సమాఖ్యల పనితీరు మెరుగుదలే లక్ష్యం

దిల్లీ

దేశంలో క్రీడా పాలనలో సంస్కరణల కోసం భారత ప్రభుత్వం సిద్ధమైంది. క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ బుధవారం లోక్‌సభలో జాతీయ క్రీడల పాలన బిల్లును ప్రవేశపెట్టారు. జాతీయ క్రీడల బోర్డు (ఎన్‌ఎస్‌బీ) ఏర్పాటుకు ఈ బిల్లులో ప్రతిపాదించారు. నిబంధనలు రూపొందించడం, బీసీసీఐ సహా జాతీయ సమాఖ్యల పనితీరును పర్యవేక్షించడం వంటి విశేష అధికారాలు ఈ బోర్డుకు ఉంటాయి. ప్రభుత్వం నుంచి నిధులు పొందాలంటే అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్‌ఎస్‌ఎఫ్)లు ఎన్‌ఎస్‌బీ గుర్తింపు పొందాల్సివుంటుంది. "2036 ఒలింపిక్స్ బిడ్డింగ్ సన్నాహక కార్యకలాపాల్లో భాగంగా సత్ఫలితాల కోసం, మేజర్ అంతర్జాతీయ ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శన కోసం క్రీడా పాలనలో సానుకూల మార్పులు అవసరం" అని బిల్లు లక్ష్యాల ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బిల్లు చట్ట రూపం దాల్చడానికి కొంత సమయం పట్టనున్నా.. దీన్ని ప్రవేశ పెట్టడమే దేశంలో క్రీడా పాలనను మెరుగుపర్చడంలో గొప్ప ముందడుగు అనడంలో సందేహం లేదు. వివాదాల పరిష్కారానికి క్రీడా ట్రైబ్యునల్ ఏర్పాటు, పదవీకాల పరిమితి, పాలనలో క్రీడాకారులకు భాగస్వామ్యం కల్పించడం, సమాఖ్యల ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ వంటి ఎన్నో కీలక అంశాలు బిల్లులో ఉన్నాయి. ఈ బిల్లు ప్రకారం అన్ని ఎన్‌ఎస్‌ఎఫ్‌లు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) పరిధిలోకి వస్తాయి. దీన్ని బీసీసీఐ మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. "మేం బిల్లును అధ్యయనం చేయాలి. ఆ తర్వాత మాత్రమే దీని గురించి మాట్లాడగలం. మేం ప్రభుత్వంతో కూడా చర్చిస్తాం" అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పార్లమెంట్ వెలుపల చెప్పాడు.



మన్‌సుఖ్ మాండవీయ

జాతీయ క్రీడా పాలన బిల్లుతో దేశంలో సమాఖ్యల పనితీరులో, క్రీడల పాలనలో గణనీయమైన మార్పులు వస్తాయడంలో సందేహం లేదు. ఈ బిల్లులోని ముఖ్యాంశాలివి.

జాతీయ క్రీడల బోర్డు

ఈ బిల్లులో అత్యంత కీలకమైన అంశం నేషనల్ స్పోర్ట్స్ బోర్డు (ఎన్‌ఎస్‌బీ) ఏర్పాటు. జాతీయ సమాఖ్యలకు గుర్తింపునివ్వడం, గుర్తింపు రద్దు చేసే విషయంలో ఈ బోర్డుకు విశేషాధికారాలు ఉంటాయి. అథ్లెట్ల సంక్షేమం కోసం అంతర్జాతీయ సమాఖ్యలతో చేతులు కలపొచ్చు కూడా. ఎన్‌ఎస్‌బీకి ఛైర్మన్ ఉంటారు. ఛైర్మన్‌తో పాటు బోర్డు సభ్యులను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. కేబినెట్ కార్యదర్శి లేదా స్పోర్ట్స్ కార్యదర్శి ఈ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. సాయ్ డీజీ, ఇద్దరు క్రీడా పాలకులకు కూడా కమిటీలో చోటుంది. సకాలంలో ఎన్నికలు నిర్వహించని లేదా ఎన్నికల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డ సమాఖ్యను రద్దు చేసే అధికారం ఎన్‌ఎస్‌బీకీ ఉంటుంది. వార్షిక పద్దులను ప్రచురించకున్నా, నిధులను దుర్వినియోగం చేసినా.. సమాఖ్యలను ఎన్‌ఎస్‌బీ సస్పెండ్ చేయొచ్చు. కానీ ఈ చర్యలు తీసుకునే ముందు సంబంధిత అంతర్జాతీయ సమాఖ్యను సంప్రదించాల్సివుంటుంది. గుర్తింపు పొందిన క్రీడా సమాఖ్యలకు మాత్రమే ప్రభుత్వం నుంచి నిధులు అందుతాయి.

ఎన్నికల ప్యానెల్

జాతీయ క్రీడల బోర్డు సూచన మేరకు జాతీయ ఎన్నికల ప్యానెల్‌ను కూడా కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. భారత ఎన్నికల సంఘం లేదా రాష్ట్ర ఎన్నికల సంఘం రిటైర్డ్ సభ్యులు లేదా రిటైరైన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు లేదా తగిన అనుభవం ఉన్న డిప్యూటీ ఎన్నికల కమిషనర్లను ఈ ప్యానెల్‌కు ఎంపిక చేస్తారు. క్రీడా సంఘాల ఎగ్జిక్యూటివ్ కమిటీ, అథ్లెట్ కమిటీల ఎన్నికలను ఈ ప్యానెల్ పర్యవేక్షిస్తుంది.

స.హ చట్టం పరిధిలోకి..

గుర్తింపు గల అన్ని క్రీడా సంఘాలు సమాచార హక్కు చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ విషయంలోనే బీసీసీఐ, క్రీడల మంత్రిత్వ శాఖ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవచ్చు. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్ (టీ20 ఫార్మాట్) అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. దీంతో బీసీసీఐ జాతీయ సమాఖ్యగా ఎన్‌ఎస్‌బీ నుంచి గుర్తింపు పొందాల్సివుంటుంది. ప్రభుత్వం నుంచి తాము నిధులు పొందట్లేదు కాబట్టి ఆర్‌టీఐ తమకు వర్తించకూడదన్నది బీసీసీఐ వాదన.

వయసు.. పదవీకాలం

క్రీడా పాలకుల వయసు, పదవీకాలాన్ని కూడా బిల్లులో నిర్ణయించారు. సమాఖ్యల్లో అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి గరిష్ఠంగా 12 ఏళ్ల వరకు వరుసగా మూడు పర్యాయాలకు మించి పదవుల్లో ఉండరాదు. వయో పరిమితి 70 ఏళ్లు. సంబంధిత క్రీడకు సంబంధించిన అంతర్జాతీయ నిబంధనలు అనుమతిస్తే నామినేషన్ సమయంలో వయోపరిమితిని 75 ఏళ్లకు పెంచవచ్చు. ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు సమాఖ్యల ఎగ్జిక్యూటివ్ కమిటీలను 15కు పరిమితం చేశారు. ఇందులో కనీసం ఇద్దరు అగ్రశ్రేణి క్రీడాకారులు ఉండాలి. నలుగురు మహిళలు ఉండడం తప్పనిసరి.

కేసుల పరిష్కారానికి..

క్రీడల మంత్రిత్వ శాఖ ప్రకారం.. సెలక్షన్ నుంచి ఎలక్షన్ వరకు క్రీడలకు సంబంధించి దేశంలో వివిధ కోర్టుల్లో 350పై కేసులు ఉన్నాయి. అథ్లెట్లు, సమాఖ్యల ప్రగతిని ఇవి చాలా అడ్డుకుంటున్నాయి. నేషనల్ స్పోర్ట్స్ ట్రైబ్యునల్ ఏర్పాటుతో వివాదాలు త్వరగా పరిష్కారం కానున్నాయి. ఛైర్‌పర్సన్ సహా ముగ్గురు సభ్యులతో కూడిన ఈ ట్రైబ్యునల్‌కు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి. సిట్టింగ్ లేదా విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. ఈ ట్రైబ్యునల్ ఆదేశాలను సుప్రీంకోర్టులో మాత్రమే సవాలు చేయడానికి వీలుంటుంది. కింది కోర్టుల జోక్యం ఉండదు.



చైనా ఓపెన్

సింధు శుభారంభం

ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

చాంగ్‌జౌ: డబుల్ ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు చాలాకాలం తర్వాత తన స్థాయికి తగ్గ ప్రదర్శనతో అదరగొట్టింది. చైనా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో ఆరో ర్యాంకర్ తొమొక మియజాకి (జపాన్)పై విజయంతో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 21-15, 8-21, 21-17తో మియజాకిపై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 15వ స్థానంలో ఉన్న సింధు గత కొంతకాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతోంది. ఈ ఏడాది అయిదు టోర్నీల్లో సింధు తొలి రౌండ్లోనే నిష్క్రమించింది. మరో మ్యాచ్‌లో ఉన్నతి హుడా 21-11, 21-16తో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌లో సింధుతో పోరుకు సిద్ధమైంది. సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టి జోడీ ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సాత్విక్ ద్వయం 21-13, 21-9తో కెన్య మిత్సుహాషి- హిరొకి ఒకముర (జపాన్) జంటపై గెలుపొందింది.

ఇంజినీర్, లాయిడ్ పేరిట స్టాండ్లు

మాంచెస్టర్: భారత మాజీ వికెట్ కీపర్ ఫారూఖ్ ఇంజినీర్, వెస్టిండీస్ దిగ్గజం క్లైవ్ లాయిడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. లాంకషైర్ కౌంటీ క్రికెట్ క్లబ్.. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో రెండు స్టాండ్లకు ఇంజినీర్, లాయిడ్‌ల పేర్లు పెట్టింది. 1968 నుంచి 1976 వరకు లాంకషైర్ తరఫున ఆడిన ఇంజినీర్ 175 మ్యాచ్‌ల్లో 5942 పరుగులు సాధించాడు. 429 క్యాచ్‌లు అందుకుని.. 35 స్టంపింగ్‌లు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ తర్వాత మాంచెస్టర్‌ను నివాస ప్రాంతంగా మార్చుకున్న 87 ఏళ్ల ఇంజినీర్ ప్రస్తుతం అక్కడే ఉంటున్నాడు. భారత క్రికెట్‌తో.. ముంబయిలోని బ్రబోర్న్ స్టేడియంతో చిరస్మరణీయ అనుబంధం కలిగిన ఇంజినీర్ పేరిట ఇక్కడ స్టాండ్ లేకపోవడం గమనార్హం. "నేను ఎక్కువ క్రికెట్ ఆడిన చోట ఈ గౌరవం లభించకపోవడం సిగ్గుచేటు" అని ఇంజినీర్ అన్నాడు.

ఫైనల్లో దివ్య

మహిళల చెస్ ప్రపంచకప్

బాటుమి (జార్జియా): భారత చెస్ స్టార్ దివ్య దేశ్‌ముఖ్ అదరగొట్టింది. ఫిడే మహిళల ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత తొలి క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. సూపర్ ఫామ్‌ను కొనసాగించిన 19 ఏళ్ల దివ్య సెమీఫైనల్లో 1.5-0.5తో చైనాకు చెందిన ప్రపంచ మాజీ ఛాంపియన్ తాన్ జోంగ్యిపై విజయం సాధించింది. మంగళవారం సెమీస్ తొలి గేమ్‌ను డ్రాగా ముగించిన ఆమె.. బుధవారం తెల్లపావులతో ప్రత్యర్థిని ఓడించింది. మిడ్ గేమ్‌లో తాన్ చేసిన తప్పిదాలను దివ్య సొమ్ము చేసుకుంది. ఈ విజయంతో ఆమె 2026 క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సంపాదించింది. తొలి గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌ను కూడా సాధించింది. మరో సెమీపైనల్లో కోనేరు హంపి, లీ టింగ్‌జీ వరుసగా రెండో గేమ్‌ను డ్రాగా ముగించారు. వీళ్లు గురువారం టైబ్రేక్స్‌లో తపలడతారు.



దివ్య

రెండో యూత్ టెస్టు డ్రా

చెమ్స్‌ఫోర్డ్: భారత్-ఇంగ్లాండ్ అండర్-19 జట్ల మధ్య జరిగిన రెండో యూత్ టెస్టు డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 93/0తో బుధవారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 324/5 వద్ద డిక్లేర్ చేసింది. 355 పరుగుల ఛేదనలో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లకు 290 పరుగులు చేసింది. వర్షం, వెలుతురులేమి కారణంగా ఆట ముందే ఆగింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (126) సెంచరీ చేశాడు. అల్బర్ట్ (4/76) భారత్‌ను కట్టడి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 309.. భారత్ 279 పరుగులు చేశాయి.

కొత్తగా మొదలుపెట్టాల్సిందే

– హర్మన్‌ప్రీత్

చెస్టర్ లీ స్ట్రీట్: ఇంగ్లాండ్‌పై టీ20, వన్డే సిరీస్‌లో విజయాలు సాధించినా.. స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం కొత్తగా సిద్ధం కావాల్సి ఉంటుందని భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. క్రాంతి గౌడ్ (6/52) విజృంభించడంతో మంగళవారం మూడో వన్డేలో భారత్ 13 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించి సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆమె ఇలా వ్యాఖ్యానించింది. 'ఇంగ్లాండ్‌తో ప్రస్తుతం ఆడిన సిరీస్ భిన్నమైంది. ఇక్కడ పిచ్‌లు వేరు. వాతావరణం వేరు. ఇలాంటి కఠిన పరిస్థితుల్లోనూ టీ20, వన్డే సిరీస్‌లు గెలవడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. రాబోయే సిరీస్ లేదా.. స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచకప్ కోసం మళ్లీ కొత్తగా సిద్ధం కావాల్సిందే" అని హర్మన్‌ప్రీత్ తెలిపింది. కొన్నేళ్లుగా జట్టు బాగా కష్టపడుతోందని దాని ఫలితమే ఇంగ్లాండ్‌లో కనిపించిందని ఆమె పేర్కొంది. మూడో వన్డేలో హర్మన్‌ప్రీత్ (102) శతకం సాయంతో భారత్ 5 వికెట్లకు 318 పరుగులు చేసింది. బదులుగా ఇంగ్లాండ్.. క్రాంతి గౌడ్, శ్రీచరణి (2/68) ధాటికి 49.5 ఓవర్లలో 305 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ నాట్ సీవర్ (98) ఇంగ్లాండ్‌ను గెలిపించలేకపోయింది.



వన్డే సిరీస్ ట్రోఫీతో భారత జట్టు

క్వార్టర్స్‌లో పంకజ్, ఆదిత్య

మనామా (బహ్రెయిన్): ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ 6-రెడ్ స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో పంకజ్ అద్వాణీ, ఆదిత్య మెహతా క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. బుధవారం ప్రిక్వార్టర్స్‌లో పంకజ్ 4-2తో స్కలాకి (పోలెండ్)ను ఓడించాడు. ఆదిత్య మెహతా 4-3తో రంజాన్ (పాకిస్థాన్)పై నెగ్గాడు.

కబడ్డీ ఆటగాడు దీపక్ హుడాకు తప్పిన ప్రమాదం

హరిద్వార్: అంతర్జాతీయ కబడ్డీ ఆటగాడు, అర్జున అవార్డు విజేత దీపక్ హుడాకు పెను ప్రమాదం తప్పింది. హరిద్వార్ (ఉత్తరాఖండ్)లో గంగా నదిలో మునిగిపోతున్న అతణ్ని కాపాడారు. బుధవారం నదిలో స్నానం చేస్తుండగా దీపక్ కొట్టుకుపోయాడు. వెంటనే నదిలోకి దూకిన ఉత్తరాఖండ్ వాటర్ పోలీస్ డైవర్స్.. కొన్ని నిమిషాల్లో అతణ్ని బయటికి తీసుకొచ్చారు. దీపక్ తన స్నేహితులతో హరిద్వార్ వచ్చాడని పోలీసులు తెలిపారు. దీపక్ ప్రొ కబడ్డీ లీగ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. భారత జట్టు తరఫున అనేక పతకాలు గెలిచాడు.

మూడో రౌండ్లో తన్వీ, వెన్నెల

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ మహిళల సింగిల్స్‌లో భారత షట్లర్లు తన్వీ రెడ్డి, వెన్నెల కలగొట్ల మూడో రౌండ్‌కు దూసుకెళ్లారు. రెండో రౌండ్లో తన్వీ రెడ్డి 21-9, 21-10తో చియోక్ లాన్ (మకావు)పై నెగ్గగా.. వెన్నెల 21-6, 21-10తో కజకిస్థాన్‌కు చెందిన అలీసా కులెషోవాను ఓడించింది. రెండో సీడ్ తన్వీ శర్మ కూడా ముందంజ వేసింది. రెండో రౌండ్లో ఆమె 21-6, 21-6తో వైదేహి (యూఏఈ)ని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో అన్ష్ నేగి, ప్రణవ్ మూడో రౌండ్లో అడుగుపెట్టారు. నేగి 21-16, 21-15తో డింగ్ హాన్ జిన్ (సింగపూర్)పై, ప్రణవ్ 21-15, 21-7తో లాల్ జుదికా (మయన్మార్)పై గెలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో కీర్తి, విష్ణు కేదార్ జంట మూడో రౌండ్లో ప్రవేశించింది.

రసెల్ మెరిసినా.. ఆసీస్‌దే విజయం



రసెల్

కింగ్‌స్టన్: వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు ఘనంగా వీడ్కోలు పలికాడు. సొంతగడ్డ జమైకాలో తన కెరీర్ చివరి టీ20 మ్యాచ్ ఆడిన రసెల్.. స్థానిక అభిమానులను వరుస సిక్సర్లతో అలరించాడు. అయినా ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. మంగళవారం రెండో టీ20లో ఆసీస్ 8 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యం సంపాదించింది. బ్రెండన్ కింగ్ (51; 36 బంతుల్లో 3×4, 4×6), రసెల్ (36; 15 బంతుల్లో 2×4, 4×6) చెలరేగడంతో మొదట విండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 172 పరుగులు సాధించింది. 98/5తో విండీస్ కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులో అడుగుపెట్టిన రసెల్.. సిక్సర్లతో చెలరేగాడు. చివరికి నాథన్ ఎలిస్ బౌలింగ్‌లో ఔటైన రసెల్.. 15 బంతుల్లో 36 పరుగులు రాబట్టాడు. అనంతరం మరో 28 బంతులు మిగిలివుండగానే ఆసీస్ లక్ష్యాన్ని ఛేదించింది. జోష్ ఇంగ్లిస్ (78 నాటౌట్), కామెరూన్ గ్రీన్ (56 నాటౌట్) విధ్వంసం సృష్టించడంతో ఆసీస్ 15.2 ఓవర్లలో 2 వికెట్లకు 173 పరుగులు సాధించింది. విండీస్ తరఫున 86 టీ20లు ఆడిన రసెల్.. 163.79 స్ట్రైక్‌రేటుతో 1122 పరుగులు సాధించి, 61 వికెట్లు తీశాడు.

దేశంలోనే పెద్ద కుంభకోణం!

దిల్లీ, ఛత్తీస్‌గఢ్ మద్యం స్కాంల కంటే అనేక రెట్లు దోపిడీ



ఈనాడు, అమరావతి: దిల్లీ మద్యం కుంభకోణం గురించి విన్నాం. ఛత్తీస్‌గఢ్ మద్యం స్కాం గురించి చదివాం. రాష్ట్రంలో జగన్ జమానాలో మనం చూసిన మద్యం కుంభకోణం మాత్రం వాటన్నింటినీ తలదన్నే లాంటిది. దేశచరిత్రలోనే అతి భారీది. అత్యధిక మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న కంపెనీలు, డిస్టిలరీల నుంచి నాటి ప్రభుత్వ పెద్దలు రూ.3,500 కోట్ల ముడుపులు కొల్లగొట్టారని సిట్ ప్రాథమికంగా తేల్చింది. ఈ కుంభకోణంతో రాష్ట్రప్రభుత్వ ఖజానాకు రూ.18,860 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కూటమి ప్రభుత్వం శ్వేతపత్రంలో ప్రకటించింది. దీన్నిబట్టి ఇది ఎంత పెద్ద కుంభకోణమో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వరంగ కార్పొరేషన్ల చేతుల్లోని మద్యం వ్యాపారాన్ని ప్రైవేటు వ్యాపారులకు అప్పగించడం ద్వారా దిల్లీలో కుంభకోణానికి పాల్పడగా.. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌ల్లో ప్రభుత్వమే మద్యం వ్యాపారం నిర్వహించి దోపిడీకి పాల్పడింది.

దిల్లీ మద్యం కుంభకోణం (2021-22 మధ్య)

- **ముడుపుల రూపంలో కొల్లగొట్టింది:** రూ.100 కోట్లు
- **రాష్ట్రప్రభుత్వ ఖజానాకు కలిగిన నష్టం:** రూ.600 కోట్లు
- **కేసు దర్యాప్తు చేస్తున్న సంస్థలు:** సీబీఐ, ఈడీ
- **అరెస్టులు:** అప్పటి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోదియా, ఎక్సైజ్ శాఖ మంత్రి సత్యేంద్ర జైన్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, భారాస ఎమ్మెల్సీ కె.కవిత, అరబిందో శరత్‌చంద్రారెడ్డి, మాగుంట రాఘవ సహా మొత్తం 17 మంది అరెస్టయ్యారు. మనీష్ సిసోదియా దాదాపు ఏడాదిన్నర పాటు జైల్లో ఉన్నారు.
- **కుంభకోణం జరిగిందిలా:** దిల్లీలో ప్రభుత్వరంగ కార్పొరేషన్ల ద్వారా నిర్వహించే మద్యం వ్యాపారాన్ని.. ప్రైవేటు వ్యాపారులకు అప్పగించేలా అప్పటి ఆప్ ప్రభుత్వం నూతన మద్యం విధానం తీసుకొచ్చింది. వ్యాపారులకు 12% లాభం దక్కేలా చేసినందుకు ఆ ముఠా నుంచి ఆప్ నేతలు రూ.100 కోట్ల ముడుపులు తీసుకున్నారనేది అభియోగం.

ఈ సొమ్మును ఆప్ నేతలు గోవా, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఖర్చుచేశారని, డొల్ల కంపెనీలు ఏర్పాటుచేశారని, హవాలా మార్గాల్లో తరలించుకున్నారని ఈడీ పేర్కొంది. ఈ చర్యల వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.600 కోట్ల నష్టం వాటిల్లిందని తేల్చింది.

ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం (2019-22 మధ్య)

- **కుంభకోణం విలువ:** రూ.2,161 కోట్లు
- **కేసు దర్యాప్తు చేస్తున్న సంస్థలు:** ఈడీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఆర్థికనేరాల విభాగం
- **అరెస్టులు:** అప్పటి ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్, నాటి ఎక్సైజ్‌మంత్రి కవాసీ లక్మా, సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్ టుటేజా, మద్యం ముఠా నాయకుడు అన్వర్ దేబర్, మరో 29 మంది ఎక్సైజ్ శాఖాధికారులు.
- **కుంభకోణం జరిగిందిలా:** ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వమే మద్యం వ్యాపారం నిర్వహించేది. కొందరు నాయకులు, అధికారులు కలిసి సిండికేట్‌గా ఏర్పడి మద్యం సరఫరా వ్యవస్థను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారనేది ప్రధాన అభియోగం.

మూడేళ్లలో రూ.2,161 కోట్ల మేర లబ్ధి పొందారని ఈడీ ప్రాథమికంగా తేల్చింది.

- మద్యం సరఫరా చేసే కంపెనీల నుంచి బ్రాండ్‌ను బట్టి ఒక్కో మద్యం కేసుపై రూ.75-150 వరకూ కమీషన్ వసూలుచేశారు. ప్రైవేటుగా మద్యం తయారుచేయించి... దాన్ని ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించారు. తద్వారా 30-40% కమీషన్ పొందారు. 2019-22 మధ్య రూ.1,200-1,500 కోట్లు అక్రమంగా ఆర్జించారు.
- రాష్ట్రంలో అమ్ముడయ్యే ప్రతి మద్యం సీసా నుంచి చట్టవిరుద్ధంగా డబ్బులు వసూలుచేశారు. డిస్టిలరీ నుంచి ప్రభుత్వ గోదాములకు కాకుండా మద్యం నేరుగా దుకాణాలకే సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో చూపించకుండా మద్యం అమ్మేలా సిబ్బందికి శిక్షణిచ్చారు. మొత్తం నగదు రూపంలోనే లావాదేవీలన్నీ నిర్వహించారు." అని ఈడీ తేల్చింది.

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం (2019-24 మధ్య)

- **ముడుపుల రూపంలో కొల్లగొట్టింది: రూ.3,500 కోట్లపైనే**
- **రాష్ట్రప్రభుత్వ ఖజానాకు నష్టం:** రూ.18,860 కోట్లు
- **కేసు దర్యాప్తు చేస్తున్న సంస్థ:** ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)
- **అరెస్టులు:** నాటి ముఖ్యమంత్రి జగన్‌కు అత్యంత సన్నిహితులైన వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, అప్పటి సీఎంఓ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డి, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జగన్ సతీమణి భారతి తరఫున ఆర్థిక వ్యవహారాలు చూసే భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, నాటి ప్రభుత్వ పెద్దల తరఫున ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహించి.. ఎప్పటికప్పుడు ఆ సొత్తును జగన్‌కు చేర్చిన ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, ఆయన అనుచరగణం సహా మొత్తం 12 మంది.
- **కుంభకోణం జరిగిందిలా:** 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే ముడుపులు కొల్లగొట్టేందుకు, దోపిడీకి వీలుగా నూతన మద్యం విధానాన్ని రూపొందించి ప్రభుత్వ దుకాణాలు తీసుకొచ్చింది. మద్యం తయారీ, కొనుగోలు, సరఫరా, విక్రయాలన్నింటినీ వైకాపా ముఠా గుత్తాధిపత్యంలో పెట్టుకుంది. బ్రాండ్ల మూలధర ఆధారంగా ఒక్కో మద్యం కేసుకు రూ.150-600 చొప్పున ముడుపులుగా నిర్ణయించి.. అవి కట్టిన కంపెనీలకే అత్యధికంగా సరఫరా ఆర్డర్లు ఇచ్చింది. అందుకు నిరాకరించిన కంపెనీల బ్రాండ్లను మార్కెట్ నుంచి తరిమేసింది. ఇలా ముడుపుల రూపంలోనే రూ.3,500 కోట్లకు పైగా కొల్లగొట్టింది.
- రూ.లక్ష కోట్లకు పైగా మద్యం విక్రయాలను నగదు రూపంలోనే చేపట్టింది. రికార్డుల్లో చూపించకుండా సుంకం చెల్లించని మద్యాన్ని అమ్మి ఆ సొత్తు జేబుల్లోకి వేసుకునేందుకు నాటి ప్రభుత్వ పెద్దలు నగదు లావాదేవీలు చేశారనే ఆరోపణలున్నాయి.
- ఇతరుల చేతుల్లో ఉన్న డిస్టిలరీలను బెదిరించి, భయపెట్టి లాగేసుకుని.. వాటిలో జే బ్రాండ్లు ఉత్పత్తి చేసి వాటిని బెవరేజెస్ కార్పొరేషన్‌తో కొనిపించి భారీగా దోచుకున్నారు. ఈ దోచుకున్న డబ్బుతో దుబాయ్ సహా పలు దేశాల్లో కంపెనీలు పెట్టారు. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేందుకు స్థిరాస్తి రంగంలోనూ, సినిమాల్లోనూ పెట్టుబడులు పెట్టారు.

రూ.10కే ఆకలి తీరుస్తున్న రైతు



వెజ్ బిర్యానీ వడ్డిస్తున్న రైతు శివాజీ

ఈనాడు, ఏలూరు: పది రూపాయలకు సరైన టీ దొరకడమే కష్టం.. అదే పదికి వెజ్ బిర్యానీ వడ్డిస్తున్నారు ఆ రైతు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఆసుపత్రికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు నిత్యం వస్తుంటారు. వారొచ్చిన వేళ అధికారులు అందుబాటులో లేకపోతే తిరిగెళ్లి రాలేక కాలే కడుపులతో కొందరు అక్కడే అలమటిస్తున్నారు. దీన్ని గుర్తించిన స్థానిక రైతు వీరమాచనేని శివాజీ సామాజిక స్పృహతో తక్కువ మొత్తానికే వారి ఆకలి తీర్చాలనుకున్నారు. అందుకు తన వ్యవసాయ క్షేత్రంలో పండే సేంద్రియ బియ్యంతో బిర్యానీ తయారు చేస్తున్నారు. రూ.10కే వెజ్ బిర్యానీ వడ్డిస్తున్నారు. 2016 నుంచి 2019 వరకు సుమారు నాలుగేళ్ల పాటు రూ.5కే వెజ్ బిర్యానీ అందించారు. గడిచిన ఐదేళ్లు అనివార్య పరిస్థితుల్లో ఆపేయగా.. వారం క్రితం తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం రూ.10కి 200 గ్రాముల వెజ్ బిర్యానీ ఇస్తున్నారు. అలాగే రూ.10కి పెరుగన్నం పెడుతున్నారు. రోజుకు సగటున 75 నుంచి 100 మంది తింటున్నారు. 'రోజూ తెల్లవారుజామున 4 గంటలకు లేచి, నేనే కూరగాయలు తరుగుతా. 10 గంటలకు వంట ప్రారంభించి 12 గంటల కల్లా సిద్ధం చేస్తా. సహాయకురాలిగా ఒకరిని పెట్టుకున్నా. నాకు లాభం అవసరం లేదు. ఒక రైతుగా.. ఆకలి విలువ తెలిసిన వ్యక్తిగా ఇది చేస్తున్నా' అని శివాజీ పేర్కొన్నారు.

మీ ఊరి పేరు చెప్పాలంటే ఇబ్బందిగా ఉందా?

అభ్యంతరకర పేర్లు మార్చాలనే వినతుల పరిశీలనకు మంత్రివర్గ ఉపసంఘం

ఈనాడు, కర్నూలు: ఊరి పేరు చివర 'పెంట' అనో, ముందు 'పంది' అనో ఉంటే వాటిని పలకడానికి ఆయా గ్రామాల వారికి ఇబ్బందిగా ఉంటుంది. ఈ తరహా పేర్లను మార్చాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వాటిని పరిశీలించి, తగు సిఫార్సులు చేసేందుకు ఇప్పటికే ఏడుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. దీంతో కొన్ని దశాబ్దాలుగా తమ గ్రామాల పేర్లు మార్చాలని డిమాండ్ చేస్తున్న వారి ఆకాంక్ష నెరవేరనుంది. ఇదే సందర్భంలో కొన్నేళ్లుగా ఆ పేర్లు కొనసాగుతుండడంతో వాటిని మార్చకూడదనే వారూ ఉన్నారు.

అలాంటి కొన్ని పేర్లు..

- శ్రీశైలం సమీపంలో 'సున్నిపెంట' అనే గ్రామం ఉంది. వాస్తవానికి ఈ ప్రాంతాన్ని పూర్వం 'విష్ణుగిరి' అని పిలిచేవారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కొంతకాలం దీన్ని 'శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ'గా పిలిచారు. తర్వాత సున్నిపెంట/సుండిపెంట అని పిలవడం మొదలైందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో 'సుండిపెంట' అని ఉంది.
- కర్నూలు గ్రామీణ మండల పరిధిలోని ఓ ప్రాంతానికి ఎల్.పేట (ఎల్ అంటే అసభ్యకర పదం) అనే పేరు నేటికీ కొనసాగుతోంది.
- నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల పంచాయతీ పరిధిలో సదరంపెంట, వెలుగోడు మండలంలో వేంపెంట, చాగలమర్రి మండలంలో డీవనిపెంట గ్రామాలున్నాయి.
- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో చవటపుత్తేడు గ్రామం పేరును 'బృందావనం'గా మార్చాలని అక్కడి వారు కోరుతున్నారు. రాపూరు మండలం తెగచర్ల పంచాయతీలో గరిమెనపెంట, కావలి మండలంలో తుమ్మలపెంట, లింగసముద్రం మండలంలో పెంట్రాల, చీమలపెంట, కొండాపురం మండలంలో గానుగపెంట, గరిమెనపెంట, ఎ.ఎస్.పేట మండలంలో పందిపాడు గ్రామాలున్నాయి.
- శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలో గాండ్లపెంట అనే ఊరుంది.
- అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలో 'కుక్కలదొడ్డి', వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలో 'చీమలపెంట' గ్రామాలున్నాయి. వీటి పేర్లు మార్చాలని గ్రామస్థులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్యకేసులో..

రంగంలోకి దిగిన సిట్

ఎమ్మెల్సీ అనంతబాబు సహా ఇతరుల పాత్రపై విచారణ మొదలు

ఈనాడు, కాకినాడ: కాకినాడకు చెందిన దళిత యువకుడు, వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యకేసు సమగ్ర విచారణకు కోర్టు అనుమతి ఇచ్చిన మరుసటి రోజే ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) రంగంలోకి దిగింది. గతంలో ఈ కేసును ఇద్దరు డీఎస్పీలు విచారించి, ఛార్జిషీట్ వేసినా నిందితునిగా ఎమ్మెల్సీ అనంతబాబును తప్ప ఇతర దోషుల పాత్రను బయటపెట్టలేక పోయారు. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఫిర్యాదుతో... మొత్తం పాత్రధారులను తేల్చేందుకు సిట్ బుధవారం దర్యాప్తు మొదలుపెట్టింది. నాడు ఎమ్మెల్సీకి గన్‌మెన్‌గా విధులు నిర్వహించిన వారిని తొలుత విచారించినట్లు తెలిసింది. గతంలో కాల్‌డేటాలను సీజ్ చేసినా హత్య జరిగిన రోజు సంభాషణలనే పరిగణనలోకి తీసుకున్నారు తప్ప అంతకుముందు అనంతబాబు ఎవరెవరితో మాట్లాడారు? ఆర్థిక లావాదేవీలు ఏమిటో పరిశీలించనే లేదు. గూగుల్ టేక్అవుట్ దిశగానూ విచారణ చేపట్టనున్నారు. సాంకేతిక ఆధారాల కోసం టెలికాం, బ్యాంకులు, ఇతర సంస్థలకు లేఖలు రాసినట్లు సమాచారం. సుబ్రహ్మణ్యం శరీరంపై పెద్దసంఖ్యలో గాయాలుండటం, మృతదేహాన్ని కారులో ఎక్కించడం... వంటి వాటిని చూస్తే ఎమ్మెల్సీతో పాటు మరికొందరి పాత్రా ఉన్నట్లు తెలుస్తున్నా దానిని ప్రస్తావించకుండానే అప్పట్లో విచారణను ముగించారు. ప్రస్తుత దర్యాప్తులో అవన్నీ వెలుగు చూడనున్నాయి. కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆధ్వర్యంలో సీఐ వి.కృష్ణ, ఎస్‌ఐలు వినయ్ ప్రతాప్, శ్రీనివాస్ కుమార్, హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ సిట్ బృందంలో ఉన్నారు.

భర్తను హత్య చేయించిన భార్య

మూడేళ్ల కుమార్తె చెప్పిన సమాచారంతో నిందితుల అరెస్టు



నిందితులు నందిని, సంజయ్



భరత్

చెన్నై(ట్రిప్లికేన్), న్యూస్‌టుడే: వివాహేతర సంబంధం పెట్టుకున్న యువకుడితో కలిసి భార్య.. భర్తను హత్య చేయించిన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. మూడేళ్ల కుమార్తె చెప్పిన సమాచారంతో పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వేలూరు జిల్లా ఒడుకత్తూర్ వద్ద కుప్పంపాళ్యానికి చెందిన భారత్(36) చెన్నైలోని ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఐదేళ్ల కిందట బెంగళూరుకు చెందిన 26 ఏళ్ల నందినితో వివాహమైంది. వారికి నాలుగు, మూడేళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారాంతపు సెలవు రోజుల్లో భార్యాపిల్లలను చూసేందుకు భారత్ ఇంటికొస్తుంటాడు. ఈ నెల 21న ఇంటికొచ్చిన భారత్ సరకుల కోసం భార్య, చిన్న కుమార్తెను తీసుకుని ద్విచక్ర వాహనంపై దుకాణానికి వెళ్లాడు. తిరిగొస్తున్నప్పుడు రోడ్డులో కొబ్బరిమట్టలు అడ్డుగా ఉండటంతో వాటిని దాటే యత్నంలో అదుపుతప్పి కిందపడిపోయాడు. అక్కడే దాక్కున్న ఓ వ్యక్తి ఆయుధంతో భారత్‌పై తీవ్రంగా దాడి చేసి పారిపోయాడు. బాధితుడు ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచాడు. విచారణలో నందిని పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సందేహం వచ్చింది. భారత్ చిన్న కుమార్తెను ఆరా తీయగా.. సంజయ్ మామ తన తండ్రిపై దాడి చేసినట్లు చెప్పింది. నందినికి.. ఎదురింట్లో ఉండే 21 ఏళ్ల సంజయ్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలిసి భారత్ పలుమార్లు భార్యను హెచ్చరించాడు. దీంతో భారత్‌ను హతమార్చేందుకు ఇద్దరూ పథకం వేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. పోలీసులు నిందితులిద్దరినీ మంగళవారం కోర్టులో హాజరుపర్చి, జైలుకు తరలించారు.

ముందస్తు బెయిల్ కేసులో 49 పేజీల తీర్పా?

- మినీ ట్రయల్ నిర్వహించేసినట్లుంది
- సీఐడీ మాజీ ఏడీజీ సంజయ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య
- ఆయన హయాంలో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఇన్వాయిస్‌లు ఇవ్వండి
- ఏపీ ప్రభుత్వానికి సూచన



ఈనాడు, దిల్లీ: వైకాపా హయాంలో సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేసినప్పుడు ఐపీఎస్ అధికారి ఎన్.సంజయ్‌పై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ ఇస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 49 పేజీల తీర్పు వెలువరించడం పట్ల సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్‌పై విచారణను మినీట్రయల్‌లా నిర్వహించినట్లుందని వ్యాఖ్యానించింది. ఏసీబీ కేసులో సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ జనవరి 30న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఎస్‌ఎల్‌పీ వేసింది. దీనిపై బుధవారం విచారించిన జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపించారు. 'సంజయ్ 2023లో సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నప్పుడు ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టం గురించి అవగాహన కల్పించడానికి సమావేశాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించే కాంట్రాక్ట్ టెండర్ ప్రక్రియను తప్పుదోవ పట్టించారు. ఇందుకోసం క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో జనవరి 30న ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. అవగాహన కార్యక్రమాలు సీఐడీ సిబ్బంది నిర్వహించినప్పటికీ తామే చేశామంటూ రూ.59.52 లక్షలు, రూ.59.51 లక్షల బిల్లులు విడుదల చేయాలని అదే రోజు క్రిత్వ్యాప్ సంస్థ ఇన్వాయిస్‌లు సమర్పించింది. ఒప్పందాల ఖరారు, ఇన్వాయిస్‌ల సమర్పణ ఒకేసారి జరిగింది' అని పేర్కొన్నారు. అదే రోజు వర్క్‌షాప్‌లు కూడా జరిగాయా అని న్యాయమూర్తి అహసనుద్దీన్ ప్రశ్నించారు. క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌తో జనవరి 30న ఒప్పందం చేసుకుంటే 27, 28, 29 తేదీల్లో 25 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారని ఎస్.వి.రాజు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె చెల్లించినట్లు, ఫర్నీచర్ తెప్పించినట్లు, అధికారులు మొబైల్ ఫోన్లలో చేసిన వీడియోగ్రఫీని డబ్బులిచ్చి చేయించినట్లు, ఆహారం సరఫరా చేయకున్నా చేసినట్లు ఇలా అన్నీ నకిలీ బిల్లులు చూపారని పేర్కొన్నారు. గుంటూరు, తిరుపతిల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించకపోయినా ఆ సంస్థ బిల్లులు క్లెయిమ్ చేసిందన్నారు.

ఒప్పందంలో ఏం చెప్పారో చూడొచ్చా?

జస్టిస్ అహసనుద్దీన్ జోక్యం చేసుకుంటూ ఆ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏం చెప్పారో చూడొచ్చా అని ప్రశ్నించారు. ఒప్పందం కాపీ తమ వద్ద లేదని, సమర్పించేందుకు సమయమివ్వాలని న్యాయవాది కోరారు. జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి జోక్యం చేసుకుంటూ ఒప్పందపత్రంతో పాటు, ఇన్వాయిస్ కాపీ కూడా ముఖ్యమన్నారు. దీంతో ధర్మాసనం విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

నిరాధార ఆరోపణలు చేస్తున్నారు: కపిల్ సిబల్

సంజయ్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చారు. నిరాధార ఆరోపణలు చేశారన్నారు. ఫిబ్రవరిలో ఇన్వాయిస్‌లు పంపితే జులైలో బిల్లులు చెల్లించారని.. ఒప్పందపత్రం, ఇన్వాయిస్‌లు సమర్పిస్తే అన్నీ తెలుస్తాయని చెప్పారు.

వెనక బెంచీల్లేకుండా..

పర్చూరు, న్యూస్‌టుడే: ఏ ఒక్క విద్యార్థీ వెనకపడకూడదనే ఉద్దేశంతో తరగతి గదుల్లోని బెంచీలను వృత్తాకారంలో ఏర్పాటు చేశారు బాపట్ల జిల్లా పర్చూరు మండలం అడుసుమల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. కేరళలో పురుడు పోసుకున్న ఈ కొత్త ఆలోచన అన్ని ప్రాంతాలకూ చేరుతోంది. ఇలా అయితే విద్యార్థులు పాఠ్యాంశాలు వినే తీరును గమనించి, ఎప్పటికప్పుడు సూచనలు చేయవచ్చని ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాకుమారి తెలిపారు.



వృత్తాకారంలో అమర్చిన బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

రోజుకు 2 టీఎంసీల చొప్పున 146 రోజులు సముద్రం పాలు!


గోదావరిలో సగటున 3,000 టీఎంసీల వృథా

పోలవరం వద్ద సగటున 651 టీఎంసీల వరద లభ్యత

- ఆ నీటి నుంచే బనకచర్లకు మళ్లించే ఆస్కారం
- ఆంధ్రప్రదేశ్ వాదనలు



ధవళేశ్వరం బ్యారేజి నుంచి సముద్రంవైపు వెళ్తున్న జలాలు



పోలవరం-బనకచర్ల అనుసంధానానికి అవసరమైన మిగులు జలాలు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. 50 ఏళ్లకు పైగా గణాంకాలతో మాట్లాడుతున్నాను. ఈ విషయంలో అనుమానాలు అవసరం లేదు.

- దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి వద్ద ఏర్పాటైన సీఎంల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుతో రోజూ 2 టీఎంసీల గోదావరి నికర జలాలు కరవు ప్రాంతాలకు మళ్లించాలనేది లక్ష్యం. సగటున ఏటా 3,000 టీఎంసీలకు పైగా వరదనీరు సముద్రం పాలవుతోంది. ఈ మిగులు జలాలు 75% విశ్వసనీయత వద్ద ఏ మేరకు ఉంటాయి? అసలు సగటున 3,000 టీఎంసీల సముద్రంలో కలిసినా ఎన్ని రోజుల పాటు 2 టీఎంసీలు బనకచర్లకు మళ్లించేందుకు వీలుంటుందనేది చర్చనీయాంశమవుతోంది. ఈ నేపథ్యంలో జలవనరుల శాఖ గోదావరిలో 57 ఏళ్ల చరిత్రను పరిగణనలోకి తీసుకుని అసలు ఎన్ని రోజుల పాటు ఎన్ని క్యూసెక్కుల ప్రవాహం సముద్రంలో కలిసిపోతోందో లెక్కలు తీశారు. ఆ గణాంకాల ఆధారంగానే ముఖ్యమంత్రి దిల్లీలో తన వాదన వినిపించారు.

వృథా అవుతున్నది 146 రోజులు

పోలవరం ప్రాజెక్టు వద్ద రోజుకు 25 వేల క్యూసెక్కులకు పైగా సముద్రంలోకి వృథాగా వరద పోతున్నది సగటున 146 రోజులుగా లెక్కించారు. అంటే రోజుకు 2 టీఎంసీలకు పైగా సముద్రంలో కలిసిపోతున్నాయి. 1990-91 నీటి సంవత్సరంలో ఏకంగా 209 రోజుల పాటు ఇలా రోజుకు 2 టీఎంసీలకు పైగా వృథా అయ్యాయి. అత్యంత కనిష్ఠంగా నమోదైన 2009-10 నీటి సంవత్సరంలో కూడా 92 రోజుల పాటు రోజుకు 2 టీఎంసీలకు పైగా సముద్రంలో కలిసిపోయాయి.

57 ఏళ్ల సగటు లెక్కల ప్రకారం సముద్రంలో వృథాగా కలిసిపోయే రోజులు..

- రోజుకు 4 టీఎంసీలు: 110
- రోజుకు 7 టీఎంసీలు: 94
- రోజుకు 9 టీఎంసీలు: 82
- రోజుకు 11 టీఎంసీలు: 72
- రోజుకు 14 టీఎంసీలు: 64

పోలవరం-బనకచర్లకు అందుబాటులో దాదాపు 651 టీఎంసీలు!

మిగులు జలాల ఆధారంగా ఏపీ ప్రభుత్వం చేపట్టబోతున్న ఈ ప్రాజెక్టుకు పోలవరం వద్ద 651 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని, అందులోంచి 200 టీఎంసీలు మళ్లించాలనేది ప్రణాళిక. 75% విశ్వసనీయత వద్ద 2,194 టీఎంసీలు, సగటు నీటి లభ్యత 2,842 టీఎంసీలను పరిగణనలోకి తీసుకుని ఈ గణాంకాలను ఆంధ్రప్రదేశ్ సిద్ధం చేసింది. అవి ఇలా ఉన్నాయి. **(అంకెలన్నీ టీఎంసీల్లో)**

గోదావరి ఉప పరీవాహకం	75% విశ్వసనీయత వద్ద	ఏపీ, తెలంగాణ వాటాలు	ఇతర రాష్ట్రాల వాటాలు	మొత్తం వినియోగం	సగటు నీటి లభ్యత	మొత్తం ఏపీ తెలంగాణ వాటా
జీ 1 నుంచి జీ 9 వరకు (కాళేశ్వరం వరకు)	832	284	545	829	1,049	525
ఇంద్రావతి (జీ 11)	737	280	457	737	981	502
దిగువ గోదావరి (జీ 10)	231	211	20	231	316	304
శబరి (జీ 12)	393	148	245	393	495	221
మొత్తం	2,193	923	1,267	2,190	2,841	1,552

పోలవరం వద్ద సగటున వరద జలాల లభ్యత: 2,842– 2,191= 651 టీఎంసీలు (ఏపీ జలవనరులశాఖ లెక్కల ప్రకారం)

రూ.48 కోట్లతో రేడియేషన్ యంత్రాల ఏర్పాటుకు ఓఎన్‌జీసీ అంగీకారం

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు వెల్లడి



పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురికి వినతి పత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో క్యాన్సర్‌పై పోరులో భాగంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ.48 కోట్లతో 3 రేడియేషన్ యంత్రాలను సమకూర్చడానికి ఓఎన్‌జీసీ ఇండియా ముందుకొచ్చిందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు తెలిపారు. దీనిపై బుధవారం దిల్లీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో చర్చించారు. హర్దీప్ సింగ్ పురికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సతీష్ బాబు మాట్లాడుతూ ఒక్కోటి సుమారు రూ.16 కోట్ల విలువైన 3 యంత్రాలను త్వరలో కాకినాడ, గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడం, రేడియేషన్ చికిత్సలో ఈ యంత్రాలు కీలకంగా పని చేస్తాయన్నారు.

50 లక్షల కుటుంబాలను పేదరికానికి దూరం చేస్తాం

పీ4 కార్యక్రమ సమీక్షలో మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో 2029 నాటికి 50 లక్షల కుటుంబాలను పేదరికం నుంచి దూరం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం గుంటూరు జిల్లా తెనాలి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి, వారికి అవసరమైన మద్దతు అందిస్తామన్నారు. పేదలకు చేయూత అందించగలిగిన స్థాయిలో ఉన్న మార్గదర్శులను గుర్తించి, వారి సహకారంతో నిరుపేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చేలా కసరత్తు చేస్తున్నామని వివరించారు. త్వరలో పూర్తి వివరాలతో www.zeropovertyp4.ap.gov.in అనే వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సంబంధిత వివరాలతో కూడిన పోస్టర్‌ను తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు.



జవాబుదారీతనాన్ని సంస్కృతిగా మార్చుకోవాలి

జపాన్‌లోని కన్సాయ్ విమానాశ్రయ సిబ్బంది గత 30 ఏళ్లలో ఏ ఒక్క ప్రయాణికుడి లగేజీని కూడా పోగొట్టకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. జవాబుదారీతనం అనేది సంస్కృతిలో అంతర్భాగమైనచోట, క్రమశిక్షణ, కచ్చితత్వంతో పని చేయడాన్ని గర్వంగా భావించే సిబ్బంది ఉన్నచోట మాత్రమే ఇలాంటి అరుదైన విషయాలు సాధ్యమవుతాయి. సమర్థతకు పట్టం కట్టే దేశం ప్రతి రంగంలోనూ శ్రేష్ఠత సాధిస్తుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

వసతిగృహాల్లో రాత్రి బస చేయాల్సిందే

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: హెచ్‌డబ్ల్యూవోలు రాత్రిపూట వసతిగృహాల్లో బస చేయాల్సిందేనని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశించారు. జిల్లాస్థాయి బీసీ అధికారులు కూడా తరచూ వసతిగృహాలను సందర్శించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక టూర్ డైరీని రూపొందించాలని, ప్రతి నెలా 5వ తేదీలోగా ఆ వివరాలను రాష్ట్ర కార్యాలయానికి నివేదించాలని నిర్దేశించారు. విజయవాడలో బుధవారం జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వసతిగృహాల పర్యవేక్షణకు త్వరలోనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. వసతిగృహాల అభివృద్ధికి పీ4 విధానాన్ని అమలు చేస్తామని వెల్లడించారు.

డిజిటల్ అరెస్టు అంటూ నగ్నంగా కూర్చోబెట్టిన సైబర్ నేరగాడు!

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరిట ఓ సైబర్ నేరగాడు ఇద్దరు మహిళలను 9 గంటల పాటు నగ్నంగా కూర్చోబెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. థాయ్‌లాండ్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఓ మహిళ.. బెంగళూరులో ఉన్న స్నేహితురాలిని కలిసేందుకు జులై 17న వచ్చారు. ఆ సమయంలో ఉపాధ్యాయురాలికి అపరిచితుడు ఫోన్ చేసి.. 'మీరు జెట్ ఎయిర్‌వేస్‌కు సంబంధించిన నగదును అక్రమంగా బదిలీ చేశారు. కొలాబా పోలీసు స్టేషన్‌లో హాజరు కావాలి' అని తెలిపాడు. ఆ మహిళ కంగారుపడి, చాలా ఏళ్లుగా భారత్‌లో లేనని చెప్పినా వినకుండా డిజిటల్ అరెస్టు చేస్తున్నానని బెదిరింపులకు దిగాడు. ఆమె నుంచి రూ.58,477 బదిలీ చేయించుకున్నాడు. ఇద్దరినీ పూర్తిగా సోదా చేయాలని చెప్పి వాట్సప్ వీడియో కాల్ చేసి.. వీడియో ముందుకు రావాలన్నాడు. గుర్తింపు కోసం పుట్టుమచ్చలు చూడాలని నగ్నంగా మారాలని హెచ్చరించారు. అలా ఇద్దరు మహిళలను 9 గంటల పాటు నగ్నంగా కూర్చోబెట్టారు. ఎంతకూ నిందితుడు వీడియో కాల్ కట్ చేయకపోవడంతో చివరకు ధైర్యం తెచ్చుకొని బాధితులే ఫోన్ ఆఫ్ చేశారు. కొద్దిసేపటికి తేరుకొని.. జరిగిందంతా మోసమని గుర్తించి బెంగళూరు తూర్పు విభాగం సైబర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకున్నారు. డిజిటల్ అరెస్టు అనేది ఎక్కడా ఉండదని నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ వారికి అవగాహన కల్పించారు.

మెడికల్ పీజీ సీట్లూ రాష్ట్ర విద్యార్థులకే..

ఉమ్మడి ప్రవేశ విధానానికి తెర

ఈనాడు, అమరావతి: వైద్య విద్యలో ఎంబీబీఎస్, దంత వైద్య సీట్ల తరహాలోనే.. పీజీ కోర్సుల ప్రవేశ నిబంధనల్లోనూ ప్రభుత్వం మార్పులు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత అమల్లో ఉన్న ఉమ్మడి ప్రవేశ విధానం గడువు పూర్తవడంతో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు తాత్కాలిక సవరణలు చేస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో (నాన్ స్టేట్ వైడ్) ప్రతి కోర్సుకు 85% సీట్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్థానిక అభ్యర్థులకు.. మిగిలిన 15 % అన్‌రిజర్వుడు కింద రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన స్థానికేతర అభ్యర్థులకు కేటాయించనున్నట్లు పేర్కొంది. ఏయూ, ఎస్వీయూ పరిధిలోని ప్రాంతాల్లో స్థానిక, అన్‌రిజర్వుడు కేటగిరీలో సీట్లు పొందేందుకు అర్హతలను వెల్లడించింది.

ఈసెట్‌లో 57% సీట్ల భర్తీ

ఈనాడు, అమరావతి: బీటెక్ రెండో ఏడాదిలో ప్రవేశాలకు నిర్వహించే ఈసెట్ కౌన్సెలింగ్‌లో 57% సీట్లు భర్తీ అయ్యాయి. తుది విడత కన్వీనర్ కోటా సీట్ల భర్తీ జాబితాను బుధవారం సాంకేతిక విద్యా శాఖ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మొత్తం 36,534 సీట్లు ఉండగా అందులో 20,837 భర్తీ అయ్యాయి. ప్రభుత్వ వర్సిటీల్లో 1,800 సీట్లకుగాను 1,485 నిండాయి.

పులిచింతల మరమ్మతులకు నిధులు

ఈనాడు, అమరావతి: పులిచింతల ప్రాజెక్టులో అవసరమైన మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రేడియల్, రివర్ స్లూయిస్ గేట్లు, మట్టి కట్ట పనుల కోసం రూ.1.45 కోట్లు విడుదల చేస్తూ జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

సింగిల్ ఎల్పీఎంల జారీకి గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో భూముల రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో జారీచేసిన జాయింట్ ఎల్పీఎంల (సర్వే నంబర్ల స్థానంలో) స్థానంలో సింగిల్ ఎల్పీఎంలు ఇవ్వాలని కోరిన రైతులకు రూ.50 ఫీజుతో సబ్-డివిజన్ చేసేందుకు విధించిన గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. తొలుత ఇచ్చిన గడువు జూన్‌తో ముగిసినందున పొడిగింపు ఉత్తర్వులను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఇచ్చారు. వైకాపా పాలనలో హడావుడిగా రీ-సర్వే పూర్తిచేసి, ఒక్కొక్కరికి కాకుండా.. ఇద్దరు, ముగ్గురు రైతులకు కలిపి జాయింట్ ఎల్పీఎంలను 8 లక్షల వరకు ఇచ్చారు. దీనివల్ల భూముల విస్తీర్ణం పెరిగి ..రైతులు అన్నదాత సుఖీభవ, ఇతర ప్రభుత్వ పథకాలకు దూరమవుతూ తీవ్రంగా నష్టపోతున్నారు.



మీ పిల్లలతో కలిసి ఆడుతున్నారా?

తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ఇంట్లో ఆటలు ఆడుతుండాలి. అవి పిల్లలకు సరదాగా ఉండటంతో పాటు వారిలో కుతూహలాన్ని కలిగించేలా చూసుకోవాలి. దీనివల్ల..

1. పిల్లల్లో ఏకాగ్రత శక్తి పెరుగుతుంది.
2. సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు అలవడుతాయి.
3. ఇతరులతో కలిసి సమన్వయంతో పనిచేయడం నేర్చుకుంటారు.
4. ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటారు.
5. కుటుంబ అనుబంధాలు బలపడతాయి.

– అమీ, పేరెంటింగ్ కోచ్

స్థిరాస్తి రంగం పరుగులు

- గత 3 నెలల్లో పెరిగిన రిజిస్ట్రేషన్లు
- గుంటూరు జిల్లాలో భారీగా పొలాలు, స్థలాల క్రయవిక్రయాలు
- నెల్లూరులో ప్లాట్లు, పశ్చిమలో ఇళ్ల అమ్మకాలు అధికం



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్థిరాస్తి రంగంలో నెలకొన్న స్తబ్దత తొలగింది. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రణాళికలతో ఆస్తుల క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో స్థిరాస్తి రంగంలో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.2,663.70 కోట్ల ఖజానాకు జమయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి రూ.1,821.17 కోట్లు మాత్రమే వచ్చాయి. అంటే ఈ ఏడాది 46.26% వృద్ధి నమోదైనట్టు. సరిగ్గా ఇదే సమయంలో తెలంగాణ (8.26%), తమిళనాడు (17.67%), కర్ణాటక (7.12%) వృద్ధిని మాత్రమే నమోదు చేశాయి. ఈ పరిణామం రాష్ట్రంలో స్థిరాస్తి రంగం పుంజుకుందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. రాజధాని అమరావతి అభివృద్ధి, నిర్మాణ పనుల్లో వేగం గుంటూరు జిల్లాలో స్థిరాస్తి కొనుగోళ్లు భారీగా పెరిగేందుకు దోహదం చేస్తోంది.

కూటమి ప్రభుత్వ చర్యలతో ఊతం

నాటి వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటనతో పాటు పాలనాపరంగా తీసుకున్న అనేక ప్రతికూల నిర్ణయాలతో స్థిరాస్తి రంగం కుదేలైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రంగం వృద్ధికి ఊతమిచ్చేలా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. లేఅవుట్లలో రోడ్ల కొలతలు తగ్గించింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల స్థలాల పక్కనే లేఅవుట్ల అభివృద్ధికి ఆయా శాఖల ఎన్వోసీ తప్పనిసరి అనే నిబంధనను ఉపసంహరించుకుంది. గతంలో పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల జారీ అధికారాన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోకి తెచ్చింది. ఐదు అంతస్తుల వరకు భవన నిర్మాణాల అనుమతుల జారీ ప్రక్రియను సరళీకృతం చేసింది. వీటికి తోడు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రణాళికల రూపకల్పన ఆస్తుల కొనుగోళ్లు పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి.

పది జిల్లాల్లో రిజిస్ట్రేషన్ల పెరుగుదల

విశాఖ, గుంటూరు, ఎన్టీఆర్, తిరుపతి, కృష్ణా, తూర్పుగోదావరి, కాకినాడ, పల్నాడు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో స్థిరాస్తి లావాదేవీలు పెరిగాయి. అన్నిరకాల రిజిస్ట్రేషన్లు కలిపి గుంటూరు జిల్లాలో అత్యధికంగా 46.23%, కృష్ణాలో 40.05%, పల్నాడు జిల్లాలో 29.10% చొప్పున పెరిగాయి. కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు తక్కువగా జరుగుతున్నాయి. కడప రూరల్, జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, అనంతపురం, అనంతపురం రూరల్, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, బుక్కపట్నం, కదిరి, హిందూపురం కార్యాలయాల పరిధుల్లో ఆస్తుల క్రయ, విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్రంలో 296 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా 153 కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిర్దేశించిన లక్ష్యానికి చేరువగా జరుగుతున్నాయి. 60 కార్యాలయాల్లో 60% నుంచి 40% మధ్య మాత్రమే రిజిస్ట్రేషన్లు నమోదవుతున్నట్లు గుర్తించారు.

జిల్లాల వారీగా

గత ఏడాది (ఏప్రిల్, మే, జూన్ నెలలు)తో పోల్చినప్పుడు ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధికంగా గుంటూరు జిల్లాలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లలో 170.63%, నివాస స్థలాల విషయంలో 47.06% పెరుగుదల నమోదైంది. నెల్లూరు జిల్లాలో ప్లాట్ల కొనుగోళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో ఇళ్ల క్రయవిక్రయాలు ఎక్కువగా జరిగాయి. గత ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకొన్న ఎన్నికల వాతావరణ ప్రభావం కూడా స్థిరాస్తి రంగంపై ఉంది.

2024 ఏప్రిల్, మే, జూన్‌లలో జరిగిన రిజిస్ట్రేషన్లను 2025 ఏప్రిల్, మే, జూన్‌లో నమోదైన వాటితో పోల్చినప్పుడు కనిపించిన వృద్ధి

జిల్లా	ప్లాట్లు	వృద్ధి	ఇళ్లు	వృద్ధి	నివాస స్థలాలు	వృద్ధి	వ్యవసాయ భూములు	వృద్ధి
విశాఖ	9,005	17.18%	5,071	4.00%	12,581	3.68%	1,783	50.21%
గుంటూరు	4,271	5.30%	6,713	9.74%	22,465	47.06%	20,460	170.63%
ఎన్టీఆర్	4,665	−4.07%	7,293	6.92%	8,952	6.60%	13,230	66.48%
తిరుపతి	1,709	16.66%	6,273	4.52%	10,445	−25.38%	11,353	41.74%
కృష్ణా	2,368	66.18%	5,454	−2.14%	8,716	16.09%	18,312	67.37%
తూ.గో.	1,871	−20.01%	5,677	4.49%	13,575	10.40%	8,885	71.36%
కాకినాడ	1,471	−29.99%	6,703	11.36%	12,871	−0.05%	8,294	52.10%
పల్నాడు	1,040	10.99%	6,472	9.88%	10,024	−0.46%	21,985	107.62%
నెల్లూరు	2,252	91.99%	6,689	1.32%	9,588	−11.37%	9,931	83.53%
ప.గో.	1,261	−38.88%	6,237	23.75%	10,803	15.85%	13,676	49.73%

సెంచరీ కొట్టిన అశోక్ లేల్యాండ్ యూనిట్

4 నెలల్లోనే 100 బస్సుల ఉత్పత్తి



100, 101వ బస్సుల ముందు ఉద్యోగులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడలో ఉన్న అశోక్ లేల్యాండ్ బస్ బాడీ బిల్డింగ్ యూనిట్ 100వ మైలురాయిని అధిగమించింది. బుధవారం ఇక్కడి నుంచి వందో బస్సును మహారాష్ట్ర ఆర్టీసీకి పంపించారు. తొలుత ఈ యూనిట్‌కు 2018 మార్చి నెలాఖరున ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ప్లాంటు నిర్మాణం పూర్తయినా వైకాపా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారమూ లేకపోవడంతో ఐదేళ్లు ప్లాంట్‌ను మూసేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఈ ఏడాది మార్చి 19న మంత్రి నారా లోకేశ్ ఈ యూనిట్‌ను ప్రారంభించారు. 4 నెలల్లోనే 101 బస్సులు సిద్ధం చేశారు. వందో బస్సు మైలురాయిని చేరుకున్న సందర్భంగా యూనిట్ వద్ద ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు.

26న విచారణకు హాజరుకండి

మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సహా ఐదుగురికి పోలీసుల నోటీసులు



మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఇంటికి నోటీసు అతికిస్తున్న కోవూరు ఎస్సై

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుపై కోవూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో దర్యాప్తు వేగవంతమైంది. ఈ నెల 25న విచారణకు హాజరుకావాలని ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. తాజాగా ఐదుగురిని ఈ నెల 26న విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేశారు. ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని వైకాపా నాయకులు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, వీరి చలపతి, పచ్చిపాల రాధాకృష్ణ, అనూప్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డిలకు కోవూరు సీఐ వి.సుధాకర్ రెడ్డి బుధవారం రాత్రి నోటీసులు జారీచేశారు. ఆ ప్రతులను కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ అందించారు. వీరిలో అనూప్‌రెడ్డికి మాత్రమే నోటీసు అందజేయగా, మిగతావారు అందుబాటులో లేకపోవడంతో వారి ఇళ్లకు నోటీసులు అతికించారు. పలువురికి వాట్సప్‌లో పంపించారు. అనిల్‌కుమార్ యాదవ్ నెల్లూరులో లేకపోవడంతో ఆయన ఇంటికి నోటీసు అతికించారు.

శ్రీశైలంలో 2 గేట్ల ద్వారా నీటి విడుదల



సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి ప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీశైలం జలాశయం నుంచి బుధవారం నీటిని దిగువకు విడుదల చేశారు. 2 గేట్లను 10 అడుగుల మేర పైకెత్తి 54,956 క్యూసెక్కులు, జలవిద్యుత్తు కేంద్రాల నుంచి 66,827 క్యూసెక్కుల ప్రవాహాన్ని వదులుతున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 76,739 క్యూసెక్కుల వరద వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం జలాశయం నీటిమట్టం 883.70 అడుగులు, నీటినిల్వ 208.2841 టీఎంసీలుగా నమోదైంది.

నాగార్జునసాగర్ కుడి కాలువకు...



కుడి కాలువలో ప్రవాహం

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు బుధవారం నీటిని విడుదల చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆదేశాలతో కుడి కాలువ మూడో గేటు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని వదిలారు. డీఈ శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీశైలం జలాశయం నుంచి భారీగా వరద వస్తోందని, ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నట్లు తెలిపారు.

ఇంజినీరింగ్‌లో మరోసారి లక్ష దాటిన కన్వీనర్ కోటా

- మొదటి విడత కౌన్సెలింగ్‌లో 78% సీట్ల భర్తీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మరోసారి ఇంజినీరింగ్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ లక్ష దాటింది. 2024లో మొదటి విడత ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 1.17 లక్షల సీట్లు భర్తీ కాగా.. ఈసారి 1.18 లక్షలు నిండాయి. విభజిత ఏపీలో ఇంత పెద్దసంఖ్యలో కన్వీనర్ కోటాలో విద్యార్థులు ప్రవేశాలు పొందడం ఇదే మొదటిసారి. ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో సాధారణ డిగ్రీ, పీజీ కోర్సుల సీట్లను పరిమితంగా నిర్వహిస్తూ ఇంజినీరింగ్‌లో అధికంగా సీట్లు ఉంచుతున్నాయి. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పీజీలో ప్రవేశాలు తగ్గిపోతుండడంతో ప్రతి వర్సిటీ ఒక్కో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసుకున్నాయి. అఖిలభారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) గతేడాది నుంచి సీట్ల పరిమితి ఎత్తేయడంతో యాజమాన్యాలు అదనపు బ్రాంచిలకు అనుమతులు తీసుకున్నాయి. మౌలిక వసతులు, అధ్యాపకుల ఆధారంగా అదనపు బ్రాంచిలకు ఏఐసీటీఈ అనుమతులు ఇచ్చింది. రెండేళ్ల క్రితం వరకు ఒక బ్రాంచిలో గరిష్ఠంగా 240 సీట్లకే పరిమితి ఉండగా.. దీన్ని సడలించింది.

నిండిన 1,18,525 సీట్లు

ఇంజినీరింగ్ ఈఏపీసెట్ తొలివిడత కౌన్సెలింగ్‌లో 77.85% సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లు 1,52,246 ఉండగా.. 1,18,525 నిండాయి. రాష్ట్రంలో 24 ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 7,708 సీట్లుకుగాను 6,860 భర్తీ అయ్యాయి. 10 ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 12,003 సీట్లు ఉండగా.. 10,892 నిండాయి. ప్రైవేటులో 210 కళాశాలల్లో 1,32,535 సీట్లు ఉండగా.. 1,00773 సీట్లు భర్తీ అయ్యాయి. ఈఏపీసెట్ ఇంజినీరింగ్‌లో 1,84,020 మంది అర్హత సాధించగా.. వీరిలో 1,26,033 మంది కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కళాశాలలు, బ్రాంచిల ఎంపికకు 1,24,655 మంది వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకోగా.. 1.18 లక్షల మందికి సీట్లు కేటాయించారు.

66 బ్రాంచిల్లో సున్నా ప్రవేశాలు

రాష్ట్రవ్యాప్తంగా 41 కళాశాలల్లోని 66 బ్రాంచిల్లో ఒక్క విద్యార్థీ చేరలేదు. వీటిలో కోర్ ఇంజినీరింగ్ బ్రాంచిలైన సివిల్, ఈఈఈ, మెకానికల్ లాంటి బ్రాంచిలే ఉన్నాయి.

యువ ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు

ఈనాడు, అమరావతి: ఏపీ కేడర్‌కు చెందిన యువ ఐపీఎస్ అధికారులకు పోస్టింగులిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రొబెషనరీలో కొనసాగుతున్న దీక్ష (2021 బ్యాచ్), మనీషా వంగలరెడ్డి (2022 బ్యాచ్), హేమంత్ బొడ్డు, ఆర్.సుష్మిత (2023 బ్యాచ్)లను ఏపీఎస్పీ కేడర్‌లో గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్లుగా నియమించారు.

మోహిత్‌రెడ్డి బెయిల్ విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిలు కోసం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి (ఏ39) వేసిన పిటిషన్ విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి తప్పుకొన్నారు. మరో జడ్జి విచారణ చేపట్టేలా చర్యలు తీసుకునేందుకు ఫైల్‌ను సీజే వద్ద ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. మోహిత్‌రెడ్డి విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను పొడిగించారు. మద్యం కుంభకోణం కేసు వ్యాజ్యాలను విచారించబోనని సదరు న్యాయమూర్తి స్పష్టంచేశారు.

ముగ్గురు పిల్లల్ని కంటే.. ఆస్తిపన్ను మినహాయించాలి

- ఐవీఎఫ్ చికిత్స వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలి
- మాతృత్వ సెలవులను 6 నుంచి 12 నెలలకు పెంచాలి
- తల్లులకు వర్క్ ఫ్రం హోం సౌకర్యం కల్పించాలి
- జనాభా పెంపునకు పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ
- పలు ప్రతిపాదనలతో సిద్ధమవుతున్న ముసాయిదా

ఈనాడు, అమరావతి: రాష్ట్ర జనాభాను పెంచే చర్యలు మొదలయ్యాయి. సంతానోత్పత్తి తగ్గుదల, వృద్ధ జనాభా పెరుగుదల వంటి సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ ముసాయిదాను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. స్వల్ప, మధ్య, దీర్ఘకాలాల్లో అనుసరించాల్సిన వ్యూహాలను అధికారులు రూపొందిస్తున్నారు. సంతానోత్పత్తి రేటును పెంచే చర్యల్లో భాగంగా... మేధావులు, నిపుణుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని పలు ప్రోత్సాహకాలను ముసాయిదాలో ప్రతిపాదించారు. రాష్ట్రంలో 2.1గా ఉండాల్సిన సంతానోత్పత్తి రేటు 1.5కు తగ్గింది. ఈ పరిణామం ఆందోళన కలిగిస్తోంది. 2047 నాటికి రాష్ట్రంలో వృద్ధుల శాతం 23కు చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం 13%-15% మధ్య ఉంది.

ఆ జంటలకు ఐవీఎఫ్ చికిత్స అవసరం

రాష్ట్రంలో 12% మంది దంపతులకు పిల్లలు పుట్టే విషయంలో లోపాలున్నాయి. వీరిలో కొందరు సమస్య పరిష్కారానికి ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) చికిత్స కోసం వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ చికిత్స ఖర్చుతో కూడుకున్నది. సాధారణంగా మూడు సైకిల్స్‌లో చికిత్సను చేస్తారు. ఒక్కో సైకిల్‌కు రూ.85 వేల వరకు అవుతుందని అంచనా. ఐవీఎఫ్ తర్వాత కొందరికి పిల్లలు పుడుతున్నారు. ఈ చికిత్సకు ప్రభుత్వపరంగా ఆర్థికసాయం అందించాలని ముసాయిదాలో చేర్చారు.

మరికొన్ని ప్రతిపాదనలివీ..

- ★ ముగ్గురు లేదా నలుగురు పిల్లలు కలిగిన వారికి ఆస్తి పన్ను మినహాయించాలి.
- ★ మూడో బిడ్డను కన్న తల్లులకు ప్రోత్సాహకంగా రూ.50 వేల చొప్పున ఇవ్వాలి. నాలుగో బిడ్డకూ ఈ విధానాన్ని కొనసాగించాలి.
- ★ తల్లులకు వర్క్ ఫ్రం హోం సౌకర్యాన్ని కల్పించాలి.
- ★ ఉద్యోగినులకు మాతృత్వ సెలవులను 6 నుంచి 12 నెలలకు పెంచాలి. ప్రైవేట్ రంగంలో పనిచేసే వారికీ దీనిని వర్తింపజేయాలి.
- ★ వివిధ కార్యాలయాల్లో పనిచేసే తల్లులకు అనుకూలంగా ఉండేందుకు పిల్లల కోసం 'క్రెచ్'లు పెట్టాలి.
- ★ పిల్లల సంరక్షణకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలను స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా చేపట్టాలి. శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పించాలి.

భోజనం బాగోలేదని ఏయూ విద్యార్థుల ఆందోళన



ఏయూ పరిపాలన భవనం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

విశాఖపట్నం(ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో భోజనం బాగోలేదని, మెస్ బిల్లులూ ఎక్కువ వస్తున్నాయని విద్యార్థులు బుధవారం పరిపాలనా భవనం వద్ద ఆందోళనకు దిగారు. హాస్టళ్లలో సౌకర్యాలూ కల్పించడం లేదని ఆరోపించారు. ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్, రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందజేస్తామని, మౌలిక సదుపాయాలూ కల్పిస్తామని.. ఇందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అందులో విద్యార్థులూ భాగస్వాములు కావాలన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన 4 నెలల్లోనే వంటశాలలు, భోజనశాలలను పూర్తి స్థాయిలో ఆధునికీకరించినట్లు వీసీ చెప్పారు. మరికొన్ని వసతి గృహాల మరమ్మతులకు టెండర్ల ప్రక్రియను బుధవారం పూర్తి చేశామన్నారు. వీసీ ఇచ్చిన హామీలతో విద్యార్థులు నిరసన విరమించారు.

సెప్టెంబరు 14 నుంచి జాతీయ మహిళా సాధికారత సదస్సు

తిరుపతిలో 2 రోజులపాటు నిర్వహణ • శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చిత్రంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: తిరుపతిలో సెప్టెంబరు 14 నుంచి రెండు రోజుల పాటు జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహించనున్నట్లు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లో ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన సదస్సు నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దేశవ్యాప్తంగా 31 శాసనసభలున్నాయి. ప్రతి శాసనసభలో వివిధ కమిటీలుంటాయి. సదస్సులో మహిళా సాధికారత కమిటీ సభ్యులు పాల్గొంటారు. ప్రతి రాష్ట్రం నుంచి ఐదారుగురు ప్రతినిధులు హాజరవుతారు. వీరందరూ రెండు రోజుల పాటు మహిళల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి.. ఆ నివేదికలను పార్లమెంటుకు, శాసనసభలకు పంపుతారు. సదస్సు అనంతరం ప్రతినిధులు తిరుమల, శ్రీకాళహస్తి, శ్రీసిటీ, శ్రీహరికోటను సందర్శిస్తారు' అని స్పీకర్ తెలిపారు. ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ సదస్సు విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

చెన్నై నల్లబజారుకు యూరియా

రూ.లక్షలు కొట్టేస్తున్న వ్యవసాయ అధికారులు

ఈనాడు, తిరుపతి: ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తున్న యూరియా చెన్నై నల్లబజారుకు తరలుతోంది. రైతులకు అవసరమైన యూరియాను రేణిగుంట రైల్వే యార్డు నుంచి సమీప మండలాలకు తరలిస్తుంటారు. అయితే కొందరు మండల వ్యవసాయ అధికారులు చేతివాటం చూపి రేణిగుంట యార్డు నుంచి లారీల్లో లోడ్ అయిన యూరియాను అక్కడి నుంచే చెన్నైకి తరలించేందుకు సహకరిస్తున్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, సూళ్లూరుపేట, గూడూరు, నాయుడుపేట, చిల్లకూరు, సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం, పిచ్చాటూరు మండలాలతో పాటు పశ్చిమ ప్రాంతాల్లో తమిళనాడుకు సరిహద్దున ఉన్న మండలాల్లో ఈ తంతు అధికంగా ఉంది. లారీ యూరియా తమిళనాడుకు తరలిస్తే రూ.60,000 నుంచి రూ.70,000 వరకు ఆదాయం వస్తుంది. దీంతో తూర్పు మండలాల్లోని కొందరు వ్యవసాయ అధికారులు ఇదే పనిగా పెట్టుకున్నారు. రబీ, ఖరీఫ్ సీజన్ వస్తే చాలు వీరి పంట పండినట్లే. ఒక్కో మండల వ్యవసాయ అధికారి రెండు నుంచి నాలుగు లారీల యూరియాను చెన్నైకి తరలించేస్తున్నారు. ఎవరైనా రైతులు గట్టిగా అడిగితే ప్రైవేటు డీలర్లకు చెప్పి సర్దుబాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు.

రాజధాని రైతులకు రూ.164.21 కోట్ల కౌలు సొమ్ము జమ

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం 11వ సంవత్సరానికి సంబంధించిన కౌలు సొమ్మును బుధవారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. మొత్తం 5 బిల్లుల్లో 18,726 రైతులకు రూ.164,21,05,607 సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించింది. ఏదైనా సాంకేతిక సమస్యలతో కౌలు డబ్బులు ఖాతాల్లో జమకాని రైతులు సీఆర్డీఏ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయాలను సంప్రదించాలని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. తాజా బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, మొబైల్ నంబరుతో సీఆర్డీఏ సిబ్బందిని కలిసి అర్జీ సమర్పిస్తే వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

EENADU Vol: 51, Issue: 345 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

అధికార నివాసాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధం

● సామాన్లు సర్దుకుంటున్న ధన్‌ఖడ్

దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి ఆకస్మికంగా రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్.. అధికార నివాసాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన తన సామగ్రిని సర్దుకుంటున్నారు. అతి త్వరలో అక్కడి నుంచి వెళ్లిపోవాలని భావిస్తున్నారు. మాజీ ఉప రాష్ట్రపతిగా ఆయనకు ప్రభుత్వ బంగళా సౌకర్యం ఉంటుంది. అందులోకి ఆయన మారతారు. ప్రస్తుతం ఆయన కొత్తగా నిర్మించిన ఉప రాష్ట్రపతి అధికారిక నివాసంలో ఉంటున్నారు. అది పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్‌లోని చర్చి రోడ్డులో ఉంది.

మాజీ ఉప రాష్ట్రపతికి లభించే ప్రయోజనాలివే..

ఉప రాష్ట్రపతిగా పని చేసిన వారికి పదవీ విరమణ, రాజీనామా తరువాత పెన్షన్‌తోపాటు ఉండడానికి ఇల్లు కేటాయిస్తారు. నిబంధనల ప్రకారం.. ఉప రాష్ట్రపతిగా 2 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పని చేసిన వారికి పెన్షన్ పొందడానికి అర్హత ఉంటుంది.

- 2018 బడ్జెట్‌లో నిర్ణయించిన ప్రకారం.. భారత ఉప రాష్ట్రపతి వేతనం సంవత్సరానికి రూ.48 లక్షలు. దీని ఆధారంగానే పెన్షన్ లభిస్తుంది. సాధారణంగా ఉప రాష్ట్రపతి వేతనంలో 50 నుంచి 60 శాతాన్ని పెన్షన్‌గా ఇస్తారు. ఈ లెక్కన ధన్‌ఖడ్‌కు నెలకు రూ.2 లక్షల కంటే ఎక్కువ పెన్షన్ వస్తుంది.
- మాజీ ఉపరాష్ట్రపతి ఉండడానికి టైప్-8 ప్రభుత్వ బంగళా కేటాయిస్తారు.
- ఉచిత విమాన, రైలు ప్రయాణ సౌకర్యాలు ఉంటాయి.
- ఉచిత వైద్యం పొందవచ్చు. మరీ ముఖ్యంగా వ్యక్తిగత ప్రైవేటు వైద్యుడిని అందుబాటులో ఉంచుతారు.
- ఇద్దరు వ్యక్తిగత సహాయకులను (పీఏ) కేటాయిస్తారు. ఉపరాష్ట్రపతి జీవిత భాగస్వామికి ఒక ప్రైవేటు కార్యదర్శిని ఇస్తారు.
- ఇంటి విద్యుత్తు, నీటి బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- ఫర్నీచరు, కొన్ని ఉపకరణాలుసహా రెండు మొబైల్ ఫోన్లు అందిస్తారు.


రేసులో ఆరుగురు?

ఉప రాష్ట్రపతి పదవిపై పలు ఊహాగానాలు ● మళ్లీ గవర్నర్‌కే దక్కుతుందా?


ఈటీవీ భారత్: జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఈ రేసులో ప్రధానంగా ఆరుగురి పేర్లు వినిపిస్తున్నాయి. అందులో సీఎం, గవర్నర్లు, ఎంపీలున్నారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబరులో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని మొదటగా పరిశీలించేది బిహార్ నుంచే అన్న ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా మూడు పేర్లు వినిపిస్తున్నాయి. సీఎం నీతీశ్ కుమార్, జేడీయూ ఎంపీ, ప్రస్తుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌తోపాటు బిహార్ గవర్నర్‌గా ఉన్న ఆరిఫ్ మహమ్మద్ ఖాన్. వీరిలో ఒకరికి పదవి దక్కొచ్చనే ప్రచారం జరుగుతోంది.




◆ ఉప రాష్ట్రపతి అభ్యర్థి రేసులో నీతీశ్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆశ్చర్యకరంగా బిహార్‌కు చెందిన భాజపా ముఖ్య నేతలు ఆయనను ఉప రాష్ట్రపతి చేయాలని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ ఆఫర్‌ను నీతీశ్ అంగీకరించే అవకాశాలు చాలా తక్కువే. కానీ నీతీశ్ రాష్ట్ర రాజకీయాల్లో ఉండగా భాజపా అభ్యర్థి సీఎం కావడం అసాధ్యం. అందుకే నీతీశ్‌ను ఒప్పించేందుకు భాజపా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం నీతీశ్‌ను ఉప రాష్ట్రపతి చేసి, ఆయన కుమారుడు నిశాంత్ కుమార్‌ను డిప్యూటీ సీఎం చేసే అవకాశాలూ లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బిహార్‌లోని బీసీ, ఈబీసీ వర్గాల ఓటర్లు ఎన్డీఏ కూటమి వైపు మొగ్గడానికి ప్రధాన కారకుడు నీతీశ్ కుమార్ అని, ఎన్నికల ముంగిట ఆయన్ను బలవంతంగా దూరం చేసుకోవడానికి ఆ కూటమి అస్సలు సాహసించదని ఇంకొందరు పరిశీలకులు తెలిపారు.




◆ జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్ ఉప రాష్ట్రపతి రేసులో ఉన్నారు. జేడీయూ ఎంపీ కావడం ఆయనకు కలిసివచ్చే అంశం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హరివంశ్ అత్యంత సన్నిహితంగా ఉంటారు.



◆ కేంద్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉన్న పలువురు గవర్నర్ల పేర్లను ఉప రాష్ట్రపతి పదవికి పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ కేటగిరీ నుంచి ప్రముఖంగా వినిపిస్తున్న పేరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్. ఈయన ప్రస్తుతం బిహార్ గవర్నర్‌గా ఉన్నారు. హిందూ పురాణాలు, గ్రంథాలపై అవగాహన కలిగిన పండితుడిగా ఆరిఫ్‌కు భాజపాలో మంచి గుర్తింపు ఉంది. ముస్లిం వర్గానికి చెందిన ఆయనను ఉప రాష్ట్రపతి చేస్తే.. ముస్లిం ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్న బిహార్‌లో కలిసొస్తుందనే అంచనాతో ఎన్డీఏ కూటమి పెద్దలు ఉన్నారని అంటున్నారు. అయితే ఆర్జేడీ అధినేత లాలూతో ఆరిఫ్‌కు సాన్నిహిత్యం ఉంది.



◆ దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీని ముప్పుతిప్పలు పెట్టిన లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను ఉప రాష్ట్రపతి పదవికి పరిశీలిస్తారనే అంచనాలున్నాయి.



◆ జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న మనోజ్ సిన్హా పేరూ తెరపైకి వస్తోంది. ఆయన కశ్మీరు పాలనలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన పదవీ కాలం ఈ ఏడాది ఆగస్టు 6తో ముగియనుంది.



◆ ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో భాజపా అనూహ్య నిర్ణయం తీసుకునే అవకాశాలూ లేకపోలేదంటున్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచిన సీనియర్ నేత శశి థరూర్ పేరునూ ప్రధాని మోదీ పరిశీలించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఏడాది కాలంగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటున్న శశి థరూర్.. త్వరలోనే భాజపాలో చేరతారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి.

ధన్‌ఖడ్ రాజీనామాపై అనుమానాలెన్నో..

● ప్రభుత్వం వివరణ ఇవ్వాలి: ఖర్గే

దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ రాజీనామా అనుమానాస్పదంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండు చేశారు. భాజపా, ఆరెస్సెస్ నేతల కంటే ఎక్కువగా కాషాయ వర్గానికి మద్దతు పలికే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం విచిత్రమని వ్యాఖ్యానించారు. 'ఆయన ఎందుకు రాజీనామా చేశారనే దానిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. కారణాలేంటో చెప్పాలి. దాని వెనుకున్న రహస్యమేంటి.. మాకేదో అనుమానంగా ఉంది (దాల్ మే కుచ్ కాలా హై). ఆయన ఆరోగ్యంగానే కనిపిస్తున్నారు. మాటతీరూ బాగానే ఉంది. అయినా ఏం జరిగింది..' అని ఖర్గే ప్రశ్నించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరెస్సెస్ చీఫ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. 'తొలి ప్రధాని నెహ్రూ డిస్కవరీ ఆఫ్ ఇండియా రాశారు. వారు దానిని తిరస్కరించారు. మన ప్రొఫెసర్లు రాసిన చరిత్రనూ తిరస్కరిస్తున్నారు. దేశ చరిత్ర కంటే వారి చరిత్ర భిన్నమైంది' అని వ్యాఖ్యానించారు.

నాలుగుసార్లు ఏకగ్రీవం

● 12 సార్లు పోటీపడ్డ అభ్యర్థులు ● ఉప రాష్ట్రపతి ఎన్నిక తీరిదీ..

దిల్లీ: దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగ్గా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది. మిగిలిన 12 సార్లు పోటీ జరిగింది. ఇందులో రెండు ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పోటీ చేశారు.

- 1952 నుంచి 62 మధ్య రెండు సార్లు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని సంధ్యాలకు చెందిన షేక్ ఖాదిర్ హుసేన్.. 1952లో నామినేషన్ వేసినా తిరస్కరణకు గురైంది.
- 1979లో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా ఉప రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన సీజేఐగా, ఉప రాష్ట్రపతిగా, తాత్కాలిక రాష్ట్రపతిగా సేవలందించారు. 1969లో ఉప రాష్ట్రపతిగా, తాత్కాలిక రాష్ట్రపతిగా ఉన్న వి.వి.గిరి.. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడం కోసం రాజీనామా చేయడంతో హిదయతుల్లా నెల పాటు తాత్కాలిక రాష్ట్రపతిగా పని చేశారు.
- 1987లో మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న శంకర్ దయాళ్ శర్మ.. పోటీ లేకుండా ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అప్పుడు 27 మంది నామినేషన్ వేయగా శర్మ ఒక్కరిదే చెల్లింది.
- 1992లో కె.ఆర్.నారాయణన్‌పై కాకా జోగీందర్ సింగ్ (ధర్తీ పకడ్) పోటీ చేశారు. నారాయణన్‌కు 700 ఓట్లురాగా జోగీందర్‌కు ఒక ఓటే వచ్చింది. 10 ఓట్లు చెల్లలేదు.
- 2007లో ఉప రాష్ట్రపతి పదవికి త్రిముఖ పోటీ జరిగింది. యూపీఏ నుంచి హమీద్ అన్సారీ, ఎన్డీయే నుంచి నజ్మా హెప్తుల్లా, తృతీయ కూటమి నుంచి రషీద్ మసూద్ పోటీ చేశారు. మొత్తం 790 ఓట్లలో 762 ఓట్లు పోలయ్యాయి. అందులో 10 చెల్లలేదు. అన్సారీకి 455, హెప్తుల్లాకు 222, రషీద్‌కు 75 ఓట్లు వచ్చాయి.
- 1962లో సామంత్ సిన్హర్‌పై జాకీర్ హుస్సేన్.. 554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో 14 ఓట్లు చెల్లలేదు.
- 1967లో ప్రొఫెసర్ హబీబ్‌పై వి.వి.గిరి విజయం సాధించారు. గిరికి 483 ఓట్లు వచ్చాయి.
- 1969లో జీఎస్ పాఠక్.. ఐదుగురు ప్రత్యర్థులను ఓడించి ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అప్పట్లో వి.వి.గిరి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.
- 1974లో ఎన్‌ఈ హోరోను ఓడించి బీడీ జట్టి ఉప రాష్ట్రపతి అయ్యారు.
- 1984లో బాపు చంద్రసేన్ కాంబ్లేను ఓడించి ఆర్.వెంకట్రామన్ ఉప రాష్ట్రపతిగా గెలిచారు. అయితే ఆయన 1987లో రాష్ట్రపతిగా పోటీ చేయడం కోసం రాజీనామా చేశారు.
- 1997లో సుర్జీత్ సింగ్‌ను ఓడించి కృష్ణకాంత్ ఉప రాష్ట్రపతి అయ్యారు.
- 2002లో కాంగ్రెస్ అభ్యర్థి సుశీల్ కుమార్ శిందేను ఓడించి భాజపా నేత భైరాన్‌సింగ్ శెకావత్ ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.
- 2007లో హమీద్ అన్సారీ ఉప రాష్ట్రపతి అయ్యారు. 2012లోనూ ఆయనే గెలిచారు. అప్పుడు ఎన్డీయే అభ్యర్థి జశ్వంత్ సింగ్‌ను ఓడించారు.
- 2017లో యూపీఏ అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీని ఓడించి ఎన్డీయే అభ్యర్థి ఎం.వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు.
- 2022లో కాంగ్రెస్ అభ్యర్థి మార్గరెట్ ఆల్వాను ఓడించి జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి అయ్యారు.



దిల్లీలో సంవిధాన్ సదన్‌లో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముచ్చట్లు

తిలక్, ఆజాద్‌లకు మోదీ ఘన నివాళి

దిల్లీ: స్వాతంత్ర్య సమరయోధులు లోకమాన్య బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారికి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో వారి పాత్రను గుర్తు చేసుకున్నారు. అసమాన ధైర్యసాహసాలకు ఆజాద్ ప్రతిరూపమని కొనియాడారు. "లోకమాన్య బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లు స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించారు. జాతీయోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తిలక్ చేసిన ప్రయత్నాలు ఆయనకు లోకమాన్య బిరుదును తెచ్చిపెట్టాయి. 'స్వరాజ్యం నాజన్మ హక్కు.. దాన్ని నేను సాధించి తీరుతాను' అనే నినాదం ప్రజల్లో స్ఫూర్తిని నింపింది" అని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

లాలూపై అభియోగాల నమోదు ఆదేశాల నిర్ణయం వాయిదా

దిల్లీ: రైల్వేశాఖ మాజీ మంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌పై అభియోగాల నమోదు మీద ఆదేశాలను దిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఆగస్టు 7కి వాయిదావేసింది. కొన్ని వివరణలు కావాల్సి ఉన్నాయని న్యాయమూర్తి విశాల్ గోగ్నే బుధవారం విచారణలో చెప్పారు. ఐఆర్‌సీటీసీ హోటళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించడంలో అవకతవకలకు సంబంధించి లాలు, ఆయన కుటుంబసభ్యులపై ఆరోపణలున్న విషయం తెలిసిందే. సీబీఐ మోపిన అభియోగాలను లాలు, ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్ తోసిపుచ్చారు. విచారించడానికి తగిన ఆధారాలు సీబీఐ వద్ద లేవని వారి తరఫు న్యాయవాదులు ఆరోపించారు. నేరారోపణలు రుజువైతే గరిష్ఠంగా ఏడేళ్ల వరకు శిక్షపడే అవకాశం ఉంది. వీటిపై వాదోపవాదాలు మే 29న ముగిశాయి.

జాతీయ విపత్తుల నిర్వహణకు కమిటీ

దిల్లీ: జాతీయ స్థాయి పర్యవసానాలకు దారి తీయగల విపత్తులకు సంబంధించి సహాయక చర్యల పర్యవేక్షణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్‌సీఎంసీ)ని బుధవారం నియమించింది. ఈ కమిటీకి కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి అధ్యక్షత వహిస్తారు. విపత్తుల నిర్వహణ చట్టం- 2005లోని సెక్షన్ 8ఏ పరిధిలో సబ్ సెక్షన్ 2 కింద తనకున్న అధికారాన్ని వినియోగించి కేంద్ర హోంశాఖ ఈ కమిటీని నియమించింది. కేంద్ర హోం, రక్షణ కార్యదర్శులు, కేంద్ర సమన్వయ కార్యదర్శి తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. జాతీయ విపత్తు తలెత్తినప్పుడు సహాయక చర్యలు చేపట్టేందుకు సన్నద్ధత ఉందా లేదా అన్న అంశాన్ని కమిటీ పరిశీలిస్తుంది. సన్నద్ధతను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటుంది.

టేకాఫ్ అయిన 2 గంటల్లో వెనక్కి

● సాంకేతిక సమస్యతో వెనక్కి వచ్చిన ఎయిరిండియా విమానం

మలప్పురం: కేరళలోని కాలికట్ విమానాశ్రయం నుంచి బుధవారం దోహా (ఖతార్)కు బయలుదేరిన ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో టేకాఫ్ అయిన రెండు గంటల్లోనే ఆ విమానం వెనక్కి వచ్చింది. "క్యాబిన్ ఏసీలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ముందు జాగ్రత్తచర్యగా ల్యాండింగ్ చేశాం" అని ఎయిరిండియా అధికారులు తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై బ్రిటన్ కన్నెర్ర

● ముఠాల నాయకులు, సంస్థలపై ఆంక్షలు

లండన్: తమ దేశంలోకి మానవ అక్రమ రవాణా చేసే ముఠాల నాయకులు, దళారులపై, వారికి పడవలు తదితర సామగ్రిని సరఫరా చేసే సంస్థలపై బ్రిటన్ బుధవారం కత్తిదూసింది. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ఇలాంటి వ్యక్తులు, సంస్థలపై కఠిన ఆంక్షలు విధించింది. మానవ అక్రమ రవాణాకు పడవలు, నౌకలను సరఫరా చేసే ఒక చైనా కంపెనీతో పాటు బాల్కన్, ఉత్తరాఫ్రికా దేశాల్లోని ముఠా నాయకులు, వారికి నిధులు సమకూర్చే ఫైనాన్షియర్లు, పశ్చిమాసియాలోని హవాలా ఆపరేటర్లపై ఆంక్షలు విధించింది. బ్రిటన్‌లో వారికున్న ఆస్తులు స్వాధీనం చేసుకొని, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేస్తారు. మానవ అక్రమ రవాణా ముఠా నాయకులు, వారి ఫైనాన్షియర్లు బ్రిటన్‌కు రాకుండా అడ్డుకుంటారు. బెల్జియం మీదుగా బ్రిటన్‌లోకి మనుషులను అక్రమంగా తీసుకొచ్చే అల్బేనియావాసి బ్లెడర్ లాలా, సెర్బియాలో మానవ స్మగ్లింగ్ జరిపే ఏలెన్ బసిల్ తదితరులు ఆంక్షలకు గురైనవారిలో ఉన్నారు. సెర్బియాకే చెందిన మహమ్మద్ టెట్వానీ, మహమ్మద్ ఖాదిర్ పిరో అనే హవాలా బ్యాంకర్లపైనా ఆంక్షలు విధించారు.

సమాజం, కార్మిక మార్కెట్‌పై కొత్త సాంకేతికతల ప్రభావాన్ని మదింపు చేయాలి

● ఆరెస్సెస్ చీఫ్ భాగవత్ పిలుపు



భారతీయ మజ్దూర్ సంఘ్ 70వ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్

దిల్లీ: సమాజం, కార్మిక మార్కెట్లపై కొత్త సాంకేతికతల ప్రభావాన్ని అంచనా వేయాల్సిన అవసరముందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. ఉపాధి అవకాశాలను అవి దెబ్బతీయవనే హామీ ఉండాలని స్పష్టం చేశారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసంఘటితరంగ కార్మికులపై దృష్టి సారించాలని, వారి శ్రమను యజమానులు దోచుకోకుండా చూడాలని సూచించారు. 'కొత్త సాంకేతికతలు వస్తున్నాయి. అవి వచ్చినప్పుడు.. అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిరుద్యోగాన్ని అది ఏం చేయబోతోంది.. తగ్గిస్తుందా.. పెంచుతుందా' అని భాగవత్ ప్రశ్నించారు. కృత్రిమ మేధవంటి వాటిపట్ల వ్యక్తమవుతున్న ఆందోళనలను ఆయన ప్రస్తావించారు. సాంకేతికత మానవ స్వభావాన్ని కొంత కఠినంగా మారుస్తోందని, కార్మికులపై గౌరవాన్ని తగ్గిస్తోందని అభిప్రాయపడ్డారు.

సాంకేతికతను వ్యతిరేకించలేం

'సాంకేతికతను వ్యతిరేకించలేం. అందులో కొత్తవి వస్తూనే ఉంటాయి. కానీ దానిని ఎలా నిర్వహిస్తున్నామనేది ప్రధానం. అది కార్మిక రంగాన్ని దెబ్బతీయకుండా చూడాలి. కొత్త సాంకేతికతలు సమాజానికి సంతోషాన్ని ఇవ్వాలి. అంతేగానీ కొత్త సమస్యలను సృష్టించకూడదు' అని భాగవత్ అభిప్రాయపడ్డారు. 1955 జులై 23వ తేదీన ఆవిర్భవించిన బీఎంఎస్ ప్రస్థానాన్ని భాగవత్ కొనియాడారు. కేంద్ర కార్మిక, ఉపాధిశాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయతోపాటు పలువురు కార్మిక నేతలు, కార్మికులు ఈ కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు.

విద్యుత్తు స్కూటరుతో కలుపుతీత!



ఈటీవీ భారత్: ప్రస్తుత టెక్ యుగంలో కొందరు యువ రైతులు విభిన్నమైన ఆలోచనలతో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. కర్ణాటకలోని బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా కబ్బూరుకు చెందిన యువరైతు అజిత్ భీమప్ప కూడా అలాగే ఆలోచించాడు. అజిత్ కుటుంబానికి దాదాపు 30 ఎకరాల పొలం ఉండగా.. 5 ఎకరాల్లో సోయాబీన్స్, మిగతా వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. సోయాబీన్స్ వేసిన పొలంలో కలుపు తీసేందుకు ఎంత ప్రయత్నించినా అద్దె ఎద్దులు, వ్యవసాయ కూలీలు సకాలంలో దొరకలేదు. స్థానిక వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించగా, వారు చిన్న సైజు గుంటక ఇచ్చారు. దీన్ని ట్రాక్టరుకు అమర్చి పొలం పనులు చేస్తారు. ట్రాక్టరు అద్దెలు కూడా చాలా ఎక్కువగా ఉన్నాయి. దీంతో అజిత్ తన విద్యుత్తు స్కూటరు వెనుకభాగంలో గుంటకను అమర్చాడు. ఒక వ్యక్తి పొలంలోని సాళ్ల మధ్య స్కూటరుతో నిదానంగా ముందుకు వెళుతుండగా, దాని వెనుకనున్న గుంటకను మరో వ్యక్తి బలంగా పట్టుకొని అనుసరించాడు. ఇలా రోజుకు దాదాపు 2 ఎకరాల్లో కలుపుతీత పూర్తి చేశారు. అజిత్ ఆలోచన బాగుందని తోటి రైతులు అభినందిస్తున్నారు.

పాతికేళ్లుగా పట్టని గోడు.. గ్రామస్థులే నిర్మించారు రోడ్డు!



ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని ధంతరీ జిల్లా నాథూకోన్హా గ్రామస్థులు రోడ్డు కావాలని గత పాతికేళ్లుగా పాలకులకు, అధికారులకు విన్నవించి విసిగిపోయారు. ఏటా తాత్కాలిక రోడ్డును నిర్మించుకోవడం, వానలు పడినప్పుడు కొట్టుకుపోవడం షరా మామూలుగా మారింది. రేషను, విద్య, వైద్యం.. ఇలా ప్రతి అవసరానికీ పక్కనున్న కేరిగావ్ గ్రామానికి వెళ్లాల్సిందే. రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అజిత్ జోగి నుంచి ప్రస్తుత సీఎం విష్ణుదేవ్ సాయి వరకు ఎందరు మారినా తమ సమస్య తీరలేదని గ్రామస్థులు తెలిపారు. ఈ పరిస్థితులతో ఏటా పడుతున్న కష్టాల నివారణకు తామే నడుం బిగించినట్లు గ్రామ సర్పంచి అక్బర్ మండావి తెలిపారు. గ్రామస్థులంతా శ్రమదానం చేశారు. పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించి, రహదారి నిర్మించుకున్నారు. నాథూకోన్హా గ్రామస్థుల కృషిని జిల్లా కలెక్టరు అవినాశ్ మిశ్ర ప్రశంసించారు. త్వరలో ఆ గ్రామాన్ని సందర్శించి, ప్రభుత్వం తరఫున మరింత సాయం చేస్తామని చెప్పారు.

ఆస్ట్రేలియాలో భారత విద్యార్థిపై దాడి



ఇంటర్నెట్‌డెస్క్: ఆస్ట్రేలియాలో ఓ భారతీయ విద్యార్థిపై కొందరు దుండగులు దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆ విద్యార్థి ఆసుపత్రిలో చేరాడు. ఈ నెల 19న అడిలైడ్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌కు చెందిన చరణ్‌ప్రీత్ సింగ్ తన భార్యతో కలిసి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో తమ కారును ఓ పక్కన పార్క్ చేసి నడుస్తుండగా.. ఐదుగురు దుండగులు వేరే వాహనంలో అక్కడికి వచ్చి చరణ్‌పై భౌతిక దాడికి దిగారు. పదునైన వస్తువులతో కొడుతూ.. అతన్ని దూషించారు. ఈ ఘటనలో చరణ్ ముఖం, వెనక భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. కారు పార్కింగ్ కారణంగానే వివాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ దాడి తనను కలచి వేసిందని.. ఇలాంటివి జరిగినప్పుడు భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలనిపిస్తుందని చరణ్ పేర్కొన్నాడు. మరోవైపు.. దాడికి పాల్పడిన దుండగుల్లో 20 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా మిగిలిన వారిని కూడా పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.



మళ్లీ నడక నేర్చుకుంటున్న శుభాంశు శుక్లా

ఇంటర్నెట్ డెస్క్: యాక్సియం-4 మిషన్‌తో భారత రోదసి చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యోమగామి శుభాంశు శుక్లా ప్రస్తుతం క్వారంటైన్ సెంటర్‌లో వైద్య నిపుణుల పర్యవేక్షణలో ఉన్న విషయం తెలిసిందే. బుధవారంతో ఈ క్వారంటైన్ ముగిసింది. 18 రోజుల పాటు అంతరిక్షంలో భారరహిత స్థితిని అనుభవించిన కారణంగా భూ వాతావరణానికి ఆయన శరీరం అలవాటుపడేందుకు వీలుగా పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మళ్లీ నడక నేర్చుకుంటున్న, పరుగు సాధన చేస్తున్న వీడియోలను శుక్లా సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ జనరల్‌గా ఆనంద్ స్వరూప్

దిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఇన్వెస్టిగేషన్ డైరెక్టర్ జనరల్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఆనంద్ స్వరూప్ నియమితులయ్యారు. ఉత్తరప్రదేశ్ క్యాడర్‌కు చెందిన స్వరూప్ 1992 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత ఎన్‌హెచ్‌ఆర్‌సీ డీజీ ఆర్ ప్రసాద్ మీనా స్థానంలో స్వరూప్ బాధ్యతలు స్వీకరిస్తారు.

కావడి యాత్రికుల ట్రక్కుకు విద్యుదాఘాతం

● ఇద్దరి మృతి ● 30 మందికి గాయాలు

జైపుర్: రాజస్థాన్‌లోని అల్వర్ జిల్లా బీచ్‌గన్వా గ్రామంలో బుధవారం కావడి యాత్రికులను (కన్వారియాలు) తీసుకెళ్తున్న ట్రక్కు విద్యుత్తు తీగలు తగిలి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేలాడుతున్న తీగ ట్రక్కుకు తగలడంతో విద్యుదాఘాతమై ఇద్దరు మృతి చెందగా 30 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పరిక్రమ కార్యక్రమం సందర్భంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైంది. కావడి యాత్రికులు నృత్యం చేస్తూ ట్రక్కు సమీపంలో కదులుతుండగా విద్యుదాఘాతమైంది. వెంటనే పలువురు కిందపడిపోయారు. ఘటన అనంతరం కోపోద్రిక్తులైన స్థానికులు.. లక్ష్మణ్‌గఢ్, ముండావర్ రోడ్డును దిగ్బంధించారు.

మళ్లీ ట్రంప్ నోట అదే పాట

● భారత్-పాక్ మధ్య అణుయుద్ధాన్ని నివారించానంటూ ప్రకటన

వాషింగ్టన్: భారత్-పాక్ మధ్య యుద్ధాన్ని తాను ఆపానని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అవే వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని వైట్‌హౌస్‌లో మంగళవారం పేర్కొన్నారు. ఘర్షణ సందర్భంగా ఐదు యుద్ధ విమానాలు కూలిపోయాయన్న విషయాన్నీ పునరుద్ఘాటించారు. భారత్-పాక్ యుద్ధమే కాకుండా, కాంగో, రువాండా మధ్య పోరునూ ఆపానని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని తగ్గించానని, కొసావో-సెర్బియా మధ్య యుద్ధాన్ని ఆపానని తెలిపారు.

ఏదో అనుమానంగా ఉంది: రాహుల్

కాల్పుల విరమణ తానే చేశానని పదే పదే ట్రంప్ చేస్తున్న ప్రకటనలు వింటుంటే ఏదో అనుమానంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. పార్లమెంటు ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ "కాల్పుల విరమణ ఒప్పందం చేయడానికి ట్రంప్ ఎవరని లోక్‌సభలో ప్రశ్నిస్తే ఒక్కసారి కూడా మోదీ బదులివ్వలేదు. ఒకవేళ స్పందించినా, కాల్పుల విరమణ చేయించింది ట్రంపే అని చెప్పగలరా? అలా చెప్పలేరు. కానీ కాల్పుల విరమణ చేయించింది ట్రంపే. ఈ విషయం ప్రపంచమంతా తెలుసు" అని రాహుల్ విమర్శించారు.

క్రైమ్ షోలు చూసి బొమ్మ తుపాకీతో బీఎస్ఎఫ్ జవాను నగల దోపిడీ



దిల్లీ: ఆన్‌లైను జూదం వ్యసనంగా మారి డబ్బులు పోగొట్టుకొన్న బీఎస్ఎఫ్ కానిస్టేబులు గౌరవ్ యాదవ్ (22) క్రైమ్ షోలు చూసిన అనుభవంతో ఓ బొమ్మ తుపాకీ కొని పట్టపగలు దిల్లీలోని ఫర్ష్ బాజార్ నగల దుకాణంలోకి చొరబడ్డాడు. నెల రోజుల కిందటే బీఎస్ఎఫ్ శిక్షణ పూర్తిచేసుకొన్న ఈ యువకుడు పంజాబులో పోస్టింగు పొంది, సెలవులో దిల్లీకి వచ్చి దోపిడీకి పాల్పడినట్లు డీసీపీ ప్రశాంత్ గౌతమ్ తెలిపారు. దుకాణంలో తుపాకీని చూపుతూ నాలుగు బంగారు కంకణాలు చేజిక్కించుకొని పారిపోయాడన్నారు. దుకాణ యజమాని ఫిర్యాదుతో సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించాక, మధ్యప్రదేశ్‌లోని తన స్వస్థలమైన శివ్‌పురికి చేరుకొన్న గౌరవ్‌ను అరెస్టు చేసినట్లు డీసీపీ బుధవారం వెల్లడించారు.

బాత్రూంలో వీడియోలు తీసి భార్యనే బ్లాక్ మెయిల్ చేసి..

● ఓ ప్రభుత్వాధికారి నిర్వాకం

పుణె: ఇంట్లోని బాత్రూంలో భార్య స్నానం చేస్తుండగా.. ప్రభుత్వాధికారి అయిన ఆమె భర్త రహస్యంగా వీడియోలు తీశాడు. డబ్బు కోసం వాటిని బయట పెడతానంటూ ఆమెను బ్లాక్‌మెయిల్ చేశాడు. మహారాష్ట్రలోని పుణె జిల్లా అంబేగావ్‌లో ఈ ఘటన జరిగింది. క్లాస్ 1 ప్రభుత్వ అధికారిణిగా పని చేస్తున్న ఓ మహిళకు, మరో ప్రభుత్వ ఉద్యోగితో 2020లో వివాహం జరిగింది. ఇటీవల తాను స్నానం చేస్తుండగా.. భర్తే రహస్య కెమెరాలతో చిత్రీకరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. కారు, ఇంటి రుణం చెల్లించడానికి తనకు డబ్బులు కావాలని, పుట్టింటి నుంచి రూ.1.5 లక్షలు తీసుకురావాలని ఒత్తిడి చేస్తున్నాడని ఆమె తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రిసెప్షనిస్టును కాలితో తన్ని.. జుట్టు పట్టి లాగి

● క్యూలో రమ్మన్నందుకు అమానుష దాడి

● మహారాష్ట్రలోని ఓ ఆసుపత్రిలో ఘటన



ఠాణె: మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో అమానుష ఘటన చోటుచేసుకుంది. అపాయింట్‌మెంట్ లేకపోవడంతో క్యూలో రమ్మని చెప్పిన ఆసుపత్రి రిసెప్షనిస్టు (25)పై విచక్షణారహితంగా దాడి చేశాడో వ్యక్తి. ఆమెను కాలితో తన్నడమే కాకుండా.. జుట్టు పట్టుకుని నేలపై ఈడ్చుకుంటూ వెళ్లాడు. తూర్పు కల్యాణ్ ప్రాంతంలోని శ్రీ బాల చికిత్సాలయంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి అనంతరం అక్కడి నుంచి పరారైన నిందితుడు గోకుల్ ఝా.. తనను గుర్తుపట్టకుండా ఉండేందుకు గడ్డం తీసివేశాడని, జుట్టు కత్తిరించుకున్నాడని పోలీసులు తెలిపారు. మంగళవారం స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయస్థానం అతడికి రెండు రోజుల పాటు పోలీసు కస్టడీని విధించింది. తన బిడ్డను డాక్టర్‌కు చూపించేందుకు క్యూ పద్ధతిని పాటించకుండా గోకుల్ ఝా తన భార్య, బిడ్డతో కలిసి ముందుకెళ్లే ప్రయత్నం చేశాడు. రిసెప్షనిస్టు అతడిని అడ్డుకొని లైనులో రావాలని సూచించారు. దీంతో ఆగ్రహించిన ఆ వ్యక్తి ఆమెపై దాడి చేశాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

ఈనాడు సినిమా

శంకర వరప్రసాద్ కేరళలో ముగించారు


చిరంజీవి

సినీప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో అగ్రహీరో చిరంజీవి, అనిల్ రావిపూడి కలయికలో రూపొందుతున్న సినిమా ఒకటి. నయనతార కథానాయిక. సుస్మిత కొణిదెల, సాహు గారపాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణను పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే బుధవారం ఈ సినిమా మూడో షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకున్నట్టు తెలుపుతూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. "మన శంకరవరప్రసాద్ గారు మూడో షెడ్యూల్‌ను కేరళలో పూర్తి చేసుకుని వచ్చారు" అనే వ్యాఖ్యను జోడించారు. ఈ షెడ్యూల్‌లో అద్భుతమైన పాటతో పాటు.. కీలకమైన టాకీ పార్ట్ సన్నివేశాలను తెరకెక్కించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. వినోద ప్రధానంగా సాగే ఈ ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది విడుదల కానుంది. భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

మిరాయ్... వైబ్!


రితిక, తేజ సజ్జా

ఘన విజయం సాధించిన 'హను - మాన్' తర్వాత తేజ సజ్జా కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'మిరాయ్'. రితికా నాయక్ కథానాయిక. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. ఆయనే ఛాయాగ్రాహకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 5న 2డీ, 3డీ ఫార్మాట్లలో, మొత్తం 8 భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమాలకి సన్నద్ధమైంది చిత్రబృందం. ఈనెల 26న తొలి పాటని విడుదల చేస్తున్నారు. "సూపర్ హీరో కథలకు కొత్త నిర్వచనాన్ని చెప్పే ఫాంటసీ చిత్రమిది. తేజ సజ్జా సూపర్ యోధగా, మంచు మనోజ్ సూపర్ విలన్‌గా శక్తిమంతమైన పాత్రల్లో నటిస్తున్నారు. తొలి పాటతో ప్రచార కార్యక్రమాల్ని మొదలు పెడుతున్నాం. 'వైబ్ ఉంది...' అంటూ సాగే ఈ పాటలో నాయకానాయికల మధ్య కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకుంటాయ"ని సినీ వర్గాలు తెలిపాయి. శ్రియ, జయరామ్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌర హరి, కళ: శ్రీనాగేంద్ర తంగాల, రచన: మణిబాబు కరణం.

నాకు ఇంకో పేరుంది!


సూర్య

ఆర్జే బాలాజీ దర్శకత్వంలో సూర్య, త్రిష జంటగా నటిస్తున్న చిత్రం 'కరుప్పు'. ప్రకాశ్ బాబు, ఎస్.ఆర్.ప్రభు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బుధవారం సూర్య పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ ప్రారంభ సంభాషణలు "కొబ్బరి కాయ కొట్టి కర్పూరం వెలిగిస్తే శాంతించే దేవుణ్ని కాదు. మనసులో మొక్కుకొని మిరపకాయలు దంచితే.. రుద్రుడై దిగొచ్చే దేవుణ్ని" అంటూ మాస్ జాతర నేపథ్యంలో అదిరిపోయే సన్నివేశాలతో సాగుతోంది. "నా పేరు సూర్య.. నాకు ఇంకో పేరు కూడా ఉంది. ఏరా భాయ్ ఇది మన టైము" అంటూ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో కథానాయకుడు సూర్య చెప్పే డైలాగ్‌లు సినీప్రియుల్ని ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇంద్రన్స్, నట్టి, అనఘమాయ రవి, సుప్రీత్ రెడ్డి తదితరులు నటిస్తున్నారు. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతమందిస్తున్నారు.

ఎదుర్కొనే ఆ శక్తి సంపదలు అభిమానులు.. సినిమా ఇచ్చినవే!

-'హరి హర వీరమల్లు' వేడుకలో పవన్ కల్యాణ్



నిధి అగర్వాల్, పవన్‌కల్యాణ్, సత్యానంద్, ఎం.ఎం.కీరవాణి

నియంతృత్వ పోకడలు ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నానంటే... ఆ శక్తి సంపదలు తనకు అభిమానులు, సినిమా ఇచ్చినవే అన్నారు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్. ఏ ఊరు వెళ్లినా, ఆ ఊర్లో ఉన్నానంటూ చెప్పుకుంటాడని తనని కొందరు విమర్శిస్తున్నారని, పవనం అంటే సర్వాంతర్యామి అని, ఆ పేరుకున్న శక్తి ఏమిటో తనని విమర్శించేవాళ్లకు అర్థం కాదన్నారు. వాళ్లంతా కూపస్థమండూకాలని, బావిలో కప్పల్లా గిరి గీసుకుని ఉంటారని విమర్శించారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'హరి హర వీర మల్లు' గురువారం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా బుధవారం రాత్రి విశాఖపట్నంలో వేడుకని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ తన నట గురువు సత్యానంద్‌ని, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణిని ఈ వేదికపై సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగి బిడ్డని...

"ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుని నేను. మా నాన్న బదిలీలకు తగ్గట్టుగా ఆయా ఊళ్లు తిరిగాను. ఎప్పుడూ ఇంట్లోనే ఉండేవాడిని. బయటికి పంపిస్తే తప్ప ఏదో ఒకటి నేర్చుకోలేడని అన్నయ్య 1992లో నన్ను విశాఖపట్నంలోని గురువు సత్యానంద్ దగ్గరికి పంపించారు. అలా ఈ నగరంతో పరిచయం. ఉత్తరాంధ్ర ఆటపాటల్ని నా గుండెల్లో అణువణువునా నింపేశారు సత్యానంద్ మాస్టర్. ఇక్కడ ఆయన నాకు నటన కంటే కూడా జీవితాన్ని నేర్పించారు. నటన పరంగా, సినిమాల పరంగానే కాదు... రెండేళ్ల కిందట ఇక్కడి నోవోటెల్ హోటల్ నుంచి బయటికి రాకూడదంటూ నన్ను అప్పటి పోలీసు అధికారుల ద్వారా భయభ్రాంతులకి గురిచేస్తే, విశాఖపట్నం మొత్తం వచ్చి హోటల్ ముందు కూర్చుంది. అందుకే అంత బలమైన జ్ఞాపకం ఉంది. అందుకే విశాఖపట్నంలో ప్రత్యేకంగా ఈ వేడుక పెట్టాలనుకున్నా. ఉప ముఖ్యమంత్రిగా కంటే కూడా, అందరికీ ఇష్టమైన హీరో పవన్‌కల్యాణ్‌లా వచ్చాను. గత ప్రభుత్వంలో రూ.10 టికెట్ పెట్టినా నా సినిమా 'వకీల్‌సాబ్'కి ఘన విజయాన్ని అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక, సినిమాటోగ్రఫీ శాఖ జనసేన తీసుకున్నప్పటికీ ఈ సినిమా టికెట్ ధరలపై నేను నిర్ణయం తీసుకోకుండా, ముఖ్యమంత్రిని సంప్రదించమని నిర్మాతల్ని పంపించా. టికెట్ ధరల పెంపుకు ఆయన అనుమతి ఇస్తేనే తీసుకోండని చెప్పాను. అలాంటి పరిస్థితుల్లో అందరి హీరోలకి చేసినట్టుగా నా సినిమాకి టికెట్ ధరల్ని పెంచుకునే వెసులుబాటు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు. యువగళం ప్రతినిధి, తెలుగుదేశం యువ సారథి నారా లోకేశ్ 'పవన్ అన్న సినిమా విజయం సాధించాలి' అంటూ ఎక్స్‌లో ఓ సందేశం పంచుకున్నార"ంటూ కృతజ్ఞతలు చెప్పారు పవన్‌కల్యాణ్.

ఎవరికీ వ్యతిరేకం కాదు

"సనాతన ధర్మం అనగానే చాలా మంది వ్యతిరేకమైన ఆలోచనలతో చూస్తుంటారు. సనాతన ధర్మం ఏ మతానికీ వ్యతిరేకం కాదు. మనందరినీ కలిపి తీసుకెళ్లేదే సనాతన ధర్మం. అలాంటి ధర్మాన్ని ప్రజా కంఠకుడైన ఔరంగజేబులాంటి పాలకుడి సమయంలో మనం ఊహించుకోగలమా? అప్పుడు భారతావనిలో హిందువుగా ఉండాలంటే పన్ను చెల్లించాలి. అలాగని ఇది ఔరంగజేబుకి వ్యతిరేకంగా తీసిన సినిమా కాదు. తప్పు ఒప్పులు జరిగినప్పుడు సమానంగా తెలియజేయాలి. మన చరిత్ర పుస్తకాల్లో చోళులు, పాండ్యులు, విజయనగర సామ్రాజ్యం కంటే ఎక్కువగా మొఘలాయిల గురించే ఉంటుంది. ప్రజా కంఠకుడైన ఔరంగజేబు కూర్చున్న సింహాసనం నుంచి కోహినూర్‌ని తీసుకొచ్చేందుకు వీరమల్లు చేసిన పోరాటమే ఈ కథ. ఆ ప్రయాణంలో ఆ వీరుడికి ఎలాంటి విషయాలు తెలిశాయన్నది ఇందులో కీలకం. తన బతుకు తాను బతకాలనుకున్న వీరమల్లు ఎలా తిరగబడ్డాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. పోరాట సన్నివేశాలు లాజికల్‌గా ఉండటానికి ఇష్టపడతాను. బలమైన మనసుతో పాటు, శరీరం ఉండాలని నమ్మి అప్పట్లో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. ఆ అవగాహనతో ఈ సినిమాలోని చివరి 20 నిమిషాల సన్నివేశాల్ని అత్యంత సహజంగా తీర్చిదిద్దా. అందులో కీరవాణి సంగీతం రోమాలు నిక్కబొడుచుకునేలా చేసింది. ఆయన లేకపోతే ఈ సినిమా లేదు. 'ఖుషి' తర్వాత నేను పూర్తిస్థాయిలో చూసుకున్న సినిమా ఇది. ఎంతో సంతృప్తినిచ్చింది" అన్నారు పవన్‌కల్యాణ్.

నేను అడగను.. ప్రేక్షకులే ఇస్తారు

"కొవిడ్ పరిణామాలు, గత ప్రభుత్వంలో విశాఖలో గొడవ, చంద్రబాబునాయుడిని అరెస్టు చేయడం, రాజకీయ పరిస్థితుల వల్ల చిత్రీకరణ ఆలస్యమైంది. పార్టీ కార్యాలయానికి దగ్గరగా ఉన్న స్థలంలోనే ఈ సినిమాతోపాటు ఓజీ చిత్రీకరణ పూర్తిచేశా. సినిమాని చూడండని చెప్పడం సిగ్గుగా ఉంటుంది. ఓటేయమని అడగడానికి ఎంత ఇబ్బంది పడతానో, అలా నా సినిమాని చూడండని చెప్పడానికీ అంతే ఇబ్బంది పడతా. ఇవ్వడమే తెలుసు కానీ, అడగడం నాకు తెలియదు. నేను అడగాల్సిన అవసరం లేదు, ప్రేక్షకులు నాకు ఇస్తారని తెలుసు. డోలీలతో వెళ్లే గ్రామాలకి రోడ్లు వేయమని వాళ్లు అడగకుండానే నేను వేయించా. నన్ను తిట్టిన ప్రత్యర్థి పార్టీ సర్పంచులకి కూడా భేదం చూపించకుండా సమానంగా నిధులు కేటాయించా. సినిమా అంటే వినోదం పంచడంతోపాటు, విజ్ఞానాన్ని అందించాలి. నేను సరస్వతి దేవిని ప్రార్థిస్తాను, కృష్ణుడిని నమ్ముతాను. కర్మ చేయి, ఫలితం భగవంతుడికి వదిలేయమని చెప్పినట్టే చేస్తుంటా. భగవంతుడు మంచి ఫలితం ఇస్తాడని నమ్ముతున్నా. మా అభిమానుల కోసం ఓ విజయాన్ని ఇవ్వు అంటూ 'గబ్బర్‌సింగ్' సమయంలో భగవంతుడిని కోరుకున్నా. నటనలో ఓనమాలు దిద్దుకున్న నా విశాఖపట్నం నేలపై నుంచి అందరూ ఆనందించే ఘన విజయాన్ని అందించాలని సరస్వతి దేవిని కోరుకుంటున్నా" అన్నారు పవన్‌కల్యాణ్. ఈ కార్యక్రమంలో నిధి అగర్వాల్, విశాఖపట్నం మేయర్ పీలా శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సుందరపు విజయ్‌కుమార్, లోకం మాధవి, విశాఖ డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, ఏపీఎంఎస్‌ఎంఈ ఛైర్మన్ శివశంకర్, విశాఖ డిప్యూటీ మేయర్ గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు. -ఈనాడు, విశాఖపట్నం

సమాజంలోని ఓ ప్రధాన సమస్యే కథాంశం

హృదయాల్ని హత్తుకునే ఓ మంచి ప్రేమకథతో 'ఉసురే' తెరకెక్కిందని, యథార్థ సంఘటనలే ఈ కథకి మూలం అని చెప్పారు నవీన్ డి. గోపాల్. ఆయన దర్శకత్వంలో... టీజయ్ అరుణాచలం, జననీ కునశీలన్ జంటగా నటించిన చిత్రమిది. మౌళి.ఎం.రాధాకృష్ణ నిర్మాత. సీనియర్ నటి రాశి కీలక పాత్ర పోషించారు. ఆగస్టు 1న ఈ చిత్రం రానుంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో పాటల విడుదల వేడుక జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ ' 'చిత్తూరులోని ఓ గ్రామంలో, అత్యంత సహజంగా తెరకెక్కించిన చిత్రమిది. ఓ అచ్చ తెలుగు సినిమా చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. ఈ సినిమా ట్రైలర్‌ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్‌కి చూపించాం. ఆయన చాలా బాగుందని, తప్పకుండా ఈ చిత్రం విజయం సాధిస్తుందని అభినందించారు. ఆయన చెప్పినట్టే ఈ చిత్రం ప్రేక్షకాదరణ పొందుతుందని నమ్ముతున్నా" అన్నారు. నిర్మాత మౌళి.ఎం.రాధాకృష్ణ మాట్లాడుతూ "సమాజంలోని ఓ ప్రధానమైన సమస్యని ఆధారంగా చేసుకుని రూపొందించిన చిత్రమిది. అనసూయ పాత్రని పోషించిన రాశి నటన ప్రేక్షకుల్ని అలరిస్తుంది. లోకేశ్ కనగరాజ్, విజయ్ సేతుపతి, శ్రుతిహాసన్ తదితరులు ఈ సినిమాకి సహకారం అందించారు" అన్నారు. రాశి మాట్లాడుతూ "దర్శకుడు మంచి విజన్‌తో ఈ సినిమాని తెరకెక్కించారు. ట్రైలర్ చూస్తే అందులో నేను హీరోహీరోయిన్లని కొట్టాను. 'ప్రేయసిరావే' సినిమాలో శ్రీకాంత్‌ని కొట్టాను. ఆ సినిమా ఘన విజయం సాధించింది. నాకున్న సెంటిమెంట్ ప్రకారం ఈ సినిమా కూడా హిట్ అవుతుంది. మంచి మలుపు ఉన్న కథలో హీరో ఎంతో సహజంగా నటించాడు. హీరోయిన్‌కీ గొప్ప భవిష్యత్తు ఉంది. ఇందులో నా పాత్ర అందరూ ఆశ్చర్యపోయేలా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కిరణ్ జోజ్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.


జననీ, అరుణాచలం

భద్రకాళి రాజకీయం



రామాంజనేయులు, తృప్తి, విజయ్ ఆంటోనీ, డి.సురేశ్‌బాబు, అరుణ్ ప్రభు

రాజకీయ నేపథ్యంలో సాగే ఓ కొత్త రకమైన సినిమానే మా 'భద్రకాళి' అన్నారు విజయ్ ఆంటోనీ. ఆయన కథానాయకుడిగా అరుణ్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. తృప్తి కథానాయిక. సర్వాంత్‌రామ్ క్రియేషన్స్ పతాకంపై రామాంజనేయులు జవ్వాజి నిర్మిస్తున్నారు. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్, స్పిరిట్ మీడియా సంయుక్తంగా సెప్టెంబరు 5న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాయి. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. కథానాయకుడు విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ "రాజకీయ నేపథ్యంలో గతంలో చాలా సినిమాలొచ్చాయి. వాటికి భిన్నంగా, ఇప్పటివరకూ తెరపై చూడని ఓ కొత్త రకమైన కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. అరుణ్ ప్రభు నాకు ఇష్టమైన దర్శకుడు. ఎంతో ప్రతిభ కలిగిన సాంకేతిక నిపుణుడు. అన్ని విషయాలపై ఎంతో అవగాహనతో ఈ సినిమాని పక్కా ప్రణాళికతో పూర్తి చేశారు. నా తొలి సినిమాని విడుదల చేసిన నిర్మాత జవ్వాజి రామాంజనేయులు. ఆయనతో కలిసి ఈ సినిమా ప్రయాణం చేయడం ఆనందంగా ఉంది. డి.సురేశ్ బాబు ఈ సినిమా విడుదల వెనుక ఉండటం ఆనందంగా ఉంది" అన్నారు. దర్శకుడు అరుణ్‌ప్రభు మాట్లాడుతూ "నా తొలి సినిమా 'అరువి' విడుదలైనప్పుడు తొలి ప్రశంస తెలుగు చిత్ర పరిశ్రమ నుంచే వచ్చింది. రానా, విజయ్ దేవరకొండ, త్రివిక్రమ్ ఫోన్ చేసి ప్రశంసించారు. 'భద్రకాళి' రాజకీయ వినోదం ఉన్న చిత్రం. అన్ని వర్గాల ప్రేక్షకులకూ చేరువయ్యేలా ఉంటుంది. తెలుగులో ఈ సినిమా విడుదల అవుతుండడం ఆనందంగా ఉంది" అన్నారు. నిర్మాత జవ్వాజి రామాంజనేయులు మాట్లాడుతూ ' 'సామాజికాంశాల్ని స్పృశిస్తూనే వినోదం పంచే చిత్రమిది. ప్రేక్షకుడిలో ఆలోచన రేకెత్తిస్తుంది. ఇప్పటివరకూ 'బిచ్చగాడు' ఫేమ్ విజయ్ ఆంటోనీ అంటున్నారు. ఈ సినిమా తర్వాత 'భద్రకాళి' విజయ్ ఆంటోనీ అని పిలుస్తారు. ఏషియన్ సురేశ్ ప్రొడక్షన్స్‌లో మేం ఈ మధ్యే 'మార్గన్'ని విడుదల చేశాం. ఇప్పుడు మళ్లీ ఈ సినిమాతో జట్టు కట్టాం. మరో విజయాన్ని అందుకుంటాం" అన్నారు. నిర్మాత డి.సురేశ్‌బాబు మాట్లాడుతూ "విజయ్ ఆంటోనీ ఏం చేసినా ఎంతో పకడ్బందీగా, పక్కాగా డిజైన్ చేస్తారు. ఈ సినిమాని ఎంతో ఉత్సాహంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇది మంచి పరిణామం. జవ్వాజి రామాంజనేయులుకు మా నాన్నతోనూ ఎంతో అనుబంధం ఉండేది. ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్న ఈ బృందానికి నా అభినందనలు" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ధనుంజయన్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

తన్వి ది గ్రేట్‌కు మధ్యప్రదేశ్‌లో పన్ను మినహాయింపు



అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించి, నటించిన చిత్రం 'తన్వి ది గ్రేట్'. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ చిత్రానికి పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డా.మోహన్ యాదవ్ ఇటీవల ప్రకటించారు. భోపాల్‌లో నిర్వహించిన 'తన్వి ది గ్రేట్' ప్రత్యేక ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..."ఆటిజంతో బాధపడుతున్న ఒక అమ్మాయి ఎదుర్కొనే సవాళ్ల ఇతివృత్తంతో రూపొందిన ఈ సినిమా అందరిని ఆకర్షిస్తోంది. ఈ అద్భుతమైన చిత్రాన్ని అందించిన అనుపమ్, చిత్రబృందానికి అభినందనలు" అన్నారు. పన్ను మినహాయింపు విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు మోహన్ యాదవ్ "గౌరవనీయులైన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి.. మిమ్మల్ని కలవడం గౌరవంగా ఉంది. మీరు మా సినిమాను థియేటర్‌లో చూడటానికి రావడం నిజంగా మా అదృష్టం. మీరు ఈ సినిమా చూసి అభినందించడమే కాకుండా పన్ను ఉచితం అని ప్రకటించార"నే వ్యాఖ్యను జోడించారు. శుభాంగి దత్, జాకీ ష్రాఫ్, అరవింద్ స్వామి, బొమన్ ఇరానీ తదితరులు నటించారు.

లద్దాఖ్‌లో సల్మాన్ యాక్షన్?



సల్మాన్

త్వరలో 'బాటిల్ ఆఫ్ గాల్వాన్' చిత్రంతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతున్నారు బాలీవుడ్ అగ్రకథానాయకుడు సల్మాన్ ఖాన్. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ చిత్రం ఆగస్టులో పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ముంబయిలో ఓ షెడ్యూల్‌తో ప్రారంభం కానున్న ఈ సినిమా.. ఆ తర్వాత లద్దాఖ్‌కు వెళ్లనుందట. "ముంబయి తర్వాత మొదలు కానున్న రెండో షెడ్యూల్ సినిమాకే చాలా కీలకం. ఎంతో శారీరక శ్రమతో కూడుకున్నది. అక్కడ సినిమాకు ప్రధానంగా నిలిచే యుద్ధ సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. దీని కోసం కొన్ని నెలల నుంచే కసరత్తులు చేస్తున్నారు సల్మాన్" అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. 2020లో గాల్వాన్ లోయలో జరిగిన యుద్ధం నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు.

రెడీ ఇన్ ఓటీటీ

మరింత రంగులమయం.. జీవితం!

సిరీస్: 'రంగీన్'
నటీనటులు: వినీత్ కుమార్ సింగ్, రాజశ్రీ దేశ్‌పాండే
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: అమెజాన్ ప్రైమ్ వీడియో



కథాంశం: భార్యాభర్తల అనుబంధం చాలా గొప్పది. బంధుత్వాలు ఎన్ని ఉన్నప్పటికీ.. చివరి వరకు కలిసి ఉండాల్సింది వీరిద్దరే. ఈ ప్రయాణంలో కొన్ని సార్లు మనస్పర్థలు రావచ్చు. ఆ పరిస్థితుల్లో కొంచెం సమయం తీసుకొని సమస్యను పరిష్కరించుకోవాలే తప్పా.. మూడో వ్యక్తికి చోటు ఇవ్వకూడదు. ఒక వేళ ఇస్తే.. ఆ పరిణామాలు సంతోషంగా ఉండే కుటుంబాన్ని ఎలా మార్చేస్తుందో చూపించడానికి సిద్ధంగా ఉంది 'రంగీన్' సిరీస్. వినీత్ కుమార్ సింగ్, రాజశ్రీ దేశ్‌పాండే, షీబా చద్దా కీలక పాత్రల్లో నటించారు. కోపాల్ నైతాని, ప్రాంజల్ దువా సంయుక్తంగా రూపొందిస్తున్నారు. ఇందులో వినీత్ కుమార్.. ఆదర్శ్ అనే పాత్రలో కనిపించనున్నారు. ఒక చిన్న వార్తా పత్రిక నడుపుతూ ఉంటాడు ఆదర్శ్. ఉద్యోగంలో బిజీగా ఉంటూ భార్యను నిర్లక్ష్యం చేస్తాడాయన. ఈ క్రమంలోనే వీరి జీవితాల్లోకి మూడో వ్యక్తి వచ్చాడని, తన భార్య తనని మోసం చేస్తోందని తెలుసుకుంటాడు ఆదర్శ్. ఆ తర్వాత ఏమైందనేదే ఈ సిరీస్ కథాంశం. మరి "మరింత రంగులమయంగా జీవితం మారబోతుంద"ంటూ ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ సిరీస్‌పై మీరూ ఓ లుక్కేయ్యండి.

కోచ్‌గా మారిన రగ్బీ ఆటగాడి కథ

సిరీస్: 'ది విన్నింగ్ ట్రై'
నటీనటులు: యూన్ కై సాంగ్, లిమ్ సే మి, కిమ్ యో హాన్
విడుదల: శుక్రవారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్



కథాంశం: ఎన్నో ఏళ్లు కష్టపడి రగ్బీ క్రీడలో జాతీయస్థాయిలో పేరు తెచ్చుకుంటాడు జూ గా రామ్(యూన్ కై సాంగ్). దక్షిణ కొరియాలో రగ్బీలో ఎంతో ప్రతిభ ఉన్న ఆటగాడు. అలాంటి జూ గా రామ్ కొన్ని కారణాల వల్ల తన కెరీర్‌ని కోల్పోతాడు. అప్పటికే తను ప్రేమిస్తున్న బే యి- జీ(లిమ్ సే మి)కి కూడా కనిపించకుండా వెళ్లిపోతాడు. కొన్ని సంవత్సరాల తర్వాత ప్రొఫెషనల్ రగ్బీ కోచ్‌గా తిరిగి క్రీడా ప్రపంచంలోకి అడుగు పెడతాడు. ఓ హైస్కూల్‌లో కోచ్‌గా చేరతాడు. అంతేకాదు "మన లక్ష్యం జాతీయ స్థాయిలో గెలవడమే" అంటూ వారిని ఆటకు సిద్ధం చేస్తుంటాడు. అదే స్కూల్‌లో తన మాజీ ప్రియురాలు బే యి-జీ షూటింగ్ కోచ్‌గా ఉంటుంది. జూ గా రామ్ తన ప్రియురాలికే కాదు జట్టులోని ప్లేయర్స్‌కి కూడా నచ్చడు. మరి ఇలాంటి పరిస్థితుల్లో జూ గా కోచ్‌గా ఆటలో మెలకువలే తెలియని జట్టుకి రగ్బీ ఎలా నేర్పించాడో తెలియాలంటే 'ది విన్నింగ్ ట్రై' సిరీస్ చూడాల్సిందే. దీనిని స్పోర్ట్స్ కామెడీ డ్రామా నేపథ్యంలో కిమ్ జే హ్యూన్, కిమ్ జీ యోన్ తెరకెక్కించారు. ప్లేయర్స్‌ని ఆటకు సిద్ధం చేస్తున్న సన్నివేశాలతో.. ప్రియురాలితో జరిగే చిలిపి గొడవలతో నవ్వులు పూయిస్తున్న ఈ సిరీస్‌ని మీరూ చూసేయండి.

దక్షిణాఫ్రికాకు నాట్కో

● ఆ దేశ కంపెనీలో 35.75% వాటా
● రూ.2,000 కోట్లతో కొనుగోలు



రాజీవ్ నన్నపనేని

ఈనాడు, హైదరాబాద్: దక్షిణాఫ్రికాలోని అగ్రగామి ఫార్మా కంపెనీ యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్)లో 35.75% వాటాను దాదాపు రూ.2,000 కోట్లు వెచ్చించి నాట్కో ఫార్మా కొనుగోలు చేస్తోంది. యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ సంస్థాగత విలువను దాదాపు 632 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.5,460 కోట్లు)గా నిర్ధారించి, ఈ వాటా కొనుగోలు ప్రతిపాదనకు బుధవారం జరిగిన నాట్కో ఫార్మా డైరెక్టర్ల బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ లావాదేవీ కోసం దక్షిణాఫ్రికాలో నాట్కో ఫార్మా సౌత్ ఆఫ్రికా ప్రొప్రైటరీ లిమిటెడ్ అనే సబ్సిడరీ కంపెనీని ఏర్పాటు చేస్తోంది. 4 నెలల వ్యవధిలో వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని అంచనా. ఆ తర్వాత యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ ఆదాయాలు, లాభాల్లో 35.75% వాటా నాట్కో ఫార్మా ఏకీకృత ఖాతాల్లో కనిపిస్తుంది. యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్‌లో 64.25% వాటా బిడ్‌వెస్ట్ అనే మరొక సంస్థ చేతిలో ఉంది.

ఇదీ ప్రయోజనం: నాట్కో ఫార్మాకు పరిశోధన- అభివృద్ధి నైపుణ్యాలు అధికం. ఔషధాలకు అనుమతులు తీసుకోవటంలో (డోసియర్ అప్రూవల్), మేధో సంపత్తి హక్కుల సాధనలో, అభివృద్ధి చెందిన దేశాల (రెగ్యులేటెడ్) మార్కెట్లలో ఎంతో అనుభవం ఉన్న నాట్కో ఫార్మా మద్దతుతో యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ కార్యకలాపాలు విస్తరించేందుకు, కొత్త ఔషధాల విడుదలకు అవకాశం కలుగుతుందని అంచనా వేస్తున్నారు. యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్‌కు ఎంతో పేరున్న బ్రాండ్లు, ఔషధాలు ఉన్నాయని, దక్షిణాఫ్రికాలో అగ్రగామి సంస్థగా ఉన్నట్లు నాట్కో ఫార్మా సీఈఓ రాజీవ్ నన్నపనేని వివరించారు. ఈ కంపెనీలో వాటా కొనడం వల్ల దక్షిణాఫ్రికాలో విస్తృత అవకాశం తమకు లభిస్తుందని, ఆఫ్రికాలోని ఇతర దేశాల్లోనూ అడుగుపెట్టొచ్చన్నారు. దక్షిణాఫ్రికా ప్రజలకు నాట్కో ఫార్మా ద్వారా తక్కువ ధరలో కొత్త ఔషధాలు అందించగలుగుతామని యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ సీఈఓ ఆండ్రూ హాల్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 50కి పైగా దేశాలకు నాట్కో ఫార్మా ఔషధాలను సరఫరా చేస్తోందని వివరించారు. ఈ వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యాక, యాడ్‌కాక్ షేర్లను జోహన్నెస్‌బర్గ్ స్టాక్ ఎక్స్ఛేంజీ నుంచి 'డీలిస్ట్' చేయాలని నిర్ణయించారు.

యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ adcock ingram

- యాడ్‌కాక్ ఇన్‌గ్రామ్ దక్షిణాఫ్రికాలోని ప్రైవేటు మార్కెట్ విభాగంలో రెండో అతిపెద్ద కంపెనీ
- జనరిక్ మందులు, బ్రాండెడ్ ఔషధాలు, క్రిటికల్ కేర్ హాస్పిటల్ ఉత్పత్తులు, కన్జూమర్- హోమ్‌కేర్ ఉత్పత్తులను విక్రయిస్తోంది.
- 2024 జూన్‌తో ముగిసిన ఏడాదికి ఈ సంస్థ 536 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,600 కోట్లు) ఆదాయాన్ని నమోదు చేసింది. ఎబిటా మార్జిన్ 14.6%, నికర లాభం 45 మిలియన్ డాలర్లు (సుమారు రూ.400 కోట్లు)గా ఉన్నాయి.
- 2025 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి ఆదాయం 262 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2250 కోట్లు), నికరలాభం 22 మిలియన్ డాలర్లు (సుమారు రూ.190 కోట్లు)గా నమోదయ్యాయి.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,418 కోట్లు

అమెరికాలో తగ్గిన ఆదాయాలు



జీవీ ప్రసాద్

ఈనాడు - హైదరాబాద్

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.8,545.2 కోట్ల ఆదాయం, రూ.1,417.8 కోట్ల నికరలాభం నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 11% కాగా, నికరలాభం 2 శాతమే పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో డాక్టర్ రెడ్డీస్ ఐరోపా దేశాల్లో అధిక వృద్ధి నమోదు చేసినా, ఉత్తర అమెరికా మార్కెట్లో ఆదాయాలు తగ్గాయి. మనదేశంలో అమ్మకాలు 11% పెరిగాయి. కొత్త ఔషధాలను విడుదల చేయడానికి తోడు, కొన్ని మందుల ధరలు పెరిగినందున మనదేశంలో ఆకర్షణీయ వృద్ధి నమోదైంది. నికోటిన్ రిప్లేస్‌మెంట్ థెరపీ విభాగానికి చెందిన ఔషధాల అధిక అమ్మకాల వల్ల ప్రస్తుత మొదటి త్రైమాసికంలో ఆదాయంలో రెండంకెల వృద్ధి సాధించినట్లు డాక్టర్ రెడ్డీస్ సహ-ఛైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ వివరించారు. యూఎస్ జనరిక్ ఔషధాల మార్కెట్లో పోటీ వల్ల లెనలిడోమైడ్ ఔషధం ధరపై ఒత్తిడి కనిపిస్తోందన్నారు. అమెరికాలో ఆదాయాలు తగ్గటానికి ఇదొక ముఖ్య కారణం.

కొత్త ఒప్పందాలు

- కెట్రుడా (బ్రాండు)కు జనరిక్ ఔషధమైన పెమ్‌బ్రోలిజుమాబ్‌ను అభివృద్ధి చేయడం కోసం అల్వోటెక్ సంస్థతో డాక్టర్ రెడ్డీస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.
- రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ)ను నిరోధించే ఔషధమైన బేఫోర్టస్ (నిర్సెవిమాబ్)ను మనదేశంలో విడుదల చేయడానికి సనోఫీతో ఒప్పందం.
- అల్జీమర్స్‌ను అదుపు చేసే సెన్నిమ్యూన్ అనే ఇమ్యునోథెరపీ ఔషధ విడుదలకు ఆల్ఫా-అబెల్లో సంస్థతో డాక్టర్ రెడ్డీస్ కలిసి పనిచేస్తోంది.



రూ.50 లక్షల వరకు క్లెయిమ్‌ల కోసం అంతర్గత అంబుడ్స్‌మన్: ఐఆర్‌డీఏఐ

దిల్లీ: రూ.50 లక్షల లోపు క్లెయిమ్‌ల విషయమై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గతంగా అంబుడ్స్‌మన్‌ను బీమా సంస్థలు ఏర్పాటు చేయాలని బీమా నియంత్రణ ప్రాధికార సంస్థ ఐఆర్‌డీఏఐ ప్రతిపాదించింది. ఇంటర్నల్ ఇన్సూరెన్స్ అంబుడ్స్‌మన్ గైడ్‌లైన్స్ 2025 పేరిట నిబంధనల ముసాయిదాను సంస్థ బుధవారం విడుదల చేసింది. పరిష్కారం కాని, అంతకు తమ తీవ్రమైన ఫిర్యాదులను పాలసీదారులు, నిర్ణీత సమయంలోపు పరిష్కరించేలా స్వతంత్ర వ్యవస్థను బీమా సంస్థలు నెలకొల్పాలని సూచించింది. ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్ పైస్థాయి కార్యకలాపాలు సాగిస్తున్న అన్ని బీమా సంస్థలకు ఇది వర్తిస్తుందని వివరించింది. తగిన న్యాయపరిధి - బాధ్యతలను నిర్ణయిస్తూ, ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో అంబుడ్స్‌మన్‌లను నియమించాలని పేర్కొంది. కంపెనీ బోర్డుకు నివేదించేలా అంబుడ్స్‌మన్ ఉండాలని తెలిపింది. ఈ ప్రతిపాదనలపై ఆగస్టు 17లోగా అభిప్రాయాలు తెలపాలని కోరింది.

కాలేయ వ్యాధులపై విస్తృత పరిశోధనలు

చేతులు కలిపిన అపోలో హాస్పిటల్స్, సీమెన్స్ హెల్తినీర్స్

ఈనాడు, హైదరాబాద్: కాలేయ వ్యాధులపై అత్యాధునిక పరిశోధనలు చేపట్టడానికి అపోలో హాస్పిటల్స్, సీమెన్స్ హెల్తినీర్స్ ఒప్పందం చేసుకున్నాయి. ఈ రెండు సంస్థలు కలిసి కృత్రిమ మేధ, ఇమేజింగ్ టెక్నాలజీలను వినియోగించి కాలేయ వ్యాధులను అదుపు చేయడానికి, నూతన చికిత్సలను ఆవిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తాయి. మనదేశంలో కాలేయ వ్యాధుల బాధితులు పెరుగుతున్నారు. అధిక బరువు, ఊబకాయం, మధుమేహ వ్యాధులు దీనికి కారణాలు. కొన్ని రకాల కాలేయ వ్యాధుల వల్ల గుండె పోటు వచ్చి, ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. మెరుగైన డయాగ్నొస్టిక్ విధానాల వల్ల కాలేయ వ్యాధులను ముందుగానే పసిగట్టి అదుపు చేసే అవకాశం ఉంటుందని అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి వివరించారు. ఈ దిశగా మంచి ఫలితాలు సాధించేందుకు సీమెన్స్ హెల్తినీర్స్‌తో అపోలో హాస్పిటల్స్ భాగస్వామ్యం వీలుకల్పిస్తుందని అన్నారు.

తనిష్క్.. వజ్రాల నైపుణ్య కేంద్రం

ముంబయి: టాటా గ్రూప్‌నకు చెందిన ఆభరణాల సంస్థ తనిష్క్, దేశంలోనే తొలిసారిగా వజ్రాల నైపుణ్య కేంద్రాన్ని ముంబయిలో ప్రారంభించింది. ఇందు కోసం డీ బీర్స్ గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. నమ్మకం, పారదర్శకత, టెక్నాలజీ ఆధారంగా వినియోగదారులు వజ్రాల కొనుగోలు ప్రయాణాన్ని మొదలుపెట్టేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని, కొనుగోలుదారులు విక్రయశాలలోనే వజ్రాల మదింపు ప్రక్రియను పూర్తిచేసేందుకు ఇది ఉపయోగ పడుతుందని తనిష్క్ వెల్లడించింది. వజ్రాలు కొనుగోలు చేసే వారికి విశ్వాసం, స్పష్టత, అవగాహన కలిగేందుకూ దోహదం చేస్తుందని చెబుతోంది. లైట్ పెర్ఫార్మెన్స్, ఆరిజన్, ఇన్‌క్లూజన్స్, లేజర్ మార్కింగ్స్ ద్వారా ఈ కేంద్రంలో వజ్రాలను మదింపు చేస్తారని తనిష్క్ సీఈఓ అజయ్ చావ్లా తెలిపారు.


కోడి గుడ్లు

24న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	450
వరంగల్	452
విజయవాడ	475
గోదావరి	475
విశాఖపట్నం	485
చిత్తూరు	523

అంచనాలను మించిన ఇన్ఫోసిస్

● రూ.6,921 కోట్లకు పెరిగిన లాభం
● ఆదాయం రూ.42,279 కోట్లకు



'మా ఎంటర్‌ప్రైజ్ ఏఐ సామర్థ్యాలు, ఖాతాదారు నిర్ణయాల్లో విజయాలు, 3,00,000 మందికి పైగా ఉద్యోగుల నిబద్ధతను మొదటి త్రైమాసిక ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. 3.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ.32,700 కోట్ల) విలువైన భారీ ఆర్డర్లు దక్కించుకున్నాం. పోటీ పరిస్థితులను తట్టుకునే మా సామర్థ్యం, ఖాతాదారులతో బలమైన బంధాలకు ఇవి నిదర్శనాలు.'
- ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్

దిల్లీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) మొదటి త్రైమాసికంలో ఇన్ఫోసిస్ అంచనాలు మించి రూ.6,921 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.6,368 కోట్లతో పోలిస్తే ఇది 8.6% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.39,315 కోట్ల నుంచి 7.53% వృద్ధితో రూ.42,279 కోట్లకు చేరింది. నిర్వహణ మార్జిన్ 21.1% నుంచి 20.8 శాతానికి చేరింది. షేరుపై ఆదాయం 8.63% అధికమై రూ.16.70గా ఉంది. 2025 జనవరి-మార్చితో పోలిస్తే లాభం 1.5% తగ్గినా, ఆదాయాలు 3.3% పెరిగాయి.

ఆదాయ అంచనాల పెంపు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆదాయ అంచనాలను ఇన్ఫోసిస్ పెంచింది. ఇంతకు ముందు స్థిర కరెన్సీలో 0-3% ఆదాయ వృద్ధిని అంచనా వేయగా.. ప్రస్తుతం దాన్ని 1-3 శాతానికి సవరించింది. నిర్వహణ మార్జిన్ అంచనాలను 20-22 శాతంగా కొనసాగించింది. కంపెనీ మొత్తం ఆదాయంలో ఆర్థిక సేవల వాటా 27.9 శాతంగా ఉంది. తయారీ (16.1%), రిటెయిల్ (13.4%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. త్రైమాసిక ఆదాయంలో ఉత్తర అమెరికా వాటా 58.9% నుంచి 56.5 శాతానికి తగ్గింది. ఐరోపా వాటా 28.4% నుంచి 31.5 శాతానికి పెరిగింది. గత కొన్ని త్రైమాసికాలుగా కంపెనీ ఐరోపాలో బలంగా రాణిస్తోందని సీఎఫ్‌ఓ జయేశ్ సంఘ్‌రాజ్‌కా పేర్కొన్నారు. భారీ లావాదేవీల మొత్తం కాంట్రాక్టు విలువ 3.8 బి.డాలర్లుగా ఉంది.

20,000 ఫ్రెషర్ల నియామకాలు..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20,000 మంది తాజా ఉత్తీర్ణులను (ఫ్రెషర్లు) ఇన్ఫోసిస్ నియమించుకోనుంది.
- 2025 జూన్ చివరకు కంపెనీ ఉద్యోగుల సంఖ్య 3,23,788గా నమోదైంది. 2024-25 ఇదే కాలం నాటి 3,15,332 మందితో పోలిస్తే, ఈ సంఖ్య 2.6% (8,456) అధికం. 2025 మార్చి చివరితో చూస్తే 210 మందిని నికరంగా జత చేసుకుంది.
- సమీక్షా త్రైమాసికంలో వలసల రేటు 14.4 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇది 12.7% కాగా, మార్చి త్రైమాసికంలో 14.1 శాతంగా ఉంది.

రెనో ట్రైబర్ ఫేస్‌లిఫ్ట్

ధర రూ.6.29- 9.17 లక్షలు



దిల్లీ: రెనో బహుళ ప్రయోజన వాహనం (ఎంపీవీ) ట్రైబర్ మోడల్‌లో సరికొత్త వెర్షన్‌ను తీసుకొచ్చింది. ఏడు సీట్లు కలిగిన కొత్త ట్రైబర్ ధర రూ.6.29- 9.17 లక్షలు (ఎక్స్‌-షోరూమ్). 2019లో ట్రైబర్‌ను తీసుకొచ్చిన సంస్థ.. ఆరేళ్ల తర్వాత కొత్త హంగులతో ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఆరు రంగులు- ఐస్ కూల్ వైట్, స్టెల్త్ బ్లాక్, మూన్‌లైట్ సిల్వర్, యాంబర్ టెర్రాకోటా, షాడో గ్రే, జన్‌స్కార్ బ్లూలో ఇది లభించనుంది. 8 అంగుళాల టచ్‌స్క్రీన్, ఏసీ వెంట్స్, యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, వైర్‌లెస్ ఛార్జర్, పుష్ బటన్ స్టార్ట్/స్టాప్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, క్రూయిజ్ కంట్రోల్, పార్కింగ్ సెన్సార్స్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. భారత్‌లో విద్యుత్ కార్ల రంగం మరింత బలోపేతం అయ్యాక, తమ విద్యుత్తు మోడళ్లు విడుదల చేస్తామని రెనో ఇండియా ఎండీ వెంకట్రామ్ మామిళ్లపల్లి పేర్కొన్నారు.

బ్లాక్ డీల్ లావాదేవీలతో ఒబెరాయ్, లోధా షేర్లకు నష్టాలు



దిల్లీ: ఒబెరాయ్ రియాల్టీ, లోధా డెవలపర్స్ షేర్లలో బ్లాక్ డీల్స్ జరగడంతో ఈ రెండు స్థిరాస్తి దిగ్గజ కంపెనీల షేర్లు 6% వరకు నష్టపోయాయి. ఒబెరాయ్ రియాల్టీలో 3% వాటాకు సమానమైన 1.1 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కోటి రూ.1,753.20 ధర వద్ద 230 మిలియన్ డాలర్ల (రూ.1,987.02 కోట్ల)కు విక్రయించారు. ఈ లావాదేవీ అనంతరం.. ఒబెరాయ్ రియాల్టీ షేరు ఎన్ఎస్ఈలో 4.16% నష్టంతో రూ.1,750.20 వద్ద ముగిసింది. లోధా డెవలపర్స్‌లోనూ 1% వాటాకు సమానమైన 98 లక్షల షేర్లను ఒక్కోటి రూ.1,384.60 వద్ద 165 మి.డాలర్ల (రూ.1,424.97 కోట్ల)కు విక్రయించారు. దీంతో ఈ కంపెనీ షేరు ఎన్ఎస్ఈలో 6.64% నష్టపోయి రూ.1,346.50 వద్ద స్థిరపడింది. ఈ బ్లాక్ డీల్ లావాదేవీల్లో రెండు కంపెనీల షేర్లను, వాటి ముందు రోజు ముగింపు ధరతో పోలిస్తే 4% తక్కువకు విక్రయించారు.

ఆరమ్ ప్రోప్‌టెక్ చేతికి ప్రోప్ టైగర్

దిల్లీ: ఇళ్ల బ్రోకరేజీ సంస్థ ప్రోప్ టైగర్‌ను ఆస్ట్రేలియాకు చెందిన ఆర్ఈఏ గ్రూపు సంస్థ నుంచి ఆరమ్ ప్రోప్‌టెక్ కొనుగోలు చేయనుంది. ఇందుకు ఆరమ్ ప్రోప్‌టెక్ బోర్డు ఆమోదం తెలిపింది. కొనుగోలు లావాదేవీ విలువ రూ.86.45 కోట్లు. పరస్పర షేర్ల బదిలీ ద్వారా ఈ కొనుగోలు జరగనుంది. ఇందులో భాగంగా ఆర్ఈఏకు ప్రిఫరెన్షియల్ పద్ధతిలో రూ.5 ముఖ విలువ గల 42,42,537 షేర్లను ఆరమ్ ప్రోప్‌టెక్ జారీ చేయనుంది. ఈ షేర్ల జారీ అనంతరం.. ఆరమ్ ప్రోప్‌టెక్‌లో ఆర్ఈఏ ఇండియాకు 5.54% వాటా ఉండనుంది.

వాణిజ్య కార్యకలాపాలు చేసే ట్రాక్టర్లకు లొకేషన్ ట్రాకింగ్ పరికరాలు

ఈనాడు, దిల్లీ వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించే (భారీ లోడ్‌ల రవాణా) అన్ని ట్రాక్టర్లకు ఈ ఏడాది అక్టోబరు 1 తర్వాత వెహికిల్ లొకేషన్ ట్రాకింగ్ పరికరాలు ఏర్పాటుచేయాలని కేంద్ర రహదారి, రవాణాశాఖ ప్రతిపాదించింది. వెహికిల్‌ట్రాకింగ్ డివైజ్‌లో ఆర్ఎఫ్ఐడీ నిక్షిప్తం చేయాలని పేర్కొంది. ట్రాక్టర్‌తో కలిసి ఉండే ట్రెయిల్ నుంచి ఆర్ఎఫ్ఐడీ డేటా రీడ్‌చేసేలా ఇది ఉండాలి. అన్ని ట్రెయిలర్‌లకు ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్స్ బిగించాలి. ట్రెయిలర్‌కు ఎలక్ట్రానిక్ గుర్తింపు కల్పించడంతో పాటు, దాన్ని ట్రాక్టర్‌తో కలపడానికి ఇది ముఖ్యం. 2027 ఏప్రిల్ 1 తర్వాత భారీ లోడ్‌లను రవాణాచేసే వాణిజ్య ట్రాక్టర్లకు ఈవెంట్ డేటా రికార్డర్ (ఈడీఆర్) బిగించాలనీ ఆదేశించింది. వాహనానికి సంబంధించిన సంక్షిప్త డేటా నిల్వచేయడానికి ఇది అవసరమని తెలిపింది. ట్రాక్టర్ కార్యకలాపాలను విశ్లేషించేందుకు వీలుగా అవసరమైన కొలమానాలన్నింటినీ రికార్డు చేసేలా ఈడీఆర్ ఉండాలని కేంద్రప్రభుత్వం స్పష్టంచేసింది. 2026 అక్టోబరు 1 నుంచి అన్ని ట్రెయిలర్లకు 13 పిన్‌లు, 13 పోల్ కనెక్టర్లు బిగించాలని పేర్కొంది. ఈ సవరణలపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలను comments-morth@gov.in ఈమెయిల్‌కు 30 రోజుల్లోపు పంపాలని సూచించింది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
టాటా కన్జూమర్	331.75	289.25	4,778.91	4,352.07
సింజీన్	87	54	875	790
వెస్ట్‌లైఫ్	1.22	3.25	653.25	613.64
పీసీబీఎల్	94	117.9	2,114	2,143
ఎంఏఎస్ ఫైనాన్షియల్	84	70	444	347
ఆదిత్య బిర్లా రియల్	(27.08)	17.35	157.41	365.24

మింత్రాపై ఫెమా కేసు

● దాఖలు చేసిన ఈడీ
● రూ.1654 కోట్ల ఎఫ్‌డీఐ 'ఉల్లంఘన'

దిల్లీ: ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఇ-కామర్స్ ప్లాట్‌ఫాం మింత్రాపై ఫెమా కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బుధవారం తెలిపింది. మింత్రా, సంబంధిత కంపెనీలు, డైరెక్టర్లు రూ.1654 కోట్ల మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డట్లు అందులో పేర్కొంది. ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా) సెక్షన్ 16(3) కింద బెంగళూరు జోనల్ కార్యాలయం ఫిర్యాదు మేరకు, ఆ సంస్థపై కేసు దాఖలు చేసినట్లు ఈడీ తెలిపింది. మింత్రా బ్రాండ్ కింద కార్యకలాపాలు నడుపుతున్న మింత్రా డిజైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, సంబంధిత కంపెనీలు 'హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ' మాటున మల్టీ బ్రాండ్ రిటెయిల్ ట్రేడ్ చేస్తున్నాయన్న 'విశ్వసనీయ సమాచారం' తమ వద్ద ఉందని ఈడీ పేర్కొంది. ఇది ఎఫ్‌డీఐ మార్గదర్శకాలు, ఫెమా నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని స్పష్టం చేసింది.

కంపెనీ ఏమంటోందంటే..: భారత్‌లో వర్తించే అన్ని చట్టాలను గౌరవించడానికి తాము కట్టుబడి ఉన్నామని, నిబంధనల పాటింపులో అత్యున్నత ప్రమాణాలతో కంపెనీని నిర్వహిస్తున్నట్లు మింత్రా ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. అధికార వర్గాల నుంచి ఇంకా తమకు వివరాలు అందలేదని తెలిపారు.

గూగుల్ ప్లే, ఆండ్రాయిడ్‌తో భారత ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం

● యాప్ డెవలపర్లకు రూ.4 లక్షల కోట్ల ఆదాయం
● 35 లక్షల ఉద్యోగాలొచ్చాయ్: పబ్లిక్ ఫస్ట్ నివేదిక



దిల్లీ: గూగుల్ ప్లే, ఆండ్రాయిడ్ కారణంగా యాప్ డెవలపర్లకు రూ.4 లక్షల కోట్ల ఆదాయం లభించిందని కన్సల్టెన్సీ సంస్థ పబ్లిక్ ఫస్ట్ తన తాజా నివేదికలో పేర్కొంది. ఈ రెండింటి వల్ల భారత ఆర్థిక వ్యవస్థలో 35 లక్షలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కూడా వచ్చాయని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల వాడకం వేగంగా పెరగడం, అందుబాటు ధరలో డేటా, డెవలపర్లు-ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సానుకూల వ్యవస్థ ఉండడంతో భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో ఒకటిగా నిలిచిందని ఆ నివేదిక తెలిపింది. భారత డిజిటల్ విప్లవం కాస్తా ఆధునిక ఆర్థిక వ్యవస్థలో కోట్ల మంది ప్రజలు పాల్గొనేలా చేసిందని వివరించింది.

2: గూగుల్ ప్లేలో నమోదైన రిజిస్టర్ డెవలపర్ల సంఖ్య విషయంలో ప్రపంచంలో భారత స్థానం
10 లక్షలు: గూగుల్ ప్లే వల్ల భారత్‌లో వచ్చిన డెవలపర్ ఉద్యోగాలు
79%: దేశంలోని యాప్ డెవలపర్లకు విదేశాల్లో ఉన్న వినియోగదారుల వాటా
720 కోట్లు: భారత డెవలపర్లకు చెందిన యాప్‌ల డౌన్‌లోడ్ల మొత్తం సంఖ్య. ఇందులో దేశీయ వినియోగదార్ల నుంచి 600 కోట్లు, విదేశీ వినియోగదార్ల నుంచి 120 కోట్లు ఉన్నాయి.

ఐటూరింగ్.ఏఐ కి రూ.43 కోట్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా రంగాలకు కృత్రిమ మేధ/ మెషీన్ లెర్నింగ్ (ఏఐ-ఎంఎల్) టెక్నాలజీ ఆధారిత సేవలు అందించే ఐటూరింగ్.ఏఐ సంస్థ, సిరీస్-ఏ ఫండింగ్ కింద 5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.43 కోట్ల) పెట్టుబడి సమీకరించింది. డల్లాస్ వెంచర్ కేపిటల్, మేలా వెంచర్స్ సారథ్యంలో సమీకరించిన ఈ నిధుల సాయంతో, జీరో కోడింగ్ ప్లాట్‌ఫామ్‌ను వివిధ ఆర్థిక సంస్థలకు అందుబాటులోకి తేగలుగుతామని ఐటూరింగ్.ఏఐ సీఈఓ సుమన్ సింగ్ తెలిపారు. దక్షిణాఫ్రికా, అమెరికా తదితర దేశాల్లోనూ ఈ సేవలు విస్తరిస్తున్నట్లు వెల్లడించారు.

కల్ ఎయిర్‌వేస్, మారన్‌కు సుప్రీంలో చుక్కెదురు



దిల్లీ: ఎప్పటినుంచో కొనసాగుతున్న షేర్ల బదిలీ వివాదంలో రూ.1300 కోట్లకు పైగా నష్టపరిహారాన్ని స్పైస్‌జెట్ నుంచి కోరుతూ కల్ ఎయిర్‌వేస్, కళానిధి మారన్ దాఖలు చేసుకున్న విజ్ఞప్తిని సుప్రీం కోర్టు బుధవారం కొట్టిపారేసింది. మే 23 నాటి దిల్లీ హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తూ, ఆలస్యం కారణంగా విజ్ఞప్తిని తోసిపుచ్చుతున్నట్లు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. స్పైస్‌జెట్‌కు మాజీ ప్రమోటర్లుగా ఉన్న మారన్, కల్ ఎయిర్‌వేస్ కావాలనే తమ అప్పీళ్ల దాఖలు, పునః దాఖలును ఆలస్యం చేసినట్లు హైకోర్టు గతంలో పేర్కొంది. మారన్‌కు అజయ్ సింగ్, స్పైస్‌జెట్ రూ.579 కోట్లను వడీతో సహా చెల్లించాలన్న మధ్యవర్తిత్వ తీర్పును సమర్థిస్తూ ఏక సభ్య ధర్మాసనం జారీ చేసిన ఆదేశాలను హైకోర్టు డివిజన్ బెంచ్ గతేడాది మే 17న పక్కనపెట్టింది. 2023 జులై 31న ఏకసభ్య ధర్మాసనం జారీ చేసిన ఆదేశాలపై సింగ్, స్పైస్‌జెట్ దాఖలు చేసిన అప్పీళ్లను డివిజన్ బెంచ్ అనుమతి ఇవ్వడం ఇందుకు నేపథ్యం. తాజా పరిణామాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు 5.75% పెరిగి రూ.40.29 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ.. ఐసీఐసీఐ.. రిలయన్స్..

● దిగ్గజ షేర్ల దూకుడుతో సూచీలకు లాభాలు
● తోడైన ఆసియా మార్కెట్ల సానుకూలతలు
● రూ.1.9 లక్షల కోట్లు పెరిగిన సంపద

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.4,209 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.4,359 కోట్లు



ప్రైవేట్ రంగ దిగ్గజ బ్యాంకులు, చమురు షేర్ల దూకుడుతో సూచీలు లాభాలతో ముగిశాయి. ఇంట్రాడేలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 52 వారాల గరిష్ఠాన్ని తాకి చివరకు దాదాపు 1% లాభంతో ముగిశాయి. 5 రోజుల వరస నష్టాల తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలోనూ కొనుగోళ్లు చోటుచేసుకున్నాయి. అమెరికాతో జపాన్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడమూ మన మార్కెట్ రాణింపునకు ఉపకరించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 3 పైసలు తగ్గి రూ.86.41 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.63% నష్టంతో 68.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.90 లక్షల కోట్లు పెరిగి రూ.460.35 లక్షల కోట్ల (5.33 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

ఆద్యంతం హుషారుగా..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 82,186.81తో పోలిస్తే) 265.06 పాయింట్ల లాభంతో 82,451.87 పాయింట్ల వద్ద ఆరంభమైంది. 82,786.43 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 539.83 పాయింట్ల లాభంతో 82,726.64 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 159 పాయింట్లు పెరిగి 25,219.90 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,233.50 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,085.50 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది.

ఆరు కంపెనీలు మినహా..: సెన్సెక్స్ 30 షేర్లలో 6 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. టాటా మోటార్స్ 2.51%, భారతీ ఎయిర్‌టెల్ 1.94%, బజాజ్ ఫైనాన్స్ 1.66%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.07%, మారుతీ సుజుకీ 1.03%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.83%, ఎటర్నల్ 0.72% చొప్పున లాభపడ్డాయి. హిందుస్థాన్ యునిలీవర్ 1.19%, బెల్ 0.68%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.68%, ఐటీసీ 0.28%, టాటా స్టీల్ 0.12% నష్టపోయాయి.

✦ రైట్స్ ఇష్యూ ద్వారా రూ.1249.33 కోట్ల వరకు సమీకరించే ప్రతిపాదనకు తమ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్లు ఐనాక్స్ విండ్ తెలిపింది. రూ.10 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.110 ప్రీమియం కలిపి రూ.120 చొప్పున కేటాయించాలని నిర్ణయించింది.

సెన్సెక్స్ ▲540 82727
నిఫ్టీ ▲159 25220

ఐపీఓ సమాచారం

✦ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) **లక్ష్మీ ఇండియా ఫైనాన్స్** తన తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు ధరల శ్రేణిగా రూ.150- 158ను నిర్ణయించింది. ఈనెల 29న ప్రారంభమై 31నలీ ఇష్యూ ముగియనుంది.
✦ **కేటెక్స్ ఫ్యాబ్రిక్స్** ఐపీఓకు ధరల శ్రేణి రూ.171-180. ఈ ఇష్యూ కూడా ఈనెల 29న మొదలై 31న ముగియనుంది.
✦ **జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్** తొలి పబ్లిక్ ఆఫర్ మొదటి రోజు ముగిసే నాటికి 8.99 రెట్ల స్పందన లభించింది. 1,41,88,644 షేర్లను జారీ చేయనుండగా.. 12,75,24,978 షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. చిన్న మదుపర్ల విభాగంలో 8.89 రెట్లు అధికంగా బిడ్‌లు దాఖలయ్యాయి.

నేటి బోర్డు సమావేశాలు: నెస్లే, ఏసీసీ, బజాజ్ ఫైనాన్స్, కెనరా బ్యాంక్, సైయెంట్, కోరమాండల్ ఇంటర్నేషనల్, ఇండియన్ బ్యాంక్, కేఫిన్ టెక్నాలజీస్, ఎంఫసిస్, ఎస్‌బీఐ లైఫ్, తాన్లా ప్లాట్‌ఫామ్స్, ఆర్ఈసీ, ఐఈఎక్స్

సంక్షిప్తంగా..

✦ పేటీఎం మాతృసంస్థ **వన్97 కమ్యూనికేషన్స్** తొలిసారిగా ఒక త్రైమాసికంలో లాభాన్ని నమోదుచేయడంతో బీఎస్ఈలో ఈ సంస్థ షేరు లాభాలతో ముగిసింది. ఆరంభంలో 3.15% నష్టపోయినా, ఆ తర్వాత బలంగా పుంజుకుని చివరకు 1.74% లాభంతో రూ.1,070.95 వద్ద స్థిరపడింది.
✦ స్వీడన్‌కు చెందిన ఆన్‌లైన్ విమాన ప్రయాణ సేవల సంస్థ ఎట్రవెలి గ్రూపు భాగస్వామ్యంతో భారత్‌లో **రాడిసన్ ఫ్లైట్స్‌**ను ప్రారంభించినట్లు **రాడిసన్ హోటల్ గ్రూపు** తెలిపింది. రాడిసన్ హోటల్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకటే లావాదేవీలో విమాన టికెట్లను, హోటల్ గదులను బుక్ చేసుకునేందుకు ఈ కొత్త భాగస్వామ్యం తోడ్పడుతుందని కంపెనీ తెలిపింది.
✦ కేపిటల్ మార్కెట్‌కు సంబంధించిన పరిశోధనా సేవల్లో నిమగ్నమైన విశ్లేషకులు ఏడాదిలోగా ఎన్ఐఎస్ఎమ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్) ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుందని సెబీ తెలిపింది.
✦ డెట్, ఈక్విటీ ద్వారా రూ.30,000 కోట్లు సమీకరించేందుకు తమ వాటాదార్లు అనుమతి ఇచ్చినట్లు **ఇండస్ఇండ్ బ్యాంక్** వెల్లడించింది. బ్యాంక్ బోర్డులో ఇద్దరు డైరెక్టర్లను నియమించే ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపారు.
✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి **భారత వృద్ధి రేటు** అంచనాను ఏడీబీ ఇంతకుముందు 6.7 శాతం వృద్ధి నమోదుకావచ్చని అంచనా వేయగా.. తాజాగా దీనిని 6.5 శాతానికి కుదించింది. ఇండ్-రా కూడా తన అంచనాను 6.6% నుంచి 6.3 శాతానికి తగ్గించింది.

ఘన వ్యర్థాలు

(ప్రభావాలు - నిర్వహణ పద్ధతులు)



వ్యక్తిగత, గృహ సంబంధిత, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ కార్యకలాపాల ద్వారా ఘనరూపంలో లేదా పాక్షిక ఘనరూపంలో విడుదలయ్యే వ్యర్థాలను 'ఘనవ్యర్థం' అంటారు. ఆధునిక కాలంలో మనిషి అభివృద్ధి కార్యకలాపాలు పెరిగే కొద్దీ ఘనవ్యర్థ పదార్థాలు అధికమవుతున్నాయి. జీవక్షయం చెందని పదార్థాల వినియోగం ముఖ్యంగా ప్లాస్టిక్స్, పాలిథీన్ వాడకం ఎక్కువైనప్పటి నుంచి ఘన వ్యర్థాల విడుదల పెరిగిపోయింది. సరైన రీతిలో నియంత్రించకపోవడంతో వీటితో సమస్యలు తీవ్రమవుతున్నాయి.

ఘన వ్యర్థ పదార్థాలు-రకాలు

మానవ జనిత మురుగు: మానవ మలంతో పాటు ఆహార వ్యర్థం అధిక మొత్తంలో విడుదలవుతుంది. ఈ రకమైన వ్యర్థం జీవక్షయం చెందినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహణకు మించిన స్థాయిలో ఇది ఉత్పత్తి అవుతోంది.

వ్యవసాయ వ్యర్థాలు: విచ్చలవిడిగా వినియోగిస్తున్న రసాయన ఎరువులు, క్రిమిసంహారక అవశేషాలు అధిక మొత్తంలో నేలలో, నీటిలో పేరుకున్నప్పుడు వాటిని 'వ్యవసాయ వ్యర్థాలు' అంటారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు: ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పెరగడంతో ఇ-వ్యర్థం అధికంగా వస్తోంది. నిరర్థక కంప్యూటర్ భాగాలు, బ్యాటరీలు, మదర్ బోర్డు, కీ బోర్డులు ఇందులోకి వస్తాయి.

బయోమెడికల్ వ్యర్థాలు: ఆసుపత్రుల నుంచి కూడా ఘన వ్యర్థాలు అధికంగా వస్తుంటాయి. వాడేసిన డిస్పోజబుల్ సిరంజీలు, సూదులు, బ్యాండేజీలు; రోగుల మల, మూత్ర రక్త నమూనాలు; తొలగించిన క్యాన్సర్ కణుతులు ఈ కోవలోకి వస్తాయి.

రేడియోధార్మిక వ్యర్థాలు: అణు ప్రమాదాలు, అణుబాంబు విస్ఫోటాలు జరిగినప్పుడు, అణువ్యర్థ ఉత్పాదన ద్వారా వచ్చే వ్యర్థాన్ని 'రేడియోధార్మిక వ్యర్థం' అంటారు. పారిశ్రామిక, వ్యవసాయ, ఆరోగ్య రంగాల్లో నిరంతరం రేడియోధార్మిక ఐసోటోప్‌ల వినియోగం కూడా ఈ రకమైన వ్యర్థాల విడుదలకు కారణమవుతోంది.

రబ్బిష్: మురుగు తర్వాత చెత్త లేదా రబ్బిష్ ముఖ్య ఘనవ్యర్థం. దహనశీలమైనవి, దహనశీలం కానివి అని ఇది రెండు రకాలు. పేపర్లు, కలప వ్యర్థం, ప్లాస్టిక్ దహనశీల రకానికి చెందుతాయి. సిరామిక్స్, గాజు లాంటివి దహనశీలం కానివి.



మైనింగ్ వ్యర్థాలు: గనుల తవ్వకాల్లో ఖనిజంలోని మలినాలను తొలగించినప్పుడు మిగిలే స్లాగ్ కూడా భారీ వ్యర్థమే. దీనివల్ల గనుల చుట్టుపక్కల ప్రాంతాలు ప్రభావితమవుతాయి. ఇనుము, బొగ్గు గనుల ధూళి తీవ్రస్థాయి శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతాయి.



భారీ వ్యర్థాలు: భవనాలు కూలినప్పుడు, వరద, భూకంపం, సునామీ, తుపాను లాంటివి సంభవించినప్పుడు మిగిలే ఇసుక, ఇటుక, కూలిన చెట్లు, పేరుకు పోయిన పూడిక మొదలైన వాటిని 'భారీ వ్యర్థాలు' అంటారు. వీటిని తొలగించడానికి ఎక్కువకాలం పడుతుంది.



పారిశ్రామిక వ్యర్థాలు: పరిశ్రమల నుంచి విడుదలయ్యే అనేక రకాల వ్యర్థాల్లో హానికర కర్బన రసాయనాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి నేలను, నీటిని కలుషితం చేస్తాయి. ఆర్సెనిక్, పాదరసం, సీసం, నికెల్, కాడ్మియం లాంటి భారలోహాలు ఇప్పటికే అధిక మొత్తంలో నేల, నీటిలో చేరాయి.



కెమికల్ వేస్ట్: ఇళ్లల్లోని పాత ఔషధాలు, పాలిష్ డబ్బాలు, థర్మామీటర్లు, టాయిలెట్ కెమికల్స్, ఇన్‌సెక్టిసైడ్ స్ప్రేలు మొదలైనవి. రసాయన వ్యర్థాలు పేరుకుపోయి హాని తలపెడతాయి. ముఖ్యంగా చిన్నారులు వీటి ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉంది.

ప్రమాదకర వ్యర్థాలు: వాడేసిన బ్యాటరీలు, షూ పాలిష్, పెయింట్ డబ్బాలు, పాత ఔషధాల ద్వారా ప్రమాదకర ఘనవ్యర్థాలు విడుదలవుతాయి. ఇ-వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలు, రేడియోధార్మిక, కెమికల్ వ్యర్థాలు కూడా ఇందులోనివే.

భారత్‌లో ఘనవ్యర్థాల ఉత్పాదన - కారణాలు

అధిక జనాభా, జనసాంద్రత: జనాభా, జనసాంద్రత పెరిగే కొద్దీ ఒక ప్రాంతంలోనే, ఒకేసారి అధిక మొత్తంలో ఘనవ్యర్థాలు విడుదలవుతాయి. అందుకే పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో వీటి ఉత్పత్తి చాలా తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో విడుదలయ్యే ఘనవ్యర్థాలు ఎక్కువగా జీవక్షయం చెందగలిగేవే. భవిష్యత్తులో పట్టణ జనాభా పెరిగేకొద్దీ వ్యర్థాల ఉత్పాదన మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది.

జీవవిచ్ఛిన్నం చెందని పదార్థాల వినియోగం: అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో పాలిథిన్, ప్లాస్టిక్స్, ఇతర పాలిమర్ల వాడకం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. వీటి వినియోగాన్ని అడ్డుకోవడం కష్టంగా మారింది.

పారిశ్రామికీకరణ: నేల, నీటిని తీవ్రంగా కలుషితం చేస్తున్న హానికర రసాయనాలు, భారలోహాలు అధికంగా విడుదలయ్యేందుకు ప్రధాన కారణం పారిశ్రామికీకరణ. ఇటీవలి కాలంలో ప్యాకేజింగ్ పరిశ్రమల నుంచి బిస్‌ఫినాల్ - ఎ, డై ఇథైల్ హెక్సైడ్ ఫ్యుమరేట్ లాంటి వ్యర్థాలు అధికంగా వస్తున్నట్లు గుర్తించారు.

హరితవిప్లవం: భారత్‌లో హరితవిప్లవంతో ఉత్పాదన పెరిగినప్పటికీ రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకమూ ఎక్కువైంది. హెక్టారుకు సగటున 140 కి.గ్రా. పైగా ఎన్‌పీకే ఎరువులను వాడుతున్నారు. పంజాబ్, హరియాణా, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో హెక్టారుకు 230 కి.గ్రా. పైగా ఎన్‌పీకే ఎరువుల వినియోగం ఉంది. డీడీటీ, ఎండ్రిన్, ఎల్‌డ్రిన్ లాంటి క్రిమిసంహారకాలు నియంత్రణకు మించి వాడటంతో వీటి అవశేషాలు ఇప్పటికీ పంట చేలల్లో కనిపిస్తున్నాయి. ఎండోసల్ఫాన్ లాంటి పురుగుమందుల వాడకంతో క్యాన్సర్, పిండ వైపరీత్యాలు సంభవిస్తున్నట్లు గుర్తించారు.

మానవ ప్రగతి సృష్టించిన అనివార్య అనర్థమే ఘనవ్యర్థం. ప్రస్తుతం పర్యావరణానికి, మనిషి ఆరోగ్యానికి ప్రధాన ముప్పుగా పరిణమించింది. వ్యక్తిగత కార్యకలాపాలు, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ ప్రభావాలతో నిత్యం అధిక మొత్తంలో విడుదలయ్యే ఆ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. నేల, నీరు, గాలిని కలుషితం చేస్తున్నాయి. ఈ సమస్యకు కారణాలు, దాని తీవ్రత, ప్రభావాలతోపాటు పరిష్కార మార్గాల గురించి పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. ఘన వ్యర్థాల రకాలు, వాటి నిర్వహణ పద్ధతులు సహా కాలుష్యాన్ని తగ్గించేందుకు, వనరులను ఆదా చేసేందుకు పాటించాల్సిన విధానాలు, అందులోనూ రీ-సైక్లింగ్‌కు ఉన్న ప్రాధాన్యం, ప్రయోజనాలను తెలుసుకోవాలి.



ప్రగతి పథంలో అనివార్య అనర్థాలు!

నిర్వహణ పద్ధతులు

1) జనక స్థానం వద్దే విభజన (సెగ్రిగేషన్ ఎట్ సోర్స్): చెత్త విడుదలయ్యే ప్రాంతం వద్దే దాన్ని తడి, పొడి భాగాలుగా వేరుచేసే విధానమే 'సెగ్రిగేషన్ ఎట్ సోర్స్'. తడిచెత్తను ఎరువుగా మార్చి పంటలకు వినియోగిస్తారు. వర్మీకంపోస్ట్‌గా వాడుకోవచ్చు. ఘనవ్యర్థ నిర్వహణలో ఇది ముఖ్యమైన పద్ధతి.

2) భూమిలోకి డంపింగ్ (లాండ్ ఫిల్లింగ్): పట్టణ ప్రాంతాల్లో ఘనవ్యర్థాల నిర్వహణకు అనువైన పద్ధతి లాండ్‌ఫిల్. ఈ విధానంలో గోతులు తవ్వి అడుగున బంకమట్టిని అవరోధంగా నింపుతారు. రెండు మట్టిపొరల మధ్య చెత్తపొర వేసి కాంపాక్టింగ్ చేస్తారు. ఆ తర్వాత లాండ్‌ఫిల్‌పై ఐరన్‌మెష్ ఏర్పాటు చేస్తారు. ఇలా ఘనవ్యర్థ ఉపరితల ప్రభావాన్ని తగ్గించవచ్చు. ల్యాండ్‌ఫిల్స్ నిర్వహణ సరిగా లేకపోతే వ్యాధులు ప్రబలొచ్చు. దాంతోపాటు మీథేన్ పేలుళ్లు సంభవించే ప్రమాదం ఉంది. ల్యాండ్‌ఫిల్స్ నుంచి విడుదలయ్యే మీథేన్ గ్రీన్‌హౌస్ వాయువుగా మారి గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతుంది.

3) కంపోస్టింగ్: గ్రామీణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు అనువైన విధానమిది. పశువుల పేడ, ఆహార వ్యర్థాన్ని పోగుచేసి వియోగం చెందించడమే కంపోస్టింగ్. దీని ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతుంది. అయితే మీథేన్ అధికంగా విడుదలవుతుంది. ఇదే కంపోస్టింగ్‌ను బయోగ్యాస్ ప్లాంట్లలో నిర్వహిస్తే మీథేన్‌ను వంటకు వినియోగించడం సాధ్యమవుతుంది.

4) ఇన్సినరేషన్: నివాస, వాణిజ్య సముదాయాల్లో విడుదలయ్యే ఘన, బయోమెడికల్ వ్యర్థాలను ఉష్ణ భస్మీకరణ లేదా ఇన్సినరేషన్ ద్వారా నిర్వహించవచ్చు. అధిక ఉష్ణోగ్రత వద్ద ఆక్సిజన్ సమక్షంలో మండించి ఘనవ్యర్థ పరిమాణాన్ని బాగా తగ్గించవచ్చు. అయితే విపరీత గాలి కాలుష్యంతోపాటు మిగిలిపోయిన వ్యర్థంలో అధిక గాఢతతో కూడిన హానికర వ్యర్థాలు ఉంటాయి. ఈ ప్రక్రియ అధిక ఖర్చుతో కూడుకుంది.

5) రీ-సైక్లింగ్ (పునరుపయోగం): నిరర్థక వ్యర్థాల నుంచి తిరిగి మనిషి ఉపయోగించే సరికొత్త పదార్థాల తయారీని 'రీ-సైక్లింగ్' అంటారు. పట్టణాల్లో లాండ్‌ఫిల్స్ నిర్వహణ ఎక్కువకాలం సాధ్యం కాదు. ఘనవ్యర్థ నిర్వహణ పద్ధతులు అనేకం ఉన్నప్పటికీ వీటిలో రీ-సైక్లింగ్ అధిక ప్రాచుర్యంలోకి వచ్చింది.

సాధారణ రీ-సైక్లింగ్ ప్రక్రియ

✪ ప్రారంభంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడిగా వేరుచేసిన చెత్తను సేకరిస్తారు. ఇదేతరహాలో నివాస సముదాయాలు, వాణిజ్య సముదాయాల నుంచి చెత్తను సేకరిస్తారు. ✪ చెత్త కుండీల్లోని చెత్తను తడి, పొడిగా వేరుచేస్తారు. ఆ తర్వాత పొడి చెత్తను ప్లాస్టిక్, పాలిథీన్, గాజు, పేపర్‌గా విభజిస్తారు. ✪ ఈ విధంగా వేరుచేసిన వివిధ రకాల పొడి చెత్తను జంక్ డీలర్లకు చేరవేస్తారు. ✪ ఈ డీలర్ల నుంచి మధ్యవర్తుల ద్వారా పొడి చెత్త రీ-సైక్లింగ్ పరిశ్రమలకు చేరుతుంది. ✪ రీ-సైక్లింగ్‌కు గురైన పదార్థాలు మళ్లీ మనిషి వినియోగించే విధంగా తయారవుతాయి.

రీ-సైక్లింగ్ లాభాలు: ఇతర ఘనవ్యర్థ నిర్వహణ పద్ధతులతో పోలిస్తే రీ-సైక్లింగ్‌తో అనేక ఉపయోగాలు ఉన్నాయి. ✪ రీ-సైక్లింగ్ పద్ధతులు అవలంబించడం ద్వారా సహజ వనరుల వినియోగం తగ్గుతుంది. ✪ గ్రీన్‌హౌస్ ఉద్గారాలు కూడా బాగా తగ్గుతాయి. ✪ కలప వినియోగం తగ్గుతుంది. ఫలితంగా అడవుల నరికివేతను అరికట్టవచ్చు. ✪ రీ-సైక్లింగ్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఈ రంగంలో పెట్టుబడులు అధికమవుతాయి. ✪ పట్టణ ప్రాంతాల్లో సేకరించే తడి చెత్తను మంచి జీవఎరువుగా తయారు చేయడానికి వీలవుతుంది. ✪ విద్యుత్తు ఆదా అవుతుంది.

ప్రభావాలు

✪ ఘనవ్యర్థ పదార్థాల నియంత్రణ సరిగా లేకపోతే ప్రభావం తీవ్రంగా ఉంటుంది. పిల్లలు, శ్రామికులు, కర్షకులు వీటి బారిన పడతారు. ✪ ఘన వ్యర్థాలు ఎక్కువైతే తాగునీటి సరఫరాలో హానికర రసాయనాలు కలుస్తాయి. దాంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇప్పటికే దేశంలో ఆర్సెనిక్, పాదరసం లాంటి భారలోహాలు నేలలో విపరీతంగా చేరినట్లు తెలుస్తోంది. పాలిక్లోరినేటెడ్ బైఫినైల్స్ లాంటి రసాయనాలు తల్లి నుంచి గర్భంలోని శిశువుకు చేరుతున్నాయి. ✪ రసాయన ఎరువులు, పురుగుమందుల అవశేషాల వల్ల నేలలోని ఉపయోగకర సూక్ష్మజీవులు నశిస్తాయి. నేల సహజసారం క్షీణిస్తుంది. ✪ కుళ్లుతున్న ఘన వ్యర్థాల్లో అభివృద్ధి చెందే హానికర శిలీంధ్రాలు, బ్యాక్టీరియా మనుషులకు సోకుతాయి. ప్లాస్టిక్, అల్యూమినియం, తగరం జీవితకాలం ఎక్కువ. గాజు జీవిత కాలం అనంతం. వీటి ప్రభావాలు చాలా తరాలు ఉంటాయి. ✪ బయోమెడికల్ వేస్ట్‌ను నియంత్రించకపోతే హెపటైటిస్-బి లాంటి వైరస్‌లు పారిశుద్ధ్య కార్మికులకు సంక్రమించే ప్రమాదం ఉంది.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

ప్రాక్టీస్ బిట్స్

1. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   1) ఇంద్రధనస్సు విప్లవం - అరుణ్ కృష్ణన్
   2) శ్వేత విప్లవం - డా.ఎం.ఎస్.స్వామినాథన్
   3) నీలి విప్లవం - డా.హీరాలాల్ చౌదరి
   4) గులాబీ విప్లవం - దుర్గేష్ పటేల్
2. ప్రస్తుతం తలసరి పాల లభ్యత ఎంత (రోజుకు)?
   1) 355 గ్రా. 2) 471గ్రా. 3) 390 గ్రా. 4)420 గ్రా.
3. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   1) సెరికల్చర్ - పట్టుపురుగుల పెంపకం

ఇండియన్ ఎకానమీ

   2) ఎపికల్చర్ - తేనెటీగల పెంపకం
   3) సిల్వికల్చర్ - కలపనిచ్చే చెట్ల పెంపకం
   4) ఆక్వాకల్చర్ - ద్రాక్ష తోటల పెంపకం
4. 'టెక్నాలజీ మిషన్ ఆఫ్ ఆయిల్ సీడ్స్'ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
   1) 1990 2) 1986 3) 1988 4) 1966
5. 2014లో ప్రారంభించిన త్రివర్ణ విప్లవం (త్రీ కలర్ రెవల్యూషన్) కిందకు రానిదాన్ని గుర్తించండి.
   1) పశు సంపద 2) సౌరశక్తి
   3) మత్స్య సంపద 4) నూనె గింజలు
6. వ్యవసాయ రంగంలో ఇంద్రధనస్సు విప్లవాన్ని ఏ జాతీయ వ్యవసాయ విధానంలో భాగంగా రూపొందించారు?
   1) జాతీయ వ్యవసాయ విధానం - 1993
   2) జాతీయ వ్యవసాయ విధానం - 2000
   3) రైతులపై జాతీయ విధానం - 2007
   4) జాతీయ రైతు కమిషన్ - 2004

సమాధానాలు: 1-2; 2-2; 3-4; 4-2; 5-4; 6-2.

సముద్రగర్భ నిఘా సాంకేతికతపై ఉమ్మడి ప్రాజెక్టు!

డెంగీ నివారణకు దేశీయంగా అభివృద్ధి చేసిన టీకా 'టెట్రావాక్స్' అందుబాటులోకి వచ్చింది. రాజస్థాన్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం సరికొత్త పథకాన్ని ప్రారంభించగా, హిమాచల్ ప్రదేశ్‌లో రేషన్ పంపిణీకి ఆధార్ ఆధారిత ముఖ ధ్రువీకరణను ప్రవేశపెట్టారు. సముద్ర గర్భంలో నిఘా సాంకేతికత అభివృద్ధికి భారత్, ఆస్ట్రేలియా చేతులు కలిపాయి. జీవఇంధనం వాడకంలో దేశం నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ, అంతర్జాతీయ వార్తల్లో నిలిచే ఇలాంటి వర్తమాన వ్యవహారాలు, ఇతర ముఖ్యాంశాలను పోటీ పరీక్షార్థులు నిరంతరం తెలుసుకుంటూ ఉండాలి. ఎప్పటికప్పుడు విడుదలయ్యే నివేదికలు, ప్రపంచ రాజకీయ, ఆర్థిక, వైజ్ఞానిక పరిణామాలు, టెన్నిస్ గ్రాండ్ స్లామ్ టోర్నీల ఫలితాలు, విజేతలతోపాటు దేశంలో ప్రధాన సంఘటనలు, కీలక పదవుల్లో జరిగిన నియామకాలు, తదితరాలన్నింటినీ గుర్తుంచుకోవాలి.


మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?



   ఎ) మరాఠా మిలిటరీ లాండ్ స్కేప్స్‌నకు ఇటీవల యునెస్కో గుర్తింపు లభించింది.
   బి) మరాఠా మిలిటరీ లాండ్ స్కేప్స్ మొత్తం 12 ఉన్నాయి.
   సి) రాయ్‌గఢ్, రాజ్‌గఢ్, ప్రతాప్‌గఢ్, పన్హాలా, శివ్‌నేరీ, లోహగఢ్, సాల్హేర్, సింధ్‌దుర్గ్, సువర్ణదుర్గ్, విజయ్‌దుర్గ్, ఖందేరీ. 11 మహారాష్ట్రలో, ఒకటి జింజీ (తమిళనాడు)లో ఉన్నాయి.
   డి) మరాఠా మిలిటరీ లాండ్ స్కేప్స్ భారత్‌లో యునెస్కో గుర్తించిన 44వ ప్రదేశం.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

   నోట్: 1) భారత్‌లో 43వ యునెస్కో ప్రదేశం మొయిడామ్స్ (అస్సాం)
   2) మహారాష్ట్రలో 7 యునెస్కో వారసత్వ ప్రదేశాలున్నాయి. 1) అజంతా గుహలు 2) ఎల్లోరా గుహలు 3) ఎలిఫాంటా గుహలు 4) ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ 5) పశ్చిమ కనుమలు 6) ది విక్టోరియన్ అండ్ ఆర్ట్ డెకో ఎన్సెంబుల్ ఆఫ్ ముంబయి 7) మరాఠా మిలిటరీ లాండ్ స్కేప్స్.
2. 47వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ సమావేశం 2025లో ఎక్కడ జరిగింది?
   1) న్యూదిల్లీ 2) ముంబయి
   3) లండన్ 4) ప్యారిస్
3. కింది వారిలో భారత 87వ చెస్ గ్రాండ్ మాస్టర్‌ను గుర్తించండి.



   1) హరికృష్ణన్
   2) కృష్ణసింగ్
   3) రామకృష్ణ
   4) శ్రీహరి

   నోట్: హరికృష్ణన్ తమిళనాడు రాష్ట్రానికి చెందినవాడు.
4. ఆషిమ్ కుమార్ ఘోష్ ఇటీవల ఏ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు?
   1) పంజాబ్ 2) హరియాణా
   3) మహారాష్ట్ర 4) గుజరాత్

   నోట్: గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు.
5. ఏ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు?
   1) ఆంధ్రప్రదేశ్ 2) తెలంగాణ
   3) కేరళ 4) మహారాష్ట్ర
6. ఇటీవల ఏ దేశాన్ని డబ్ల్యూహెచ్‌ఓ మలేరియా రహిత దేశంగా ప్రకటించింది?
   1) అర్జెంటీనా 2) చిలీ
   3) బ్రెజిల్ 4) సురినామ్


   నోట్: ఎ) ఇప్పటివరకు 47 దేశాలను డబ్ల్యూహెచ్‌ఓ మలేరియా రహిత దేశాలుగా ప్రకటించింది.
   బి) అమెజాన్ నదీ పరీవాహక ప్రాంతంలో మలేరియా రహిత దేశంగా నిలిచిన తొలి దేశం సురినామ్.
7. కింది వాటిలో సరైంది?



   ఎ) 2025 వింబుల్డన్ పురుషుల విజేత యానిక్ సినర్ (ఇటలీ).
   బి) 2025 వింబుల్డన్ పురుషుల రన్నర్ కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్).
   సి) 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల విజేత యానిక్ సినర్ (ఇటలీ).
   డి) యానిక్ సినర్ ఇప్పటివరకు మొత్తం నాలుగు టైటిల్స్ నెగ్గాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్-2024, 2025; వింబుల్డన్-2025, యూఎస్ ఓపెన్-2024
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
8. కింది వాటిలో సరైంది?
   ఎ) 2025 వింబుల్డన్ మహిళల విజేత ఇగా స్వైటెక్ (పోలండ్).
   బి) 2025 వింబుల్డన్ రన్నర్ అమండా అనిసిమోవా (యూఎస్ఏ).
   సి) 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల విజేత మాడిసన్ కీస్ (యూఎస్ఏ).
   డి) ఇగా స్వైటెక్ ఇప్పటివరకు 6 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గింది. ఫ్రెంచ్ ఓపెన్ 2020, 2022, 2023, 2024; యూఎస్ ఓపెన్- 2022, వింబుల్డన్-2025.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి

   నోట్: 1) మహిళల ఫైనల్స్‌లో 6-0, 6-0తో గెలిచి ఇగా స్వైటెక్ రికార్డు సృష్టించింది. 114 ఏళ్ల తర్వాత వింబుల్డన్ టోర్నీలో మహిళల సింగిల్స్ విభాగంలో తొలిసారి ఈ ఘనత సాధించింది.
   2) ఓపెన్ శకంలో ఒక గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో 6-0, 6-0 తో గెలవడం ఇది రెండోసారి. మొదటిసారి 1988 ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో జరిగింది.
   3) గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో ఆరు సార్లు ఫైనల్‌కు చేరిన తర్వాత నెగ్గిన మూడో క్రీడాకారిణి ఇగా స్వైటెక్. 1) మార్గరెట్ కోర్ట్ 2) మోనికా సెలెస్
9. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నలుగురిని రాజ్యసభకు నామినేట్ చేశారు. కింది వారిలో ఆ నలుగురులో లేనివారు ఎవరు?
   1) హర్షవర్ధన్ శ్రింగ్లా 2) ఉజ్వల్ నికమ్
   3) మీనాక్షి జైన్ 4) రంగనాథ్ సింగ్
10. ఇటీవల మరణించిన ముహ్మద్ బుహారీ ఏ దేశ మాజీ అధ్యక్షుడు?
   1) సోమాలియా 2) ఫిజీ
   3) కంబోడియా 4) నైజీరియా

   నోట్: 2015 నుంచి 2023 వరకు నైజీరియా అధ్యక్షుడిగా పనిచేశారు.
11. హాంకాంగ్ అంతర్జాతీయ ఒప్పందం 2025, జూన్ 26 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం దేనికి సంబంధించింది?
   1) ఈ ఒప్పందం ప్రకారం ఇతర దేశాల నౌకలు హాంకాంగ్ వచ్చినప్పుడు 50% సుంకాలు వసూలు చేస్తారు.
   2) ఈ ఒప్పందం ప్రకారం కాలంచెల్లిన నౌకల రీసైక్లింగ్‌లో మానవ ఆరోగ్యం, పర్యావరణానికి హాని కలగకుండా చూసుకోవాలి.
   3) చైనా నుంచి వచ్చే వస్తువులపై సుంకం లేకుండా చేయడం.
   4) ఈ ఒప్పందం ప్రకారం హాంకాంగ్.. చైనాలో అంతర్భాగంగా గుర్తింపు పొందింది.
12. ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ వరల్డ్ ఎనర్జీ - 2025 (జీవ ఇంధనం వాడకంలో) భారత్ ఎన్నో స్థానంలో నిలిచింది?



   1) 6వ 2) 3వ
   3) 4వ 4) 2వ

   నోట్: 1) అమెరికా, బ్రెజిల్, ఇండోనేసియా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.
   2) ఆర్థిక సమానత్వంపై ప్రపంచ బ్యాంకు నివేదికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. తొలి మూడు స్థానాల్లో స్లొవేకియా, స్లొవేనియా, బెలారస్ నిలిచాయి.
13. ఇటీవల వార్తల్లో నిలిచిన రితికా హుడా ఏ క్రీడకు చెందినవారు?
   1) క్రికెట్ 2) బాక్సింగ్
   3) రెజ్లింగ్ 4) వెయిట్ లిఫ్టింగ్

   నోట్: భారత హెవీవెయిట్ రెజ్లర్ రితికా హుడా డోపింగ్ టెస్టులో పట్టుబడ్డారు.

కరెంట్ అఫైర్స్

14. కింది వాటిలో సరైంది?
   ఎ) భారత్‌లో మొదటి డెంగీ వ్యాక్సిన్ 'టెట్రా వాక్స్-డీవీ'ను సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసింది.
   బి) దేశంలో స్వదేశీ క్వాంటం సెక్యూర్ శాటిలైట్ నిర్మాణానికి స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్, సినర్జీ క్వాంటం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లు ఒప్పందం చేసుకున్నాయి.
   సి) డిజిటల్ మౌలిక సదుపాయల కోసం రూపొందించిన డేటా సెంటర్ స్విచ్ కమ్ రౌటర్ 'సాక్ష్యం 3000'ను న్యూదిల్లీలోని సీడాట్ క్యాంపస్‌లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు.
   డి) నేషనల్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ ప్రాజెక్ట్ అమలు కోసం భారత్ నేవీ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుంది.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి, డి
15. 'స్ట్రెంథనింగ్ రీజనల్ మారిటైమ్ కనెక్టివిటీ అండ్ కోపరేషన్' అనే థీమ్‌తో 2వ విడత బిమ్‌స్టెక్ పోర్టుల సదస్సు జులై 14, 15 తేదీల్లో ఎక్కడ జరిగింది?
   1) కాకినాడ 2) ఢాకా
   3) విశాఖపట్టణం 4) చెన్నై
16. కింది వాటిలో సరైంది?
   ఎ) ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) డైరెక్టర్‌గా పి.రత్నాకర్ నియమితులయ్యారు.
   బి) యాపిల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా భారత సంతతికి చెందిన సాబిఖాన్ నియమితులయ్యారు.
   సి) కామన్వెల్త్ యూత్ పీస్ అంబాసిడర్‌గా ఐఐటీ గువాహటి విద్యార్థిని సుకన్య సోనోవాల్ ఎంపికయ్యారు.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి
17. 'సిందూర్ బ్రిడ్జ్' పేరుతో ఇటీవల ఏ రాష్ట్ర సీఎం బ్రిటిష్ కాలం నాటి కార్నాక్ రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ స్థానంలో దీన్ని ప్రారంభించారు?
   1) గుజరాత్ 2) కేరళ
   3) కర్ణాటక 4) మహారాష్ట్ర

   నోట్: 1) దేశంలోనే రెండో అతిపెద్ద కేబుల్ బ్రిడ్జ్ కర్ణాటకలోని శివమొగ్గ జిల్లా సిగందూర్ సమీపంలోని శరావతి బ్యాక్‌వాటర్‌పై రూ.473 కోట్లతో నిర్మించారు. దీని పొడవు 2.14 కి.మీ., వెడల్పు 16 మీటర్లు.



   2) గుజరాత్‌లోని ఒఖా బేట్ - ద్వారక మధ్య ఉన్న సుదర్శన్ సేతు దేశంలోనే పొడవైన కేబుల్ బ్రిడ్జ్. దీని పొడవు 2.32 కి.మీ., వెడల్పు 27.2 మీ.
18. ఏ రాష్ట్ర సీఎం గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం 'పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గరీబీ యుక్త్ గావ్ యోజన'ను ప్రారంభించారు?
   1) గుజరాత్ 2) హరియాణా
   3) మధ్యప్రదేశ్ 4) రాజస్థాన్

   నోట్: రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ
19. ఆధార్ ఆధారిత ఫేస్ అథెంటిఫికేషన్ పద్ధతిలో రేషన్ పంపిణీ ప్రారంభించిన భారత్‌లోని తొలి రాష్ట్రం ఏది?
   1) ఆంధ్రప్రదేశ్ 2) తెలంగాణ
   3) హిమాచల్ ప్రదేశ్ 4) హరియాణా
20. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర హోంశాఖ కార్యదర్శి పదవీకాలాన్ని 2026, ఆగస్టు వరకు పొడిగించింది. అయితే హోంశాఖ కార్యదర్శి ఎవరు?
   1) అనంత్ కుమార్ 2) గోవింద్ మోహన్
   3) విశ్వనాథన్ 4) గణేష్ కిరణ్
21. ఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులైన మొదటి మహిళ ఎవరు?
   1) నందిని శర్మ 2) సోనాలీ మిశ్రా
   3) సరస్వతి రాయ్ 4) కావేరి శర్మ
22. సముద్ర గర్భ నిఘా టెక్నాలజీ కోసం భారత్, ఏ దేశం ఉమ్మడి ప్రాజెక్టు చేపట్టాయి?
   1) అమెరికా 2) జపాన్ 3) ఆస్ట్రేలియా 4) రష్యా

   నోట్: ఆస్ట్రేలియాకు చెందిన డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ గ్రూప్, భారత్‌లోని డీఆర్‌డీఓకు చెందిన నావల్ ఫిజికల్ అండ్ ఓషనోగ్రాఫిక్ లాబొరేటరీ దీనిపై మూడేళ్లపాటు పరిశోధనలు చేయనున్నాయి.
23. ఏటా ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
   1) జులై 20 2) జులై 10
   3) జులై 21 4) జులై 11

   థీమ్: 'న్యాయమైన, ఆశాజనకమైన ప్రపంచంలో వారు కోరుకునే కుటుంబాలను సృష్టించడానికి యువతకు సాధికారత కల్పించడం'.



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-1; 2-4; 3-1; 4-2; 5-2; 6-4; 7-4; 8-1; 9-4; 10-4; 11-2; 12-3; 13-3; 14-4; 15-3; 16-4; 17-3; 18-4; 19-3; 20-2; 21-2; 22-3; 23-4.

భారతదేశంలో మౌలిక సదుపాయాలు - జల రవాణా

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

పర్యావరణ హితం.. సరకు రవాణాకు అనుకూలం!

సరకు రవాణా, వాణిజ్యానికి జల మార్గాలు అత్యంత కీలకమైనవి. ఆర్థికంగా, పర్యావరణానికి ఇవి ఎంతో అనుకూలంగా ఉంటాయి. భారతదేశానికి మూడు వైపులా సముద్రాలతోపాటు దేశంలో నదులు, కాలువలు లాంటి జల వనరులు విస్తృతంగా ఉన్నాయి. ఇవన్నీ ప్రకృతి సిద్ధంగా ఏర్పడినవే. ఈ మార్గాలకు ఎలాంటి నిర్మాణ వ్యయం అక్కర్లేదు. అవి పడవలు, ఓడల ద్వారా తక్కువ ధరల్లో రవాణాకు వీలు కల్పిస్తున్నాయి. ఎక్కువ పరిమాణంలో, బరువైన వస్తువులను తక్కువ ఖర్చుతో రవాణా చేసేందుకు ఇవి ఉపయోగకరంగా ఉంటాయి.



రకాలు

జల రవాణా రెండు రెండు రకాలుగా ఉంటుంది. అవి:

1. లోతట్టు నీటి రవాణా
2. సముద్ర రవాణా/ నౌక రవాణా

లోతట్టు నీటి రవాణా (ఇన్‌లాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్)

ప్రస్తుతం దేశంలో ఉన్న లోతట్టు జలమార్గాల పొడవు 14,500 కి.మీ. కాలువలు వెడల్పుగా లేకపోవడం, తక్కువ లోతు, ఒడ్డు/తీరం కొట్టుకుపోవడం లాంటి సమస్యల వల్ల కొంతమేరకు మాత్రమే రవాణాకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇందులో 5,200 కి.మీ. నదీ మార్గాలు కాగా, 4,000 కి.మీ. కాలువలు. ఇవికాక నిలవ నీరు (back waters), కయ్యలు (creeks), సరస్సులను కూడా జల మార్గాలుగా వినియోగిస్తున్నారు.

✦ అత్యధిక పొడవు లోతట్టు నీటి రవాణా ఉన్న రాష్ట్రాల్లో ఉత్తర్ ప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో వరుసగా పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, అసోం, కేరళ ఉన్నాయి.

బకింగ్ హాం కాలువ:

భారతదేశంలో అత్యధిక పొడవున్న జలమార్గాల కాలువ. దీన్ని గతంలో లార్డ్ క్లైవ్ కాలువ అనేవారు.

- అప్పటి మద్రాస్ గవర్నర్ డ్యూక్ ఆఫ్ బకింగ్ హాం పేరిట 1878 నుంచి దీన్ని బకింగ్ హాం కాలువగా పిలుస్తున్నారు.
- బ్రిటిష్ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, తమిళనాడులోని విల్లుపురాన్ని కలుపుతూ తూర్పు తీరానికి దగ్గరగా 796 కి.మీ. పొడవున వివిధ దశల్లో దీని నిర్మాణం జరిగింది.
- తూర్పు తీరంలో 1966, 1976 సంవత్సరాల్లో ఏర్పడిన తీవ్ర తుపానుల వల్ల అనేక చోట్ల ఈ కాలువ పూడి పోయింది. ప్రస్తుతం దీనికి మరమ్మతులు చేసి మళ్లీ ఉపయోగంలోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

కర్నూలు – కడప కాలువ (కేసీ కెనాల్): 1863-70 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి అవసరాలను తీర్చేందుకు దీన్ని నిర్మించారు. ఇది 1933 వరకు జల మార్గంగా కూడా ఉపయోగపడింది. ఇది పెన్నా, తుంగభద్ర నదులను కలుపుతుంది. కర్నూలు వద్ద సుంకేశులలో ప్రారంభమవుతుంది.

● ఇది కాక దేశంలో ఒడిశా కాలువ, మడ్నిపూరు కాలువ, దామోదర్ కాలువ, పశ్చిమ తీర కాలువ లాంటి వాటిని జల రవాణాకు ఉపయోగిస్తున్నారు.

ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా

కేంద్ర ప్రభుత్వం 1986 అక్టోబరు 27న ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేసింది. దీని ప్రధాన కార్యాలయం నోయిడాలో ఉంది.

❖ దేశంలో జాతీయ జలమార్గాల అభివృద్ధి, నిర్వహణ దీని బాధ్యత.

❖ జాతీయ జలమార్గాలు అనే భావనను 1982లో ప్రవేశపెట్టారు. దేశంలో 111 జాతీయ జలమార్గాలున్నాయి. లోతట్టు జలమార్గాల అభివృద్ధిలో భాగంగా 26 జాతీయ జలమార్గాలకు సరకు రవాణా విషయంలో ప్రాధాన్యత ఇచ్చారు. ఇన్‌లాండ్ వెసెల్స్ చట్టం - 1917 స్థానంలో 2021లో కొత్త చట్టం రూపుదిద్దుకుంది.

సముద్ర రవాణా

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి:

తీరప్రాంత రవాణా: భారతదేశానికి తూర్పు, పశ్చిమ తీరాలు కలిపి 7,517 కి.మీ. సముద్ర తీరం ఉంది. కేంద్ర ప్రభుత్వ వార్షిక సర్వే 2024-25 ప్రకారం మన దేశంలో 12 ప్రధాన రేవులు, 205 వరకు చిన్న రేవులు ఉన్నాయి. వాటి ద్వారా జరిగే దేశీయ రవాణాను తీరప్రాంత రవాణా అంటారు.

విదేశీ రవాణా: అంతర్జాతీయ రవాణాకు జల మార్గాలు ఆయువుపట్టు. మన దేశ అంతర్జాతీయ వ్యాపారంలో సరకుల రవాణాలో 95%, వ్యాపార విలువలో 70% వరకు నౌకల ద్వారానే జరుగుతుంది.

☛ ప్రణాళికా కాలంలో భారతదేశ అంతర్జాతీయ నౌకా రవాణాలో భారతీయ నౌకా కంపెనీల వాటా పెరుగుతూ వస్తోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అధికంగా రవాణా నౌకలున్న దేశాల్లో భారతదేశం ఒకటి.

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ఇది 1961 అక్టోబరు 2న ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా ఏర్పాటైంది. 1992 సెప్టెంబరు 10 నుంచి పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా మార్చారు.

▼ ఇది దేశంలోనే అతిపెద్ద షిప్పింగ్ కంపెనీ. ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. 2008, ఆగస్టులో దీనికి నవరత్న హోదా లభించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మూలధనంలో కేంద్ర ప్రభుత్వ వాటా 75 శాతం. దీని ప్రైవేటీకరణకు 2019, నవంబరులో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఇది ప్రభుత్వ నియంత్రణలోనే ఉంది.

దేశంలోని ప్రధాన ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల వివరాలు

విళింజమ్ ఇంటర్నేషనల్ సీపోర్ట్: ప్రధాని నరేంద్ర మోదీ 2025, మే 2న తిరువనంతపురంలో విళింజమ్ ఇంటర్నేషనల్ సీపోర్ట్‌ను ప్రారంభించారు. ఇది దేశంలోని మొట్టమొదటి ప్రత్యేక కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు.

◆ దీన్ని అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీఎస్ఈజడ్) ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.8,867 కోట్లతో నిర్మించింది. మనదేశానికి చెందిన అన్ని సరకు రవాణా నౌకల ట్రాన్స్‌షిప్‌మెంట్ దీన్నుంచి నిర్వహించవచ్చని ప్రభుత్వం ఇటీవల పేర్కొంది.

◆ ప్రస్తుతం మన దేశానికి చెందిన 75% వరకు ట్రాన్స్‌షిప్‌మెంట్ కార్గోను ఇతర దేశాల్లోని పోర్టులే నిర్వహిస్తుండటంతో.. భారతీయ పోర్టులు ఏటా 200-220 మి. డాలర్ల ఆదాయాన్ని కోల్పోతున్నాయి. అంతర్జాతీయ షిప్పింగ్ మార్గానికి ఈ పోర్టు 10 నాటికల్ మైళ్ల దూరంలోనే ఉంది.

◆ ఒక చిన్న నౌక నుంచి, సుదూర గమ్యాలకు ప్రయాణించే పెద్ద నౌకల్లోకి సరకును మార్చడమే ట్రాన్స్‌షిప్‌మెంట్. దీనివల్ల రవాణా వ్యయాలు తగ్గుతాయి. అధిక లోతైన సముద్రతీరం ఉన్న పోర్టులు ఈ ప్రక్రియకు అవసరం.

◆ సింగపూర్, కొలంబో, సలాలా (ఒమన్), దుబాయ్ లాంటి విదేశీ పోర్టుల్లో ప్రస్తుతం భారతీయ కార్గో ట్రాన్స్‌షిప్‌మెంట్ జరుగుతోంది. దీన్ని మన దేశానికి తీసుకురావడమే విళింజమ్ ప్రాజెక్టు ప్రాథమిక ఉద్దేశం.

న్యూ డ్రై డాక్ (ఎన్‌డీడీ): దీన్ని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో రూ.1800 కోట్ల ఖర్చుతో నిర్మించారు. 310 మీటర్ల పొడవు, 13 మీటర్ల లోతుతో ఇది 70,000 టన్నుల వరకు స్థానభ్రంశం చేయగల విమాన వాహక నౌకలను నిర్వహించగలదు.

జల్‌మార్గ్ వికాస్ ప్రాజెక్టు (జేఎంవీపీ): జాతీయ జలమార్గం -1 (హల్దియా నుంచి వారణాసి) సామర్థ్యాన్ని పెంచడానికి రూ.5,370 కోట్ల వ్యయంతో ప్రభుత్వం దీన్ని ఆమోదించింది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day

720

Assiduous

Telugu meaning: శ్రద్ధగల, శ్రమించే

English meaning: The word 'assiduous' (అసిడ్యుఅస్) is an adjective that describes someone who shows great care, attention, and persistent effort in doing something.

Synonyms: Diligent, Industrious

Antonyms: Lazy, Negligent

Usage: 1. She is an assiduous student who studies for hours every day without distraction.

2. His assiduous efforts in the project earned him a well-deserved promotion.

Latest Updates

Agniveervayu Intake 02/2026 Notification

The Indian Air Force invites online applications from unmarried Indian male and female candidates for the Agniveervayu Intake 02/2026 under the Agnipath Scheme. The application fee is Rs.550 + GST. Eligible candidates can apply online before 31 July 2025.

Posts In KRCL

Konkan Railway Corporation Limited (KRCL) Navi Mumbai is conducting interviews for the vacant posts of JTA Signal/Telecommunication, Technician Signal/Telecommunication on contractual basis. The total no. of posts is 28. Eligible candidates can appear for interview on 5th, 7th August 2025.

Jobs In Homi Baba Cancer Hospital

Homi Baba Cancer Hospital, Visakhapatnam, is inviting applications for the Medical & Non-Medical posts in various departments on a temporary basis. The total no. of posts is 13. The application fee is Rs.300. The last date for receipt of online applications is 21 August 2025.

Did You Apply..?

Today (July 24) is the last date for the following jobs/ Apprentice posts

☛ 1075 MTS posts in SSC. *Eligibility:* 10th class.

☛ 50 Non-Executive Posts in FSN. *Eligibility:* Diploma, ITI.

☛ Bank of Baroda Local Bank Officer Recruitment 2025 - 2,500 posts. *Eligibility:* A Graduation degree.

For more information and other notifications - scan QR code

ఆదాయ పన్ను దినోత్సవం

జులై 24
చరిత్రలో ఈనాడు

భారతదేశంలో మొదటిసారి ఆదాయ పన్ను విధించిన రోజుకు గుర్తుగా ఏటా జులై 24న 'ఆదాయ పన్ను దినోత్సవం'గా (Income Tax Day) నిర్వహిస్తారు. భారత ప్రభుత్వానికి ఆర్థిక వనరులను సమకూర్చే ప్రధాన మార్గం పన్నుల రాబడి. పన్ను అనేది టాక్సో అనే 'లాటిన్' పదం నుంచి వచ్చింది. దీని అర్థం 'నేను అంచనా వేస్తా'. ఒక ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత ఆదాయంపై ప్రభుత్వం వసూలు చేసే పన్నును ఆదాయ పన్ను అంటారు. వ్యాపారాలు - జీతం నుంచి వచ్చే ఆదాయం, ఆస్తులు - ఆభరణాలు అమ్మడం ద్వారా లభించే మొత్తం, బహుమతులు - లాటరీ - పెట్టుబడి రాబడి మొదలైనవాటిపై దీన్ని విధిస్తారు. ఈ విధంగా సేకరించిన మొత్తాన్ని ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగిస్తాయి. సకాలంలో పన్ను కట్టేలా ప్రోత్సహించడంతోపాటు దాని ఆవశ్యకత గురించి ప్రజలను చైతన్యపరచడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

■ ఆదాయపు పన్ను శాఖ గణాంకాల ప్రకారం, భారతదేశంలో 13.36 కోట్ల నమోదిత పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఆదాయ పన్ను రిటర్న్‌లు సమర్పించే వారి సంఖ్య పెరుగుతున్నా, ఆ మేరకు వసూళ్లు మాత్రం జరగడంలేదు. మధ్య తరగతి ఆదాయ వర్గీయుల కోసం కొత్త పన్ను విధానంలో చెల్లించాల్సిన పన్ను తగ్గేలా 2025-26 కేంద్ర బడ్జెట్‌లో శ్లాబులను సవరించారు. వాటిని పరిశీలిస్తే..

ఆదాయ శ్లాబు (రూపాయల్లో)	పన్ను రేటు (శాతాల్లో)
0 - 4 లక్షలు	లేదు
4 - 8 లక్షలు	5
8 - 12 లక్షలు	10
12 - 16 లక్షలు	15
16 - 20 లక్షలు	20
20 - 24 లక్షలు	25
24 లక్షలు ఆ పైన	30

చారిత్రక నేపథ్యం:

1857 సిపాయిల తిరుగుబాటు వల్ల ఆంగ్లేయులకు నిధుల కొరత ఏర్పడింది. దీన్ని అధిగమించేందుకు జేమ్స్ విల్సన్ అనే స్కాట్లాండ్ ఆర్థికవేత్త సంపన్నులపై ఆదాయ పన్ను విధించాలని ప్రతిపాదించాడు. ఇది 1860, జులై 24 నుంచి అమల్లోకి వచ్చింది. 1865లో దీన్ని రద్దు చేసి, 1869లో పునఃప్రవేశపెట్టారు. ఇది 1886 నుంచి మన దేశంలో శాశ్వతంగా కొనసాగుతోంది.




❖ పన్ను వసూలు చేసే యంత్రాంగం, పన్నురేట్లను విధించడానికి పాటించాల్సిన అంశాలను తెలుపుతూ ప్రభుత్వం ఆదాయ పన్ను చట్టం 1922ను రూపొందించింది. 1922-61 మధ్యకాలంలో ఈ చట్టాన్ని అనేకసార్లు సవరించారు. లా కమిషన్, ప్రత్యక్ష పన్నుల పరిపాలనా విచారణ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న ఆదాయ పన్ను చట్టం 1961 అమల్లోకి వచ్చింది.

❖ దేశంలో ఆదాయ పన్ను విధించి 2010 నాటికి 150 ఏళ్లు అయిన సందర్భంగా ఏటా జులై 24న 'ఆదాయ పన్ను దినోత్సవం'గా జరపాలని ప్రభుత్వం తీర్మానించింది. అప్పటి నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

సహజ రేడియోధార్మికత

విశ్వంలో శక్తికి మూలమైన కేంద్రకం అస్థిరంగా ఉంటే అది స్థిరత్వాన్ని పొందే ప్రయత్నంలో విచ్ఛిత్తి చెందడమో లేదా తనకు తానుగా వికిరణాలను వెదజల్లడమో చేస్తుంది. వికిరణాల వల్ల కొన్ని దుష్ప్రభావాలతో పాటు మానవాళికి అనేక ఉపయోగాలు ఉన్నాయి. రేడియోధార్మికతను ప్రదర్శించే మూలకాల ఐసోటోప్‌లను వైద్య, పారిశ్రామిక, పర్యావరణ రంగాల్లో విరివిగా ఉపయోగిస్తారు.



న్యూట్రినో

బీటా క్షయాన్ని, దాని అవిచ్ఛిన్న శక్తి వర్ణపటాన్ని వివరించే ప్రక్రియలో భాగంగా పౌలీ అనే శాస్త్రవేత్త 1930లో మరొక అదృశ్య కణం ఉంటుందని ప్రతిపాదించాడు. ఫెర్మీ అనే శాస్త్రవేత్త ఆ కణాన్ని న్యూట్రినో అని పిలిచాడు.

పాజిట్రాన్

ఎలక్ట్రాన్ ప్రతికణం పాజిట్రాన్. ఇది ఎలక్ట్రాన్ ప్రతిద్రవ్యం.

కేంద్రక సంలీనం

రెండు లేదా అంతకంటే ఎక్కువ తేలికైన కేంద్రకాలు అధిక ఉష్ణోగ్రతల వద్ద కలిసి ఒక స్థిర కేంద్రకంగా ఏర్పడే ప్రక్రియను 'కేంద్రక సంలీనం' అంటారు.

ఆల్ఫా కిరణాలు, బీటా కిరణాలు, గామా కిరణాలు, రేడియో ఐసోటోప్‌లు, రేడియోధార్మిక శ్రేణులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ–బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ–బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Gita Gopinath, the First Deputy Managing Director (FDMD) of the International Monetary Fund is set to leave the organisation towards August to rejoin the Harvard University. She joined the Fund as a Chief Economist in 2019, being the first woman to hold the position, and was later promoted to be the FDMD in 2022. Gopinath is an Indian-born US citizen.

The Indian Air Force is set to phase out the last of its iconic Mikoyan-Gurevich MiG-21 fighter jets in September, ending a journey of 62 years. The IAF has 36 MiG-21 planes left in its arsenal, a far cry from the nearly 900 - of which around 660 were built in India - that so successfully protected the nation's skies and territories.

India ranked 77th on the Henley Passport Index 2025. Indian passport holders can now travel visa-free or with visa-on-arrival access to 59 destinations. Singapore retains the top spot, offering visa-free access to 193 destinations. Japan and South Korea follow closely with access to 190 countries. Seven European nations - including France, Germany, and Italy - share third place, each with access to 189 destinations.

India will host the 2025 Chess World Cup from October 30 to November 27, the International Chess Federation (FIDE) said on 21 July 2025. The tournament will feature 206 players in a knockout format, with the top three earning spots in the 2026 Candidates Tournament, which determines the challenger for the World Chess Championship.

For more Current Affairs: Scan QR code

Bank Exams

Reasoning

Statements - Arguments

Directions (Qs. 1 - 9): Each question below is followed by two arguments numbered I and II. You have to decide which of the arguments is a 'strong' argument and which is a 'weak' argument. Mark your answer as..

A) If only Argument I is strong.
B) If only Argument II is strong.
C) Either I or II is strong.
D) Neither I nor II is strong.
E) Both I and II are strong.

1. Statement: Computerisation in offices is a must to provide efficient services to the citizens.

Arguments:
I. Yes, because the work is done quickly and time is not wasted.
II. No, it will generate more unemployment.

2. Statement: Should there be a complete ban on opening up of new management educational institutions?

Arguments:
I. Yes, there are more institutions than required and there is no need to open up new institutions.
II. No, we need more professional managers in coming days because the future scenario will be very competitive.

3. Statement: Should private organisations be allowed to carry on security related research activities?

Arguments:
I. No, private organisations are easily vulnerable to our enemies and therefore, they should not be permitted to carry on such researches.
II. Yes, the Government has not sufficient resources to carry on such researches and the private organisations would manage necessary resources.

4. Statement: Should there be recruitment in banks on the basis of past academic performance rather than through competitive examinations?

Arguments:
I. Yes, it will be beneficial for those candidates who are unable to bear the expenses of competitive examinations.
II. No, the past academic performance cannot be made the basic of recruitment because there is no uniformity in the assessment by the universities.

5. Statement: Should there be only one rate of interest for term deposits of varying durations in banks?

Arguments:
I. No, people will refrain money for longer duration resulting into reduction of liquidity level of banks.
II. Yes, this will be much simpler for the common people and they may be encouraged to keep more money in banks.

6. Statement: Should there be a cap on maximum number of contestants for parliamentary elections in any constituency?

Arguments:
I. Yes, this will make the parliamentary elections more meaningful as the voters can make a considered judgement for casting their vote.
II. No, in a democracy any person fulfilling the eligibility criteria can contest parliamentary elections and there should be no such restrictions.

7. Statement: Should all those who have come in contact with patients with infectious respiratory disease be quarantined in their houses?

Arguments:
I. No, nobody should be quarantined unless they are tested and found to be infected by the virus causing the disease.
II. Yes, this is the only way to control the spread of the dreaded disease.

8. Should all those who are found guilty of committing homicide or abetting homicide be either given capital punishment or be kept in jail for the entire life?

Arguments:
I. Yes, such server punishments only will make people refrain from committing such heinous acts and the society will be more safe.
II. No, those who are repentant for the crime they committed by given a chance to lead a normal life outside the jail.

9. Should there be a restriction on the migration of people from one state to another state in India?

Arguments:
I. No any Indian citizen has a basic right to stay at any place of their choice and hence they cannot be stopped.
II. Yes, this is the only way to effect an equitable distribution of resources across the states in India.

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

ఏ కోర్సులతో సాఫ్ట్‌వేర్ జాబ్?

బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), దూరవిద్యలో ఎంసీఏ చేశాను. కోడింగ్ అంటే ఆసక్తి లేదు. వయసు 45 ఏళ్లు. సాఫ్ట్‌వేర్ జాబ్ సంపాదించాలంటే ఏం చదవాలి? - అరుణ

■ ప్రస్తుతం ఐటీ రంగంలో ఫ్రెషర్స్‌కి ఎక్కువ ఉద్యోగావకాశాలున్నాయి. కోడింగ్‌లో అతి తక్కువ పరిజ్ఞానం ఉన్నవారికి కూడా కొన్ని సంస్థల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి. మీరు బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), ఎంసీఏ చదివారు కాబట్టి కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవడం పెద్ద కష్టం కాదు. మీ వయసులో ఉద్యోగం పొందడంలో కొంత ఇబ్బంది ఉంటుంది కానీ, అసాధ్యం మాత్రం కాదు. సాఫ్ట్‌వేర్ కోర్సుల్ని నేర్చుకోవడం ద్వారా ఐటీ రంగంలో ఉద్యోగాన్ని పొందవచ్చు.

ప్రస్తుతం డిజిటల్ మార్కెటింగ్, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, టెక్నికల్ రైటింగ్, యుఐ/యుఎక్స్ డిజైన్ లాంటి కోర్సులకు డిమాండ్ ఎక్కువ. వీటిలో ఆసక్తి ఉన్న రంగంలో మూడు నుంచి ఆరు నెలల్లో డిప్లొమా లేదా సర్టిఫికేషన్ కోర్సులు చేయండి. ప్రభుత్వ సంస్థల ద్వారా ఉచితంగానో, తక్కువ ఖర్చుతోనో నైపుణ్య శిక్షణ పొందే అవకాశముంది. ఫ్రీలాన్సింగ్, రిమోట్ వర్క్ ద్వారా అనుభవం పెంచుకోవచ్చు. అవసరమైతే మొదట తక్కువ వేతనంతో ఉద్యోగం ప్రారంభించి, కొంత అనుభవంతో మెరుగైన అవకాశాలకు కోడింగ్‌తో సంబంధం లేకుండా పొందగల ప్రత్యామ్నాయ కొలువులున్నాయి. బిజినెస్ అనలిస్ట్‌గా వ్యాపార అవసరాలను విశ్లేషించి టెక్నికల్ టీమ్‌కు సూచనలు అందించవచ్చు. ప్రాజెక్ట్ మేనేజర్‌గా ప్రాజెక్టులను సమర్థంగా నిర్వహించవచ్చు. యుఐ/యుఎక్స్ డిజైనర్‌గా యాప్‌లు, వెబ్‌సైట్లకు, వినియోగదారులకు అనుకూలమైన డిజైన్ చేయవచ్చు. టెక్నికల్ రైటర్‌గా డాక్యుమెంటేషన్, మాన్యువల్స్ తయారు చేయవచ్చు. సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ లేదా నెట్‌వర్క్ ఇంజినీర్‌గా సర్వర్లు, నెట్‌వర్క్ నిర్వహణ చేయవచ్చు. టెక్నికల్ సపోర్ట్ లేదా కస్టమర్ సపోర్ట్ ఉద్యోగాలూ ఉన్నాయి. వీటితో పాటు క్వాలిటీ ఎనలిస్ట్, క్యూఏ టెస్టర్, ఎస్ఈఓ అనలిస్ట్, ప్రొడక్ట్ మేనేజర్ లాంటి అవకాశాలు లభిస్తాయి. ఈ రంగాల్లో సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లం సాల్వింగ్ సామర్థ్యం ఉంటే మేలు. ఉద్యోగం పొందాలంటే, నైపుణ్యం, నెట్‌వర్కింగ్, పట్టుదల ముఖ్యం. ఎంచుకొన్న సాఫ్ట్‌వేర్ కోర్సుల్ని రోజుకు కనీసం 4 గంటల పాటు నేర్చుకుంటే ఆరు నెలల నుంచి సంవత్సరం లోపు ఉద్యోగం సాధించవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



అప్రకటిత నియమాలు.. అప్రమత్తం సుమా!

కార్పొరేట్ సంస్థల్లో కొన్ని నియమాలు ఎంప్లాయీ హ్యాండ్ బుక్, అపాయింట్‌మెంట్ లెటర్, కోడ్ ఆఫ్ కాండక్ట్, స్టాండింగ్ ఆర్డర్స్, హెచ్ఆర్ పాలసీ లాంటి డాక్యుమెంట్ల రూపంలో లిఖిత పూర్వకంగా ఉంటాయి. ఈ నియమాలను ఆచరించడంలో ఎలాంటి సంక్లిష్టతా ఉండదు. కానీ సంస్థలోని అప్రకటిత నియమాలను అర్థం చేసుకోవడంపైనే ఉద్యోగి విజయం ఆధారపడి ఉంటుంది!

ఐటీ సేవలందించే టెక్ సంస్థలో ట్రెయినీగా చేరిన మనోజ్ సంస్థలో చాలా క్లిష్టమైన సమస్యలను పరిష్కరించాడు. ఇతని సామర్థ్యం గుర్తించిన యాజమాన్యం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును కేటాయించింది. అతడితో ఆ ప్రాజెక్ట్ రివ్యూ చేస్తూ మేనేజర్ ఏదైనా సందేహాలుంటే తనను చాంబర్లో కలవమని చెప్పాడు. తనకు సందేహాలు లేవు కనుక మేనేజర్‌ను కలవాల్సిన అవసరం లేదనుకున్నాడు మనోజ్. అయితే ప్రాజెక్టును ప్రజెంట్ చేసే సమయంలో క్లయింట్ల అనుమానాలను సంతృప్తికరంగా నివృత్తి చేయలేకపోయాడు. ఫలితంగా ప్రాజెక్ట్ విఫలమయింది. మేనేజర్ తనను కలవమనడంలోని ఆంతర్యం అప్పటికి గానీ అర్థం కాలేదతడికి..

అప్రకటిత నియమాలు రాతపూర్వకంగా ఉండవు. ఇవి ఒక్కో సంస్థలో ఒక్కోలా ఉంటాయి. వీటిని ఉద్యోగికి ఎవరూ అధికారికంగా 'ఓపెన్'గా చెప్పరు. సంస్థ పరిస్థితులనూ, ఎదుటివారి ప్రవర్తనలనూ బట్టి అర్థం చేసుకొని పాటించాల్సి ఉంటుంది. చెప్పకుండా నేర్చుకోవలసిన ఈ పాఠాలను అర్థం చేసుకోవడమే ఉద్యోగి విజయానికి మూలసూత్రం.

సంస్థల్లో సాధారణంగా కనిపించే కొన్ని అప్రకటిత నియమాలను తెలుసుకుందాం.

1 ఆఫీస్ డైనమిక్స్‌ను అర్థం చేసుకోవడం: ప్రతి సంస్థలోనూ కంటికి కనిపించని అనధికారిక, అధికార కేంద్రాలు, ప్రభావవంతమైన ఉద్యోగులు ఉంటారు. వీరిని గుర్తించి పరిచయాలు పెంచుకోవాలి. దాదాపు ప్రతి కార్యాలయంలోనూ కొన్ని గ్రూపులు, ఆఫీస్ పాలిటిక్స్ ఉంటాయి. వీటికి పూర్తిగా దూరంగా ఉండలేరు. అయితే వీటిలో చిక్కుకోకుండా జాగ్రత్త పడాలి.

2 'నో' చెప్పడం నేర్చుకోండి: సంబంధం లేని పనులు, సామర్థ్యానికి మించిన పని భారం, టార్గెట్లు ఇస్తున్నారనిపించినపుడు ఆ పని ఉద్యోగి ఉత్పాదకతపై వ్యతిరేక ప్రభావం చూపుతోందనిపిస్తే, సంకోచించకుండా 'ఈ పని చేయలే'నని చెప్పాలి. 'ప్రస్తుతం మరో ప్రాజెక్టులో బిజీగా ఉన్నా'నని చెప్పడం తప్పు కాదు. ఉదా: 'ఈ ప్రపంచంలో ఏదీ అసాధ్యం కాదు' అన్నది ఉత్సాహవంతుడైన అనిల్ ట్యాగ్ లైన్. తన టీమ్ సభ్యులు చేయవలసిన పనులు కూడా స్వచ్ఛందంగా తీసుకునేవాడు. దీనితో ఒత్తిడికి లోనై ఏ పనీ పూర్తి చేయలేకపోయాడు. ఈ పరిస్థితి గమనించిన మేనేజర్ హెచ్చరించాక తన ప్రాధాన్యాలను జాగ్రత్తగా ఎంచుకొని, దారిలోకి వచ్చాడు.

3 మేనేజర్ శైలిని గ్రహించడం: ప్రతి మేనేజర్‌కూ ఒక ప్రత్యేక పని శైలి ఉంటుంది. మేనేజర్ల వర్కింగ్ స్టైల్‌నూ, వారి ప్రాధాన్యాలనూ, బలాలూ, బలహీనతలను అర్థం చేసుకోవాలి. సంస్థ ప్రాధాన్యాలను మేనేజర్ ఎలా గుర్తించగలుగుతున్నారో గమనించాలి. కొంతమంది మేనేజర్లు మైక్రో మేనేజ్‌మెంట్‌కూ, మరి కొందరు ముఖ్యాంశాలకూ ప్రాధాన్యం ఇస్తారు. అందుకు తగిన విధంగా పనిచేయాలి. ఇది కెరియర్ అభివృద్ధికి సహకరిస్తుంది. ఉదా: ఐటీ సంస్థలో టీం లీడర్ అనిత తన ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్నీ మేనేజర్‌కు వివరించేది. ఆ మేనేజర్ ముఖ్యాంశాలకు ప్రాధాన్యమిస్తారు. ఈ విషయం ఆమె గుర్తించలేకపోయింది. ఇద్దరి పని పద్ధతుల మధ్య సమన్వయలోపం ఆమె కెరియర్‌పై ప్రభావం చూపింది.

4 ఎవరో గమనిస్తున్నారు: పని ప్రదేశంలో ఉద్యోగులు తమను నిరంతరం ఎవరో గమనిస్తున్నారని భావించాలి. ప్రవర్తన, పని విధానం, నెట్‌వర్కింగ్ లాంటి విషయాల్లో ప్రతి చర్యా బాధ్యతాయుతంగా, ఉత్పాదకతతో ఉండేలా చూసుకోవాలి. అప్రమత్తంగా విధులు నిర్వర్తించడం ఒక ముఖ్యమైన అంశం. చుట్టూ కెమెరాలే ఉండనవసరం లేదు. అంతకుమించి ఎవరో ఒకరు గమనిస్తూండవొచ్చు.

5 మౌనం కూడా మంచిదే: ఒక్కోసారి సహోద్యోగులు సమస్యలు కలిగించవచ్చు. వారిని ప్రతిఘటించి, ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలున్నప్పటికీ తీవ్రంగా స్పందించకూడదు. అది అభిప్రాయభేదాల స్థాయి దాటి వాదనకు దారితీయవచ్చు. అలాంటి సంఘటనలకు స్పందించకుండా మౌనంగా ఉండటం పరిపక్వతకు గుర్తు. అదెంతో మేలు చేస్తుంది. కార్పొరేట్ కంపెనీలు ఈ తరహా అభ్యర్థులనే కోరుకుంటాయి.

6 సంస్థ సర్వోన్నతం: కార్పొరేట్ సంస్థలు పాలసీలు, నియమాలపై ఆధారపడి పని చేస్తాయి. ఉద్యోగి బాగా పనిచేస్తే గుర్తించి ప్రోత్సహిస్తారు. అయితే తాను లేకపోతే సంస్థలో పనులు ఆగిపోతాయని ఉద్యోగి భావిస్తే అది పొరపాటు. ఒక ఉద్యోగి లేకపోతే ఆ స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తారు. ఉదా: తన సాంకేతిక నైపుణ్యాలతో ఎంతటి క్లిష్ట సమస్యనైనా సులభంగా సాల్వ్ చేయగలిగే విజయ్ తాను లేకపోతే సంస్థలో చాలా ప్రాజెక్టులు దెబ్బతింటాయని భావించి నిర్లక్ష్యంగా ప్రవర్తించసాగాడు. ఇది గమనించిన యాజమాన్యం అతణ్ని మరో విభాగానికి బదిలీ చేసి అతడి స్థానంలో మరో యువ ఇంజినీర్‌ను నియమించింది.

7 హుందాగా అభిప్రాయ ప్రకటన: ఏదైనా ఒక అంశంపై అభిప్రాయాలు తెలియచేయాల్సి వచ్చినపుడు, అవి బాస్ అభిప్రాయాలకు భిన్నంగా ఉన్నట్లయితే యథేచ్ఛగా వ్యతిరేకించి ఖండించకూడదు. ఆ అభిప్రాయాలతో విభేదాలుంటే వాటిని బహిరంగంగా కాకుండా ప్రైవేటుగా వ్యక్తపరిచి హుందాగా వ్యవహరించాలి.


కార్పొరేట్ ప్రపంచం నిరంతరాయ అభ్యాస ప్రక్రియ. ఈ అప్రకటిత నియమాలను సరైన పద్ధతిలో అర్థం చేసుకుని కెరియర్‌కు వర్తింపచేయగలిగితే కార్పొరేట్ సంస్థల్లో రాణించి పురోగతి సాధించవచ్చు. ఉద్యోగి సరైన వైఖరి, ప్రవర్తన గురించిన అంశాలివి. నైపుణ్యాలతో వీటికి సంబంధం లేదు.



దొరైరాజ్
ప్రముఖ కార్పొరేట్ సంస్థలో సీనియర్ జనరల్ మేనేజర్

అటవీ కొలువులకు సిద్ధమేనా?

అటవీ శాఖలో 691 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్ ఉద్యోగాల నియామకానికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదే శాఖకు చెందిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులను కూడా త్వరలో భర్తీ చేయనున్నారు.



ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్స్ ఉద్యోగాలకు 01.07.2025 నాటికి 18-30 సంవత్సరాల వయసు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు గరిష్ఠ వయసులో మినహాయింపు ఉంది. క్యారీ ఫార్వర్డ్ అయిన ఉద్యోగాలకు 10 ఏళ్లు, కొత్తగా ప్రకటించిన ఉద్యోగాలకు 5 ఏళ్లు సడలింపు ఇస్తారు.

కనీస విద్యార్హత ఇంటర్మీడియట్. 14.7.25 నాటికి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ ఉద్యోగాలకు ప్రధానంగా శారీరక కొలతల అర్హత, నడక పరీక్షలూ ఉంటాయి. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా కొలతలూ, ఇతర ప్రమాణాలను పరిశీలించుకుని ఈ పరీక్షకు సిద్ధపడాలి.

అభ్యర్థి తన జిల్లాలో ఎన్ని ఉద్యోగాలు ఉన్నాయో చూసుకుని రంగంలోకి దిగటం మేలు. 20 శాతం ఉద్యోగాలు నాన్ లోకల్ ఉంటాయి కాబట్టి ఒకవేళ సొంత జిల్లాలో ఉద్యోగాలు లేనట్లయితే పక్క జిల్లాల వైపు చూడవచ్చు.

స్క్రీనింగ్ పరీక్ష తర్వాత మెయిన్స్ పరీక్ష ఉంటుంది. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ కూడా నిర్వహిస్తారు. నిర్దిష్ట నిష్పత్తిలో మెయిన్స్ నుంచి ఎంపిక చేసినవారికి నడక, మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. అన్నిట్లోనూ అర్హత పొందినవారిని పరిగణనలోకి తీసుకుని ఫైనల్ ర్యాంకింగ్ నిర్ణయిస్తారు. రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇస్తారు.

స్క్రీనింగ్ పరీక్ష 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 150 నిమిషాల్లో 150 ప్రశ్నలను గుర్తించాలి. ఇందులో పార్ట్ ఎ, పార్ట్ బి అని రెండు భాగాలు. ఒక్కొక్కటి 75 ప్రశ్నలు 75 మార్కులకు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ కూడా ఉంది.

ఈ పరీక్షను 2025 సెప్టెంబర్ 7న నిర్వహించబోతున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది.

45 రోజుల సమయమే ఉంది కాబట్టి సిలబస్ రీత్యా కొత్త అభ్యర్థులకు సవాల్ లాంటిది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్హత కాబట్టి చాలామంది ఇంటర్ పాసైన అభ్యర్థులకు ఆశలుంటాయి. కానీ ఇప్పటికే గ్రూప్ 1, 2 లాంటి ఇతర పోటీ పరీక్షలకు సిద్ధపడి, వయసు, శారీరక ప్రమాణాలున్నవారు నెగ్గటానికి మంచి అవకాశాలున్నాయని చెప్పవచ్చు. కొత్తగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పూర్తిగా ఆశలు వదులుకోకుండా చదవాలి.

స్క్రీనింగ్ పరీక్ష నెగ్గాలంటే..

పార్ట్ ఎ: పరిమిత సిలబస్‌కు ప్రాధాన్యం

▼ ప్రతిరోజూ కనీసం గంట సేపయినా జాతీయ అంతర్జాతీయ వర్తమానాంశాలను పరిశీలించండి. గత ఆరు నెలల పరిణామాలను అధ్యయనం చేయండి.

▼ సాధారణ స్థాయి రీజనింగ్ విభాగాలను నిత్యం సాధన చేయండి.

▼ పర్యావరణ పరిరక్షణ- సంతులిత అభివృద్ధి.. పరిమిత సిలబస్సే కాబట్టి సులువుగా సిద్ధం కావొచ్చు. దీనిపై దృష్టి పెడితే మార్కులు సాధించడానికి వీలుంటుంది.

▼ విపత్తు నిర్వహణ ఆసక్తి కలిగించే అంశం, సిలబస్ అంశాలు తక్కువ. అందుకని ప్రాథమిక స్థాయి పరిజ్ఞానానికి ప్రాధాన్యమిస్తూ ప్రిపేర్ అయితే పట్టు సాధించవచ్చు.

▼ గ్రామీణ అభివృద్ధిపై ప్రశ్నలడిగే అవకాశముంది.

▼ భారత భౌగోళిక అంశాలనూ, ఆంధ్రప్రదేశ్ భౌగోళిక అంశాలనూ అనుసంధానించుకునే ప్రయత్నం చేయవచ్చు.

▼ భారత రాజ్యాంగం అంశాలపై స్థూల అవగాహన, పాఠశాల స్థాయి పరిజ్ఞానంతో మార్కులు సాధించే అవకాశాలున్నాయి.

▼ స్వల్ప వ్యవధి దృష్ట్యా చరిత్రలోని జాతీయోద్యమంపై దృష్టి పెడితే కొంత మేలు జరగవచ్చు. జాతీయోద్యమ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని పరిణామాలపై స్థూల అవగాహన అవసరం.

▼ సైన్స్ అండ్ టెక్నాలజీపై ప్రశ్నలను కరెంట్ అఫైర్స్ ప్రాధాన్యంగా చదువుకుంటే మంచిది. మరీ లోతుగా వెళ్లకుండా తాజాగా జరిగిన పరిణామాలకూ, సంబంధిత వర్తమానాంశాలకూ పరిమితం అవ్వండి.

పార్ట్ బి: బేసిక్స్‌పై గట్టి పట్టు

▼ జనరల్ సైన్స్ కోసం హైస్కూలు తరగతుల్లోని జంతు- వృక్షశాస్త్ర అంశాల ప్రాథమికాంశాలు (బేసిక్స్) బలంగా నేర్చుకుంటే సులభంగా మంచి మార్కులు వస్తాయి.

▼ మానవ శరీర నిర్మాణానికి సంబంధించిన వివిధ ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. మానవ జన్యు వారసత్వం, జీవుల పునరుత్పత్తి ప్రక్రియలు సులభమైన భాషలో నేర్చుకున్నా ఈ పరీక్షకు సరిపోవచ్చు. ఇటీవల గ్రూప్-2 మెయిన్స్ మాదిరే సాధారణ స్థాయి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. అందుకే బేసిక్స్‌పై పట్టు సాధిస్తే మంచి అవకాశాలుంటాయి.

▼ రసాయన శాస్త్రంలోని లోహ, అలోహ చాప్టర్స్‌పై, కార్బన్ సంబంధిత అంశాలపై పాఠశాల స్థాయి సమాచారం తెలిసివుండాలి.

▼ ఇంధన వనరులపై ప్రాథమిక స్థాయి ప్రశ్నలు రావొచ్చు. శిలాజ, పునరుత్పత్తి ఇంధనాలు, వాటిలోని రకాలు, ఉత్పత్తి మెలకువలు, ప్రస్తుత ఉత్పత్తి స్థాయుల గురించి తెలుసుకోవాలి.

▼ పర్యావరణ సంబంధిత విషయాలు కూడా సాధారణ స్థాయిలోనే సిలబస్ అంశాల వరకు సిద్ధమైతే సరిపోతుంది. ▼ సాధారణ గణిత అంశాల విషయానికొస్తే- అంకగణితం, జామెట్రీ, స్టాటిస్టిక్స్ అనే మూడు విభాగాలున్నాయి. సిలబస్ రీత్యా చూస్తే ప్రాథమిక పరిజ్ఞానం ఈ మూడిట్లోనూ సరిపోతుంది.

▼ గణితం నేపథ్యంలో ఇంటర్ చదివిన వారికి పెద్ద సమస్యలుండకపోవచ్చు. కానీ గణిత నేపథ్యం లేనివారు కొంత ఇబ్బంది పడొచ్చు. వారు కూడా ఈ మూడు విభాగాల్లోని ప్రాథమిక అంశాలను రోజూ కనీసం మూడు గంటలు ప్రాక్టీస్ చేయటం మంచిది.

▼ పాఠశాల పుస్తకాలలోని సంబంధిత సిలబస్ చూసుకుని సాధన చేయటం వల్ల ఫలితం ఉంటుంది.

▼ పోటీ పరీక్షల పుస్తకాల్లో ఈ మూడు విభాగాలకు సంబంధించి ఇచ్చే షార్ట్ కట్స్ ప్రయోజనకరం.

▼ గ్రూప్ 1, 2, ఇతర పోటీ పరీక్షల సన్నద్ధతపై ఇప్పటికే పట్టు సాధించిన వారు సిలబస్ ప్రకారం మాత్రమే ప్రిపేరైతే సరిపోతుంది. ఆయా పరీక్షల్లో మాదిరిగా విస్తృత ప్రిపరేషన్ అవసరం ఉండకపోవచ్చు. ప్రధానంగా బేసిక్స్‌పై బాగా దృష్టి పెట్టాలి.



– కొడాలి భవానీ శంకర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

గెస్ట్ రిలేషన్స్ ఎగ్జిక్యూటివ్
సంస్థ: ఎడ్జ్ అండ్ ఎసెన్స్
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, కొలాబరేషన్, కల్చరల్ అవేర్‌నెస్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సేల్స్
స్టైపెండ్: రూ.3,500
☛ https://shorturl.at/vMtXE

త్రీడీ ప్రింటింగ్
సంస్థ: గరుడా3డీ నైపుణ్యాలు: ఆటోడెస్క్ ఫ్యూజన్ 360, ర్యాపిడ్ ప్రొటోటైపింగ్
స్టైపెండ్: రూ.10,000-11,000
☛ https://shorturl.at/frgZF

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: హెచ్‌వైపీఆర్4 క్లౌడ్ టెక్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.15,000
☛ https://shorturl.at/GV9Ww

ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్
సంస్థ: ఇన్నోవన్ టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఏఐ, సీఎస్ఎస్, గిట్‌హబ్, హెచ్‌టీఎంఎల్, జావా, జావాస్క్రిప్ట్, మెషిన్ లెర్నింగ్, పైతాన్, రియాక్ట్, ఎస్క్యూఎల్
స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://shorturl.at/495iB

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 15

సేల్స్, మార్కెటింగ్ అండ్ ఈవెంట్ ఆపరేషన్స్
సంస్థ: ద కలినరీ లాంజ్
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, కేన్వా, ఇంగ్లిష్ మాట్లాడం, రాయడం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, గూగుల్ షీట్స్, ఎంఎస్-ఎక్సెల్, ఆపరేషన్స్, సేల్స్ సపోర్ట్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/IRVk0

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: సేఫ్టీకనెక్ట్ నైపుణ్యాలు: కంటెంట్, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైన్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.5,000-10,000
☛ https://shorturl.at/MueNA

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
సంస్థ: ర్యాంకర్స్‌గ్రిడ్ బై కాగ్నోల్యాబ్స్
నైపుణ్యాలు: అటెన్షన్ టు డీటెయిల్, కొలాబరేషన్, డేటా అనాలిసిస్, లీడర్‌షిప్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-పవర్‌పాయింట్, పర్ఫార్మెన్స్ మానిటరింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, రిపోర్ట్ రైటింగ్, రిపోర్ట్ మేనేజ్‌మెంట్, రిస్క్ అసెస్‌మెంట్, స్టేక్‌హోల్డర్ మేనేజ్‌మెంట్, టీమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.7,000-10,000
☛ https://shorturl.at/cnYE3

వీటికి దరఖాస్తు గడువు: ఆగస్టు 14

హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: సైకం కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: కాంపెన్సేషన్ మేనేజ్‌మెంట్, కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, ఎంప్లాయీ రిలేషన్స్, ఎంప్లాయ్‌మెంట్ ఎంగేజ్‌మెంట్, ఇంగ్లిష్, హెచ్ఆర్ అనలిటిక్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మ్యాన్‌పవర్ ప్లానింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, నెగోషియేషన్, ఆన్‌బోర్డింగ్, పేరోల్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిక్రూట్‌మెంట్, శాలరీ స్ట్రక్చర్, టీమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000-13,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 3
☛ https://shorturl.at/KIjLo

ఈ-కామర్స్ ఎగ్జిక్యూటివ్
సంస్థ: ఎస్‌డీసీ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ ప్రై.లి. నైపుణ్యాలు: కంప్యూటర్ నెట్‌వర్కింగ్, ఎథికల్ హ్యాకింగ్, లినక్స్, పైతాన్, వీఏపీటీ, వెబ్ అప్లికేషన్ సెక్యూరిటీ
స్టైపెండ్: రూ.4,000-5,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 9
☛ https://shorturl.at/UTIGv

ఆపరేషన్స్ అసోసియేట్
సంస్థ: అసెంట్ హెచ్ఆర్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఆపరేషన్స్
స్టైపెండ్: రూ.12,000-20,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
☛ https://shorturl.at/gZpNo

డిజిటల్ మీడియా అసిస్టెంట్
సంస్థ: బయోఫ్యాక్ ఇన్‌పుట్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఫేస్‌బుక్ యాడ్స్, ఇన్‌స్టాగ్రామ్ యాడ్స్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.17,000-18,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 1
☛ https://shorturl.at/lRJqZ

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా.. వివిధ విభాగాల్లో 41 మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ మేనేజర్: 13 ◗ సీనియర్ మేనేజర్: 12 ◗ చీఫ్ మేనేజర్: 02
◗ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్: 14
విభాగాలు: ప్రొడక్ట్, డిజిటల్ ప్రొడక్ట్, ఫైర్ సేఫ్టీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, అడ్మినిస్ట్రేటర్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎంసీఏ/ఎమ్మెస్సీ(సీఎస్)తో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 24 నుంచి 40 ఏళ్లు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.08.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.850. ఎస్సీ, ఎస్టీ/పీడబ్ల్యూడీ/ఈఎస్ఎం/డీఈఎస్ఎంలకు రూ.175.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.bankofbaroda.in/career/

ఏపీలో 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లో 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
◗ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్: 100 (30 క్యారీ ఫార్వర్డ్ + 70 తాజా).
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ లేదా అగ్రికల్చర్) లేదా కెమికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్
ఎంపిక: స్క్రీనింగ్ టెస్టు, మెయిన్ పరీక్ష, ఫిజికల్ టెస్టు: వాకింగ్, మెడికల్ పరీక్షలతో. **వేతన శ్రేణి:** నెలకు రూ.32,670 - రూ.1,01,970.
వయసు: 01.07.2025 నాటికి కనీసం 18 - 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్‌కు 5 ఏళ్లు. సీఎఫ్ పోస్టులకు ఎస్సీ/ఎస్టీలకు 10 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.
శారీరక ప్రమాణాలు: పురుషులు: కనీస ఎత్తు 163 సెంటీమీటర్లు, ఛాతీ 84 సెంటీమీటర్లు (గాలి పీల్చినపుడు 5 సెం.మీ. పెరగాలి). మహిళలు: కనీస ఎత్తు 150 సెంటీమీటర్లు, ఛాతీ 79 సెంటీమీటర్లు (5 సెం.మీ. విస్తరణతో) వాకింగ్ టెస్టు: పురుషులు 25 కిలోమీటర్లు, మహిళలు 16 కిలోమీటర్లు 4 గంటల్లో పూర్తి చేయాలి. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ:** 28.07.2025
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 17.08.2025
దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250. పరీక్ష ఫీజు రూ.80. ఎస్సీ/ఎస్టీ/బీసీ, ఈఎస్ఎంలకు పరీక్ష ఫీజు ఉండదు.
స్క్రీనింగ్ పరీక్ష తేదీ: 07.09.2025
వెబ్‌సైట్: https://portal-psc.ap.gov.in/HomePages/RecruitmentNotifications

హిందుస్థాన్ ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్‌లో..

హిందుస్థాన్ ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో 40 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ వైస్ ప్రెసిడెంట్: 03 ◗ అడిషనల్ చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్: 01 ◗ డిప్యూటీ మేనేజర్/అసిస్టెంట్ మేనేజర్: 03
◗ సీనియర్ ఇంజినీర్/ఇంజినీర్: 10
◗ అసిస్టెంట్ మేనేజర్/డిప్యూటీ మేనేజర్: 11
◗ అసిస్టెంట్ మేనేజర్/డిప్యూటీ మేనేజర్/మేనేజర్: 03
◗ డిప్యూటీ మేనేజర్/మేనేజర్/సీనియర్ మేనేజర్: 02
◗ ఆఫీసర్: 01 ◗ మేనేజర్: 01 ◗ సీనియర్ మేనేజర్/ఎఫ్‌టీసీ: 01
◗ మేనేజర్/ఎఫ్‌టీసీ: 01 ◗ ఆఫీసర్/ఎఫ్‌టీసీ: 03
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, సీఏ లేదా సీఎంఏతో పాటు పని అనుభవం.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూతో.
వయసు: 30 నుంచి 42 ఏళ్లు.
వేతన శ్రేణి: నెలకు వైస్ ప్రెసిడెంట్‌కు రూ.1,20,000 - రూ.2,80,000, అడిషనల్ చీఫ్ మేనేజర్‌కు రూ.90,000 - రూ.2,40,000, సీనియర్ మేనేజర్‌కు రూ.80,000 - రూ.2,20,000, మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.60,000 - రూ.1,80,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000 - రూ.1,60,000, సీనియర్ ఇంజినీర్‌కు రూ.45,000 - రూ.1,50,000, ఇంజినీర్/ఆఫీసర్‌కు రూ.40,000 - రూ.1,40,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.08.2025
వెబ్‌సైట్: https://jobse3.hurl.net.in/index.php

కొంకణ్ రైల్వేలో 28 ఖాళీలు

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, నవీ ముంబయి ఒప్పంద ప్రాతిపదికన 28 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ జేటీఏ సిగ్నల్/ టెలికమ్యూనికేషన్: 04
◗ టెక్నీషియన్ సిగ్నల్/టెలి కమ్యూనికేషన్: 24
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిప్లొమా, డిగ్రీ.
గరిష్ఠ వయసు: 30 ఏళ్లు. **వేతనం:** నెలకు జేటీఏ సిగ్నల్/టెలికి రూ.43,380, టెక్నీషియన్ సిగ్నల్/టెలికి రూ.37,500.
ఎంపిక: ఇంటర్వ్యూతో ఇంటర్వ్యూ తేదీలు: 05.08.2025, 07.08.2025
వేదిక: యూఎస్‌బీఆర్ఎల్ ప్రాజెక్ట్ ఆఫీస్, కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, జ్యోతిపురం రోడ్, త్రినాథ, పోస్ట్ గ్రామోర్‌రాసి, జమ్మూ, జమ్మూకశ్మీర్(యూటీ)పిన్-182311.
వెబ్‌సైట్: https://konkanrailway.com/en/current_notification

వాక్-ఇన్స్

ఏఆర్‌సీఐ హైదరాబాద్‌లో 41 ఖాళీలు

ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్, హైదరాబాద్ 41 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
◗ రిసెర్చ్ అసోసియేట్-1: 06 ◗ రిసెర్చ్ అసోసియేట్-3: 01
◗ జూనియర్ రిసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్): 30
◗ సీనియర్ రిసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్): 04
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **గరిష్ఠ వయసు:** 28 నుంచి 38 ఏళ్లు.
స్టైపెండ్: నెలకు ఆర్ఏ-1కు రూ.58,000, ఆర్ఏ-3కి రూ.67,000, జేఆర్ఎఫ్‌కు రూ.37,000, ఎస్ఆర్ఎఫ్‌కు రూ.42,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో
ఇంటర్వ్యూ తేదీలు: 28.07.2025, 07.08.2025
వెబ్‌సైట్: https://www.arci.res.in/careers/

విశాఖపట్నం క్యాన్సర్ హాస్పిటల్‌లో..

హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్, విశాఖపట్నం 13 మెడికల్, నాన్‌మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
◗ కన్సల్టెంట్ (డీ/ఈ/ఎఫ్): 08 ◗ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్: 01 ◗ ఆఫీసర్ ఇన్‌ఛార్జి(డిస్పెన్సరీ): 01
◗ సైంటిఫిక్ అసిస్టెంట్ సీ(న్యూక్లియర్ మెడిసిన్): 01
◗ ఫార్మసిస్ట్ బీ: 01 ◗ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1: 01
విభాగాలు: పాథాలజీ, అనస్థీషియాలజీ, డెంటల్ అండ్ ప్రొస్థెటిక్స్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, రేడియో డయాగ్నోసిస్, గైనిక్ ఆంకాలజీ.
అర్హత: పోస్టును అనుసరించి ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ (నర్సింగ్), బీ ఫార్మ్ లేదా డీ ఫార్మ్, బీఎస్సీ, ఎంబీబీఎస్ లేదా బీడీఎస్, ఎండీ/డీఎన్‌బీ, ఎండీఎస్, డీఎం, ఎంసీహెచ్, డిప్లొమా, అనుభవం.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూతో **వయసు:** 21.08.2025 నాటికి కన్సల్టెంట్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్, ఆఫీస్ ఇన్‌ఛార్జి, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులకు 40 నుంచి 50 ఏళ్లు, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, ఫార్మసిస్ట్-బీకి 30 ఏళ్లు,
మూల వేతనం: నెలకు ఫార్మసిస్ట్-బీ పోస్టుకు రూ.29,200, సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.44,900, ఆఫీసర్ ఇన్‌ఛార్జికి రూ.56,100, కన్సల్టెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్‌కు రూ.67,700.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.08.2025
దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ/ఎస్టీ/మహిళలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://tmc.gov.in/m_events/events/JobDetail?jobId=35859

నర్సు పోస్టుల నియామకం

హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్, విశాఖపట్నం తాత్కాలిక ప్రాతిపదికన 5 నర్సు పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
అర్హత: జీఎన్ఎం, బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **జీతం:** నెలకు రూ.33,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 29.07.2025.
వేదిక: హోమీ భాభా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రిసెర్చ్ సెంటర్, అగనంపూడి, విశాఖపట్నం.
వెబ్‌సైట్: https://tmc.gov.in/m_events/events/jobvacancies

మా అన్న ఆచూకీ కనుగొనేలా పోలీసుల్ని ఆదేశించండి

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి వినతి

ఈనాడు, అమరావతి: రెండేళ్ల నుంచి కనిపించకుండా పోయిన తన అన్న ఆచూకీ కనిపెట్టేలా పోలీసుల్ని ఆదేశించాలని అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలానికి చెందిన ఓబులేసు తెదేపా కార్యాలయంలో విన్నవించారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితులు బుధవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ స్వామినాయుడు, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ వజ్జ బాబురావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా మోరంపల్లికి చెందిన వి.వెంకటరాముడు కోరారు. గత ప్రభుత్వ హయాంలో వైకాపా నేతలు తనపై అక్రమంగా బనాయించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు తొలగించాలని నెల్లూరు జిల్లా కలిగిరికి చెందిన ఎం.హరి వినతిపత్రం సమర్పించారు. తన పొలాన్ని వైకాపా నేతల పేరుపైకి మార్చిన ఎమ్మార్వోపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన అనిల్‌కుమార్ కోరారు.

విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: కర్నూలు బస్సు ఘటన లాంటివి పునరావృతం కాకుండా విద్యార్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కోరారు. 'ఒకే బస్సులో 100 మందికి పైగా విద్యార్థులు- ఊపిరాడక ముగ్గురికి అస్వస్థత' అనే శీర్షికతో 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన వార్తను జత చేస్తూ.. ఈ ఘటన ఆందోళనకు గురి చేసిందని 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.

ఏపీఎంఎస్ఐడీసీ ఇన్‌ఛార్జి ఎండీగా వీరపాండియన్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) బాధ్యతలను తాత్కాలికంగా వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ శాఖ వైస్ ఛైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.గిరీషా ముస్సోరీలో నిర్వహించే ఐఏఎస్ అధికారుల మిడ్ కెరీర్ శిక్షణకు వెళ్లారు. ఈ మేరకు ఈ నెల 21 నుంచి ఆగస్టు 16 వరకు పూర్తి అదనపు బాధ్యతల్లో వీరపాండియన్ కొనసాగుతారని బుధవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

'అవయవ మార్పిడి' కేంద్రాలుగా ప్రభుత్వ ఆసుపత్రులకు అర్హత కల్పించండి

హైకోర్టులో పిల్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని వంద పడకల సామర్థ్యమున్న ప్రభుత్వ బోధన ఆసుపత్రులను అవయవ మార్పిడి శస్త్రచికిత్స కేంద్రాలు (ఓటీసీ)గా స్థాయి పెంచాలని అభ్యర్థిస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2016లో పిల్ దాఖలైతే ఇప్పటి వరకూ కౌంటర్ వేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓటీసీగా ప్రభుత్వ ఆసుపత్రుల స్థాయిని పెంచితే అవయవ మార్పిడి రాకెట్లను కట్టడి చేయవచ్చని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు జి.భార్గవి ఈ పిల్ దాఖలు చేశారు.

ఈఆర్సీ ఛైర్‌పర్సన్ పోస్టును ఎప్పటిలోగా భర్తీ చేస్తారో చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఛైర్‌పర్సన్‌ను ఎప్పటిలోగా నియమిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. వ్యాజ్యంపై విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేసింది. ఏపీఈఆర్సీ ఛైర్‌పర్సన్ పోస్టు గతేడాది అక్టోబరు నుంచి ఖాళీగా ఉంటోందని, దీన్ని భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ డాక్టర్ దొంతి నరసింహారెడ్డి పిల్ వేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎం.పవన్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఈఆర్సీ సభ్యుడి పోస్టు భర్తీకి ఈ ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, ఛైర్‌పర్సన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఛైర్‌పర్సన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఎప్పటిలోగా భర్తీ చేస్తారో చెప్పాలని ఆదేశించింది.

16 నుంచి పంచ జ్యోతిర్లింగ దర్శనానికి టూరిస్ట్ రైలు: ఐఆర్‌సీటీసీ

ఈనాడు, హైదరాబాద్: పంచ జ్యోతిర్లింగ దర్శనంతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంలోని ముఖ్య ప్రదేశాలను చూసేలా భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలుతో ప్రత్యేక యాత్రను ఐఆర్‌సీటీసీ ప్రకటించింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఆగస్టు 16న ప్రారంభమయ్యే ఈ యాత్ర 24వ తేదీన ముగుస్తుంది. ఈ రైలు ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగం, దీక్షా భూమి స్తూపం (అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన ప్రదేశం), నాగ్‌పుర్‌లోని స్వామినారాయణ మందిరం, మోవ్ వద్ద జన్మ భూమి (అంబేడ్కర్ జన్మస్థలం), నాసిక్ వద్ద త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, పుణెలో భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్ వద్ద ఘృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం మొదలైన ప్రదేశాలను సందర్శించే అవకాశం ఈ యాత్రలో ఉంటుందని ఐఆర్‌సీటీసీ తెలిపింది. రాష్ట్రంలో సికింద్రాబాద్‌తో పాటు కామారెడ్డి, నిజామాబాద్, స్టేషన్లలో ప్రయాణికులు రైలు ఎక్కేందుకు సౌకర్యం కల్పించింది. రైలు, రోడ్డు రవాణా, వసతి సౌకర్యం, భోజనం సహా అన్నిరకాల ఏర్పాట్లు ఉంటాయని పేర్కొంది. 'భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు'తో పంచ జ్యోతిర్లింగ దర్శనంతో అంబేడ్కర్ యాత్రకు ప్రయాణ తరగతిని బట్టి ఛార్జి రూ.14,700 నుంచి రూ.29,900గా ఖరారు చేసింది. బుకింగ్‌ల కోసం 9701360701, 9281030712, 9281030711 నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

రసాయన ఎరువుల 'మోత'

- మిరప, మొక్కజొన్నల్లో భారీగా కుమ్మరిస్తున్నారు
- జొన్నలోనూ యూరియా వాడకం 417% అధికం
- గడ్డిపెంపకానికీ భారీగా వినియోగం

ఈనాడు, అమరావతి: ఎరువుల బస్తాలు ఎన్ని ఎక్కువ వాడితే.. పంట దిగుబడి అంత ఎక్కువగా వస్తుందనే ఆలోచనే రైతులను పరిమితికి మించిన వాడకం దిశగా నడిపిస్తోంది. సాగులో పెట్టుబడి వ్యయం పెరగడానికి ఇదీ ఒక కారణం. రాష్ట్రంలో 2024-25 సంవత్సరంలో పంటల వారీగా చూస్తే ఎరువుల వాడకంలో మిరప అగ్రస్థానంలో ఉండగా మొక్కజొన్న రెండోస్థానంలో నిలిచింది. జొన్న, వేరుశనగ, పసుపు, పప్పుధాన్యాలు తదితర పంటలకూ యూరియాను కుమ్మరిస్తున్నారు.

మిరపలో ఎరువుల మోత

రాష్ట్రంలో రసాయన ఎరువులు అత్యధికంగా వాడే పంట మిరప.. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారమే హెక్టారుకు 1,325 కిలోల వాడకం ఉంది. సిఫార్సు చేసిన మోతాదు కంటే యూరియా 78%, భాస్వరం 122% అధికంగా చల్లుతున్నారు. వాస్తవంగా చూస్తే రైతులు ఇంతకు రెట్టింపుస్థాయిలోనే వాడుతున్నారు. ఫలితంగా మిరపకు ఎకరాకు రూ.3 లక్షల పెట్టుబడి అవుతోంది. తీరా చూస్తే ధరలు దక్కడం లేదు. క్వింటాలుకు రూ.10వేలు ఉన్నా గిట్టుబాటు కాని పరిస్థితి. ఎకరానికే రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఎరువుల వాడకం తగ్గించుకుంటే పెట్టుబడి కూడా తగ్గుతుందని ఆలోచించడం లేదు.

పంటల వారీగా నత్రజని, భాస్వరం, పొటాష్ వాడకం (హెక్టారుకు కిలోల్లో)

పంట	సిఫార్సు చేసిన మోతాదు (కిలోల్లో)			రైతులు ఉపయోగించేది (కిలోల్లో)		
	నత్రజని	భాస్వరం	పొటాష్	నత్రజని	భాస్వరం	పొటాష్
వరి	120	80	40	161	36	25
మొక్కజొన్న	200	80	80	389	61	25
పత్తి	150	60	60	208	36	62
మిరప	300	60	120	535	133	0
అరటి	500	250	500	559	129	247
గడ్డి	150	60	60	575	0	0
సుబాబుల్	125	60	60	114	0	0
యూకలిప్టస్	125	60	60	230	0	0
వేరుశనగ	30	40	50	121	19	0
పప్పుధాన్యాలు	20	50	0	73	30	0
జొన్న	80	40	40	414	0	0
పసుపు	188	63	94	377	180	62

మొక్కజొన్న పైనా భారీగా..

ఎరువుల వినియోగం అధికంగా ఉండే రెండో పంట మొక్కజొన్న. హెక్టారుకు 565 కిలోలు చల్లుతున్నట్లు వ్యవసాయశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వాస్తవ వినియోగం ఇంకా ఎక్కువే. రెండు మూడేళ్లగా గిట్టుబాటు ధరలు లభిస్తుండటంతో అధికశాతం రైతులు మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. ఇతర పంటల సాగులో నష్టాలతో.. ప్రత్యామ్నాయ పంటగా దీనినే ఎంచుకుంటున్నారు.

జొన్నకు 417% అధికంగా యూరియా

జొన్న సాగులో సిఫార్సు చేసిన మోతాదుకు మించి 417% అధికంగా యూరియాను వినియోగిస్తున్నారు. వేరుశనగకు కూడా 303% అధికంగా వేస్తున్నారు. పప్పుధాన్యాల్లోనూ ఇదే పరిస్థితి. గడ్డి పెంపకానికి 283% అధికంగా వాడటం గమనార్హం.

అపోహ మాత్రమే

– వి.శైలజ, ప్రధాన శాస్త్రవేత్త, సాయిల్ సైన్స్, ప్రాంతీయ పరిశోధనాస్థానం, లాం, గుంటూరు

భూసార పరీక్షలు చేయించుకుని.. అవసరం మేరకు రైతులు ఎరువులు వాడాలి. యూరియా ఎక్కువ వస్తే దిగుబడి పెరుగుతుందనేది అపోహ మాత్రమే. నేలలో పోషకలోపం తక్కువగా ఉంటే సిఫార్సు చేసిన మోతాదుకు మించి 30% వరకు వేసుకోవచ్చు. నత్రజని ఎక్కువగా వాడితే చీడపీడలు పెరుగుతాయి. వాటి నివారణకు పురుగుమందులు ఎక్కువగా చల్లాలి. పంటల నాణ్యత దెబ్బతింటుంది. భూగర్భజలాలు కలుషితమవుతాయి. భాస్వరం, పొటాష్ ఎరువుల్ని సిఫార్సు మేరకు అందించాలి. లేదంటే మొక్కల్లో రోగనిరోధకత తగ్గుతుంది. కరవు పరిస్థితుల్లో నానో ఎరువులు పిచికారి చేస్తే మంచి ప్రయోజనం ఉంటుంది. అయితే నేల ద్వారా అందించడమూ ముఖ్యమే.

తెదేపా ఎమ్మెల్యేల పనితీరుకు ప్రోగ్రెస్ కార్డులు

- వారితో సీఎం ముఖాముఖి భేటీలు
- ఇప్పటి వరకు 21 మందితో సమావేశం

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి వ్యక్తిగతంగా ప్రోగ్రెస్ రిపోర్టులు ఇస్తున్నారు. వివిధ సర్వేల్లో నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు వెల్లడించిన అభిప్రాయాల్ని క్రోడీకరించి నివేదికలు రూపొందించారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల షెడ్యూల్‌ను బట్టి రోజుకు ఇద్దరు, ముగ్గురితో సమావేశాలు జరుగుతున్నాయి. జూన్ 27న రంపచోడవరం ఎమ్మెల్యేతో సమావేశాలు ప్రారంభించారు. ఇప్పటి వరకు గిద్దలూరు, మార్కాపురం, శ్రీశైలం, నందికొట్కూరు తదితర 21 నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో భేటీలు పూర్తయ్యాయి. బుధవారం గుంతకల్లు, గంగాధర నెల్లూరు శాసనసభ్యులతో చంద్రబాబు సమావేశమయ్యారు. గురువారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను సమావేశానికి పిలిచారు. ముఖ్యమంత్రి ఒక్కో శాసనసభ్యుడితో అర్ధ గంట నుంచి 45 నిమిషాలపాటు సమావేశమవుతున్నారు. తన దగ్గరున్న నివేదికల ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరు, ఏడాది కాలంలో పార్టీ బలోపేతానికి, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు తీసుకున్న చొరవ, లోపాలు సహా అన్ని అంశాలపై కూలంకషంగా చర్చిస్తున్నారు. బాగా పనిచేస్తున్నవారిని భుజం తడుతూ, లోపాలున్నచోట సరిచేసుకోవాలని చెబుతున్నారు. అవినీతి ఆరోపణలు, కేడర్‌తో సమన్వయం లేకపోవడం వంటి సమస్యలున్న చోట పద్ధతి మార్చుకోవాలని కాస్త గట్టిగానే చెబుతున్నట్లు సమాచారం. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలందరితో ముఖాముఖి సమావేశమవ్వాలన్న సీఎం నిర్ణయంలో భాగంగా ఈ భేటీలు జరుగుతున్నాయి. సీఎంతో ముఖాముఖి కూర్చుని మాట్లాడేందుకు 45 నిమిషాల వరకు సమయం లభిస్తుండటంతో నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, కూటమిలోని మిత్రపక్షాలతో క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై కూలంకషంగా చర్చించేందుకు వీలు కలుగుతోందని ఎమ్మెల్యేలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో నిందితులకు రిమాండ్

ఈనాడు, హైదరాబాద్: సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ కేసులో ప్రధాన నిందితుడు పాములపాటి పవన్‌కుమార్ అలియాస్ లియోన్‌తోపాటు ప్రదీప్ కుమార్‌గుప్తాను బుధవారం సీఐడీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఏపీలోని తాడేపల్లిగూడెనికి చెందిన పవన్, హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన ప్రదీప్‌లను ఎల్బీనగర్‌లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 19కి చేరింది. వైద్యులు రాజశేఖర్, అవినాశ్‌తో కలిసి సరూర్‌నగర్ ప్రాంతంలోని అలకనంద, జనని, అరుణ ఆసుపత్రుల్లో అక్రమంగా కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన కేసులో పవన్‌ను సూత్రధారిగా గుర్తించారు. ప్రదీప్‌గుప్తా దిల్లీ, గుజరాత్, మహారాష్ట్రల్లో కిడ్నీదాతల్ని గుర్తించినట్లు బయటపడింది. వీరు ఒక్కో శస్త్రచికిత్సకు రూ.10 నుంచి 15 లక్షల వరకు కమీషన్ పొందినట్లు సమాచారం.

బ్యాక్టీరియా కణ గోడల నిర్మాణంలో బలహీనతలు

- ఎడిట్ చేసే ఎంజైమ్‌ను గుర్తించిన సీసీఎంబీ శాస్త్రవేత్తలు

ఈనాడు, హైదరాబాద్: యాంటీబయాటిక్ పనితీరును మరింత మెరుగుపరిచే బ్యాక్టీరియా కణ గోడ రహస్యాన్ని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) శాస్త్రవేత్తలు వెలికితీశారు. రక్షణాత్మకమని భావిస్తున్న కణ గోడలను దిద్దుబాటు(ఎడిట్) చేయవచ్చని తేల్చారు. బ్యాక్టీరియా రక్షణాత్మక కణ గోడలతో కప్పి ఉంటుంది. ఇవి పెప్టిడోగ్లైకాన్(పీజీ) అనే ప్రత్యేకమైన పాలిమర్‌తో రూపొందుతాయి. వైద్యపరంగా ఉపయోగించే అనేక యాంటీబయాటిక్‌లను పీజీ లక్ష్యంగానే ప్రయోగిస్తుంటారు. వీటి కణ గోడల బయోసింథటిక్ మార్గాన్ని అర్థం చేసుకోవడంపై సీసీఎంబీకి చెందిన పరిశోధకురాలు డాక్టర్ మంజులారెడ్డి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం అధ్యయనం చేసింది. కణ గోడల్లో సాధారణంగా ఎల్-అలనైన్ అనే నిర్దిష్ట అమైనో ఆమ్లం కనిపిస్తుంది. సీసీఎంబీ కొత్త అధ్యయనం ప్రకారం కణగోడను నిర్మించేటప్పుడు బ్యాక్టీరియా పొరపాటున కొన్నిసార్లు ఎల్-అలనైన్‌కు బదులుగా ఎల్-సెరైన్ లేదా గ్లైసిన్ వంటి సారూప్యమైన అమైనో ఆమ్లాలను జోడిస్తున్నట్లు గుర్తించారు. ఈ కారణంగా కణ గోడ బలహీనమై యాంటీబయాటిక్స్‌కు గురయ్యే అవకాశం పెరుగుతున్నట్లు గమనించారు. ఈ తప్పిదాన్ని సరిదిద్దుతున్న ఒక ఎంజైమ్‌ను సీసీఎంబీ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనికి పెప్టిడోగ్లైకాన్ ఎడిటింగ్ ఫ్యాక్టర్(పీజీఈఎఫ్) అనే పేరు పెట్టారు. కణ గోడల సింథసిస్‌లో ఇలాంటి బలహీనతలను అధ్యయనం చేయడం ద్వారా బ్యాక్టీరియా పెరుగుదలను అడ్డుకునే కొత్త మార్గాలను రూపొందించవచ్చని పరిశోధకురాలు డాక్టర్ శాంభవి గార్డే అన్నారు. మానవుల లోనూ ఈ తరహా ఎంజైమ్ ఎల్ఏసీసీ1 ఉందని.. దీని పనితీరు గురించి ఇప్పటివరకు స్పష్టంగా తెలియదని డాక్టర్ మంజులారెడ్డి అన్నారు. ఎల్ఏసీసీ1 లోపాలతో శరీర రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించడం అనేక రుగ్మతలకు దారి తీస్తుందని చెప్పారు. తమ అధ్యయనం బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా రోగనిరోధక ప్రతిస్పందనలో ఎల్ఏసీసీ1 పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. తాజాగా ఈ పరిశోధన పీఎన్ఏఎస్ జర్నల్‌లో ప్రచురితమైంది.



సీసీఎంబీ పరిశోధకులు డాక్టర్ మంజులారెడ్డి, శాంభవి గార్డే

ఆర్టీసీ బస్సును అపహరించిన మతిస్థిమితం లేని వ్యక్తి

- సుమారు 50 కి.మీ. డ్రైవింగ్ చేస్తూ ప్రయాణం





అపహరణకు గురైన ఆర్టీసీ బస్సు ★ కృష్ణ

ఆత్మకూరు, నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సును అపహరించడంతో పాటు దాన్ని డ్రైవింగ్ చేస్తూ సుమారు 50 కి.మీ దూరం ప్రయాణించాడు. ఆ సమయంలో బస్సులో నలుగురు ప్రయాణికులు కూడా ఉండడం గమనార్హం. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆత్మకూరు డిపోనకు చెందిన పల్లెవెలుగు బస్సు మంగళవారం రాత్రి నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్‌లో ఉంచారు. కండక్టర్ బుధవారం తెల్లవారుజామున వచ్చి చూడగా బస్సు కనిపించలేదు. అధికారులకు సమాచారమివ్వగా.. పోలీసుల సాయంతో గాలింపు చేపట్టారు. బస్సు తెల్లవారు జాము 4.45 గంటలకు బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా దాటినట్లు గుర్తించారు. బస్సును అపహరించింది విడవలూరు మండలం ఊటుకూరు పంచాయతీ కంచరపాలేనికి చెందిన బిట్రగుంట కృష్ణగా గుర్తించారు. ఈయనకు కొద్ది రోజులుగా మతిస్థిమితం సరిగా లేదని పోలీసులు తెలిపారు. కృష్ణ గతంలో నెల్లూరు ఆర్టీసీ డిపో-1లో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేసేవారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తిపైకి లారీ ఎక్కించి చంపిన డ్రైవర్

తెలంగాణలోని మెదక్ జిల్లాలో ఘటన



మృతుడు సత్తిరెడ్డి

చేగుంట, న్యూస్‌టుడే: ఓ లారీ డ్రైవర్ ఏమాత్రం కనికరం లేకుండా వ్యక్తిపైకి లారీ ఎక్కించి చంపేసిన ఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు వద్ద బుధవారం చోటుచేసుకుంది. నార్సింగి ఎస్సై సృజన తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన గలువ సత్తిరెడ్డి(45) సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలో ఉంటున్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం తిప్పాపూర్‌లో బంధువు చనిపోవడంతో తన కుటుంబికులతో కలిసి ఆయన కారులో వెళ్లారు. తిరిగివస్తుండగా వల్లూరు సమీపంలోని ఓ దాబా వద్ద కామారెడ్డి వైపు నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరి కారును ఢీకొట్టి ఆపకుండా వెళ్లింది. దీంతో కారు నడుపుతున్న సత్తిరెడ్డి సోదరుడు వెంకటరెడ్డి వేగంగా వెళ్లి వల్లూరు దాటాక ఆ లారీ ముందు కారు నిలిపారు. వెనకాల కూర్చున్న సత్తిరెడ్డి కారులో నుంచి దిగి లారీని ఆపేందుకు ప్రయత్నించారు. కానీ లారీ డ్రైవర్ అతి వేగంగా వచ్చి ఆయనను ఢీకొట్టి..ఆపకుండా ఆయన మీదనుంచి లారీని ఎక్కించిపోవడంతో ఘటనా స్థలంలోనే సత్తిరెడ్డి మృతి చెందారు. అయినా డ్రైవర్ లారీ ఆపకుండా వెళ్లిపోతుండగా స్థానికులు వెంబడించి తూప్రాన్ వద్ద అడ్డగించారు. ఈ క్రమంలో డ్రైవర్ లారీని వదిలేసి పారిపోయాడు.

1944 నాటి ఒప్పందానికి తూట్లు పొడిచి కేసీ కాలువకు 39.9 టీఎంసీలు

- బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ వాదన

ఈనాడు హైదరాబాద్: హైదరాబాద్, మద్రాస్ ప్రభుత్వాల మధ్య 1944 జూన్‌లో జరిగిన ఒప్పందం ప్రకారం కేసీ కాలువకు 19 టీఎంసీల నీటినే వినియోగించుకోవాల్సి ఉందని, అయితే ఈ ఒప్పందానికి తూట్లు పొడిచారని బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ దృష్టికి తెలంగాణ తీసుకెళ్లింది. కేసీ కాలువ వినియోగాన్ని 39.9 టీఎంసీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పెంచి కృష్ణా ట్రైబ్యునల్-1 నుంచి కేటాయింపులు పొందినట్లు వెల్లడించింది. ఈ మేరకు బుధవారం బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట వాదనలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపించారు. వాస్తవానికి కేసీ కాలువ కింద వినియోగం 54 టీఎంసీలుగా ఉందని, నిప్పులవాగు, గాలేరు, కుందూ వాగుల ద్వారా కూడా 5.2 టీఎంసీల లభ్యత ఉందని, ఈ వివరాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ట్రైబ్యునల్ ఎదుట ఉంచలేదన్నారు. సుంకేశుల బ్యారేజీ నుంచే కాకుండా బనకచర్ల ఎస్కేప్ ఛానల్ ద్వారా కూడా కేసీ కాలువకు ఆంధ్రప్రదేశ్ నీటిని మళ్లిస్తుందని తెలంగాణ న్యాయవాది పేర్కొనగా, ఎస్కేప్ ఛానల్ ద్వారా ఎంత నీటిని మళ్లిస్తున్నారని ట్రైబ్యునల్ ప్రశ్నించింది. కేసీ కాలువకు 45.1 టీఎంసీల నీటి లభ్యత ఉందని, శాస్త్రీయంగా పంటలకు ఎంత అవసరం అన్నది అంచనా వేస్తే 18.51 టీఎంసీలేనని, ఈ మిగులు నీటిని తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించాలని వైద్యనాథన్ కోరారు. గురు, శుక్రవారాల్లో కూడా తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తారు.

● పోలవరం-బనకచర్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ తాజాగా తెలంగాణ నీటిపారుదల శాఖ కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖకు లేఖ రాసింది. ఈ పథకం వల్ల తెలంగాణకు ఎలా నష్టం వాటిల్లుతుందో పేర్కొంటూ సాంకేతిక అంశాలతో కేంద్ర జలశక్తి కార్యదర్శికి తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి లేఖ రాసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

పీఆర్సీ బకాయిలు చెల్లించాలని సీఎస్‌కు వినతి

ఈనాడు, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ఎమ్మెల్సీ గోపిమూర్తి వినతిపత్రం సమర్పించారు. "రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ 2023 జూన్ 30తో పూర్తయింది. జులై నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉంది. ఇప్పటికి రెండేళ్లు వృథా అయింది. వెంటనే 12వ పీఆర్సీని నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలి. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పింఛను విధానాన్ని వర్తింపజేయాలి' అని కోరారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

తెలుగు రాష్ట్రాల్లో 'పీఎం కుసుమ్' కార్యరూపం దాల్చలేదు

లోక్‌సభలో కేంద్ర మంత్రి శ్రీపాద యశో నాయక్ వెల్లడి

ఈనాడు, దిల్లీ: పీఎం కుసుమ్ పథకం కింద ఏపీ, తెలంగాణలకు మంజూరైన సోలార్ పంపుల్లో ఒక్కటీ ఏర్పాటు చేయలేదని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో బుధవారం ఆయన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. తెలంగాణకు కాంపోనెంట్-ఏ కింద 1,450 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్ మంజూరు చేయగా, ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని చెప్పారు. ప్లాంట్ బీ కింద రైతుల పొలాల్లో అమర్చేందుకు 20 వేల సోలార్ పంప్‌లు మంజూరవ్వగా.. ఒక్కటీ ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. కాంపోనెంట్-సి కింద 28 వేల వ్యక్తిగత పంపులు మంజూరైతే.. అవి కూడా కార్యరూపం దాల్చలేదని చెప్పారు. ఏపీకి కాంపోనెంట్ ఏ, బీల్లో ఏమీ మంజూరు కాలేదని, కాంపోనెంట్-సీలో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ కింద లక్ష కనెక్షన్లు మంజూరైనా.. ఇప్పటివరకు ఒక్కటీ ఏర్పాటు చేయలేదని వెల్లడించారు.

ఏపీలో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఏపీలో 73 రైల్వే స్టేషన్లను అభివృద్ధికి ఎంపిక చేయగా, వాటిలో ఇప్పటివరకు సూళ్లూరుపేట స్టేషన్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన వాటి పనులు వేగంగా సాగుతున్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో అనంతపురం తెదేపా సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఏపీలోని స్టేషన్ల అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2,913 కోట్ల బడ్జెట్ కేటాయించామని వెల్లడించారు.

జిల్లాల ఖనిజ ఫౌండేషన్ ఖాతాల్లో రూ.1,341 కోట్లు

ఏపీలోని జిల్లాల ఖనిజ ఫౌండేషన్ ఖాతాల్లో రూ.1,341 కోట్ల నిధులున్నట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. బుధవారం లోక్‌సభలో నరసరావుపేట తెదేపా సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ఫౌండేషన్‌కు రూ.68.15 కోట్లు వసూలైతే, రూ.174.64 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అత్యధికంగా వైఎస్సార్ కడప జిల్లా ఖాతాలో రూ.240.29 కోట్లు, కృష్ణా జిల్లా ఖాతాలో రూ.179 కోట్లు, ప్రకాశం జిల్లా ఖాతాలో రూ.164 కోట్లు, నంద్యాలలో రూ.114.44 కోట్ల నిల్వలున్నట్లు వివరించారు.

ఐదేళ్లలో 28.6 లక్షల టన్నుల క్వార్ట్జ్ ఖనిజం ఉత్పత్తి

ఏపీలో గత ఐదేళ్లలో 28.6 లక్షల టన్నుల క్వార్ట్జ్ ఖనిజం ఉత్పత్తి అయినట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. హిందూపురం తెదేపా సభ్యుడు బీకే పార్థసారథి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 2020-21లో 5.2, 2021-22లో 4.8, 2022-23లో 7.2, 2023-24లో 9.4, 2024-25లో రెండు లక్షల టన్నుల క్వార్ట్జ్ ఉత్పత్తయినట్లు చెప్పారు.



కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్) హైదరాబాద్ బెంచ్ జ్యుడిషియల్ సభ్యులు లతా బస్వరాజ్ బుధవారం విజయవాడలోని రాజ్‌భవన్‌కు వచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

బదిలీల్లో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల లెక్క తేల్చండి

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్యశాఖ పరిధిలో జరిగే సాధారణ బదిలీల్లో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు మినహాయింపులిచ్చే విషయంపై స్పష్టత ఇవ్వాలని ఉన్నతాధికారుల్ని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఒకే చోట తొమ్మిదేళ్లు కొనసాగవచ్చనే సాకుతో చాలా మంది సుదీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండడంతో పలు అభ్యంతరాలు వచ్చాయి. దీంతో ఆయన ఈ నిర్ణయం తీసుకొన్నారు. "జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో ఎన్ని సంఘాలు, ఏ స్థాయి ప్రతినిధులకు మినహాయింపు ఇవ్వాలి? వారికి ఎలాంటి పరిమితులు విధించొచ్చు? అన్ని సంఘాలకూ బదిలీల్లో మినహాయింపు ఇస్తే ఎదురయ్యే పరిణామాలు? ఈ అంశంపై గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు? వాటి అమలు తీరు?' తదితర అంశాలపై వివరణ ఇవ్వాలని మంత్రి కోరారు.

డ్వాక్రా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాలి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: డ్వాక్రా సంఘాల లావాదేవీల నిర్వహణలో పారదర్శకతకు.. మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 'మన డబ్బులు-మన లెక్కలు' కార్యక్రమాన్ని మహిళలకు చేరువ చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలు ఎంత రుణం తీసుకుంటున్నారు? నెలవారీ ఎంత చెల్లిస్తున్నారు? తీసుకున్న రుణం మీద బ్యాంకర్లు ఎంత వడ్డీ వసూలు చేస్తున్నారు? అనేది ఎప్పటికప్పుడు ఈ యాప్ ద్వారా సంఘ సభ్యురాలికి తెలుస్తుందన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రాజెక్ట్ అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ఏడాదికి 2.50 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దేలా ముందడుగు వేయాలి. రైతు ఉత్పాదక సంస్థలకు కేంద్రం విరివిగా నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో వీటిని బలోపేతం చేసి ఎక్కువ నిధులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

కొనసాగుతున్న మెగా పీటీఎం వివరాల సేకరణ

ఈనాడు, అమరావతి: పాఠశాలల్లో ఇటీవల నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశ(మెగా పీటీఎం) వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) సవరణ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆన్‌లైన్ వివరాలను గురువారంలోపు పంపించాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించింది. ప్రతి పాఠశాల పీటీఎంకు సంబంధించిన 3 విభిన్నమైన ఫొటోలను అప్‌లోడ్ చేయాలని, అన్నింటిలో జన సమూహం కనిపించాలని సూచించింది. మెగా పీటీఎంను గిన్నిస్ రికార్డుకు పంపించేందుకు అన్ని వివరాలను ఎస్ఎస్ఏ సేకరిస్తోంది. ఇందులో భాగంగా ఎక్కడైనా పూర్తి సమాచారం రాకపోతే ఎంఈఓల ద్వారా ఆన్‌లైన్‌లో సమాచారం సేకరిస్తోంది. వీడియోలు 30 నుంచి 40 సెకన్లలోపు ఉండాలని, చాలా పాఠశాలలు రెండు నుంచి 20 సెకన్ల వీడియోలను అప్‌లోడ్ చేశారని తెలిపింది. అన్ని జిల్లా డీఈఓలు, ఏపీసీలు పర్యవేక్షించాలని సూచించింది.